
‘స్వచ్ఛమైన రక్షిత జలాలను అందిస్తేనే గోండు, చెంచు, ఆదివాసి గిరిజనులు ఆరోగ్యంగా ఉంటారు.’

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 17 సంచిక: 313

సోమవారం 3-2-2025



అభిషేక్... అమోఘం
37 బంతుల్లోనే శతకం..ఆఖరి టి20లో ఇంగ్లండ్‌పై భారత్ జయభేరి -14లో



గృహరుణం స్మార్ట్‌గా తీర్చేద్దాం
ఏటా అదనంగా చెల్లిస్తే అసలుకు మరింత జమ -15లో

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



అజేయం.. అద్వితీయం

వరుసగా రెండోసారి అండర్-19 మహిళల టి20 ప్రపంచకప్ సాధించిన భారత జట్టు

ఆద్యంతం ఆధిపత్యం చెలాయిస్తూ భారత అమ్మాయిల జట్టు వరుసగా రెండోసారి అండర్-19 మహిళల టి20 ప్రపంచకప్ టైటిల్‌ను సాధించింది. కౌలాలంపూర్‌లో ఆదివారం జరిగిన ఫైనల్లో టీమిండియా తొమ్మిది వికెట్ల తేడాతో దక్షిణాఫ్రికా జట్టును ఓడించింది. తెలంగాణ అమ్మాయి గొంగడి త్రిష ఆల్‌రౌండ్ (3/15; 44 నాటౌట్) ప్రతిభతో భారత జట్టు విజయంలో ముఖ్యపాత్ర పోషించింది. త్రిషకు ‘ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్’తో పాటు ‘ప్లేయర్ ఆఫ్ ద టోర్నీ’ అవార్డులు లభించడం విశేషం. ఈ టోర్నీ మొత్తంలో భారత్ ఒక్క మ్యాచ్‌లో కూడా ఓడిపోకుండా చాంపియన్‌గా నిలిచింది. వరుసగా రెండోసారి విజేతగా నిలిచిన భారత జట్టుకు ప్రోత్సాహకంగా భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) రూ. 5 కోట్ల నజరానా ప్రకటించింది.

తొలి కల నెరవేరింది

- రెండుసార్లు అండర్-19 ప్రపంచకప్ గెలవడం చిరస్మరణీయం
- ఇక సీనియర్ స్థాయిపై దృష్టి
- కౌలాలంపూర్ నుంచి ‘సాక్షి’తో ‘ప్లేయర్ ఆఫ్ ద టోర్నీ’ త్రిష



- వివరాలు 14లో ▶



గాడ్స్ ఓన్ కంట్రీ... చూడాల్సినవి ఇవి అని చెప్పకోవడం కష్టం. ఆధ్యాత్మికం, ధార్మికం, బీచ్‌లు, బ్యాక్ వాటర్స్, పర్వతాలు, కొండ వాలులో టీ తోటలు, సముద్రం మీద సూర్యాస్తమయాలు, జలపాతాలు, వన్యప్రాణులు... ఇలా పరస్పరం వైవిధ్య భరితమైన పర్యటనల నిలయమైన కేరళపై ప్రత్యేక కథనం...

సాక్షి ప్లస్ లో

‘లెక్క’ తేలింది

సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే గణాంకాలను వెల్లడించిన మంత్రి ఉత్తమ్

రాష్ట్రంలో మొత్తం జనాభా సుమారు 3.7 కోట్లు.. సర్వేలో పాల్గొన్నది 3.54 కోట్లు

- గుర్తించిన కుటుంబాలు 1,15,17,457... సర్వే చేసినవి 1,12,15,134 కుటుంబాలు
- 3 లక్షలకుపైగా కుటుంబాలకు చెందిన 16 లక్షల మంది సర్వేకు దూరం
- తాళం వేసి ఉన్న ఇళ్లు 1.03 లక్షలు.. వివరాలు ఇవ్వడానికి నిరాకరించినవారు 1.68 లక్షలు
- మిగతా వారంతా రాష్ట్రేతర వలస కార్మికులుగా గుర్తింపు



ఆదివారం సచివాలయంలో కుటుంబ సర్వే నివేదికను చూపుతున్న మంత్రులు దామోదర రాజనర్సింహ, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, సీతక్క. చిత్రంలో సందీప్‌కుమార్ సుల్తానియా తదితరులు

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ సామాజిక ముఖ చిత్రం విడుదలైంది. రాష్ట్రంలో సామాజిక వర్గాల వారీగా జనాభా లెక్క తేలింది. గతేడాది నవంబర్, డిసెంబర్‌లలో రాష్ట్ర ప్రణాళిక విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన ‘సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వే (సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే)’ గణాంకాలను మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆదివారం వెల్లడించారు. సర్వే వివరాలను, సర్వే జరిగిన తీరును వివరించారు.

సర్వేలో తేల్చిన అంశాలివే..

రాష్ట్రంలో సుమారు 3.7 కోట్ల మంది జనాభా ఉండగా.. అందులో 3.54 కోట్ల మందికి సంబంధించి సర్వే జరిగింది. వివిధ కారణాలతో మరో 16 లక్షల మంది (3.1%)కి సంబంధించిన వివరాల సేకరణ జరగలేదు. సర్వే చేసిన జనాభాకు సంబంధించి పురుషులు 1.79 కోట్లు, మహిళలు 1.75 కోట్లు, థర్డ్ జెండర్ 13,774 మంది ఉన్నారు. ఈ సర్వే నివేదిక ప్రకారం రాష్ట్రంలో అత్యధికంగా 46.25 శాతం మంది బీసీలు ఉన్నారు. తర్వాత షెడ్యూల్డ్ కులాల జనాభా 17.43 శాతం, ఓసీలు 13.31 శాతం, ముస్లిం మైనార్టీలు 12.56 శాతం, షెడ్యూల్డ్ తెగలవారు 10.45 శాతం ఉన్నారు. ముస్లిం మైనార్టీలలో 2.48శాతం ఓసీ కేటగిరీకి చెందినవారు. వీరిని కూడా కలిపితే రాష్ట్రంలో ఓసీ కేటగిరీ జనాభా 15.79% అవుతోంది.

యాభై రోజుల్లో ‘సమగ్రం’గా..

రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఇతర బలహీన

మిగతా 2వ పేజీలో ▶

సర్వేలో వెల్లడైన మేరకు సామాజిక వర్గాల వారీ జనాభా ఇదీ..

వర్గం	జనాభా	శాతం
ఎస్సీ	61,84,319	17.43
ఎస్టీ	37,05,929	10.45
బీసీ (ముస్లిమేతర)	1,64,09,179	46.25
ముస్లిం మైనార్టీ (బీసీ)	35,76,588	10.08
ముస్లిం మైనార్టీ (ఓసీ)	8,80,424	2.48
ముస్లిం మైనార్టీ (బీసీ+ఓసీ)	44,57,012	12.56
ఓసీ	47,21,115	13.31
ఓసీ (జనరల్+ముస్లిం)	56,01,539	15.79

ప్రజల ఆకాంక్షలను నెరవేర్చే సర్వే ఇది

మంత్రులు ఉత్తమ్, పొన్నం, దామోదర, సీతక్క వెల్లడి

96.9% కచ్చితత్వంతో.. 50 రోజుల్లో సర్వే నిర్వహించాం

రాష్ట్రంలో సామాజిక న్యాయానికి సర్కారు పెద్దపీట వేస్తోంది 2లో

ఆదివారం ప్రయాగ్‌రాజ్‌లో అమృత స్నానాలు చేస్తున్న భక్తులు



వసంత పంచమి వేళ నేడు అమృత స్నానం

- మహాకుంభమేళాలో చిట్టచివరి పవిత్రస్నానాలకు ‘ఆపరేషన్ ఎలెవెన్’తో చర్యలు.. మౌని అమావాస్య దుర్ఘటన నేపథ్యంలో యూపీ సర్కారు అప్రమత్తం
- ఇద్దరు సీనియర్ ఐఏఎస్‌లకు పర్యవేక్షణ బాధ్యతల అప్పగింత.. భక్తుల కోసం ‘వన్ వే ట్రాఫిక్ రూట్’ ఏర్పాటు
- స్నాన ఘాట్ల వద్ద అదనపు బారికేడ్ల నిర్మాణం.. రంగంలోకి మోటారుసైకిల్ స్క్వాడ్లు

6లో

విద్యుత్ రైలుకి వందనం



నాడు బాంబేలోని విక్టోరియా టెర్మినస్‌లో విద్యుత్ రైలు తొలి అడుగులు

- 1925 ఫిబ్రవరి 3న దేశంలో తొలి విద్యుత్ రైలు పరుగులు
- ముంబై-కుర్లా మార్గంలో మొదట వినియోగం.. 1961 తర్వాత ఊపందుకున్న రైల్వే విద్యుదీకరణ
- పెద్ద దేశాల్లో రైల్వే విద్యుదీకరణ అత్యధికంగా జరిగిన దేశం మనదే..

12లో

పుస్తకావిష్కరణలో మాట్లాడుతున్న వైవీ రెడ్డి. చిత్రంలో పద్మనాభయ్య తదితరులు



భారత్ ఎదుగుదల అనూహ్యం..

- ప్రపంచ ఐదో అతిపెద్ద ఆర్థికవ్యవస్థగా ఎదగటం శుభపరిణామం: ఆర్‌బీఐ మాజీ గవర్నర్ వై.వి రెడ్డి
- ఆస్కిలో ‘వర్క్ విస్డమ్ లెగసీ’ పుస్తకావిష్కరణ
- స్వయంగా సంకలనం చేసిన వై.వి రెడ్డి
- అనేక రంగాల ప్రముఖుల 31 వ్యాసాలతో పుస్తకం

2లో

బడ్జెట్‌లో వివక్షపై యుద్ధం

అంబేడ్కర్ విగ్రహం సాక్షిగా ప్రకటిస్తున్నాం

- కాంగ్రెస్ ధర్నాలో పార్టీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్
- 8 మంది చొప్పున బీజేపీ ఎమ్మెల్యేలు, ఎంపీలను గెలిపిస్తే రాష్ట్రానికి ఇచ్చింది గాడిద గుడ్డే
- బీజేపీ ఎంపీలకు తెలంగాణ డీఎన్ఏ ఉంటే ఇప్పటికైనా గొంతెత్తాలి.. కిషన్‌రెడ్డి, సంజయ్ రాజీనామా చేయాలని డిమాండ్
- నేడు జిల్లా కేంద్రాల్లో నిరసనలకు పిలుపు

2లో





18 నెలల క్రితం శంకుస్థాపన చేసినా..

మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ మండలం అమ్మపాలెం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రానికి ప్రస్తుతం 13 మంది చిన్నారులు 15 మంది బాలింతలు గర్భిణీలు వస్తున్నారు. టాయిలెట్ లేకపోవడంతో చిన్నారులను మల, మూత్రవిసర్జనకు తీసుకెళ్లేందుకు కార్యకర్తలు, ఆయాలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గర్భిణీలు, బాలింతలు అత్యవసర పరిస్థితుల్లో ఇంటికెళ్లి పోవాల్సి వస్తోంది. సుమారు 18 నెలల క్రితం టాయిలెట్ నిర్మాణానికి అప్పటి ఎమ్మెల్యే రెడ్యానాయక్ శంకుస్థాపన చేసినా ఇప్పటికీ పనులు ప్రారంభం కాలేదు.

అంగన్‌వాడీ కేంద్రంలో టాయిలెట్ లేకపోవడంతో ఇబ్బందిగా ఉంది. పిల్లలను మల, మూత్ర విసర్జనకు బయటకు తీసుకెళ్లాల్సి వస్తోంది. మాతో పాటు సెంటర్‌కి వచ్చే మహిళలు ఇంటికి వెళ్లి రావాల్సి వస్తోంది. మా బాధలు ఎవరికీ చెప్పుకోలేకపోతున్నాం.



ఉమారాణి, అమ్మపాలెం-1 అంగన్‌వాడీ కార్యకర్త

తాగునీటికి తిప్పలు.. ఒకటికొస్తే అవస్థలు


అంగన్‌వాడీల్లో ఆ సౌకర్యాలెప్పుడో..

- ఇబ్బందులు పడుతున్న చిన్నారులు, గర్భిణీలు, బాలింతలు
- కేంద్రం రూ.10 కోట్లు మంజూరు చేసినా నత్తనడకన పనులు
- రాష్ట్రవ్యాప్తంగా 7,021 అంగన్‌వాడీలకు టాయిలెట్లు మంజూరు..1,015 మాత్రమే పూర్తి
- 1,864 కేంద్రాలకు గాను 289 కేంద్రాల్లోనే తాగునీటి వసతి కల్పన.. ఆర్థిక సంవత్సరం ముగియనుండటంతో నిధులు మురిగిపోయే ప్రమాదం

3లో

అంగన్‌వాడీల్లో టాయిలెట్ల నిర్మాణాలకు సంబంధించి ఎక్కువ సంఖ్యలో పనులు ప్రారంభించని జిల్లాలు..

జిల్లా	సంఖ్య
రంగారెడ్డి	547
మహబూబాబాద్	254
కరీంనగర్	541
ఖమ్మం	239
నాగర్‌కర్నూల్	227



కళ్లముందు కనిపిస్తున్నట్టే..

ప్రభుత్వ స్కూళ్లలో ఏఐ ఆధారిత బోధన

- వచ్చే ఏడాది నుంచి 5 వేల స్కూళ్లలో షురూ!
- 5వ తరగతి నుంచి టెన్త్ వరకు వర్చువల్ రియాలిటీ విధానంలో పాఠాలు
- త్వరలో పాఠశాల విద్యాశాఖ నివేదిక



సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వ పాఠశాలల్లో సరికొత్త తరహాలో బోధనకు సన్నాహాలు జరుగుతున్నాయి. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సహకారంతో వర్చువల్ రియాలిటీ విధానంలో పాఠాలు చెప్పేలా విద్యాశాఖ ఏర్పాట్లు చేస్తోంది. ఇందుకోసం బెంగళూరు కేంద్రంగా పనిచేస్తున్న ఎక్‌స్టెప్ ఫౌండేషన్ సహకారం తీసుకోనుంది. ఇప్పటికే రాష్ట్ర విద్యాశాఖ అధికారులు ఫౌండేషన్‌కు వెళ్లి అక్కడ ప్రతినిధులతో సంప్రదింపులు జరిపారు. ఏ తరహా మౌలిక వసతులు, ఏఐ ఆధారిత టూల్స్ కావాలో తెలుసుకున్నారు. ప్రయోగాత్మకంగా రాష్ట్రంలో కొన్ని

మిగతా 3వ పేజీలో ▶

ఇదండీ సంగతి



ప్రతిపక్షాలు ఇది బీహార్ బడ్జెట్ అని మనకు మంచి ప్రచారం చేసి పెడుతున్నాయ్ సార్!

● ఢిల్లీ

ఇందిర సర్కార్ ఉంటే.. పన్నుకే 10 లక్షలు!

మా పాలనలో ప్రజలు రూ. 12 లక్షల వార్షికాదాయం ఉన్నా ట్యాక్స్ కట్టాల్సిన పనిలేదు. గత కాంగ్రెస్ పాలనలో భారీ ట్యాక్స్‌లు మోపారు. నెహ్రూ హయాంలో 12 లక్షల వార్షికాదాయంలో నాలుగింట ఒకవంతు ట్యాక్స్‌కే పోయేది. ఇందిరాగాంధీ బతికి ఉంటే రూ. 12 లక్షలకు.. రూ.10 లక్షలు కట్టాల్సి వచ్చేది.

- నరేంద్రమోదీ, ప్రధానమంత్రి



6లో

● అమెరికా

కెనడా, మెక్సికో, చైనాపై టారిఫ్ కొరడా

మెక్సికో, కెనడాలపై 25 శాతం, చైనా వస్తువులపై 10% మేర సుంకాలు పెంచుతున్నా. అమెరికాలోకి అక్రమ వలసలు, ప్రాణాంతక మాదకద్రవ్యాల కట్టడిలో మెక్సికో, కెనడా, చైనా విఫలమైనందుకే ఈ నిర్ణయం తీసుకున్నా. అమెరికన్లను కాపాడటానికి ఆ దేశాలపై టారిఫ్‌లు పెంచక తప్పట్లేదు.

- డొనాల్డ్ ట్రంప్, అమెరికా అధ్యక్షుడు



6లో

క్లుప్తంగా...

మీ విజయం యువతకు స్ఫూర్తిదాయకం

అండర్‌–19 మహిళల జట్టు గెలుపుపై కిషన్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్‌: అండర్‌–19 టీ–20 మహిళల ప్రపంచకప్‌ను గెలుచుకున్న భారత మహిళా జట్టును కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అభినందించారు. ఈ విజయం యువతకు స్ఫూర్తిదాయకమని ఆయన పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. 'అండర్‌–19 మహిళల ప్రపంచకప్‌ గెలుచుకున్న భారత జట్టుకు హార్దిక అభినందనలు. మీ విజయం 140 కోట్ల మంది భారతీయులకు గర్వకారణం. ఈ గొప్ప విజయంలో కీలకంగా వ్యవహరించిన ఆల్‌రౌండర్‌ తెలుగమ్మాయి గొంగడి త్రిషకు హృదయపూర్వక అభినందనలు' అని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు.

మధ్యతరగతి ప్రజలతోనే దేశ ఆర్థిక ప్రగతి

రాజ్యసభ సభ్యుడు కె.లక్ష్మణ్‌



సాక్షి, హైదరాబాద్‌: మధ్యతరగతి ప్రజలతోనే దేశ ఆర్థిక ప్రగతి సాధ్యపడుతుందని, ఇదే ప్రధాని మోదీ నినాదం అని రాజ్యసభ సభ్యులు కె.లక్ష్మణ్‌ అన్నారు. ఆదివారం ఆయన బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ, ఈ సారి కేంద్ర బడ్జెట్‌ మధ్యతరగతికి ఊరట కలిగించేలా ఉందని, 2014లో రూ.2 లక్షల మేర ఆదాయపు పన్ను మినహాయింపు ఉంటే ఇప్పుడు ఏకంగా రూ.12 లక్షల వరకు మినహాయింపు ఇచ్చారని పేర్కొన్నారు. దశాబ్ద కాలంలో ప్రధాని మోదీ దేశం కోసం ఎన్నో కీలక నిర్ణయాలు తీసుకున్నారని, దేశాన్ని ఆర్థికంగా ఎంతో బలోపేతం చేశారని చెప్పారు. రాష్ట్రాల హక్కులకు ప్రాధాన్యం కల్పిస్తూనే మోదీ ఈ నిర్ణయాలు తీసుకున్నారని, సామాన్యుడు కూడా నాణ్యమైన విద్య, వైద్యం అందుకునేలా వ్యవస్థను తీర్చిదిద్దారని అన్నారు. తమ హయాంలో అభివృద్ధిపై కాంగ్రెస్‌, బీఆర్‌ఎస్‌ పార్టీలతో ప్రత్యేక చర్చకు తాను సిద్ధమని చెప్పారు.

ఎమ్మెల్సీ కవితతో బీసీ, జాగృతి నేతల భేటీ



సాక్షి, హైదరాబాద్‌: మంత్రి ఉత్తమ్‌కుమార్‌ రెడ్డి ఆదివారం సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే నివేదికను వెల్లడించిన నేపథ్యంలో ఎమ్మెల్సీ కవితతో బీసీ సంఘాలు, తెలంగాణ జాగృతి నేతలు భేటీ అయ్యారు. కవితను ఆమె నివాసంలో కలసిన నేతలు పలు అంశాలపై చర్చించారు. సర్వే గణాంకాల ఆధారంగా స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు ఎంత మేర రిజర్వేషన్లు పెరుగుతాయన్న అంశంపై కవిత వారితో చర్చించారు. బీసీలకు స్థానిక ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించాల్సిందేనంటూ తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో ఇటీవల ఇందిరాపార్క్‌ వద్ద ధర్నా నిర్వహించిన విషయం తెలిసిందే.

కాంగ్రెస్‌పార్టీ మైనార్టీలను మోసం చేసింది

మాజీ హోం మంత్రి మహమూద్‌ అలీ



సాక్షి, హైదరాబాద్‌: గతంలో మైనార్టీ డిక్లరేషన్‌ను ప్రకటించిన కాంగ్రెస్‌పార్టీ ఆ విషయాన్ని ఇప్పుడు మర్చిపోయిందని, ఓట్లు వేయించుకుని మైనార్టీలను కాంగ్రెస్‌పార్టీ నాయకులు మోసగించారని మాజీ హోం మంత్రి మహమూద్‌ అలీ అన్నారు. ఆదివారం ఆయన తెలంగాణభవన్‌లో మీడియాతో మాట్లాడుతూ, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌.. మైనార్టీలకోసం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారన్నారు. మైనార్టీలకు డబుల్‌ బెడ్‌రూం ఇళ్లు కూడా ఇచ్చారని గుర్తు చేశారు. కానీ ఇప్పుడు కాంగ్రెస్‌పార్టీ ఏ హామీని కూడా అమలు చేయడం లేదని విమర్శించారు. సీఎం రేవంత్‌రెడ్డి.. ప్రధాన మంత్రి మోదీని బడే భాయ్‌ అని సంబోధించారని, అసలు కాంగ్రెస్‌పార్టీ సెక్యులర్‌ పార్టీయా.. కాదా..? అనే విషయాన్ని రాహుల్‌ గాంధీ, ప్రియాంకా గాంధీ చెప్పాలని డిమాండ్‌ చేశారు.

తెలంగాణపై బీజేపీకి చిత్తశుద్ధిలేదు

బీఆర్‌ఎస్‌ నేత రావుల శ్రీధర్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్‌: కేంద్ర ప్రభుత్వ బడ్జెట్‌లో కేటాయింపులు చూసిన తర్వాత తెలంగాణపై బీజేపీకి చిత్త శుద్ధి లేదన్న విషయం అర్థం అయిందని బీఆర్‌ఎస్‌ నేత రావుల శ్రీధర్‌రెడ్డి విమర్శించారు. తెలంగాణకు నిధులు తీసుకురావడంలో రాష్ట్ర బీజేపీ, కాంగ్రెస్‌ ఎంపీలు విఫలమయ్యారన్నారు. రాష్ట్రానికి రూపాయి కూడా ఇవ్వకుండా.. ఇది డ్రీమ్‌ బడ్జెట్‌ అని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అనడం విడ్డూరమన్నారు. ఆదివారం తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ, పక్క రాష్ట్రంలో ఉన్న కేంద్ర మంత్రులు రామ్మోహన్‌ నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్‌లను చూసి కిషన్‌ రెడ్డి, బండి సంజయ్‌ బుద్ధి తెచ్చుకోవాలన్నారు. తెలంగాణ ప్రజలకు బీజేపీ, కాంగ్రెస్‌ పార్టీల ఎంపీలు క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్‌ చేశారు.

భారత్‌ ఎదుగుదల అనూహ్యం

- ప్రపంచ ఐదో అతిపెద్ద ఆర్థికవ్యవస్థగా ఎదగటం శుభపరిణామం
- ఆర్‌బీఐ మాజీ గవర్నర్‌ వైవీ రెడ్డి వెల్లడి
- ఆస్కిలో 'వర్క్‌ విస్‌డమ్‌ లెగసీ' పుస్తకావిష్కరణ
- స్వయంగా సంకలనం చేసిన వైవీ రెడ్డి
- అనేక రంగాల ప్రముఖుల వ్యాసాలతో పుస్తకం



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఆర్బీఐ మాజీ గవర్నర్‌ వైవీ రెడ్డి, ఆస్కి చైర్మన్‌ డాక్టర్‌ పద్మనాభయ్య

పంజగుట్ట: ప్రపంచంలోని అతిపెద్ద ఆర్థిక వ్యవస్థల్లో భారత్‌ ఐదో స్థానానికి చేరుకోవడం శుభ పరిణామం అని రిజర్వ్‌ బ్యాంక్‌ ఆఫ్‌ ఇండియా మాజీ గవర్నర్‌, పద్మవిభూషణ్‌ పురస్కార గ్రహీత వైవీ రెడ్డి అన్నారు. పలు రంగాలకు చెందిన 28 మంది ప్రముఖులు రాసిన 31 వ్యాసాల సంపుటి 'వర్క్‌ విస్‌డమ్‌ లెగసీ' పుస్తకావిష్కరణ కార్యక్రమం ఆదివారం ఖైరతాబాద్‌లోని అడ్మినిస్ట్రేటివ్‌ స్టాఫ్‌ కాలేజీలో జరిగింది. ఈ కార్యక్రమంలో వైవీ రెడ్డి మాట్లాడుతూ.. అనేక కులాలు, భాషలు, మతాలు, సంప్రదాయాలు, ఆర్థిక వెనకబాటుతో ఉన్న చిన్నచిన్న సంస్థానాలు, రాజ్యాలు కలిసి భారత్‌గా ఏర్పడిన తరుణంలో.. దేశం ఎలా నెట్టుకొస్తుందా అని స్వాతంత్య్రం వచ్చిన కొత్తలో అనుమానాలు ఉండేవని తెలిపారు. వాటిని పటాపంచలు చేస్తూ ప్రపంచంలో గొప్ప దేశంగా అవతరించడం గర్వకారణమని పేర్కొన్నారు. యూనియన్‌ బ్యాంక్‌ మాజీ జనరల్‌ మేనేజర్‌ రవి మీనన్‌, సీనియర్‌ పాత్రికేయుడు షాజీ విక్రమన్‌, రచయిత, ఆర్థికవేత్త కవి యాగ మాట్లాడుతూ.. వైవీ రెడ్డి ఆర్‌బీఐ గవర్నర్‌గా ఉన్నప్పుడు ఎంతో సీరియస్‌గా ఉంటారని అందరూ భావించేవారని, కానీ ప్రతి సందర్భంలోనూ ఆయన ఛలోక్తులు విసురుతూ అందరినీ నవ్విస్తూ ఉండేవారని గుర్తుచేశారు.

మేధోమథన సమాహారం

అనేక రంగాల ప్రముఖుల లోతైన అభిప్రాయాలతో కూడిన వ్యాసాల సమాహారమే వర్క్‌ విస్‌డమ్‌ లెగసీ పుస్తకం. రవి మీనన్‌, షాజీ విక్రమన్‌, కవి యాగ సహకారంతో వైవీ రెడ్డి స్వయంగా ఈ వ్యాస సంపుటిని సంకలనం చేశారు. ఆస్కి చైర్మన్‌ డాక్టర్‌ పద్మనాభయ్యతో కలిసి ఈ గ్రంథాన్ని ఆవిష్కరించారు. రాజకీయ ప్రముఖులు, మాజీ ప్రభుత్వ ఉన్నతాధికారులు, సీనియర్‌ పాత్రికేయులు, సామాజికవేత్తలు, దేశ ప్రగతిలో కీలకంగా పనిచేసిన వ్యక్తులు రాసిన 31 వ్యాసాలను ఇందులో పొందుపరిచారు. భారతదేశ ప్రగతి ప్రస్థానం, అభివృద్ధి, ప్రజా జీవితంలో చోటుచేసుకుంటున్న పరిణామాలు.. విద్య, ఉపాధి రంగాల్లో వచ్చిన మార్పులకు సాక్షులుగా నిలిచిన వ్యక్తులే ఈ వ్యాసాలను రాయటం విశేషం. దేశానికి స్వాతంత్య్రం వచ్చిన కొత్తలో పని విధానం ఎలా ఉండేది? క్రమంగా ఎలా మారుతూ వచ్చింది? వివిధ రంగాల్లో ఉద్యోగుల పని విధానం ఎలా ఉంది? అనే అంశాలను ఈ వ్యాసాల్లో చర్చించారు. రాజకీయ రంగానికి చెందిన పీ చిదంబరం, అరుణ్‌శౌరి, యశ్వంత్‌ సిన్హా, వ్యాపార రంగానికి చెందిన కేవీ కామత్‌, నారాయణ మూర్తి తదితరుల వ్యాసాలు ఈ గ్రంథంలో ఉన్నాయి. ఆవిష్కరణ కార్యక్రమంలో ఈ గ్రంథం గురించి మాట్లాడిన వైవీ రెడ్డి.. తాను కలిసి పనిచేసిన వ్యక్తుల్లో కొందరిని ఎంతో గౌరవంతో ఇందులో భాగస్వాములను చేశానని, అంతే గౌరవ మర్యాదలతో మరికొందరిని భాగస్వాములను చేయలేదని చమత్కరించారు.

ప్రజల ఆకాంక్షలను నెరవేర్చే సర్వే ఇది

మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొన్నం, దామోదర, సీతక్క వెల్లడి

- 96.9 శాతం కచ్చితత్వంతో.. 50 రోజుల్లో సమగ్ర సర్వే నిర్వహించాం
- 4న కేబినెట్‌కు సర్వే నివేదిక అందజేత
- మంగళవారం ఉదయం 10 గంటలకు మంత్రివర్గం భేటీ అయి చర్చిస్తుంది
- అదేరోజు అసెంబ్లీలో నివేదిక అని వెల్లడి



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్‌. చిత్రంలో మంత్రి పొన్నం

సాక్షి, హైదరాబాద్‌: రాష్ట్ర ప్రజల ఆకాంక్షలను నెరవేర్చే సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే ప్రక్రియ పూర్తయిందని మంత్రి ఎన్‌.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఈ నెల 4న ఈ సర్వే నివేదికను రాష్ట్ర కేబినెట్‌కు అందిస్తామని, ఆ రోజున ఉదయం 10 గంటలకు కేబినెట్‌ భేటీ అయి నివేదికపై చర్చిస్తుందని వెల్లడించారు. అదే రోజున అసెంబ్లీ ప్రత్యేక సమావేశం నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. ఉదయం 11 గంటలకు ప్రారంభమయ్యే అసెంబ్లీలో నివేదికపై చర్చిస్తుందని తెలిపారు. రాష్ట్రంలో 'సామాజిక, ఆర్థిక, విద్య, ఉద్యోగ, రాజకీయ, కుల సర్వే'పై ఏర్పాటైన మంత్రివర్గ ఉపసంఘం చైర్మన్‌ ఉత్తమ్‌తోపాటు కో–చైర్మన్‌ దామోదర రాజనర్సింహ, సభ్యులు పొన్నం ప్రభాకర్‌, సీతక్క తదితరులు ఆదివారం సచివాలయంలో మీడియా సమావేశం నిర్వహించారు.

దేశంలో ఎక్కడా లేనంత కచ్చితంగా..

రాష్ట్ర ప్రభుత్వం యాభై రోజుల్లోనే 96.9 శాతం కచ్చితత్వంతో సమగ్ర సర్వే నిర్వహించి రికార్డు సృష్టించిందని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చెప్పారు. దేశంలో ఎక్కడా ఇంతటి కచ్చితత్వంతో సర్వే జరగలేదన్నారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌ అగ్రనేత రాహుల్‌ గాంధీ రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు ఈ సర్వే చేపట్టామని తెలిపారు. ప్రణాళిక శాఖ ఆధ్వర్యంలో జరిగిన ఈ సర్వేకు సంబంధించి ఆ శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్‌ సుల్తానియా, నోడల్‌ అధికారి అనుదీప్‌ దురిశెట్టి తదితరులు ఆదివారం మంత్రివర్గ ఉపసంఘానికి సర్వే నివేదిక సమర్పించారని వెల్లడించారు.

సంక్షేమ కార్యక్రమాల కోసం

రాష్ట్రంలో కాంగ్రెస్‌ పార్టీ సామాజిక న్యాయానికి పెద్దపీట వేస్తోందని ఉత్తమ్‌ పేర్కొన్నారు. రాష్ట్రంలో సంక్షేమ కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేసేందుకు ఈ సర్వే వివరాలను వినియోగించుకుంటామని తెలిపారు. ఇది కేవలం డేటా సేకరణ ప్రక్రియ మాత్రమే కాదని, సామాజిక న్యాయ విప్లవమని వ్యాఖ్యానించారు. సర్వేపై తప్పుడు ప్రచారాలు, హైకోర్టులో పిల్‌లు వేయడం వంటి సమస్యలు ఎదురయ్యాయని చెప్పారు. కోర్టు ప్రభుత్వానికి అనుకూలంగా తీర్పునివ్వడంతో సర్వే సమగ్రంగా కొనసాగిందని తెలిపారు. ప్రజలకు అవగాహన కల్పించేలా అధికార యంత్రాంగం వివిధ కార్యక్రమాలు నిర్వహించి.. సర్వేను విజయవంతంగా పూర్తి చేసిందని చెప్పారు. సర్వేలో పాల్గొన్న ప్రతి అధికారి, సిబ్బందికి మంత్రివర్గ ఉపసంఘం అభినందనలు తెలుపుతోందన్నారు.

రాష్ట్ర చరిత్రలో మైలురాయి

సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే రాష్ట్ర చరిత్రలో మైలురాయి అని మంత్రి పొన్నం ప్రభాకర్‌ పేర్కొన్నారు. ప్రజలు ప్రభుత్వంపై నమ్మకాన్ని ప్రదర్శిస్తూ సర్వేలో పాలు పంచుకున్నారని తెలిపారు. కొందరు ఉద్దేశపూర్వకంగా సర్వేను అడ్డుకునేందుకు తప్పుడు ప్రచారం చేశారని, వాటిని ప్రజలు తిప్పికొట్టారని పేర్కొన్నారు. ఈ సర్వే సామాజిక న్యాయాన్ని నిర్ధారించడంలో నిబద్ధతతో కూడిన ప్రయత్నమని మంత్రి దామోదర రాజనర్సింహ అభివర్ణించారు. ఇలాంటి సర్వేలు దేశవ్యాప్తంగా నిర్వహించాల్సిన అవసరం ఉందని మంత్రి సీతక్క పేర్కొన్నారు. ఈ సమావేశంలో ప్రణాళిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్‌కుమార్‌ సుల్తానియా, హైదరాబాద్‌ కలెక్టర్‌ అనుదీప్‌, ఇతర అధికారులు పాల్గొన్నారు.

రేపు అసెంబ్లీ సమావేశం

సాక్షి, హైదరాబాద్‌: ఈ నెల 4వ తేదీ ఉదయం 11 గంటలకు రాష్ట్ర అసెంబ్లీ సమావేశం కానుంది. స్పీకర్‌ గడ్డం ప్రసాద్‌కుమార్‌ ఆదేశాల మేరకు ఈ భేటీ జరుగుతోందని పేర్కొంటూ.. శాసనసభ కార్యదర్శి వి.నరసింహాచార్యులు ఆదివారం బులెటిన్‌ విడుదల చేశారు.

'లెక్క' తేలింది

▶ మొదటి పేజీ తరువాయి

వర్గాల అభ్యున్నతి కోసం అవసరమైన సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ అవకాశాలను మెరుగుపర్చేందుకు.. సమగ్ర ప్రణాళికలు రూపొందించి అమలు చేసేందుకు వీలుగా సర్వే చేపడుతున్నట్టు రాష్ట్ర ప్రభుత్వం గతేడాది బడ్జెట్‌ సమావేశాల్లో తీర్మానం చేసింది. గతేడాది అక్టోబర్‌ 10న రాష్ట్రంలో 'సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వే (సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే)' చేపడుతున్నట్టుగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఉత్తర్వులు జారీ చేశారు. నవంబర్‌ 6నలో రాష్ట్ర ప్రణాళిక శాఖ ఆధ్వర్యంలో సర్వే ప్రక్రియ ప్రారంభమైంది. తొలి మూడు రోజుల పాటు ఇళ్లను గుర్తించి స్టిక్కర్లు వేసిన సర్వే సిబ్బంది.. తొమ్మిదో తేదీ నుంచి వివరాల సేకరణ ప్రారంభించారు. నవంబర్‌ 31 నాటికే పూర్తి చేయాలనే లక్ష్యం నిర్దేశించుకున్నా.. కొన్నిచోట్ల వివరాల సేకరణ సుదీర్ఘంగా కొనసాగడం, ఇంటి యజమానులు అందుబాటులో లేకపోవడం వంటి కారణాలతో జాప్యం జరిగింది. డిసెంబర్‌ మూడో వారం నాటికి సర్వే ప్రక్రియ, డేటా ఎంట్రీ పూర్తయింది.


16 లక్షల మంది దూరం..: రాష్ట్రవ్యాప్తంగా 1,15,17,457 కుటుంబాలు ఉన్నట్టు గుర్తించిన అధికారులు.. అందులో 1,12,15,134 కుటుంబాల వివరాలను సేకరించారు. సుమారు మూడు లక్షల కుటుంబాలకు సంబంధించిన సమాచారం సేకరించలేదు. ఇందులో 1.03 లక్షల ఇళ్లు తాళం వేసి ఉండగా.. 1.68 లక్షల కుటుంబాలు సర్వేలో పాల్గొనేందుకు ముందుకురాలేదు. మిగతా కుటుంబాలు రాష్ట్రేతర వలస కార్మికులు కావడంతో సర్వే చేయలేదు. మొత్తంగా సుమారు 16 లక్షల మందికి సంబంధించిన వివరాల సేకరణ జరగలేదని అంచనా. 96.9 శాతం కచ్చితత్వంతో సర్వే జరిగిందని అధికారులు చెప్తున్నారు. ఈ సర్వేలో 94,863 మంది ఎన్యుమరేటర్లు, 9,628 మంది సూపర్‌వైజర్లు పాల్గొన్నారు. సుమారు 76 వేల మంది డేటా ఎంట్రీ ఆపరేటర్లతో 36 రోజుల్లో సర్వే వివరాలను డిజిటలైజ్‌ చేశారు.

సర్వేలో సేకరించిన వ్యక్తుల సమాచారం

కేటగిరీ	జనాభా	శాతం
పురుషులు	1,79,21,183	50.51
మహిళలు	1,75,42,597	49.45
థర్డ్‌ జెండర్‌	13,774	0.04
మొత్తం	3,54,77,554	100%

ఢిల్లీ పాడుబడిన హైదరాబాద్‌లా ఉంది

ఢిల్లీ ఎన్నికల ప్రచారంలో ఏపీ సీఎం చంద్రబాబు



సాక్షి, న్యూఢిల్లీ: 'దేశ రాజధాని ఢిల్లీ మురికికూపంగా తయారైంది. స్లమ్‌ ఏరియాల్లో మంచినీటి పైప్‌లైన్‌, డ్రెయినేజీలు కలిసే ఉన్నాయి. 1995లో పాడుబడిన హైదరాబాద్‌లా ఢిల్లీ మహానగరం ఉంది' అని ఏపీ సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు. ఒకప్పుడు ఐటీ గురించి మాట్లాడాను, ఇప్పుడు ఏఐ గురించి మాట్లాడుతున్నానన్నారు. ప్రతి ఒక్క ఇంట్లో ఒక ఏఐ తయారు కావాలని ఆయన ఆకాంక్షించారు. ఆదివారం రాత్రి ఢిల్లీలోని షహదరా నియోజకవర్గం నుంచి బరిలో నిలిచిన బీజేపీ షాహద్రా అభ్యర్థి గోయల్‌కు మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సభలో ఆయన తెలుగువారిని, ఉత్తరాది ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. 'ఢిల్లీ ఓ పక్క వాతావరణం, మరోపక్క రాజకీయాలతో కలుషితమైంది. ఢిల్లీ ప్రజలకు అభివృద్ధి కావాలన్నా, జీవన ప్రమాణాలు మెరుగుపడాలన్న బీజేపీని గెలిపించి తీరాలి. ప్రపంచంలో దేశం బ్రాండ్‌ మార్మోగుతుందంటే దానికి కారకుడు ప్రధాని మోదీ మాత్రమే' అని అన్నారు.

బడ్జెట్‌లో కేంద్రం వివక్షపై యుద్ధం

అంబేడ్కర్‌ విగ్రహం సాక్షిగా ప్రకటిస్తున్నాం

- తెలంగాణ అభివృద్ధిని కాంక్షించే ప్రతి ఒక్కరూ కలిసి రావాలి
- కాంగ్రెస్‌ ధర్నాలో పార్టీ చీఫ్‌ మహేశ్‌కుమార్‌
- బీజేపీ ఎంపీలకు తెలంగాణ డీఎన్‌ఏ ఉంటే ఇప్పటికైనా గొంతెత్తాలి
- కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, సంజయ్‌ రాజీనామా చేయాలని డిమాండ్‌
- నేడు జిల్లా కేంద్రాల్లో నిరసనలకు పిలుపు



హైదరాబాద్‌లోని ట్యాంక్‌బండ్‌పై నిర్వహించిన ధర్నాలో మహేశ్‌కుమార్‌గౌడ్‌, షబ్బీర్‌ అలీ, సీతక్క, పొన్నం ప్రభాకర్‌ తదితరులు

సాక్షి, హైదరాబాద్‌: బడ్జెట్‌లో తెలంగాణపై కేంద్ర ప్రభుత్వ వివక్ష వైఖరికి నిరసనగా అంబేడ్కర్‌ విగ్రహం సాక్షిగా యుద్ధం ప్రకటిస్తున్నామని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌ కుమార్‌ గౌడ్‌ చెప్పారు. తెలంగాణ అభివృద్ధిని కాంక్షించే ప్రతి పౌరుడూ తమతో కలిసి రావాలని ఆయన పిలుపునిచ్చారు. 'దేశమంటే మట్టి కాదోయ్‌..' అంటూ తెలుగు గేయాన్ని గుర్తుచేసి.. తెలుగు ప్రజల ఆకాంక్షలకు, తెలుగు నేల అభివృద్ధికి బడ్జెట్‌లో మొండిచేయి చూపారని మండిపడ్డారు. తెలంగాణ ప్రజలు బీజేపీని ఎప్పటికీ క్షమించరని అన్నారు. కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి అన్యాయం జరిగిందని పేర్కొంటూ.. ఆదివారం ట్యాంక్‌బండ్‌ వద్ద కాంగ్రెస్‌ పార్టీ నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.

బీజేపీ సవతి ప్రేమకు నిదర్శనం

తెలుగింటి కోడలు నిర్మలా సీతారామన్‌.. దేశ సమగ్రాభివృద్ధికి కాకుండా రాజకీయ ప్రయోజనాల కోసం బడ్జెట్‌ కేటాయింపులు చేసినట్లు ఉందని మహేశ్‌గౌడ్‌ ధ్వజమెత్తారు. తెలంగాణ విషయంలో బీజేపీ సవతి ప్రేమను అవి తెలియజేస్తున్నాయని విమర్శించారు. రాష్ట్రం నుంచి లక్షల కోట్ల రూపాయల పన్నులు తీసుకుంటున్న కేంద్రం, కనీసం రూ.40 వేల కోట్లు కూడా రాష్ట్రానికి కేటాయించకపోవడం దురదృష్టకరమన్నారు. తెలంగాణ ప్రజలు బీజేపీకి చెందిన 8 మంది ఎమ్మెల్యేలు, 8 మంది ఎంపీలను గెలిపిస్తే.. రాష్ట్రానికి కేంద్రం గాడిద గుడ్డు ఇచ్చిందని వ్యాఖ్యానించారు. రాష్ట్రం నుంచి కేంద్ర మంత్రివర్గంలో ప్రాతినిధ్యం వహిస్తున్న కిషన్‌రెడ్డి, సంజయ్‌లకు తెలంగాణ అభివృద్ధి పట్టదా అని నిలదీశారు. రాష్ట్రంపై ప్రేమ ఉంటే వారు వెంటనే తమ పదవులకు రాజీనామా చేయాలని డిమాండ్‌ చేశారు. కేంద్రం కక్షపూరిత వైఖరికి నిరసనగా రాజకీయాలకతీతంగా తెలంగాణ వాదులు ఏకతాటి పైకి రావాలని మహేశ్‌గౌడ్‌ విజ్ఞప్తి చేశారు.

అప్పుడు అడగలేదన్నారు.. ఇప్పుడు అడుగుతున్నా మొండిచెయ్యే

బీజేపీ ఎంపీల్లో తెలంగాణ డీఎన్‌ఏ ఉంటే ఇప్పటికైనా గొంతెత్తాలని రాష్ట్ర బీసీ సంక్షేమం, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ డిమాండ్‌ చేశారు. నిధులు అడగడం లేదని పదేళ్లుగా చెప్పుకొచ్చారని, ఇప్పుడు అడుగుతున్నా ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క మాట్లాడుతూ.. తెలంగాణ అంటే బీజేపీకి ద్వేషమని వ్యాఖ్యానించారు. బీజేపీ ప్రభుత్వం పెట్టింది స్వార్థపూరిత బడ్జెట్‌ అని విమర్శించారు. ఇది ఆరంభం మాత్రమేనని, ఢిల్లీలోని జంతర్‌మంతర్‌ దగ్గర కూడా నిరసన తెలియజేస్తామని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌ అలీ చెప్పారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు అనిల్‌ కుమార్‌ యాదవ్‌, ఎమ్మెల్యేలు శ్రీగణేశ్‌, ఈర్లపల్లి శంకర్‌, నాగరాజు, ఎమ్మెల్సీలు బల్మూరి వెంకట్‌రావు, ఎగ్గె మల్లేశం, సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ఏఐసీసీ కార్యదర్శి ఎస్‌. సంపత్‌కుమార్‌, ప్రణాళిక సంఘం వైస్‌ చైర్మన్‌ చిన్నారెడ్డి, డీసీసీ అధ్యక్షుడు రోహిణ్‌రెడ్డి, కార్పొరేషన్‌ చైర్మన్లు మెట్టు సాయికుమార్‌, మల్‌రెడ్డి రాంరెడ్డి, చల్లా నర్సింహారెడ్డి, నాగరిగారి ప్రీతం, రియాజ్‌, టీపీసీసీ మీడియా విభాగం చైర్మన్‌ సామా రామ్మోహన్‌రెడ్డి, యూత్‌ కాంగ్రెస్‌, ఎన్‌ఎస్‌యూఐల రాష్ట్ర అధ్యక్షులు శివచరణ్‌రెడ్డి, వెంకటస్వామి, సేవాదళ్‌ చైర్మన్‌ మిద్దెల జితేందర్‌, మహిళా కాంగ్రెస్‌ నాయకులు సునీతారావు పాల్గొన్నారు.

మోదీ, నిర్మల దిష్టిబొమ్మలు దగ్ధం చేయండి

కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు జరిగిన అన్యాయానికి నిరసనగా పార్టీ ఆధ్వర్యంలో సోమవారం రాష్ట్ర వ్యాప్తంగా జిల్లా కేంద్రాల్లో నిరసన కార్యక్రమాలు నిర్వహించాలని టీపీసీసీ పిలుపునిచ్చింది. ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్‌ చైర్మన్లు, ముఖ్య నేతలంతా పాల్గొనాలని, ప్రధాని మోదీ, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ల దిష్టిబొమ్మలు దగ్ధం చేయాలని పార్టీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్‌ ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

15 లోపు 'పంచాయతీ' షెడ్యూల్‌!

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు: మంత్రి పొంగులేటి



ఖమ్మం కలెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

వైరా: ఈనెల 15వ తేదీలోగా గ్రామ పంచాయతీల ఎన్నికల షెడ్యూల్‌ వస్తుందని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి చెప్పారు. ఆదివారం ఖమ్మం జిల్లా వైరా మండలం విప్పలమడకలో ఆయన మాట్లాడారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని చెప్పారు. లబ్ధిదారుల ఎంపికలో పొరపాట్లు జరగకుండా చూడాలని అధికారులకు సూచించారు. తాము పండించిన ధాన్యం కొనుగోలు చేయడం లేదని పలువురు రైతులు మంత్రి దృష్టికి తీసుకురాగా, వెంటనే కలెక్టర్‌ ముజమ్మిల్‌ ఖాన్‌తో ఫోన్‌లో మాట్లాడారు. చివరి గింజ వరకూ కొనుగోలు చేయాలని, రైతులు ఇబ్బంది పడకుండా చూడాలని ఆదేశించారు. కార్యక్రమంలో వైరా ఎమ్మెల్యే మాలోత్‌ రాందాస్‌ నాయక్‌తో పాటు స్థానిక నేతలు పాల్గొన్నారు.

నేటి నుంచి ఎమ్మెల్సీ నామినేషన్ల స్వీకరణ

సాక్షి ప్రతినిధి, నల్లగొండ/కరీంనగర్‌: వరంగల్‌–ఖమ్మం–నల్లగొండ ఉపాధ్యాయ, కరీంనగర్‌, మెదక్‌, నిజామాబాద్‌, ఆదిలాబాద్‌ జిల్లాల, ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీల ఎన్నికకు సోమవారం నోటిఫికేషన్‌ విడుదల కానుంది. ఈ నెల 3 నుంచి 10వ తేదీ వరకు ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్లు స్వీకరిస్తారు. 11న నామినేషన్ల పరిశీలన, 13న సాయంత్రం 3 గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణకు గడువు ఉంది. ఆ తర్వాత పోటీలో ఉన్న అభ్యర్థుల వివరాలు ప్రకటిస్తారు. నామినేషన్ల ప్రక్రియకు సంబంధించి ఇప్పటికే నల్లగొండ కలెక్టరేట్‌ బయట 100 మీటర్ల పరిధిలో బారికేడ్లు ఏర్పాటు చేశారు. 100 మీటర్ల లోపు మూడు వాహనాలు, నామినేషన్‌ అభ్యర్థితో కలిపి ఐదుగురిని మాత్రమే అనుమతిస్తారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గానికి సంబంధించి నామినేషన్లను నల్లగొండ కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన ఆర్‌ఓ కార్యాలయంలో స్వీకరిస్తారు. ఎన్నికల రిటర్నింగ్‌ అధికారిగా కలెక్టర్‌ ఇలా త్రిపాఠి వ్యవహరిస్తారు. కరీంనగర్‌, మెదక్‌, నిజామాబాద్‌, ఆదిలాబాద్‌ జిల్లాల ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాలకు కలెక్టర్‌ పమేలా సత్పతి ఆర్వోగా వ్యవహరిస్తారు. నామినేషన్ల స్వీకరణకు కరీంనగర్‌ కలెక్టరేట్‌లో ఏర్పాట్లు పూర్తి చేశారు.

హైడ్రాతో రియల్‌ ఎస్టేట్‌ కుదేలు

ఆ బూచి చూపి బిల్డర్లపై వేధింపులకు పాల్పడుతున్నారు: హరీశ్‌రావు



బిల్డర్‌ వేణుగోపాల్‌రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మాజీ మంత్రి హరీశ్‌రావు

కుత్బుల్లాపూర్‌: హైడ్రా ఏర్పాటుతో రాష్ట్రంలో రియల్‌ ఎస్టేట్‌ రంగం కుదేలైందని.. బిల్డర్‌ వేణుగోపాల్‌రెడ్డి ఆత్మహత్య ప్రభుత్వ హత్యే అని మాజీ మంత్రి హరీశ్‌రావు ఆరోపించారు. అప్పుల బాధతో ఆత్మహత్యకు పాల్పడిన కొంపల్లికి చెందిన బిల్డర్‌ వేణుగోపాల్‌రెడ్డి కుటుంబసభ్యులను ఆదివారం ఆయన ఎమ్మెల్యే వివేకానందతో కలిసి పరామర్శించారు. అనంతరం హరీశ్‌రావు మాట్లాడుతూ నేడు రాష్ట్రంలో రియల్‌ఎస్టేట్‌ రంగం పెనుముప్పును ఎదుర్కొంటోందని, పిల్లల పెళ్లిళ్లు, చదువుల కోసం, ఆపదలో ఉన్నవారు అమ్ముకుందామంటే ప్లాట్లు అమ్ముడుపోని దుస్థితి నెలకొందన్నారు. పదేళ్ల బీఆర్‌ఎస్‌ ప్రభుత్వ పాలనలో తెలంగాణలో రియల్‌ ఎస్టేట్‌ రంగం దేశానికే దిక్సూచిగా నిలిచిందని, నాటి సీఎం కేసీఆర్‌ హైదరాబాద్‌ను పెట్టుబడులకు స్వర్గధామంగా మారిస్తే, నేడు కాంగ్రెస్‌ పాలకుల అనాలోచిత నిర్ణయాలతో ప్రజలను భయపెట్టే విధంగా హైడ్రా ఏర్పాటు చేయడంతో పెట్టుబడులు ముంబై, నోయిడా, బెంగళూరులకు తరలి పోతున్నాయని చెప్పారు. సీఎం రేవంత్‌రెడ్డి రియల్‌ఎస్టేట్‌ అంటే నాకు బాగా తెలుసు అని మాటల్లో చెప్పడం కాదు..మీరు వచ్చి వేణుగోపాల్‌రెడ్డి కుటుంబంతో మాట్లాడండి, వారి కష్టాన్ని అర్థం చేసుకోండి, భవిష్యత్‌లో మిగతా బిల్డర్లకు ఈ పరిస్థితి రాకుండా చర్యలు చేపట్టండని హరీశ్‌రావు అన్నారు. హెచ్‌ఎండీఏ, జీహెచ్‌ఎంసీ పరిధిలో అనుమతులు ఎందుకు ఆలస్యమవుతున్నాయని ప్రశ్నించారు. సీఎం రియల్‌ ఎస్టేట్‌ రంగంపై సమీక్ష సమావేశం నిర్వహించి బిల్డర్లకు భరోసా కల్పించాలన్నారు.

కేంద్రం దేశవ్యాప్తంగా కులగణన చేయాలి

మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌



సాక్షి, హైదరాబాద్‌: దేశవ్యాప్తంగా జనగణనతోపాటు కులగణన చేసేలా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని జాతీయ ఓబీసీ నేతలతో జరిగిన సమావేశంలో మాజీ మంత్రి వి.శ్రీనివాస్‌ గౌడ్‌ అన్నారు. ఆదివారం శంషాబాద్‌లోని నోవాటెల్‌ హోటల్‌లో ప్రొఫెసర్‌ సూరజ్‌ మండల్‌, తమిళనాడు రాజ్యసభ సభ్యుడు వి.విల్సన్‌, ఆలిండియా ఓబీసీ స్టూడెంట్స్‌ అసోసియేషన్‌ జాతీయ అధ్యక్షుడు కిరణ్‌తో శ్రీనివాస్‌గౌడ్‌ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జనాభా దామాషా ప్రకారం బీసీ రిజర్వేషన్లు కేటాయించి, చట్టబద్ధత కల్పించాలన్నారు. ప్రభుత్వం సాకులు చెప్పి తప్పించుకుంటే, ఓబీసీలు దేశవ్యాప్త ఉద్యమానికి సిద్ధం కావాలని అన్నారు. కేంద్రంలో ఓబీసీ మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని డిమాండ్‌ చేశారు. లేదంటే అన్ని రాష్ట్రాలలో తిరిగి ఓబీసీ ఉద్యమాన్ని మరింత బలోపేతం చేస్తామని పేర్కొన్నారు.

చివరి ఓసీ సీఎం రేవంత్‌రెడ్డి

ఆర్ట్స్‌ కాలేజీ యుద్ధభేరి సభలో తీన్మార్‌ మల్లన్న



సభలో మాట్లాడుతున్న తీన్మార్‌ మల్లన్న. చిత్రంలో బస్వరాజు సారయ్య తదితరులు

హనుమకొండ చౌరస్తా: తెలంగాణలో చివరి ఓసీ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. 2028లో బీసీ వ్యక్తి సీఎం కావడం పక్కా.. అని తీన్మార్‌ మల్లన్న అన్నారు. హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్‌ కాలేజీ మైదానంలో ఆదివారం బీసీ రాజకీయ యుద్ధభేరి సభ నిర్వహించారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి పెద్దసంఖ్యలో హాజరైన ప్రజలను ఉద్దేశించి మల్లన్న ప్రసంగించారు. కుల గణనలో రెడ్లు, వెలమల శాతం ఎంతో చెప్పే ధైర్యం ప్రభుత్వాలకు లేదని అన్నారు. 55 శాతం ఉన్న బీసీలు ఏడాదికి లక్షా 20 వేల కోట్ల పన్నులు చెల్లిస్తుంటే.. ఆ కుప్పపై రెడ్లు, వెలమలు కూర్చుని కాంట్రాక్టులు చేసుకుంటూ సొంత ఖజానా నింపుకుంటున్నారని విమర్శించారు. ఈ సభ రెడ్లు, వెలమలకు–బీసీలకు మధ్య జరిగిన విడాకుల సభ అని పేర్కొన్నారు. త్వరలో జరగనున్న పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ బీసీలు ఎవరైనా బీసీ అభ్యర్థులకే ఓటేయాలని మల్లన్న కోరారు. సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, ఎంపీ ఆర్‌.కృష్ణయ్య, మాజీ మంత్రి మోత్కుపల్లి, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, బీపీ మండల్‌ మనవడు సూరజ్‌ మండల్‌ పాల్గొన్నారు.

తాగునీటికి తిప్పలు.. ఒకటికొస్తే అవస్థలు

అంగన్‌వాడీల్లో ఆ సౌకర్యాలెప్పుడో..

సాక్షి, హైదరాబాద్: అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రాథమిక సౌకర్యాల కల్పన ప్రహసనంగా మారింది. సరైన వసతులు కల్పించే దిశగా కేంద్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తున్నప్పటికీ... నిర్మాణ పనుల్లో తీవ్ర జాప్యం నెలకొంటోంది. ఫలితంగా అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులు, గర్భిణీలు, బాలింతలకు ఇబ్బందులు తప్పడం లేదు. కనీసం తాగునీటి సౌకర్యం, మూత్రశాలలు లేకపోవడంతో గర్భిణులు, బాలింతలు వేచి ఉండలేక ఇళ్లకెళ్లిపోతున్నారు. రాష్ట్రంలోని 7,021 అంగన్‌వాడీ కేంద్రాల్లో టాయిలెట్ల నిర్మాణం, 1,811 కేంద్రాలకు తాగునీటి వసతి ఏర్పాటు కోసం పనులు చేపట్టాలని కేంద్రం నిర్ణయించింది. 2024–25లో రూ.10 కోట్ల నిధులు కూడా విడుదల చేసింది. కానీ పనులన్నీ నత్తనడకన సాగుతున్నాయి. ఆర్థిక సంవత్సరం ముగియనున్నా వేగం పుంజుకోవడం లేదు.



మహబూబ్‌నగర్ జిల్లా మహమ్మదాబాద్ మండల పరిధిలోని చౌదర్‌పల్లి అంగన్‌వాడీ కేంద్రం పరిస్థితి ఇదీ. ఇక్కడ 22 మంది చిన్నారులున్నారు. టాయిలెట్ అసంపూర్తిగా ఉండటంతో రోడ్డు పైనే లఘుశంక తీర్చుకుంటున్నారు. ఈ కేంద్రంలో తాగునీటి వసతి కూడా లేకపోవడంతో చిన్నారులు, ఈ కేంద్రానికి వచ్చే బాలింతలు, గర్భిణులు ఇబ్బందులు పడుతున్నారు.

పురోగతి లేని పనులు

అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు పూర్వ ప్రాథమిక విద్య అందించడంతో పాటు పౌష్టికాహారాన్ని పంపిణీ చేస్తారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఈ కేంద్రాలను నిర్వహిస్తారు. వీటిల్లో చిన్నారులతో పాటు గర్భిణులు, బాలింతలకు సైతం పౌష్టికాహారాన్ని అందిస్తారు. సమగ్ర పౌష్టికాహారాన్ని అక్కడే వండి పంపిణీ చేయాల్సి ఉంటుంది. కానీ చాలాచోట్ల వండిన ఆహారానికి బదులుగా ముడిసరుకునే అందిస్తున్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో సరైన వసతులు లేకపోవడమే ఇందుకు ప్రధాన కారణం. ఈ నేపథ్యంలోనే అంగన్‌వాడీ కేంద్రాల్లో తాగునీటి వసతి, టాయిలెట్లు ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. రాష్ట్రంలోని కొన్ని కేంద్రాలకు వీటిని మంజూరు చేసింది. 7,021 కేంద్రాలకు టాయిలెట్లు మంజూరు చేయగా... ఇందులో కేవలం 1,015 టాయిలెట్లకు సంబంధించిన నిర్మాణ పనులు మాత్రమే పూర్తయ్యాయి. 1,738 కేంద్రాల నిర్మాణ పనులు వివిధ దశల్లో కొనసాగుతుండగా..4,268 కేంద్రాల్లో పనులు ప్రారంభానికే నోచుకోలేదు. అదేవిధంగా 1,864 అంగన్‌వాడీ కేంద్రాలకు తాగునీటి వసతికి సంబంధించి పనులు మంజూరు కాగా కేవలం 289 మాత్రమే పూర్తయ్యాయి. మరో 406 కేంద్రాల్లో పనులు కొనసాగుతుండగా.. 1,169 కేంద్రాల్లో అసలు ప్రారంభమే కాలేదు.

పాలకవర్గాలు లేకపోవడమే కారణం?

ఆర్థిక సంవత్సరం ముగిసేనాటికి పనులు ప్రారంభించకుంటే మంజూరైన నిధులు మురిగిపోయే ప్రమాదం ఉంది. గత సంవత్సరం ఫిబ్రవరి నెల నుంచి గ్రామ పంచాయతీలు ప్రత్యేకాధికారుల పాలనలో ఉన్నాయి. తాజాగా మున్సిపాలిటీల్లో కూడా ప్రత్యేక పాలన ప్రారంభమైంది. అంగన్‌వాడీల్లో వసతుల కల్పనలో స్థానిక సంస్థల పాత్రే కీలకం. కానీ పాలకమండళ్లు లేకపోవడం, ప్రత్యేక పాలన కొనసాగుతుండడంతో అంగన్‌వాడీ కేంద్రాల్లో తాగునీటి సౌకర్యం ఏర్పాటు, టాయిలెట్ల నిర్మాణ పనులపై ప్రభావం పడిందని అధికారులు పేర్కొంటున్నారు.

అంగన్‌వాడీల్లో తాగునీటి వసతి ఏర్పాటుకు సంబంధించి ఎక్కువ సంఖ్యలో పనులు ప్రారంభించని జిల్లాలు ఇలా...

జిల్లా	ప్రారంభించని పనుల సంఖ్య
రంగారెడ్డి	151
ములుగు	89
కరీంనగర్	71
మహబూబాబాద్	71
మేడ్చల్–మల్కాజిగిరి	64

బేతి మల్లేశందే జేఎల్ ఫస్ట్ ర్యాంక్

- మార్కులు ఎక్కువ వచ్చాయని విత్‌హెల్డ్‌లో పెట్టిన టీజీపీఎస్సీ
- 7 నెలల న్యాయపోరాటం అనంతరం మొదటి ర్యాంకర్‌గా ప్రకటన



లింగాల ఘణపురం: పరీక్షలో మార్కులు ఎక్కువ వచ్చాయన్న అనుమానంతో 'విత్‌హెల్డ్' వేటు పడిన ఉద్యోగార్థినే ఎట్టకేలకు టీజీపీఎస్సీ టాప్ ర్యాంకర్‌గా ప్రకటించింది. జనగామ జిల్లా లింగాల ఘణపురం మండలం వడిచర్లకు చెందిన బేతి మల్లేశం.. 2022లో టీజీపీఎస్సీ విడుదల చేసిన జూనియర్ లెక్చరర్ పోటీ పరీక్షకు దరఖాస్తు చేసి పరీక్ష రాశారు. ఆయనది గణితం సబ్జెక్టు. 2024 జూలైలో ప్రకటించిన పరీక్ష ఫలితాల్లో మొత్తం 450 మార్కులకు గాను మల్లేశంకు 408 మార్కులు వచ్చాయి. ఆయన తర్వాతి స్థానంలో నిలిచిన అభ్యర్థికి వచ్చిన మార్కులు రూ.306 మాత్రమే. ఇద్దరి మధ్య ఏకంగా 102 మార్కుల తేడా ఉండటంతో, మల్లేశం మాస్ కాపీయింగ్‌కు పాల్పడ్డారేమోనని అనుమానించి ఆయన ఫలితాన్ని (విత్‌హెల్డ్) నిలిపివేశారు. దీంతో మల్లేశం కోర్టుకు వెళ్లారు. విచారణ అనంతరం కోర్టు ఆయనకు అనుకూలంగా తీర్పు ఇచ్చింది. దీంతో గత జనవరి 31వ తేదీన మల్లేశంను స్టేట్ ఫస్ట్ ర్యాంకర్‌గా ప్రకటిస్తూ టీజీపీఎస్సీ కార్యదర్శి నవీన్ నికోలస్ ఉత్తర్వులు జారీ చేశారు. మల్లేశం మహారాష్ట్రలోని ముంబైలో స్కూల్ అసిస్టెంట్ మ్యాథ్స్ టీచర్‌గా పని చేస్తున్నారు. 2009 నాన్‌లోకల్ కోటాలో ఆయన టీచర్ ఉద్యోగం సంపాదించారు.

'బనకచర్ల'పై మన అభ్యంతరాలు బేఖాతరు

- ఇప్పటికే ప్రాజెక్టు డీపీఆర్‌ను సిద్ధం చేసిన ఏపీ ప్రభుత్వం
- వ్యాప్కోస్ ఆధ్వర్యంలో ముమ్మరంగా కొనసాగుతున్న లైడార్ సర్వే
- ప్రాజెక్టు పనులు ప్రారంభించే సన్నాహాల్లో ఏపీ అధికారులు

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ ప్రభుత్వ అభ్యంతరాలను పట్టించుకోకుండా గోదావరి–బనకచర్ల అనుసంధాన ప్రాజెక్టు నిర్మాణం విషయంలో ఏపీ ప్రభుత్వం దూకుడు పెంచింది. ప్రాజెక్టు డీపీఆర్‌ను ఇప్పటికే సిద్ధం చేయగా, పనులు ప్రారంభించడానికి సన్నాహాలు చేస్తోంది. ప్రాజెక్టు అలైన్‌మెంట్ ఖరారు చేసేందుకు వ్యాప్కోస్ ఆధ్వర్యంలో లైట్ డిటెక్షన్ అండ్ రేంజింగ్(లైడార్) సర్వేను ముమ్మరంగా నిర్వహిస్తోంది. మూడు విభాగాలు(సెగ్మెంట్స్)గా ప్రాజెక్టును విభజించి నిర్మించనుండగా, రెండు విభాగాలకు సంబంధించిన లైడార్ సర్వే ఇప్పటికే పూర్తయ్యింది. మూడో సెగ్మెంట్‌కు సంబంధించిన లైడార్ సర్వే మరో ఒకటిరెండు రోజుల్లో పూర్తి కానుంది. లైడార్ సర్వే ద్వారా తీసిన త్రీడీ, ఫోటోగ్రాఫిక్ చిత్రాల ఆధారంగా కాల్వలు/సొరంగాల అలైన్‌మెంట్‌తోపాటు లెవల్‌ను ఖరారు చేస్తారు. సర్వే పూర్తయితే ప్రాజెక్టు పనులను ఏపీ ప్రారంభిస్తుంది.

రెండు సెగ్మెంట్ల సర్వే పూర్తి

తొలి సెగ్మెంట్‌లో భాగంగా.. పోలవరం ప్రాజెక్టు కుడి ప్రధానకాల్వ సామర్థ్యాన్ని 17,500 నుంచి 38,000 క్యూసెక్కులకు, తాడిపూడి ఎత్తిపోతల పథకం కాల్వ సామర్థ్యాన్ని 1,400 క్యూసెక్కుల నుంచి 10,000 క్యూసెక్కులను పెంచనుంది. అనంతరం పోలవరం ప్రాజెక్టు నుంచి ఈ రెండు కాల్వల ద్వారా నీటిని సమాంతరంగా తరలించి బుడమేరు డైవర్షన్ కెనాల్‌లోకి వేసి అక్కడి నుంచి కృష్ణా నదిలోకి విడుదల చేస్తామని ఏపీ ప్రతిపాదించింది.

» రెండో సెగ్మెంట్ కింద కృష్ణానది నుంచి 28,000 క్యూసెక్కులను ఆరు దశల్లో మొత్తం 127 మీటర్లు లిఫ్ట్ చేసి బొల్లపల్లి రిజర్వాయర్‌కు తరలించనుంది. ఇందుకోసం 150 టీఎంసీల భారీ సామర్థ్యంతో గుంటూరు జిల్లాలో బొల్లపల్లి రిజర్వాయర్ నిర్మాణాన్ని ఏపీ ప్రతిపాదించింది. ఈ సెగ్మెంట్‌లో భాగంగానే నాగార్జునసాగర్ కుడికాల్వ నుంచి బొల్లపల్లి రిజర్వాయర్‌కు నీటిని తరలిస్తామని మరో లింక్‌ను ప్రతిపాదించిన విషయం తెలిసిందే. ఈ రెండు సెగ్మెంట్లకు సంబంధించిన లైడార్ సర్వే ఇప్పటికే పూర్తయ్యిందని అధికారవర్గాలు తెలిపాయి.

» మూడో సెగ్మెంట్ కింద బొల్లపల్లి రిజర్వాయర్ నుంచి 3 దశల్లో నీటిని లిఫ్ట్ చేసి బనకచర్ల క్రాస్ రెగ్యులేటర్‌కు తరలిస్తామని ఏపీ ప్రతిపాదించింది. ఈ క్రమంలో నల్లమల అటవీప్రాంతంలోని కొండల్లో 26.8 కి.మీల సొరంగాన్ని నిర్మించాల్సి ఉంటుంది. ఈ పనులకు సంబంధించిన లైడార్ సర్వే చివరి దశలో ఉంది.

'సాగర్'లింక్‌పై సైతం

నాగార్జునసాగర్ ప్రాజెక్టు నుంచి వరద జలాలను కుడికాల్వ ద్వారా తరలించి గుంటూరు జిల్లాలో నిర్మించబోయే బొల్లపల్లి రిజర్వాయర్‌లోకి ఎత్తిపోస్తామని ఈ ప్రాజెక్టు కింద ఏపీ ప్రతిపాదించింది. ఇందుకోసం కుడికాల్వ(జవహర్ కాల్వ)ను 96.5 కి.మీల వరకు వెడల్పు పెంచి అక్కడి నుంచి వరద జలాలను లిఫ్ట్ చేస్తామని ఏపీ చెప్పడంతో తెలంగాణ ప్రభుత్వం ఆక్షేపణ తెలిపింది. ఈ పనులకు సంబంధించిన సర్వే పనులను ఏపీ పూర్తి చేసినట్టు అధికారవర్గాలు తెలిపాయి. రూ.80వేల కోట్ల ప్రాథమిక అంచనాలతో ప్రతిపాదించిన ఈ ప్రాజెక్టు ద్వారా రోజుకు 2 టీఎంసీలు చొప్పున 90 రోజుల్లో 180 టీఎంసీల మిగులు జలాలను గోదావరి నుంచి తరలిస్తామని ఏపీ పేర్కొంటోంది.

కళ్లముందు కనిపిస్తున్నట్టే..

▶ మొదటి పేజీ తరువాయి

స్కూళ్లను ఎంపిక చేసి..వచ్చే విద్యా సంవత్సరం నుంచే దీనిని అమలు చేయాలని నిర్ణయించారు. ఈ మేరకు రూపొందించిన ఓ నివేదికను పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ నర్సింహారెడ్డి త్వరలో ప్రభుత్వానికి సమర్పించనున్నారు.

సరి చేసుకునే వరకు సూచనలు!

రాష్ట్రంలో 26 వేల ప్రభుత్వ స్కూళ్లున్నాయి. ఇందులో తొలి విడతగా 5 వేల స్కూళ్లను ఎంపిక చేయాలని భావిస్తున్నారు. ఇప్పటికే కంప్యూటర్లు, ఇంటర్నెట్ అనుసంధానం ఉన్న స్కూళ్ల జాబితాను పరిశీలిస్తున్నారు. 5వ తరగతి మొదలు కొని 10వ తరగతి వరకూ ఏఐ ఆధారిత బోధన ఉంటుందని అధికారులు అంటున్నారు. ప్రస్తుతం ఉన్న సిలబస్‌ను దృష్టిలో ఉంచుకుని ప్రోగ్రామ్స్ రూపొందిస్తారు. ప్రధాన సర్వర్ల నుంచి ఆయా స్కూళ్ళకు వీటిని అనుసంధానం చేస్తారు. టీచర్ ఒక పాఠం చెప్పిన తర్వాత ఏఐ ఆధారిత ప్రశ్నలు గూగుల్ క్రోం ద్వారా విద్యార్థులకు పంపుతారు. వీటికి ఆన్‌లైన్‌లోనే సమాధానం చెప్పాల్సి ఉంటుంది. తప్పులుంటే సరి చేసుకునే వరకూ ఏఐ టెక్నాలజీ విద్యార్థికి సూచనలు చేస్తుంది.

వర్చువల్ రియాలిటీ విధానంలో..

ఏఐ సాంకేతికత అందుబాటులోకి వస్తే విద్యార్థి స్వయం అనుభవం మాదిరి పాఠం నేర్చుకునే అవకాశం ఉంటుంది. ఉదాహరణకు విత్తనం మొలకెత్తడం, వృద్ధి చెందడానికి సంబంధించి థియరీ మాత్రమే పుస్తకాల్లో ఉంటుంది. వర్చువల్ విధానంలో విద్యార్థికి కెమెరా లెన్స్ పరికరం ఇస్తారు. దీన్ని ధరించిన తర్వాత విత్తనం తానే నాటి, అది దశల వారీగా ఎలా ఎదుగుతుందో పరిశీలిస్తున్న అనుభూతి పొందుతాడు. అదే విధంగా ఎర్రకోట గురించి పాఠం చెప్పేటప్పుడు, టిప్పు సుల్తాన్ యుద్ధంపై బోధన చేసేటప్పుడు అక్కడే ఉండి చూస్తున్నట్టుగా చేయడం ఏఐ టెక్నాలజీతో సాధ్యమవుతుందని చెబుతున్నారు. దీనివల్ల విద్యార్థుల్లో పఠనాసక్తి పెరగడంతో పాటు, జ్ఞాపక శక్తి మెరుగయ్యే అవకాశం ఉంటుందని భావిస్తున్నారు.

మౌలిక సదుపాయాలే కీలకం

డిజిటల్ బోధన కోసం గతంలో 3 వేల పాఠశాలల్లో లేబొరేటరీలు ఏర్పాటు చేశారు. 10 వేల స్కూళ్ళకు కంప్యూటర్లు ఇచ్చారు. 8 వేల స్కూళ్ళకు ఇంటర్నెట్ సౌకర్యం కల్పించారు. కానీ ఏఐ ఆధారిత బోధనకు మరింత అత్యాధునిక మౌలిక వసతులు అవసరం. ఇప్పుడున్న నెట్ స్పీడ్ పది రెట్లు పెంచాల్సిన అవసరం ఉందని నిపుణులు అంటున్నారు. సర్వర్ల నుంచి వేగంగా ప్రోగ్రామింగ్ అందుకోగల మాడ్యూల్స్‌ను రూపొందించాల్సి ఉంటుంది. దీనికి తోడు ప్రభుత్వ స్కూళ్ళల్లో టీచర్లకు ఏఐపై ప్రత్యేక శిక్షణ ఇవ్వాల్సి ఉంది. గతంలో ఇచ్చిన కంప్యూటర్లు చాలా స్కూళ్లలో వాడకుండా పక్కన పడేశారు. తాజాగా ఇలాంటి పరిస్థితి తలెత్తకుండా స్థానిక ప్రజా ప్రతినిధులు, గ్రామాల్లో ఉండే యువతను ఈ ప్రాజెక్టులో భాగస్వామ్యం చేయాలని భావిస్తున్నారు.

ఏఐతో మెరుగైన బోధన



ప్రభుత్వ పాఠశాలల్లో ప్రైవేటు స్కూళ్ల కంటే మెరుగైన విద్యా ప్రమాణాలు నెలకొల్పేందుకు ప్రయత్నిస్తున్నాం. ఇందులో భాగంగానే ఏఐ టెక్నాలజీతో విద్యా బోధన అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. దీనిపై త్వరలోనే కార్యాచరణ చేపట్టాలని భావిస్తున్నాం.

– ఈవీ నర్సింహారెడ్డి (పాఠశాల విద్యా డైరెక్టర్)

మంచి ఫలితాలకు అవకాశం ఉంది



అమెరికాలో గూగుల్ క్రోం ద్వారానే అసైన్‌మెంట్స్ ఇస్తున్నారు. మూల్యాంకనం చేపడుతున్నారు. ఏఐ వాడకంలో అక్కడి స్కూళ్ళు ముందంజలో ఉన్నాయి. మన విద్యార్థులు గణితంలో అక్కడివారి కంటే మెరుగ్గా ఉంటారు. కాబట్టి ఏఐ టెక్నాలజీతో మంచి ఫలితాలు వచ్చేందుకు అవకాశం ఉంది.

– సంక్రాంతి రవికుమార్ (అమెరికాలో ఏఐ బోధన పరిశీలించిన టీచర్)

అడ్మిషన్లు పెరుగుతాయి



ఏఐ టెక్నాలజీని ముందుకు తీసుకెళ్తే ప్రభుత్వ స్కూళ్ళల్లో అడ్మిషన్లు పెరుగుతాయి. పోటీ ప్రపంచాన్ని తట్టుకునేందుకు ఇది మంచి మార్గం. దీనిపై టీచర్లకు సరైన శిక్షణ ఇవ్వాలి.

– పింగిలి శ్రీపాల్‌రెడ్డి (టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు)

'ముద్రగడ' ఇంటిపై దాడి

- కారును ఢీకొట్టి.. ఫ్లెక్సీలు తొక్కించి నానా బీభత్సం
- కిర్లంపూడిలో ట్రాక్టర్‌తో జనసేన కార్యకర్త వీరంగం



ధ్వంసమైన ముద్రగడ కారు(ఇన్‌సెట్‌లో) జనసేన కండువాతో నిందితుడు గంగాధర్


సాక్షి ప్రతినిధి, కాకినాడ: ఏపీలో కూటమి నేతల అరాచకాలు, దౌర్జన్యాలకు అంతు లేకుండా పోతోంది. అధికార గర్వంతో ఇష్టారాజ్యంగా పేట్రేగిపోతున్నారు. చట్టం తమ చుట్టమన్నట్లుగా వ్యవహరిస్తూ తమకు అడ్డేలేదనే ధైర్యంతో చెలరేగిపోతున్నారు. రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు చేస్తూ అరాచకంగా వ్యవహరిస్తున్నారు. తాజాగా.. జనసేన నాయకుల ప్రోద్బలంతో ఆ పార్టీ కార్యకర్త ఒకరు ఆదివారం ఉదయం కాకినాడ జిల్లా కిర్లంపూడిలో మాజీమంత్రి, వైఎస్సార్‌సీపీ నేత ముద్రగడ పద్మనాభం ఇంటిపై దాడికి పాల్పడి, నానా బీభత్సం సృష్టించాడు. ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ ప్రాతినిధ్యం వహిస్తున్న పిఠాపురం నియోజకవర్గం మంగితుర్తికి చెందిన జనసేన కార్యకర్త గనిశెట్టి గంగాధర్ చాలాకాలం నుంచి కిర్లంపూడిలో తన అమ్మమ్మ ఇంటి వద్ద ఉంటున్నాడు. జనసేనకు వీరాభిమాని. ఆ పార్టీకి చెందిన ప్రతి ఫ్లెక్సీలో తన ఫొటో వేయించుకుంటుంటాడు. మండలంలోని జగపతినగరం శివారు కొండయ్యపేటలో ఆదివారం తెల్లవారుజామున 4 గంటల ప్రాంతంలో పోతుల సత్తిపండుకు చెందిన ట్రాక్టర్‌ను గంగాధర్ దొంగిలించాడు. రామతులసి పెట్రోలు బంకులో రూ.4,300ల డీజిల్ పోయించుకున్నాడు. డబ్బులు అడిగిన పెట్రోలు బంకు బాయ్ వేణుగోపాల్‌ను 'నన్నే డబ్బులు అడుగుతావా? చంపేస్తాను'అంటూ బెదిరించి బంకులో గలాటా సృష్టించాడు. అక్కడి నుంచి ముద్రగడ ఇంటికి చేరుకున్నాడు. ప్రహరీ గేటు మూసి ఉండటంతో గోడ దూకి లోపలకు వెళ్లి గేటు తెరచి, ట్రాక్టర్‌తో ఆవరణలోకి వెళ్లాడు. ముద్రగడ కారును ఢీకొట్టి, వైఎస్సార్‌సీపీ ఫ్లెక్సీలు నేల కూల్చేసి నానా బీభత్సం సృష్టించాడు. కొబ్బరి తోటల్లో దుక్కి దున్నినట్లుగా ముద్రగడ ఇంటి ఆవరణ మొత్తం ట్రాక్టర్‌తో తిరుగుతూ 'జై జనసేన'అంటూ నినాదాలు చేశాడు. అనంతరం అక్కడి నుంచి వెళ్లిపోయి తెల్లవారిన తరువాత మరోసారి ముద్రగడ ఇంటి బయట గలాటా సృష్టించాడు. 'జై జనసేన, తగ్గేదే లేద'ంటూ ముద్రగడ పద్మనాభాన్ని కించపరిచేలా కేకలు వేశాడు. విషయం తెలిసిన ముద్రగడ అభిమానులు, వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో కిర్లంపూడి చేరుకున్నారు. గంగాధర్‌ను స్థానికులు పట్టుకుని దేహశుద్ధి చేసి, పోలీసులకు అప్పగించారు. సంఘటనా స్థలానికి పెద్దాపురం డీఎస్పీ శ్రీహరిరాజు ఆధ్వర్యాన జగ్గంపేట సీఐ వైఆర్‌కే శ్రీనివాస్, ఎస్సై సతీష్, పోలీసులు తరలివచ్చి నిందితుడు గంగాధర్‌ను అదుపులోకి తీసుకున్నారు. విచారణ అనంతరం అతడిని అరెస్టుచేసినట్లు సీఐ చెప్పారు.

ముద్రగడకు జగన్ భరోసా

వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత ముద్రగడ పద్మనాభానికి పార్టీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధైర్యం చెప్పారు. ముద్రగడ ఇంటిపై జనసేన కార్యకర్త దాడి నేపథ్యంలో బెంగళూరులో ఉన్న జగన్ పద్మనాభంతో ఫోన్లో మాట్లాడారు. సంఘటన పూర్వాపరాలు అడిగి తెలుసుకున్నారు. పార్టీ అన్ని వేళల్లో, అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

'ఈగల్' కమిటీలో చల్లా వంశీచంద్‌రెడ్డి

8 మంది సభ్యులతో కమిటీని ఏర్పాటు చేసిన ఏఐసీసీ



సాక్షి, న్యూఢిల్లీ: మహారాష్ట్రతో పాటు.. దేశంలోని పలు రాష్ట్రాల్లో త్వరలో జరగబోయే అసెంబ్లీ ఎన్నికల పర్యవేక్షణ కోసం కాంగ్రెస్ అధిష్టానం ఎంపవర్డ్ యాక్షన్ గ్రూప్ ఆఫ్ లీడర్స్ అండ్ ఎక్స్‌పర్ట్స్ (ఈగల్) కమిటీని ఏర్పాటు చేసింది. మొత్తం ఎనిమిది మంది సభ్యులున్న కమిటీలో తెలంగాణ నుంచి మాజీ ఎమ్మెల్యే, ఏఐసీసీ కార్యదర్శి చల్లా వంశీచంద్‌రెడ్డికి చోటు కల్పించింది. ఆదివారం ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి (సంస్థాగత) కేసీ వేణుగోపాల్ ఒక ప్రకటనలో కమిటీ వివరాలను వెల్లడించారు. దేశంలో స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా ఎన్నికలు జరిగేలా చూసేందుకు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ప్రత్యేకంగా 'ఈగల్'పేరుతో కమిటీ ఏర్పాటు చేశారని పేర్కొన్నారు. ముందుగా ఈ కమిటీ మహారాష్ట్ర ఓటర్ల జాబితాలో అవకతవకలపై అధ్యయనం చేసి, కాంగ్రెస్ అధిష్టానానికి నివేదికను అందిస్తుందని కేసీ వేణుగోపాల్ పేర్కొన్నారు.

ఆరుగురు గురుకుల విద్యార్థులు అదృశ్యం

నెమలిపురి ఎస్సీ బాలుర గురుకుల పాఠశాలలో ఘటన

కోదాడ రూరల్: సూర్యాపేట జిల్లా కోదాడ మండల పరిధిలోని దోరకుంట ఆవాస గ్రామమైన నెమలిపురి ఎస్సీ బాలుర గురుకుల పాఠశాలలో ఆరుగురు విద్యార్థులు ఆదివారం మధ్యాహ్నం నుంచి కనిపించడం లేదు. రాత్రి భోజన సమయంలో గమనించినప్పుడు.. పదో తరగతికి చెందిన ఐదుగురు విద్యార్థులు నాగ వంశీ, భానుప్రకాశ్, యువరాజ్, వికాస్, జగన్, 9వ తరగతి విద్యార్థి అజయ్ కనిపించలేదు. దీంతో ఉపాధ్యాయులు ఆరా తీయగా.. మధ్యాహ్నం నుంచి కనిపించడం లేదని సహ విద్యార్థులు తెలిపారు. ప్రిన్సిపల్ విద్యార్థుల తల్లిదండ్రులకు సమాచారం ఇవ్వగా.. పిల్లలు ఇళ్లకు రాలేదని స్పష్టం చేశారు. అనంతరం తల్లిదండ్రులు పాఠశాల వద్దకు వచ్చి ప్రిన్సిపల్, ఉపాధ్యాయులతో గొడవకు దిగినట్లు తెలుస్తోంది. కనిపించని వారిలో మునగాల, కోదాడ పట్టణం, బేతవోలు, కొమరబండకు చెందిన విద్యార్థులు ఉన్నారు. రాత్రి 10 గంటలు దాటినా విద్యార్థుల ఆచూకీ లేకపోవడంతో వారి తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ఈ సంఘటనపై ప్రిన్సిపల్ కోదాడ రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కాగా, శనివారం రాత్రి పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు వీడ్కోలు పార్టీ నిర్వహించగా.. కొంతమంది విద్యార్థులు గొడవ చేసినట్లు తెలుస్తోంది. దీనిపై విద్యార్థులను పాఠశాల ఉపాధ్యాయులు మందలించారా? లేక వారే మనస్తాపంతో వెళ్లారా? అన్నది తెలియాల్సి ఉంది. ఈ సంఘటనపై తమకు ఫిర్యాదు అందిందని ఎస్ఐ అనిల్ రెడ్డి తెలిపారు.

నేటి భవితలో..

- బిట్‌శాట్ 2025:
  బిట్‌శాట్‌తో బీటెక్, బీఫార్మసీకి మార్గం
  దేశంలో ఇంజనీరింగ్, సైన్స్ ఎడ్యుకేషన్‌లో పేరు గడించిన.. బిర్లా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ (బిట్స్) నిర్వహించే ఎంట్రన్స్ టెస్ట్.. బిట్‌శాట్! ఇందులో ర్యాంకు ఆధారంగా.. బిట్స్‌కు చెందిన క్యాంపస్‌లలో.. బీటెక్, బీఫార్మసీ కోర్సుల్లో ప్రవేశం పొందొచ్చు!! జేఈఈ మెయిన్, అడ్వాన్స్‌డ్‌కు హాజరయ్యే విద్యార్థులు అదే ప్రిపరేషన్‌తో.. బిట్‌శాట్‌లోనూ సత్ఫలితాలు సొంతం చేసుకునే అవకాశం ఉంది! తాజాగా.. 2025–26 విద్యా సంవత్సరానికి సంబంధించి బిట్‌శాట్–2025కు దరఖాస్తు ప్రక్రియ మొదలైంది. ఈ నేపథ్యంలో.. బిట్స్ ప్రత్యేకత, బిట్‌శాట్ పరీక్ష విధానం, ప్రిపరేషన్ తదితర వివరాలు.. దీంతోపాటు నేటి విద్యా, ఉద్యోగాల సమాచారం.

నేటి భవిత పేజీ కోసం సాక్షి ఫ్లస్ (ఈ పేపర్) ను చూడండి

ఒడిశాలో థర్మల్ పవర్ | రాజస్తాన్‌లో సోలార్

నష్టాల నుంచి డిస్కంలు గట్టెక్కేందుకు ప్రత్యామ్నాయ చర్యలతో ముందుకెళ్లాలని భావిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం



సాక్షి, హైదరాబాద్: భారీ నష్టాల్లో ఉన్న విద్యుత్ ఉత్పత్తి సంస్థలను గట్టెక్కించేందుకు ప్రత్యామ్నాయ చర్యలతో ముందుకెళ్లాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. పొరుగు రాష్ట్రాల్లోనూ సౌర విద్యుత్ ప్లాంట్లు, థర్మల్ విద్యుత్ కేంద్రాల ఏర్పాటు దిశగా ముమ్మర ప్రయత్నాలు చేస్తోంది. ఇప్పటికే రాజస్తాన్‌లో భారీ ఎత్తున సౌర విద్యుత్ ప్లాంట్లను ఏర్పాటు చేయాలని నిర్ణయించిన ప్రభుత్వం అందుకు అవసరమైన భూకేటాయింపుల కోసం ఆ రాష్ట్ర ప్రభుత్వంతో సంప్రదింపులు జరుపుతోంది. అదే సమయంలో పీక్ అవర్స్‌లో రాష్ట్రం నుంచి దాదాపు 1,200 మెగావాట్ల థర్మల్ పవర్‌ను రాజస్తాన్‌కు విక్రయించే అంశంపైనా ఒప్పందం చేసుకోనుంది. మరోవైపు ఇటీవలే సింగరేణికి ఒడిశాలోని నైనిలో కేటాయించిన బొగ్గు బ్లాక్ పక్కనే 1,600 మెగావాట్ల థర్మల్ విద్యుత్ కేంద్రాన్ని ఏర్పాటు చేయడానికి ఆ రాష్ట్ర ప్రభుత్వంతో స్థలం కోసం చేసిన ప్రయత్నాలు కొలిక్కి వచ్చాయి. అక్కడ ఏర్పాటు చేసే పిట్‌హెడ్ స్టేషన్ నుంచి 'నాల్కో'కు 1,350 మెగావాట్ల విద్యుత్‌ను విక్రయించేందుకు సింగరేణి సంసిద్ధత వ్యక్తం చేసింది. అందుకోసం విద్యుత్ కొనుగోలు ఒప్పందం (పీపీఏ) కుదుర్చుకోవడానికి 'నాల్కో' ముందుకొచ్చింది. బొగ్గు ఉత్పత్తితోపాటు విద్యుదుత్పాదన రంగంలోకి దిగిన సింగరేణి మరిన్ని పవర్ ప్లాంట్ల ఏర్పాటు దిశగా అడుగులు వేస్తోంది.

రాజస్తాన్‌లో..

రాజస్తాన్ ప్రభుత్వంతో ఇప్పటికే చర్చలు జరిపినట్టు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క 'సాక్షి'కి చెప్పారు. ఎన్ని మెగావాట్ల సౌర విద్యుత్ ప్లాంట్లు ఏర్పాటు చేయాలన్న దానిపై అధ్యయనం జరుగుతోందని.. సౌరవిద్యుత్ ప్లాంట్ ఏర్పాటుకు అవసరమైన భూమి ఇవ్వాలని ఆ ప్రభుత్వాన్ని కోరామన్నారు. ఉదయం పూట సౌర విద్యుత్ వినియోగించుకుంటామని, పీక్ అవర్స్‌లో వారికి థర్మల్ విద్యుత్ అవసరం ఉన్నందున దాదాపు 1,200 మెగావాట్లు ఇవ్వడానికి కూడా తెలంగాణ జెన్‌కో సంసిద్ధతను వ్యక్తం చేసినట్టు చెప్పారు. తక్కువ ధరకు బయట విద్యుత్ లభిస్తున్నప్పుడు థర్మల్ స్టేషన్లను బ్యాక్‌డౌన్ చేస్తున్నామని, పీక్‌టైమ్‌లో థర్మల్ విద్యుత్ కేంద్రాల్లో ఉత్పత్తి తప్పనిసరి అని చెబుతున్నారు.

భారీగా సౌర విద్యుత్‌పైనే దృష్టి..

రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే దాదాపు 4,000 మెగావాట్ల సౌర విద్యుత్‌ను రైతులకు, మహిళా సంఘాలకు కేటాయించి వాటి నుంచి కొనుగోలు చేయడానికి ఆసక్తి వ్యక్తీకరణ టెండర్లను పిలిచింది. ఇది కాకుండా రాష్ట్రంలో వివాదరహితంగా ఉన్న అన్ని దేవాలయ భూముల్లో సోలార్ పవర్ యూనిట్లు నెలకొల్పడానికి ప్రభుత్వం సిద్ధమైంది. నీటిపారుదల శాఖకు సంబంధించి రిజర్వాయర్లు, కాలువల కోసం వేలాది ఎకరాలు సేకరించింది. అందులో చాలా భూములు ఉపయోగించుకుండా ఖాళీగా ఉన్నాయి. అలా ఉన్న భూములన్నింటినీ అధికారులు సర్వే చేస్తున్నారని, వాటిల్లోనూ సోలార్ పవర్‌ప్లాంట్లు ఏర్పాటు చేయాలని సంకల్పించినట్టు డిప్యూటీ సీఎం చెప్పారు. తద్వారా ఆయా భూములు అన్యాక్రాంతం కాకుండా చూడటంతోపాటు ఆయా శాఖలకు ఆదాయం కూడా సమకూరుతుందన్నారు. మధ్యతరహా నీటిపారుదల రిజర్వాయర్లలో ఫ్లోటింగ్ సోలార్ ప్యానెల్స్ ఏర్పాటుతో విద్యుత్ ఉత్పత్తి చేపట్టనున్నట్టు వివరించారు. ఇప్పటికే సింగరేణి ఎల్లంపల్లి రిజర్వాయర్‌లో ఫ్లోటింగ్ సోలార్ ప్యానెల్స్‌తో విద్యుత్ ఉత్పాదన చేస్తోందన్నారు.

సింగరేణిలోని ఓపెన్‌కాస్ట్ మైన్స్‌లో..

సింగరేణి ఓపెన్ కాస్ట్‌లో బొగ్గు తీసిన తర్వాత పెద్ద గుంతలుగా ఏర్పడిన వాటిలో భారీ వర్షాల కారణంగా అవి నీటితో నిండుతున్నాయి. అక్కడ పంప్డ్ స్టోరేజీ పద్ధతిలో విద్యుత్ ఉత్పత్తి చేయడానికి ప్రయత్నాలు చేస్తున్నట్టు డిప్యూటీ సీఎం భట్టి చెప్పారు. మరోవైపు భాగ్యనగరంలో ఫుట్‌పాత్‌లు ఆక్రమణకు గురికాకుండా వాటికి పైకప్పు రూపంలో సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేయనుంది. తద్వారా వీధిదీపాలకు అవసరమయ్యే విద్యుత్‌ను అందించడంతోపాటు పాదచారులకు నీడ కూడా లభిస్తుందని ప్రభుత్వం భావిస్తోంది.

రెండు మండలాల్లో పూర్తిగా సౌర విద్యుత్

ముఖ్యమంత్రి సొంత గ్రామమైన కొండారెడ్డిపల్లితోపాటు సీఎం నియోజకవర్గ(కొడంగల్) పరిధిలోని ఒక మండలం, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క నియోజకవర్గం(మధిర)లోని బోనకల్ మండలంలో పూర్తిగా సౌరవిద్యుత్‌ను సరఫరా చేసేందుకు పైలెట్ ప్రాజెక్ట్ కోసం ఎంపిక చేశారు. ఈ రెండు మండలాలు పూర్తయిన తర్వాత మరిన్ని గ్రామాల్లో సౌర విద్యుత్ సరఫరా చేయడానికి సంకల్పించారు. రాష్ట్రంలో పెద్ద ఎత్తున డేటా సెంటర్స్ ఏర్పాటు చేయడానికి ఐటీ కంపెనీలు ముందుకొస్తున్న విషయం విదితమే. అయితే వీరు క్లీన్‌ఎనర్జీ కావాలని కోరుతున్నారని, తద్వారా వారికి కార్బన్ క్రెడిట్స్ రావడం వల్ల రాయితీలు లభిస్తాయని చెబుతున్నారు. అందుకే క్లీన్‌ఎనర్జీ వైపు దృష్టి సారించినట్టు ప్రభుత్వ వర్గాలు పేర్కొంటున్నాయి.



కామన్ సెన్స్ అనేది మేధావితనం అంతటి అరుదైనదే!
– రాల్ఫ్ వాల్డో ఎమర్సన్

సాక్షి
సోమవారం, 3 ఫిబ్రవరి 2025

దేవభూమి

గతేడాది డిసెంబర్ 25న మరణించిన మలయాళ మహారచయిత ఎమ్.టి.వాసుదేవన్ నాయర్ తన సాహిత్య జీవితంలో తనను బాగా కదిలించిన ఒక అనుభవాన్ని పంచుకున్నారు. ఆయన 1976లో తీవ్రమైన అనారోగ్యానికి గురై ఆసుపత్రిలో ఉన్నారు. అప్పుడో పల్లెటూరతను వచ్చి, ఆయనంటే అభిమానమని చెప్పడమే కాదు, 'మీరు జబ్బుతో ఉన్నారని తెలిసి సేవ చేయడానికి వచ్చాను. కొన్ని పనులు మగ నర్సులే చేయాల్సి ఉంటుంది. మీకు నయమయే దాకా ఆ పనులు చేస్తాను' అన్నాడట. మనిషి మానసిక ఘర్షణల మీద ఎక్కువ దృష్టి పెట్టిన ఎమ్టీ విస్తారంగా రాశారు. కథలు, నవలలు, యాత్రా రచనలు, బాల సాహిత్యం, విమర్శతో పాటు సినిమాలకు స్క్రీన్‌ప్లే రచనలు చేయడమే కాకుండా, అత్యుత్తమ చిత్రాలు అనదగ్గవాటికి దర్శకత్వమూ వహించారు. కేరళ సంస్కృతి మీద ఆయన ప్రభావం ఎనలేనిది. ఆ పల్లెటూరి మనిషి ఎమ్టీ రచనలు చదవడమే కాదు, ఆయన కోసం తన వ్యవసాయ పనులను ఆపుకొని మరీ వచ్చాడు. ఏ రచయితకైనా తన రచనా ప్రయాణంలోని కష్టాల బరువు దిగిపోయే ఘట్టమిది. సహజంగానే ఆ స్పందనకు వాసుదేవన్ నాయర్ కళ్లు చెమ్మగిల్లాయి. ఇది ఒక గొప్ప రచయితగా వాసుదేవన్ నాయర్‌కు జరిగిన ఒక విడి అనుభవమే కావొచ్చు; కానీ మలయాళీయుల సాహిత్య సంపన్నతకు అది గుర్తు. పామరులను కూడా సాహిత్యం ఎలా పెనవేసుకుపోయిందో చెప్పడానికి నిదర్శనం. ఎందుకంటే, ఇదే వాసుదేవన్ నాయర్ మరో సందర్భంలో ఒక గ్రామీణుడు ఆయన దగ్గర ఉచితంగా పుస్తకం తీసుకోవడానికి నిరాకరించి, అతడి దగ్గరున్న ముడుతలు పడిన నోట్లు బలవంతంగా ఇచ్చిన విషయాన్ని గుర్తుచేసుకున్నారు. ఆ నేల అలాంటిది. దోస్తోవ్‌స్కీ లాంటి రష్యన్ రచయిత మీద కూడా ఒక సాధారణ ఆటోడ్రైవర్ తనదైన అభిప్రాయాన్ని కలిగివుంటాడని మురిసిపోయే మలయాళీ సాహిత్యజీవులు ఎందరో!

'స్వర్గాన్ని నేను ఎప్పుడూ ఒక రకమైన గ్రంథాలయంలా ఊహిస్తాను,' అంటారు అర్జెంటీనా రచయిత జార్జ్ లూయీ బోర్హెస్. పుస్తకాలను మించిన పెన్నిధి ఏముంది! గ్రంథాలయం అనేది ఒక ఆశ. ఒక దారిదీపం. ఎమ్టీ సహా చాలామంది రచయితలు తాము రచయితలు కావడానికి ఒక కారణంగా 'ఎక్కువ సమయం లైబ్రరీలో గడపడం' అని చెబుతారు. అత్యంత ప్రకృతి రమణీయత వల్ల కాబోలు కేరళను దేవభూమి అని పిలుస్తుంటారు. కానీ అక్కడి గ్రంథాలయాల వల్ల కూడా అది దేవభూమి అవుతోంది. రాష్ట్రంలో ఎనిమిది వేలకు పైగా లైబ్రరీలు ఉండటమే కాదు, రాష్ట్రవ్యాప్తంగా ముప్పైకి పైగా పెద్ద సాహిత్య ఉత్సవాలు జరుగుతుంటాయి. దేశంలో ప్రతి పంచాయితీలో దాదాపు ఎనిమిది గ్రంథాలయాలున్న ఏకైక రాష్ట్రం కేరళ. దేశంలో అత్యధిక పబ్లిక్ లైబ్రరీలున్న రాష్ట్రం మహారాష్ట్ర (12,191). తర్వాతి స్థానంలో ఉన్న కేరళ (8,415)తో పోల్చితే మహారాష్ట్ర విస్తీర్ణం సుమారు ఎనిమిదింతలని గ్రహిస్తే కేరళ గొప్పదనం అర్థమవుతుంది. మన రెండు తెలుగు రాష్ట్రాల్లో ఉమ్మడిగా కూడా కేరళ సంఖ్యలో నాలుగో వంతైనా లేవు. అక్కడి గిరిజన గ్రామాల్లోనూ కొత్తగా 630 గ్రంథాలయాలను ఏర్పాటుచేయాలని గతేడాది నిర్ణయించారు. కేరళ గ్రంథాలయోద్యమ పితామహుడు పీ.ఎం.పణిక్కర్ వర్ధంతి అయిన జూన్ 19ని అక్కడ 'రీడింగ్ డే'గా జరుపుతుంటారు. చదవడాన్నీ, చదివే వాతావరణాన్నీ మలయాళీయులు ఎంతగా ప్రోత్సహిస్తున్నారనడానికి ఇది రుజువు. ఈమధ్య 'కేరళ లెజిస్లేచర్ ఇంటర్నేషనల్ బుక్ ఫెస్టివల్–2025' ప్రారంభిస్తూ ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి పినరయి విజయన్, 'ప్రపంచ పుస్తక రాజధాని'గా తిరువనంతపురంను 'యునెస్కో' గుర్తించాలని కోరింది అందుకే. తమ రాజధాని నగరం ఆ గౌరవానికి పూర్తిగా అర్హమైనదేనని ఆయన ధీమా!

గతేడాదే ఐక్యరాజ్యసమితి సాంస్కృతిక విభాగమైన యునెస్కో కేరళలోని మరో నగరమైన కోళిక్కోడ్‌ను 'సాహిత్య నగరం'గా గుర్తించిన సంగతి ఇక్కడ గుర్తుచేసుకోవాలి. భారత్‌లో యునెస్కో గౌరవం దక్కించుకున్న తొలి నగరం ఇదే. ఒక్క కోళిక్కోడ్‌లోనే 600 గ్రంథాలయాలు, రీడింగ్ రూములు ఉన్నాయి. వాసుదేవన్ నాయర్, వైకోం మహమ్మద్ బషీర్, పి.వత్సల లాంటి ఎందరో రచయితలకు కోళిక్కోడ్‌తో అనుబంధం ఉంది. యునెస్కో మొదలైన 1945లోనే కేరళలో 'సాహిత్య ప్రవర్ధక సహకార సంఘం' ఏర్పాటుకావడం ఆ రాష్ట్ర ఘన సాహిత్య వారసత్వాన్ని గుర్తుచేస్తోంది. పుస్తకాల ప్రచురణ కోసం కొంతమంది రచయితలు కలిసి ఏర్పాటుచేసిన ఈ సంఘం సుమారు 8,400 పుస్తకాలను ప్రచురించింది. మలయాళ సినిమా అంతగా వర్ధిల్లుతుండటానికి కూడా ఈ సాహిత్య దన్నే కారణం. అందుకే ప్రముఖ సినీ జర్నలిస్ట్ అనుపమా చోప్రా నవతరం మలయాళ దర్శకులను ఇంటర్వ్యూ చేస్తూ, 'అసలు మీరు ఏంచదువుతారు? ఏం చూస్తారు?' అని ప్రశ్నించారు.

పుస్తక ప్రేమికులుగా వ్యక్తులు ఉండటం దానికదే విశేషమే. కానీ వ్యవస్థలు పుస్తకాన్ని ప్రేమిస్తే దాని ప్రభావం వేరే ఉంటుంది. 'పర్వతము ఎంత ఎత్తయి గగన భేద్యమయినా దాని విశాలమైన వక్షస్థలము నుండి చిన్న సెలయేరుగాని ప్రవహించకపోతే ఆ ప్రకృతి సౌందర్యం అసమగ్రంగా ఒంటరిగా శుష్కంగా గోచరిస్తుంది,' అంటారు తన 'జీవనలీల' పుస్తకంలో కాకాసాహెబ్ కాలేల్కర్. ఒక ఇల్లు ఎంత ఘనంగా నిర్మించినా దానిముందు ఒక పూలచెట్టో, ఒక ఊరు ఎంత పెద్దదయినా దాని మధ్యన ఒక గ్రంథాలయమో లేకపోతే అవి అసంపూర్ణం అవుతాయి. పువ్వులు (ప్రకృతి), పుస్తకాలు (వివేకం) ఉన్న ప్రతిచోటూ దేవభూమే!

ఆత్మగౌరవ పొలికేక

"ఆ దృశ్యాలు... ఫారెస్ట్ ఆఫీసులు... పోలీస్ స్టేషన్లు... మనుషులు... ఆ చావులు... అన్నం తినే వేళల్లో ఎవరెవరో కలవడానికి వస్తారు"... ఇవి ఎరుకల జాతిని తరాలుగా వెంటాడే దృశ్యాలు.

బ్రిటిష్ వలసవాదులు 1871లో తీసుకొచ్చిన 'క్రిమినల్ ట్రైబ్స్ చట్టం' ద్వారా ఇతర ఆదివాసీల వలెనే ఎరుకల వారు కూడా పుట్టుకతో నేరస్థుల జాబితాలో చేరిపోయారు. స్వతంత్రం వచ్చాక ఆ చట్టాన్ని రద్దు చేసినప్పటికీ ఎరుకుల వారిని 'మర్యాదస్తుల కుల సమాజం' ఇంకా దొంగలుగానే పరిగణిస్తోంది.



పలమనేరు బాలాజీ 'ఏకలవ్య కాలనీ ఎరుకల జీవన గాథలు' కథాసంపుటి ఎరుకల జాతి జీవన వాస్తవికతను అచ్చమైన స్థానికతతో జీవం ఉట్టిపడేలా చిత్రించింది. ఈ కథా సంపుటిలోని కథలన్నీ చిత్తూరు జిల్లా పలమనేరు ప్రాంతపు ఎరుకల వారి జీవితంపైన అల్లినవే! నిజానికి ఇది అల్లిక కాదు. ఇంతవరకు ఆ జాతిపై ఇతరులు దూరం నుంచి క్రీగంట చూసి రాసిన రాతలకు భిన్నంగా బాలాజీ చూపించిన అరుదైన తన జాతి జీవన చిత్రం. కులసమాజంలో ఎరుకలవారు ఎదుర్కొనే అవమానాలు, అగచాట్లు, కాసింత ఆత్మగౌరవం కోసం వారు వేసే పొలికేకలు ఈ కథల్లో మనకు వినిపిస్తాయి.

పోలీసుల జులుంకీ, ఊరిలో పైకులంవాళ్ళ దౌర్జన్యానికీ... దేనికీ భయపడకుండా ఎరుకల జాతి ఆత్మగౌరవాన్ని నిలబెట్టడానికి నడుం కట్టుకున్న మునిరత్నం, మొగిలప్ప; ఎరుకల జాతిని హీనంగా చూసే వ్యవస్థను ప్రశ్నించే ఉడుకోడు; బతకడమే ఓ నిరసనగా చేసుకుని వంట చేయడంలో ఇతర కులం వాళ్ళకు ఏమాత్రం తీసిపోని పనిమంతుడు కబాబ్ కపాలి; తన కులవృత్తిని కాదని భూమిపై హక్కులుంటే సమాజంలో గౌరవం దొరుకుతుందని కష్టపడి పొలం కొని సాగుచేసినా 'ఎరుకల ఆడది సాగు చేస్తదా' అని హీనంగా మాట్లాడిన వారిపై మట్టి తుఫానై ఎగిసిపడిన కట్టెలామె; తనని నిశానిగా వాడుకోజూసిన దొరపై తిరగబడిన ఎరుకల సర్పంచ్ శ్రీను; జాతిని మేల్కొల్పాలని నిత్యం వారి బాగోగులు చూసుకునే కాంతమ్మ, జయమ్మ; అడవిలో వేటకు వెళ్లే పశువుల పైన, కట్టెలు కొట్టుకునే వాళ్ళ పైన అపరాధ రుసుం వసూలు చేయకుండా తన నెల జీతాన్ని చలానా కట్టే ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్ వెర్రి బాగుల కింది స్థాయి ఉద్యోగి; ఎస్టీ కాలనీని 'ఏకలవ్య కాలనీ'గా మార్చి ఎరుకల జాతి ఆత్మ గౌరవాన్ని చాటి, ఎరుకల యువతను చైతన్యవంతం చేసే కథకుడు ఇందులో సజీవ పాత్రలు.

'ఏనుగుల రాజ్యంలో', 'గురి', 'వెదురు', 'ఎర్రమన్ను ముగ్గుపిండి', 'అదే ప్రశ్న', 'ఆకలేస్తుంది', 'దేనికీ భయపడవద్దు', 'ప్రయత్నం' వంటి కథలన్నీ నేరుగా పాఠకుడిని ఏకలవ్య కాలనీకి తీసుకెళ్తాయి. ఈ పుస్తకం తెలుగు సాహిత్యంలో ఖాళీలను కచ్చితంగా పూరిస్తుంది. తెలుగు సాహిత్యంలో ముఖ్యమైన మైలురాయిగా నిలిచిపోయే పుస్తకం 'ఏకలవ్య కాలనీ ఎరుకల జీవన గాథలు'. ఎరుకల జాతి గురించి జీవం ఉట్టిపడే కథలు రాసిన పలమనేరు బాలాజీకి, సీరియస్ రచనలకు పెట్టింది పేరైన 'పర్స్పెక్టివ్స్' ఖాతాలో ఈ అరుదైన కథా సంపుటిని చేర్చిన రామ కృష్ణారావుకి అభినందనలు.

– చల్లపల్లి స్వరూపరాణి, రచయిత్రి – ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో సీనియర్ ప్రొఫెసర్

మన రాజ్యాంగం బలమైనదేనా?

కామెంట్



కరణ్ థాపర్

మీకు తెలుసా? ప్రపంచ దేశాలన్నింటి రాజ్యాంగాల సగటు ఆయుష్షు 19 ఏళ్ల మాత్రమేనని! భారతదేశం మాత్రం 75 ఏళ్ల పాటు తన రాజ్యాంగాన్ని కాపాడుకుంది. దీనికి సంతోషపడదాం. గర్వంగా ఫీల్ అవుదాం. దేశ చరిత్రలోనే కీలకమైన ఈ ఘట్టాన్ని గత వారమే చూశాం. అయితే, సమీక్షకు తగిన సమయం కూడా ఇదే! డెబ్బై ఐదేళ్ల సుదీర్ఘ ప్రయాణంలో భారత రాజ్యాంగం ఎదుర్కొన్న సవాళ్లు, ప్రశ్నలేమిటన్నది చూద్దాం.

మన రాజ్యాంగం వలసవాదులదని చాలామంది మేధావులు విమర్శిస్తూంటారు. భారతీయ మూలాలు ఉన్నది కాదని ఆర్‌ఎస్‌ఎస్ వ్యాఖ్యానిస్తూ ఉండేది. అలాంటప్పుడు ఇది ఏ విధంగా మనకు మంచిది?

ప్రజలకు ప్రజాస్వామ్యాన్ని అందించిందనేది ఒక సమాధానం. అలాగే ఏకకాలంలో అర్హులందరికీ ఓటుహక్కు కల్పించిన రాజ్యాంగం కూడా మనదే. కానీ దీనివల్ల అందరూ సమానంగా లాభపడ్డారా? లేక... ముస్లింలు, ఆదివాసీలు, దళిత మహిళలు లాభపడలేదా?

డెబ్బై ఏళ్ల ప్రయాణంలో మన రాజ్యాంగం ఇప్పటివరకూ 106 సార్లు మార్పులకు గురైంది. ఇది మన శక్తికి ప్రతీకా? ఎందుకంటే, అవసరమైనప్పుడు తగు విధంగా మార్పులు, చేర్పులు చేసుకునే వీలుతో రాజ్యాంగం ఉంది. లేదా ఇది బలహీనతా? అగ్ర రాజ్యం అమెరికాలో 1789 నుంచి జరిగిన సవరణలు కేవలం 27 మాత్రమే.

శాసనాలు చేసే ప్రజా ప్రతినిధుల వ్యవస్థ కంటే కార్యనిర్వాహక వర్గాన్ని రాజ్యాంగం ఎక్కువ బలోపేతం చేసిందని చెబుతారు. అసెంబ్లీ స్పీకర్ల పనితీరు, రాజ్యాంగంలోని పదవ షెడ్యూల్ ఈ పరిస్థితిని మరింత దిగజార్చాయి. ఫలితంగా ఎంపీలు పార్టీ నాయకత్వానికి సబార్డినేట్లుగా మారిపోయారు. స్పీకర్లకు హౌస్ ఆఫ్ కామన్స్ (యూకే) మాదిరిగా వారిపై అధికారం ఏదీ ఉండదు. ఈ విమర్శను ఇప్పటివరకూ ఎవరూ సవాలు చేయలేదు కూడా! అయితే దీని వెనుక ఏముందన్నది నిశితంగా పరిశీలించాల్సిన అంశం. ''భారతీయ రాజ్యాంగం అడ్డుగోడలు నిర్మించకుండా... కార్యనిర్వాహక వర్గానికి ఎక్కువ అధికారాలు ఇచ్చింది. అంతేకాకుండా ఈ వర్గం తన అధికారాన్ని పూర్తిస్థాయిలో చలాయిస్తుందని విశ్వసించింది'' అంటారు గౌతమ్ భాటియా. పాలకులందరూ మంచివారనీ, రాజ్యాంగాన్ని తు.చ. తప్పకుండా పాటిస్తారని రాజ్యాంగ నిర్మాతలు భావించారా? ఊహూ, అలా అనుకోలేదని స్పష్టంగా చెప్పవచ్చు.

ఒక ఉదాహరణ – ఇందిరాగాంధీ విధించిన అత్యవసర పరిస్థితి. ఇది రాజ్యాంగాన్ని సుప్తచేతనావస్థలో పెట్టడం వల్లనో, రాజ్యాంగానికి అతీతంగా పోవడం వల్లనో అమలు కాలేదు. దాంట్లో భాగమైన వ్యవస్థలతోనే జరిగింది. ఇది మన రాజ్యాంగం బలహీనత లేదా లోపాన్ని ఎత్తిచూపింది. రాజ్యాంగ పరమైన నైతికత లేని విషయాన్ని ఎమర్జెన్సీ పరిస్థితి ఎత్తి చూపిందని చెప్పవచ్చు. ఈ నైతికత అనేది రాజ్యాంగ స్ఫూర్తితోనే వ్యవస్థలు పనిచేస్తాయా, లేదా అన్నదాన్ని నిర్ణయిస్తుంది. గవర్నర్లు, ఎన్నికల కమిషనర్లు తరచూ ఈ రాజ్యాంగ నైతికతను తప్పుతుంటారని మనకు తెలుసు. కానీ వాటిపై వ్యాఖ్యానించడం కంటే ఎక్కువేమీ చేయలేము – ఈ అంశాలపై మన ఆందోళన, విమర్శ ఎంత స్థాయిలో ఉన్నప్పటికీ! రాజ్యాంగంలో ఉన్న మరో లోటు ఇదేనా?

రాజ్యాంగం సమాఖ్య నిర్మాణానికి ఏర్పాటు చేసింది. కానీ ఆర్థికాంశాలతో పాటు పరిపాలనకు సంబంధించిన విషయాల్లోనూ రాష్ట్రాలపై పెత్తనం చలాయించే అధికారం కేంద్రానికి కట్టబెట్టింది. సమాఖ్య స్వరూపాన్ని మార్చే అధికారం, శక్తి కూడా కేంద్రానిదే. స్వాతంత్య్రం లభించిన సమయంలో దేశం బలహీనంగా, ముక్కలు ముక్కలుగా విడిపోయింది కాబట్టి... ఆ పరిస్థితుల్లో ఇలాంటి ఏర్పాట్లు చేశారని అనుకున్నా మూడు సిల్వర్ జూబ్లీల కాలం గడచిన ఈ తరుణంలోనైనా మార్పులు చేయడం అనవసరమా?

భారతీయ పౌరులకు రాజ్యాంగం బోలెడన్ని ప్రాథమిక హక్కులను కల్పించింది. అయితే భావ ప్రకటన, వ్యక్తీకరణపై పూర్తిస్థాయి స్వాతంత్య్రం మాత్రం లేకుండా పోయింది. నిజానికి ఈ 'ఫ్రీ స్పీచ్'ను నైతికత, పరువునష్టం వంటి రెండు సందర్భాల్లో మాత్రమే నియంత్రించాల్సి ఉంటుంది. మహా అయితే... విదేశాలతో మన సంబంధాలు దెబ్బతినే పరిస్థితులకూ పొడిగించవచ్చు. కానీ... మనకున్న నియంత్రణలు చాలా ఎక్కువగా లేవూ?

1973లో రాజ్యాంగపు మౌలిక స్వరూపాన్ని కాపాడే లక్ష్యంతో సుప్రీంకోర్టు కొన్ని విధి విధానాలను సిద్ధం చేసింది. ఇదో చారిత్రక నిర్ణయం. అయితే దాదాపుగా అదే సమయంలో జబల్‌పూర్ అడిషనల్ డిస్ట్రిక్ట్ మేజిస్ట్రేట్ ఎమర్జెన్సీ విషయంలో శాసనకర్తల ఒత్తిడికి లొంగిపోయారు. అయోధ్య విషయంలోనూ ఇదే జరిగిందన్నది చాలామంది అభిప్రాయం. అలాగే జమ్మూ–కశ్మీర్‌కు ఉన్న రాష్ట్ర హోదాను కూడా రాజ్యాంగం కాపాడలేకపోయింది. కాబట్టి... రాజ్యాంగ సంరక్షణ చేయాల్సిన న్యాయస్థానాలు తమ నిర్ణయాల్లో అసందిగ్ధతతో వ్యవహరిస్తున్నాయి. లేదంటే అవసరమైనంత చేయడం లేదు.

రాజ్యాంగం మనకు ఎన్నికల కమిషన్, కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్(కాగ్), ఇన్ఫర్మేషన్ కమిషన్ వంటి ఎన్నో వ్యవస్థలను కల్పించింది. కానీ... ఇవి పాలకవర్గానికి అతీతంగా స్వతంత్రంగా పని చేసేలా మాత్రం చేయలేకపోయింది. ఆ యా సంస్థల ఉన్నతాధికారుల నియామకాల విషయంలో ఇది మరింత సత్యమని చాలా మంది చెబుతారు.

చివరగా... రాజ్యాంగాన్ని గౌరవించాల్సిన రాజకీయ నేతలు, సంస్థల అధినేతలు ఆ పని ఎంత వరకూ సక్రమంగా నిర్వర్తించారు? అలాగే రాజ్యాంగ సంరక్షణ బాధ్యతను న్యాయమూర్తులు ఎంత సమర్థంగా నిర్వహించారు? సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ మదన్‌లోకూర్‌ను ఇదే ప్రశ్న అడిగితే... ''భారత్‌కు మంచి రాజ్యాంగం ఉంది. కీలక సందర్భాల్లో రాజకీయ నేతలు, న్యాయమూర్తులు దీని ప్రతిష్ఠను దిగజార్చారు. పాలకవర్గం మాత్రమే కాదు... పార్లమెంటు కూడా ఇందులో భాగస్వామే'' అన్నారు. ఇందులో అంగీకరించక పోయేందుకు ఏమీ లేదన్నది నా అభిప్రాయం!

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్



- ◆ ప్రపంచ దేశాల రాజ్యాంగాల సగటు వయసు 19 ఏళ్లు. ఆ లెక్కన భారత రాజ్యాంగం 75 ఏళ్లు పూర్తి చేసుకోవడం గొప్పే!
- ◆ అమెరికాలో 1789 నుంచి జరిగిన సవరణలు కేవలం 27 మాత్రమే. మన రాజ్యాంగం ఇప్పటివరకూ 106 సార్లు సవరణలకు గురైంది. ఇది శక్తికి ప్రతీకా? బలహీనతకా?
- ◆ రాజ్యాంగం కార్యనిర్వాహక వర్గానికి ఎక్కువ అధికారాలు ఇచ్చింది. పాలకులందరూ మంచివారనీ, రాజ్యాంగాన్ని తు.చ. తప్పకుండా పాటిస్తారనీ రాజ్యాంగ నిర్మాతలు భావించారా? అది తప్పని ఎమర్జెన్సీ నిరూపించింది.
- ◆ రాజ్యాంగం మనకు ఎన్నో వ్యవస్థలను కల్పించింది. కానీ ఇవి పాలకవర్గానికి అతీతంగా స్వతంత్రంగా పనిచేసేలా మాత్రం చేయలేకపోయింది.

సోషల్ మీడియా

నిజమైన విద్య



విద్య అనేది కేవలం జ్ఞానం పొందడం గురించినదే కాదు. అది కుతూహలాన్ని జ్వలింపజేయాలి. ఎదుగుదలకు స్ఫూర్తినివ్వాలి. నేర్చుకోవడానికీ, సృజించడానికీ తృష్ణను రగల్చాలి.

– సుధా మూర్తి, రాజ్యసభ సభ్యురాలు, రచయిత్రి

లోపలి అద్భుతం



జీవిత పాఠాలు: అద్భుతం కోసం చూస్తున్నారా? కేవలం మీ శ్వాసను గమనించండి. ప్రతి శ్వాస ఒక అద్భుతమే! ఇది ఆగిపోతుందేమో అని మనం భయపడే అద్భుతం.

– శేఖర్ కపూర్, దర్శకుడు

ప్రమాదంలో ఎన్నారైలు!



అమెరికాలో ప్రస్తుతం నేను ఆందోళనకు గురవుతున్న ఒకే ఒక్క జాతిద్వేషం ఇండియన్లకు వ్యతిరేకంగా సాగుతున్నది. దీనికి రెండు కారణాలు: 1. అలాంటిది జరిగినప్పుడు దాన్ని ఎదుర్కొనే సాంస్కృతిక ప్రతిరక్షక వ్యవస్థలు లేనందున ప్రతిక్రియ ఉండదు. 2. చాలామంది భారతీయులు వలసజీవులుగా ఉన్నందున నిజంగానే వాళ్లు ప్రమాదంలో పడగలరు.

– నోవా స్మిత్, అమెరికా బ్లాగర్

అది కదా చూపు!



2009లో నేను 'ఫోర్బ్స్ ఇండియా'లో పనిచేస్తున్నప్పుడు 'అరోవిల్'లో జపాన్ వడ్రంగి కెంజీ మత్సుమోతోను కలిశాను. ఆయన సాధారణ వడ్రంగి కాదు. ఒక చెక్కను కూడా ధ్యానంగా చూస్తారు. 'అది ఏం కావాలనుకుంటుందో నాకు చెబుతుంది' అంటారు. ఒక్కోసారి నాకు అనిపిస్తుంది, మనం అంత మర్యాద సాటి మనుషులకు కూడా ఇవ్వం. అసలు మనకు మనం కూడా ఇచ్చుకోం.

– రామ్‌నాథ్, డేటా ఎనలిస్ట్

నటన వృథా



మీకు అనుభవం లేని విషయాల్లో, అది ఉన్నట్టుగా నటించవద్దు. అది ఎవరినీ నమ్మించలేదు. పైగా మీరే నవ్వులాటకు గురవుతారు. దానికి బదులుగా కుతూహలం చూపితే, అది సహజ ప్రవర్తన అవుతుంది. దానివల్ల మీరొక మొద్దుగా కనబడరు. చాలా నేర్చుకోవచ్చు.

– పాల్ గ్రాహమ్, కంప్యూటర్ శాస్త్రవేత్త

సౌత్ మేల్కొనాలి!



ఉత్తరాది రాష్ట్రాల వైఫల్యాలకు క్రమశిక్షణ కలిగిన దక్షిణాది రాష్ట్రాలను శిక్షించే దేశం ఇండియా. దక్షిణాది ఉద్యమించకపోతే, మనం దుంప నాశనం అవుతాం.

– రోహిత్ ఆర్., యాక్టివిస్ట్

సర్కారుకు సాహిత్యంపై దృష్టి ఉన్నప్పుడు...

'బ్రింగింగ్ ద వరల్డ్ టు తమిళ్... టేకింగ్ తమిళ్ టు ద వరల్డ్'... ఇదీ తమిళనాడు ప్రభుత్వ నినాదం. ఇక్కడ తమిళ్‌కు బదులు తెలుగు/తెలంగాణ అని పెడితే ఎలా ఉంటుందో ఆలోచించగలిగితే తెలుగు సాహిత్యం ఘనత ప్రపంచానికి తెలుస్తుంది.

తమిళనాడు ప్రభుత్వం గత మూడేళ్లుగా ప్రతి జనవరిలో 'చెన్నై ఇంటర్నేషనల్ బుక్ ఫెయిర్' (సి.ఐ.బి.ఎఫ్.) పేరుతో భారీ బిజినెస్ బుక్‌ఫెయిర్ నడుపుతోంది. ఇది పాఠకుల కోసం కాదు. కేవలం పబ్లిషర్ల కోసం! ప్రపంచ పబ్లిషర్లు, తమిళ పబ్లిషర్లు కలిసి తమిళం నుంచి ప్రపంచ భాషలకు, ప్రపంచ భాషల నుంచి తమిళానికి అనువాదాలు సాగేందుకు ఎం.ఓ.యూ.లు చేసుకుంటారు. మొన్నటి జనవరి 16 నుంచి 18 వరకూ జరిగిన 'సి.ఐ.బి.ఎఫ్. 2025'లో ఏకంగా 64 దేశాలు పాల్గొన్నాయి. ఈ దేశాలు తమిళం నుంచి అనువాదాలకు అంగీకరించాయి. కనీసం వంద పుస్తకాలు ఒక్కోటి పది భాషల లెక్కన 1005 ఒడంబడికలు జరిగాయి. అలాగే వివిధ భాషల 125 పుస్తకాలు తమిళంలోకి అనువాదం కానున్నాయి.



విదేశీ ప్రచురణకర్తలతో తమిళనాడు ప్రతినిధుల చర్చలు

ఒక జాతి గొప్పదనం ఆ జాతి సాహితీ సంస్కృతుల ద్వారానే ప్రపంచానికి తెలుస్తుంది. తమిళ ప్రజలకు, ప్రభుత్వాలకు ఈ సంగతి బాగా తెలుసు. అందుకే వారు కలిసికట్టుగా భాష, సంస్కృతుల గురించి ఎంతో శ్రద్ధ పెడుతున్నారు. తమిళ సాహిత్యం ఫ్రెంచ్, జర్మన్, స్పానిష్, చైనీస్, అరబ్బీ వంటి ప్రపంచ భాషల్లోకి సింధీ, అవధ్, కశ్మీరి, ఒరియా వంటి దేశీయ భాషల్లోకి అనువాదం కావాలంటే రచయిత పూనుకుంటే సాధ్యం కాదు. ఇది అర్థం చేసుకున్న తమిళ ప్రభుత్వం తానే పూనుకుంది. తమ భాషలో వెలువడే మంచి పుస్తకాలు ప్రపంచ పాఠకులకు చేరువ చేయాలంటే తానే డబ్బిచ్చి ప్రోత్సహించాలనుకుంది. సి.ఐ.బి.ఎఫ్. కోసం 'ట్రాన్స్‌లేషన్ గ్రాంట్' పేరుతో పుస్తకానికి లక్ష నుంచి 5 లక్షల వరకూ గ్రాంట్ ఇస్తోంది. పాఠశాల శాఖ ఈ పనిని అజమాయిషీ చేస్తోంది. ఒడంబడిక చేసుకున్న పబ్లిషర్ ఆ గ్రాంట్ ద్వారా అనువాదకునికి, ప్రింటర్‌కి డబ్బు సౌకర్యంగా చెల్లించి పుస్తకం వెలువరించవచ్చు. డబ్బు తిరిగి చెల్లించ నక్కరలేదు. రికార్డు కోసం కొన్ని కాపీలు ప్రభుత్వానికి దఖలు పరచాలంతే! అమ్మకాలను బట్టి రచయితకు రాయల్టీ చెల్లించాల్సి ఉంటుంది.

ప్రభుత్వం చూపిన ఈ చొరవ వల్ల, దేశంలో మరే భాషలోనూ ఇలాంటి చొరవ లేకపోవడం వల్ల భారతదేశం అంటే తమిళ సాహిత్యమే అనేంతగా ప్రపంచ భాషల్లోకి తమిళ సాహిత్యం దూసుకుపోతోంది. పెరియార్ రచనలు ఇప్పటికే స్పానిష్‌తో సహా పదిహేనుకు పైగా భాషల్లోకి వెళ్లాయి. మహాకవి తిరువళ్లువర్‌తో మొదలు గత కొన్నేళ్లుగా పేరు పొందిన 'ఇమయం' అనే రచయిత వరకూ అందరి పుస్తకాలూ ప్రపంచ భాషల్లోకి వెళ్లాయి. వెళుతున్నాయి. వీలైతే తమిళం నుంచి నేరుగా లేదంటే లింక్ లాంగ్వేజ్‌గా ఇంగ్లిష్‌ను పెట్టుకుని అక్కడి నుంచి వివిధ దేశాల భాషల్లోకి తమిళ సాహిత్యం విస్తరిస్తోంది. తమిళనాడు ప్రభుత్వం ఒకవైపు భాషా విస్తరణకు ప్రాధాన్యం ఇస్తూనే సాహిత్య విస్తరణ కూడా చేస్తోంది. మరో అడుగు ముందుకేసి సాహిత్య అకాడెమీ అవార్డీలకు 'కలల కుటీరం' పేరుతో ఇళ్లు మంజూరు చేస్తోంది.

మరి తెలుగు రాష్ట్రాలలో ఇలాంటి ప్రయత్నం ఉందా? శ్రీశ్రీ, చలం, కొకు, రావిశాస్త్రి, శివారెడ్డి వంటి వారి రచనలు కనీసం హిందీలోకి వెళ్లలేదు. మలయాళ భాష వరకూ చేరలేదు. ఫ్రెంచ్ భాషలోకి వెళతాయా? గద్దర్, కాళోజీ, వరవరరావు, అంపశయ్య నవీన్ తదితరుల రచనలు స్పానిష్‌లోకి వెళ్లకూడదా? ఓల్గా, అబ్బూరి ఛాయాదేవి, జయప్రభ, కుప్పిలి పద్మ తదితరుల రచనలు ఇటాలియన్‌కు తర్జుమా కారాదా? మద్దూరి నగేశ్ బాబు, పైడి తెరేశ్, గోరటి వెంకన్న, సతీష్ చందర్, శిఖామణి... వీరి రచనలు వివిధ దేశాల సాహిత్యానికి ఏ మాత్రం తక్కువ కాదు. వేమన పద్యాలు, తిలక్ కవిత్వం, కల్యాణరావు 'అంటరాని వసంతం' నవల ప్రభుత్వాలు పూనుకుని గ్రాంట్‌లు ఇస్తే అనువాదమై ఘనత పొందవూ?

'ప్రపంచ తెలుగు మహాసభలు', 'సాహితీ ఉత్సవాలు', 'అనువాద సమ్మేళనాలు'... ఇవన్నీ జరుగుతూ ఉంటే భాష, సంస్కృతులు వర్ధిల్లుతాయి. అభివృద్ధి, సంక్షేమాలు ప్రభుత్వాలకు తప్పని విధానాలు. కాని సాహిత్యం కూడా తెలిస్తే జాతి ఔన్నత్యం తల ఎగరేస్తుంది. తమిళ ప్రభుత్వం నుంచి నేర్వాల్సింది అదే!

– ఖదీర్

అశ్వతీర్థం

భరత వంశంలో జన్మించిన కుశికుడు ఇంద్రుడితో సమానమైన తేజస్సు కలిగినవాడు. అతడి కొడుకు గాధి. కన్యాకుబ్జం రాజధానిగా పరిపాలన సాగించిన గాధి మహారాజుకు చాలా కాలం సంతానం కలగలేదు. ఆ దిగులుతో సంతానం కోసం తపస్సు చేయాలని అడవులకు వెళ్ళి, సోమయాగం చేశాడు. ఆ యాగఫలంగా సత్యవతి అనే కూతురు కలిగింది.

జ్యోతిర్మయం

ఆ రోజులలో భృగు వంశ సంజాతుడైన చ్యవనుడికి ఋచీకుడనే కొడుకు ఉండేవాడు. ఋచీకుడు విఖ్యాతుడైన తపస్వి. గాధి కుమార్తెయైన సత్యవతిని వివాహమాడాలనే కోరికతో ఒక రోజు వెళ్ళి గాధిని అడిగాడు. ఋచీకుడిని ధనహీనుడిగా తలచిన గాధి, కన్యాశుల్కం ఇస్తేనే గాని తన కూతురిని వివాహమాడడానికి ఇవ్వనన్నాడు. శుల్కంగా ఏమి కావాలో కోరుకొమ్మన్నాడు ఋచీకుడు. ఒక చెవి శ్యామ వర్ణంతోను, మిగతా శరీరమంతా శ్వేతవర్ణంతో చంద్రుడిలా మెరిసే వెయ్యి వేగవంతమైన గుర్రాలను శుల్కంగా కోరాడు గాధి. అలా కోరడంలో, అది మానవ సాధ్యమయ్యే పని కాదు గనుక, ఋచీకుడు నిస్సహాయంగా వెనుదిరిగి వెళ్ళి పోతాడని గాధి తలచాడు. కాని ఋచీకుడి తపశ్శక్తికి అది అసాధ్యం కాదని గాధి ఊహించలేదు.

అష్ట దిక్పాలకులలో ఒకడైన వరుణ దేవుడిని మనస్సులో తలుచుకున్నాడు ఋచీకుడు. ఋచీకుడికి ఏది కావాలంటే అది, ఎక్కడ కావాలంటే అక్కడ లభ్యమయ్యే వరమిచ్చాడు వరుణుడు. కన్యాకుబ్జం దగ్గర గంగానది ఒడ్డున కూర్చుని తనకు కావలసింది కోరుకున్నాడు ఋచీకుడు. అలా కోరిన వెంటనే గంగానది నీళ్ళ నుండి గాధి కోరుకున్న రూపంలో కాంతులీనుతూ వేయి గుర్రాలు ఉత్పన్నమయ్యాయి. ఆ వేయి గుర్రాలను శుల్కంగా గాధికి ఇచ్చి, సత్యవతిని పరిణయమాడాడు ఋచీకుడు.

పూర్వం మహాతపస్సంపన్నులైన ఋషులకు సాధ్యం కానిదేదీ ఉండేది కాదని ఈ ఐతిహ్యం చెబుతుంది. ఈ కథ కారణంగానే నేటికీ కన్యాకుబ్జం నగరం దగ్గరి గంగానది అశ్వతీర్థంగా పిలవబడుతూ ఉందని వ్యాసుడి మహాభారతం, అనుశాసనిక పర్వం, నాలుగవ అధ్యాయంలో చెప్పబడింది.

– భట్టు వెంకటరావు

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు, మాఘ మాసం, **తిథి:** శు.పంచమి ఉ.10.14 వరకు, తదుపరి షష్ఠి, **నక్షత్రం:** రేవతి రా.2.38 వరకు, తదుపరి అశ్వని, **వర్జ్యం:** ప.3.29 నుండి 4.57 వరకు, **దుర్ముహూర్తం:** ప.12.39 నుండి 1.27 వరకు, తదుపరి ప.2.56 నుండి 3.44 వరకు, **అమృతఘడియలు:** రా.12.23 నుండి 1.54 వరకు, శ్రీ పంచమి; **రాహుకాలం:** ఉ.7.30 నుండి 9.00 వరకు, **యమగండం:** ఉ.10.30 నుండి 12.00 వరకు, **సూర్యోదయం:** 6.36, **సూర్యాస్తమయం:** 5.52.

ఎస్టీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

నాంపల్లి (హైదరాబాద్): పోస్టల్ శాఖలో పనిచేసే ఎస్టీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించేందుకు తన శాయాశక్తుల కృషి చేస్తానని జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోతు హుస్సేన్ నాయక్ అన్నారు. ఆదివారం నాంపల్లిలోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో అఖిల భారత పోస్టల్ షెడ్యూల్డ్ ట్రైబ్స్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రథమ సర్కిల్ సమావేశం జరిగింది.


• జాటోతు హుస్సేన్ నాయక్

ఈ కార్యక్రమంలో హుస్సేన్ నాయక్ మాట్లాడుతూ, దేశవ్యాప్తంగా వివిధ ప్రభుత్వరంగ సంస్థల్లో పనిచేస్తున్న ఎస్టీ ఉద్యోగులు పలు సమస్యలు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఈ సమస్యలను జాతీయ ఎస్టీ కమిషన్ చైర్మన్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్, ఎస్టీ కార్పొరేషన్ చైర్మన్ తేజావత్ బెల్లయ్య నాయక్, అఖిల భారత పోస్టల్ ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాస్ పాల్గొన్నారు.

కెనడా, మెక్సికో, చైనాపై టారిఫ్ కొరడా


సుంకాల ఉత్తర్వులపై ట్రంప్ సంతకాలు

- మెక్సికో, కెనడాలపై 25 శాతం, చైనాపై 10 శాతం పెంపు
- ప్రతిగా అమెరికా ఉత్పత్తులపై సుంకాలు పెంచిన కెనడా, మెక్సికో
- ప్రపంచ వాణిజ్య సంస్థలో ఫిర్యాదు చేస్తాం: చైనా
- అమెరికాలో ఇక మరింత పెరగనున్న ధరల మంటలు




క్లాడియా


జిన్‌పింగ్


ట్రూడో

వాషింగ్టన్: అంతర్జాతీయంగా ఆర్థిక యుద్ధానికి తెర లేచింది. ఉత్తర అమెరికా ఖండంలోని మిత్ర దేశాలైన మెక్సికో, కెనడా, అగ్ర రాజ్యం చైనాపై సుంకాలు పెంచి తీరతానంటూ ఎన్నికల ప్రచారం నుంచీ కారాలు మిరియాలు నూరిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తాననుకున్నది చేశారు. ఆ దేశాల నుంచి అమెరికాలోకి దిగుమతుయ్యే వస్తువులపై అధిక సుంకాలను అమల్లోకి తెచ్చేశారు. మెక్సికో, కెనడాలపై 25 శాతం, చైనా వస్తువులపై 10 శాతం మేరకు సుంకాల పెంపు ఉత్తర్వులపై శనివారం సంతకాలు చేశారు. అనంతరం మాట్లాడుతూ, అమెరికాలోకి అక్రమ వలసల, గంపగుత్తగా వస్తున్న ప్రాణాంతక మాదకద్రవ్యాల తరలింపును కట్టడి చేయడంలో ఆ దేశాలు విఫలమైనందుకే ఈ నిర్ణయం తీసుకున్నానంటూ తన చర్యను సమర్థించుకున్నారు. అమెరికన్లను కాపాడటానికి ఆ మూడు దేశాలపై టారిఫ్‌లు పెంచక తప్పడం లేదని చెప్పారు. ''ప్రాణాంతకమైన కృత్రిమ మాదక ద్రవ్యం ఫెంటానిల్ అమెరికాలోకి అక్రమంగా పోటెత్తడానికి ప్రధానంగా కెనడా, మెక్సికో, చైనాలే కారణం. అక్రమ వలసదారులను అడ్డుకోకుండా అమెరికాకు మెక్సికో భారీ నష్టం కలిగిస్తోంది'' అంటూ మండిపడ్డారు. కెనడా, మెక్సికో తక్షణం ప్రతీకార చర్యలకు దిగాయి. టారిఫ్‌ల యుద్ధంలో వెనకడుగేసే ప్రసక్తే లేదని స్పష్టం చేశాయి. అమెరికా నుంచి దిగుమతయ్యే వస్తూత్పత్తులపై భారీ సుంకాలు విధిస్తున్నట్లు ప్రకటించాయి. ఇకపై అమెరికా ఉత్పత్తులపై టారిఫ్‌ను 25 శాతం పెంచుతున్నట్లు కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో ఆదివారం ప్రకటించారు. అమెరికాతో కెనడా 155 బిలియన్ డాలర్ల మేరకు వాణిజ్యం చేస్తుంది. మెక్సికో అధ్యక్షురాలు క్లాడియా షేన్‌బామ్ సైతం ఇలాంటి ప్రకటనే చేశారు. అమెరికా వస్తువులపై సుంకాన్ని ఎంత శాతం పెంచేది స్పష్టంగా పేర్కొనలేదు. ప్రపంచ దేశాలకు సరకు సప్లై చైన్‌గా పేరొందిన చైనా కూడా ట్రంప్ ఉత్తర్వులపై ఘాటుగా స్పందించింది. ''ఈ విషయాన్ని వరల్డ్ ట్రేడ్ ఆర్గనైజేషన్ (డబ్ల్యూటీఓ)లో తేల్చుకుంటాం. అమెరికాపై దావా వేస్తాం. డబ్ల్యూటీవో నియమ నిబంధనలకు పూర్తి విరుద్ధంగా ట్రంప్ నిర్ణయం తీసుకున్నారు. దీంతో ఇరుదేశాల వాణిజ్యం తీవ్ర ఒడిదుడుకులకు లోనవుతుంది'' అని చైనా వాణిజ్య శాఖ ప్రకటించింది.

అమెరికన్ల జేబుకు చిల్లు!

కొత్త టారిఫ్‌లు అమలైతే సగటు అమెరికన్ల ధరల కష్టాలు పెరగనున్నాయి. సరుకులు, గ్యాసోలిన్, గృహ, వాహన సంబంధ, ఇతర వస్తువుల ధరలు పెరగనున్నాయి. ఆయా ఉత్పత్తులను కెనడా, మెక్సికో, చైనా నుంచి దిగుమతి చేసుకునే వాణిజ్య సంస్థలే ఈ అధిక టారిఫ్‌ను చెల్లించాలి. దాంతో ఆ భారాన్ని అవి నేరుగా వినియోగదారులపైనే మోపనున్నాయి. దాంతో వాటి ధరలకు మరింతగా రెక్కలు రావడం ఖాయంగా కనిపిస్తోంది. ఇప్పటికే ధరాభారంతో సతమతమవుతున్న అమెరికన్లపై ఇది మూలిగే నక్కపై తాటిపండు చందం కానుంది. ధరలతో పాటు ద్రవ్యోల్బణమూ పెరుగుతుంది. దాంతో కొనుగోళ్లు తగ్గి అమెరికా ఆర్థికాభివృద్ధి కుంటుబడనుంది. అది ఇతర దేశాలపైనా తీవ్ర ప్రతికూల ప్రభావం చూపుతుంది. కెనడా నుంచి దిగుమతయ్యే చమురు, సహజ వాయువు, విద్యుత్‌లపై ట్రంప్ మరో 10 శాతం టారిఫ్ విధించారు. ఈ చర్యను కెనడా ప్రధాని ట్రూడో తీవ్రంగా తప్పుబట్టారు. ''దగ్గర చేయాల్సిన దేశాలను ట్రంప్ దూరం చేస్తున్నారు. దేశాలతో మైత్రితో మెలిగే పద్ధతి ఇది కాదు. మేం కూడా మీ వాళ్లం అనుకున్నాం గనుకే అఫ్గానిస్తాన్‌లో మీతో కలిసి యుద్ధం చేశాం. కాలిఫోర్నియాలో కార్చిచ్చు కమ్మేస్తే సాయపడ్డాం. కత్రినా హరికేన్ వేళ ఆదుకున్నాం. ఎల్లవేళలా మీకోసం నిలబడ్డాం. మీ బాధను పంచుకున్నాం'' అంటూ ట్రంప్ తీరును ఆక్షేపించారు.

డ్రగ్స్ ముఠాలతో దోస్తీ అంటగడతారా: మెక్సికో

మెక్సికోలోని డ్రగ్స్ ముఠాలతో తమ ప్రభుత్వానికీ సంబంధాలున్నాయన్న ట్రంప్ వ్యాఖ్యలను అధ్యక్షురాలు క్లాడియా తోసిపుచ్చారు. ''నేరమయ సంస్థలతో మెక్సికో సర్కార్‌కు సంబంధాలున్నాయన్న శ్వేతసౌధం మాటల్లో ఇసుమంతైనా నిజం లేదు. డ్రగ్స్ స్మగ్లర్లతో మాకు దోస్తీ అంటగట్టడం దారుణం. మా గడ్డపై అలాంటివి జరగడం లేదు. అసలు ఫెంటానిల్ కట్టడిపై అమెరికా ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే ముందు అక్కడి ప్రధాన నగరాల్లో వీధుల్లోనే విచ్చలవిడిగా దొరుకుతున్న ఆ డ్రగ్‌పై ఉక్కుపాదంమోపండి. అంతేగానీ మాపై ఆరోపణలు చేయొద్దు'' అని హెచ్చరించారు. కెనడాలోని బ్రిటిష్ కొలంబియా రాష్ట్రవాసులంతా అమెరికా నుంచి వచ్చే మద్యాన్ని బహిష్కరిస్తున్నట్టు ఆ రాష్ట్ర అత్యున్నత నేత డేవిడ్ ఎబీ ప్రకటించారు. ప్రభుత్వ దుకాణాల నుంచి అమెరికన్ ఆల్కహాల్ బ్రాండ్లను తొలగిస్తున్నట్టు తెలిపారు.

ట్రంప్ నట్టేట ముంచుతారా?

జో బైడెన్ హయాంలో అధిక ధరలతో అసహనానికి గురైన అమెరికా ఓటర్లు ఈ ఎన్నికల్లో ట్రంప్‌కు జై కొట్టారు. తీరా ట్రంప్ తాజా చర్యలతో పరిస్థితి పెనం నుంచి పొయ్యిలోకి చందంగా మారేలా కనిపిస్తోంది. టారిఫ్‌లు 25 శాతం పెరిగితే రిటైల్‌లో వస్తువుల ధరలు చాలా పెరుగుతాయి. కెనడాతో అమెరికా 155 బిలియన్ డాలర్ల మేర వాణిజ్యం చేస్తోందంటే ఆ దేశం నుంచి ఏ స్థాయిలో దిగుమతులున్నాయో అర్థంచేసుకోవచ్చు. ధరలకు కళ్లెం వేయలేదంటూ తమపై దుమ్మెత్తిపోసిన ప్రజలకు డెమొక్రటిక్ పార్టీ నేతలు ఇప్పుడు చురకలంటిస్తున్నారు. తమను కాదని ట్రంప్‌ను నమ్ముకున్నందుకు భలే జరిగిందంటూ సోషల్ మీడియాలో వ్యంగ్య పోస్టులు పెడుతున్నారు. ''పచారీ సరుకుల ధరలు ఎక్కువున్నాయా? టమాటాల ధరలపై ఆందోళన చెందుతున్నారా? కార్ల ధరలపై ఆందోళన చెందుతున్నారా? కాస్తాగండి. మీ ట్రంప్ ధాటికి అవన్నీ ఇంకా పెరగనున్నాయి'' అని డెమొక్రటిక్ పార్టీ సెనేటర్ చక్ షుమర్ వ్యాఖ్యానించారు. అమెరికాలో భవన నిర్మాణ రంగం దాదాపు కెనడాపైనే ఆధారపడింది. భారీ దుంగలు, రైతులు, ఆటో మేకర్స్, పరిశ్రమల సిబ్బంది అక్కడి నుంచి రావాల్సిందే.

వసంత పంచమి వేళ...

నేడు అమృత స్నానం

- మహా కుంభమేళాకు మళ్లీ పోటెత్తనున్న భక్తులు
- 'మౌని' దుర్ఘటన నేపథ్యంలో పక్కాగా ఏర్పాట్లు
- 20 రోజుల్లో 33.6 కోట్ల మంది పుణ్యస్నానాలు

మహాకుంభ్ నగర్: వసంత పంచమి సందర్భంగా మహా కుంభమేళాలో సోమవారం పవిత్ర షాహీ (అమృత) స్నాన కార్యక్రమం జరగనుంది. భక్తులు కోట్లలో తరలి రానుండటంతో ఉత్తరప్రదేశ్ అప్రమత్తమైంది. జనవరి 29న మౌనీ అవావాస్య నాడు కోట్లమంది పోటెత్తిన సందర్భంగా జరిగిన తొక్కిసలాటలో 30 మందికి పైగా చనిపోగా 60 మంది గాయపడటం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఉన్నతాధికారులు అత్యంత కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేపట్టారు. ఎటువంటి పొరపాట్లూ జరక్కూడదన్న సీఎం యోగి ఆదిత్యనాథ్ ఆదేశాల మేరకు 'ఆపరేషన్ ఎలెవెన్' పేరుతో జన సమూహ నిర్వహణ చర్యలు తీసుకుంటున్నారు. 2019 అర్ధ కుంభ్‌ను విజయవంతంగా నిర్వహించిన సీనియర్ ఐఏఎస్ అధికారులు ఆశిష్ గోయల్, భాను చంద్ర గోస్వామి ఏర్పాట్లను ప్రత్యేకంగా పర్యవేక్షిస్తున్నారు. వీరికి భారీ జనసమూహాల నియంత్రణ, నిర్వహణలో విశేష అనుభవముంది. వీరు ఆదివారం చేపట్టాల్సిన ఏర్పాట్లపై అధికారులతో చర్చించారు. ఆపరేషన్ ఎలెవెన్‌లో భాగంగా భక్తుల కోసం'ఒన్ వే ట్రాఫిక్ రూట్'ఏర్పాటు చేశారు. త్రివేణీ ఘాట్ల వద్ద అదనంగా బారికేడ్లను నిర్మించడంతోపాటు పోలీసులను మోహరించారు. న్యూ యమునా బ్రిడ్జిపైన కీలక ప్రాంతాల్లో అదనంగా పోలీసులను నియమించారు. మోటారుసైకిల్ పెట్రోల్ స్క్వాడ్లు రెండింటిని ఏర్పాటు చేయడంతోపాటు బ్రిడ్జి రెయిలింగ్‌ను పటిష్టం చేశారు. శాస్త్రి వంతెన వద్ద ప్రత్యేకంగా నిఘా పెట్టారు. ఝుసీ నుంచి సంగం దాకా ట్రాఫిక్‌ను నియంత్రిస్తారు. ఇక్కడ మరో రెండు మోటారు సైకిల్ స్క్వాడ్లను విధుల్లో ఉంచారు. అదనపు డీజీ భాను భాస్కర్ ఆదివారం స్వయంగా భక్తుల నియంత్రణ చర్యలను చేపట్టారు. మేళా అథారిటీ భవనంలో ఉన్న ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్(ఐసీసీసీ)నుంచి ఘాట్లలో పరిస్థితిని భారీ స్క్రీన్లపై స్వయంగా పరిశీలించి తగు సూచనలు చేశారు.స్నానాలు పూర్తయిన వారు ఘాట్ల నుంచి వెంటనే బయటకు వచ్చేయాలన్నారు. ప్రత్యేకించిన ప్రాంతాల్లో దుస్తులు మార్చుకోవాలని కోరారు. ఘాట్లలో ఇతరులు కూడా స్నానాలు చేసేందుకు అవకాశమివ్వాలని కోరారు. ఘాట్ల వద్ద ఆహారం, పానీయాలు సేవించరాదని కోరారు. ఘాట్ల వద్ద జనం గుమికూడకుండా చూసుకోవాలని పోలీసు అధికారులకు నిర్దేశించారు. భక్తులు మిగతా ప్రాంతాలకు వెళ్లేలా చూడాలన్నారు.

ఆదివారం 90 లక్షల మంది

మహాకుంభ మేళాలో అత్యంత పవిత్రమైంది అమృత్ స్నాన్. ఆ రోజు స్నానమాచరిస్తే పాపాలు తొలగి మోక్షం ప్రాప్తిస్తుందని విశ్వాసం. కనుక సోమవారం వసంత పంచమి సందర్భంగా త్రివేణీ సంగమానికి భక్తులు పోటెత్తుతారని భావిస్తున్నారు. ఆ ప్రభావం ఆదివారమే కనిపించింది. మధ్యాహ్నానికే ఏకంగా 90 లక్షల దాకా పుణ్య స్నానాలు చేసినట్లు అంచనా. జనవరి 13న మొదలైన మహా కుంభమేళాలో 20 రోజుల్లోనే 33.61 కోట్ల మంది స్నానాలు చేసినట్లు అధికారులు చెబుతున్నారు. ప్రయాగ్‌రాజ్‌లో ఫాపామౌ నుంచి అరైల్ ఘాట్ దాకా 5 కోసుల ప్రాంతమంతటినీ త్రివేణి సంగమలో భాగంగానే పరిగణిస్తారని ఆలిండియా అఖాడా పరిషత్ అధ్యక్షుడు మహంత్ రవీంద్ర పురి తెలిపారు. ఈ ప్రాంతంలో ఎక్కడైనా భక్తులు పుణ్య స్నానాలు చేయవచ్చన్నారు. 12న మాఘ పూర్ణిమ, 26న మహాశివరాత్రి సందర్భంగా మరో రెండు పుణ్యస్నానాలున్నాయి. 5న ప్రధాని నరేంద్ర మోదీ కూడా మహా కుంభమేళాలో పుణ్యస్నానం ఆచరించనున్నారు. దాంతో రాబోయే కొన్ని రోజులు యంత్రాంగానికి సవాలుగా మారనున్నాయి.


ప్రయాగ్‌రాజ్‌లోని సంగం మధ్య ఆదివారం పెద్ద సంఖ్యలో స్నానాలాచరిస్తున్న భక్తులు


స్నాన ఘాట్ల వద్ద కట్టుదిట్టంగా భద్రత

బీజేపీది గూండాగిరీ: కేజ్రీవాల్



న్యూఢిల్లీ: ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలకు గాను తను పోటీలో ఉన్న న్యూఢిల్లీ నియోజకవర్గంలో స్వతంత్ర పరిశీలకులను నియమించాలంటూ ఆప్ చీఫ్ కేజ్రీవాల్ ఆదివారం ఈసీకి లేఖ రాశారు. తమ పార్టీ కార్యకర్తలపై దాడులకు పాల్పడుతున్న బీజేపీ కార్యకర్తలను అరెస్ట్ చేయాలని, సంబంధిత ఘటనలకు కారణమైన పోలీసులను సస్పెండ్ చేయాలని కూడా ఆయన డిమాండ్ చేశారు. న్యూఢిల్లీ స్థానం నుంచి కేజ్రీవాల్‌తోపాటు బీజేపీ నుంచి పర్వేశ్ శర్మ, కాంగ్రెస్ తరఫున సందీప్ దీక్షిత్ బరిలో ఉన్నారు. ఎన్నికలు సమీపిస్తున్న వేళ బీజేపీ నేతలు గూండాగిరీకి పాల్పడుతు న్నారని కేజ్రీవాల్ ఆదివారం 'ఎక్స్'లో ఆరోపించారు. ఆప్ వలంటీర్లు, మద్దతు దారులను వారు బెదిరిస్తున్నా రన్నారు. ఇటు వంటి వాటిని తాము లక్ష్యపెట్టబోమన్నారు. మురికి వాడల్లోని ప్రజల ఓటు హక్కును తొలగించేందుకు కుట్ర జరుగుతోందని కేజ్రీవాల్ ఆరోపించారు. ఇటువంటి వాటిపై అప్రమత్తంగా ఉండాలని ఆయన ప్రజలను కోరుతూ ఓ వీడియో సందేశం విడుదల చేశారు.

మోదీకి క్రెడిట్ రావొద్దనే నిధులు వద్దంటోంది

ఆప్ ప్రభుత్వంపై రక్షణ మంత్రి రాజ్‌నాథ్ నిప్పులు



న్యూఢిల్లీ: కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వానికి మంచి పేరు రాకూడదనే ఉద్దేశంతోనే ఢిల్లీలోని ఆప్ ప్రభుత్వం కేంద్ర నిధులను వద్దంటోందని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ విమర్శించారు. రాజేంద్ర నగర్‌లో ఆదివారం జరిగిన ఎన్నికల ర్యాలీలో మంత్రి మాట్లాడారు. 'బీజేపీ హయాంలో దేశం ఆర్థికంగా ముందుకు సాగుతుండగా ఆప్ ప్రభుత్వం కారణంగా ఢిల్లీకి ఆ ప్రతిఫలాలు అందడం లేదు. ఢిల్లీ ప్రజలకు సేవలందించే అవకాశం చాలా ఏళ్లుగా బీజేపీకి దక్కడం లేదు. ఢిల్లీలో అవసరమైన అభివృద్ధి జరగడం లేదు'అని రాజ్‌నాథ్ చెప్పారు. మద్యం కుంభకోణం కేసులో జైలుకు వెళ్లినా ఢిల్లీ సీఎంగా ఉన్న కేజ్రీవాల్ పదవిని మాత్రం వదల్లేదని ఆరోపించారు. ప్రజలకిచ్చిన వాగ్దానాలను కేజ్రీవాల్ అమలు చేయలేదని నిందించారు. కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీపైనా ఆయన విమర్శనాస్త్రాలు సంధించారు.

మోదీ, కేజ్రీ పిరికిపందలు

పారిశ్రామికవేత్తల బానిసలు: ప్రియాంక



న్యూఢిల్లీ: ప్రధాని నరేంద్ర మోదీ, ఆప్ చీఫ్ అరవింద్ కేజ్రీవాల్‌పై కాంగ్రెస్ నేత ప్రియాంకా గాంధీ వాద్రా తీవ్ర స్థాయిలో విమర్శల వర్షం కురిపించారు. వారిని మించిన పిరికిపందలను, కల్లబొల్లి ఏడ్పులు ఏడ్చే నేతలను తన జీవితంలోనే చూడలేదన్నారు. వారిద్దరినీ బడా పారిశ్రామికవేత్తలకు బానిసలుగా అభివర్ణించారు. రాష్ట్రపతి ద్రౌపదీ ముర్మును కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీ అవమానించారంటూ ప్రజలను మోదీ పక్కదారి పట్టిస్తున్నారని ఆరోపించారు. ఆదివారం ఆమె ఢిల్లీలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. వయసులో పెద్దదైన ఓ మహిళ మరో మహిళ పట్ల సానుభూతి వ్యక్తం చేయడం అవమానమెలా అవుతుందని ప్రశ్నించారు.

అబద్ధాలకు సర్దార్ మోదీ: ఖర్గే



న్యూఢిల్లీ: ప్రధాని మోదీ, ఆప్ చీఫ్ కేజ్రీవాల్‌పై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ప్రధాని మోదీ అబద్ధాలకు సర్దారైతే, ఆయన తండ్రి కేజ్రీవాల్ అని పేర్కొన్నారు. ముస్తాఫాబాద్‌లో ఆదివారం ఎన్నికల ర్యాలీలో ఆయన మాట్లాడారు. ''అవినీతికి వ్యతిరేకంగా పోరాడుతాం, లోక్‌పాల్‌తో దాన్ని రూపుమాపుతానంటూ వాగ్దానాలు చేసిన కేజ్రీవాలే..ప్రజల ఓట్ల కోసం వృద్ధుడైన అన్నా హజారేకు అబద్ధాలు చెప్పి ఢిల్లీకి తీసుకువచ్చారు. కాలినడకన ఓట్లడిగి ఇప్పుడు కార్ల కాన్వాయ్‌లలో తిరుగుతూ శీష్ మహల్ కట్టారు. ఆప్‌ను ఆ పార్టీ గుర్తు చీపురుతో ఊడ్చేయండి'' అని ప్రజలకు పిలుపునిచ్చారు.

వినువీధి నుంచి చంద్ర గ్రహణ వీక్షణం

కెమెరాలో బంధించిన బ్లూ ఘోస్ట్ ల్యాండర్

టెక్సాస్: చంద్రగ్రహణాన్ని భూమి నుంచి చూశారు. అయితే అత్యంత దగ్గరగా, అది కూడా ఆకాశం నుంచి చూశారా? లేదు కదా. అయితే వచ్చే నెలలో చంద్రునిపై దిగనున్న బ్లూ ఘోస్ట్ ల్యాండర్ చంద్రగ్రహణాన్ని అత్యంత సమీపం నుంచి చూపించి అబ్బురపరిచింది. అది తాజాగా తీసిన చంద్రగ్రహణం ఫొటోలను జతకూర్చి వీడియోగా కూర్చి ల్యాండర్ తయారీదారు ఫైర్‌ఫ్లై ఏరోస్పేస్ తన సోషల్ మీడియా ఖాతాలో పోస్ట్ చేసింది. ఈ వీడియో తెగ వైరలవుతోంది. ల్యాండర్ ప్రస్తుతం అంతరిక్షంలో భూ సమీప కక్ష్యలో పరిభ్రమిస్తోంది. ఈ క్రమంలోనే చంద్రగ్రహణం ఫొటోలను తన 6.6 అడుగుల ఎత్తయిన డెక్ నుంచి కెమెరాలో బంధించింది. సూర్యకిరణాల వల్ల ఏర్పడిన తన నీడతో భూమి చంద్రుడిని కప్పేస్తున్న దృశ్యాలు ఆ వీడియోలో కనువిందు చేస్తున్నాయి. చంద్రునిపై నాసా పరిశోధనలకు పరికరాలను మోసుకెళ్లేందుకు 'కమర్షియల్ లూనార్ పేలోడ్ సర్వీసెస్' ప్రాజెక్టులో భాగంగా జనవరి 15న అమెరికాలోని కెన్నడీ స్పేస్ సెంటర్ నుంచి బ్లూ ఘోస్ట్ ల్యాండర్‌ను ప్రయోగించారు.



ఇందిర సర్కారే ఉంటే...

పన్నుకే 10 లక్షలు!

ఢిల్లీ ప్రచారంలో కాంగ్రెస్‌పై మోదీ విమర్శలు



న్యూఢిల్లీ: జవహర్‌లాల్ నెహ్రూ, ఇందిరా గాంధీ హయాంలలో ప్రజల నుంచి ముక్కు పిండి అత్యధిక పన్నులు వసూలు చేసేవారని ప్రధాని నరేంద్ర మోదీ ఆరోపించారు. ఆదివారం ఢిల్లీలోని ఆర్‌కే పురంలో ఆయన అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. గత కాంగ్రెస్ ప్రభుత్వాలపై విమర్శలు గుప్పించారు. ''మా ప్రభుత్వ హయాంలో భారతీయులు రూ.12 లక్షల వార్షిక ఆదాయమున్నా ఎలాంటి పన్నూ కట్టాల్సిన పనిలేదు. కాంగ్రెస్ పాలనలో విపరీతమైన పన్నులు మోపారు. నెహ్రూ హయాంలోనైతే రూ.12 లక్షల వార్షికాదాయంలో నాలుగింట ఒక వంతు పన్నుకే పోయేది. ఇందిరా బతికుంటే ఆమె పాలనలో రూ.12 లక్షల వార్షికాదాయానికి ఏకంగా రూ.10 లక్షలు పన్ను కట్టాల్సి వచ్చేది. 1970వ దశకంలో కాంగ్రెస్ హయాంలో చరిత్రలో ఎన్నడూ లేనంతగా ప్రత్యక్ష పన్నులుండేవి. 1970లో 93.5 శాతముండగా 1973–74 ఆర్థిక సంవత్సరానికల్లా ఏకంగా 97.5 శాతానికి పెంచేశారు. 12 ఏళ్ల క్రితం కూడా కాంగ్రెస్ పాలనలో రూ.12 లక్షల ఆదాయం ఉంటే రూ.2.6 లక్షల పన్ను కట్టించుకున్నారు'' అని మోదీ అన్నారు.

మురికివాడల జోలికి పోం

ఢిల్లీలో బీజేపీ అధికారంలోకి వస్తే మురికివాడలను నేలమట్టం చేస్తుందన్న ఆప్ కన్వీనర్ కేజ్రీవాల్ చేసిన ఆరోపణలను మోదీ తోసిపుచ్చారు. ''ఢిల్లీలో అమలవుతోన్న ఏ సంక్షేమ పథకాన్నీ రద్దు చేయబోం. ప్రజాప్రయోజనాలే మాకు ముఖ్యం. పూర్వాంచల్, బిహార్ వాసులు చాలామంది ఢిల్లీకి వచ్చి ఉంటున్నారు. వారి బాధలు నాకు తెలుసు. నేను కూడా పూర్వాంచల్ ప్రాంత ఎంపీనే. కోవిడ్ కాలంలో కొన్ని పార్టీలు మిమ్మల్ని ఢిల్లీ నుంచి తరిమేయాలని చూశాయి. బీజేపీ ప్రభుత్వం ఎల్లప్పుడూ పూర్వాంచల్, బిహారీలకు తోడుగా నిలబడుతుంది'' అన్నారు. ''ఢిల్లీ యువతను కాంగ్రెస్, ఆప్ మభ్యపెట్టి మోసగించాయి. యువత అవసరాలు చూస్తామని అబద్ధాలు చెప్పి కాంగ్రెస్ సర్కారు చివరకు కామన్వెల్త్ స్కామ్ చేసింది. క్రీడా విశ్వవిద్యాలయం నిర్మిస్తామని చెప్పి ఆప్ సర్కార్ ఢిల్లీ యువత భవిష్యత్తుతో ఆటలాడుకుంది. ఇప్పుడు యువభారతం బీజేపీ వెంట నడుస్తోంది'' అన్నారు.

మాది మధ్యతరగతి బడ్జెట్

''భారతీయ చరిత్రలో మధ్యతరగతికి అత్యంత ప్రయోజనకరమైన బడ్జెట్‌ను తీసుకొచ్చాం. స్వతంత్ర భారత చరిత్రలో రూ.12 లక్షల వార్షికదాయం ఉన్న వారికి ఇంతటి ఉపశమనం ఏనాడూ దక్కలేదు. మిడిల్ క్లాస్ మనసు గెలిచిన బడ్జెట్ ఇదేనని వాళ్లే స్వయంగా చెబుతున్నారు. వసంత పంచమితో రాశి మారబోతోంది. అదే సమయానికి ఫిబ్రవరి 5న (పోలింగ్ తేదీ) ఢిల్లీలో కొత్త అభివృద్ధి వసంతం రాబోతోంది. ఇప్పుడు టైమంతా ఢిల్లీదే. ఫిబ్రవరి 7 లేదా 8న ఢిల్లీలో బీజేపీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయబోతోంది. ఇది ఖాయం. రాసిపెట్టుకోండి'' అని మోదీ ధీమా వ్యక్తం చేశారు.

హిందూయిజాన్ని గూండాగిరీగా మార్చేశారు



జైపూర్: హిందూయిజాన్ని కొందరు నేడు బ్రిటిష్ ఫుట్‌బాల్ హులిగాన్ స్థాయికి దిగజార్చారని కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్ వ్యాఖ్యానించారు. తమ ఫుట్‌బాల్ టీంకు మద్దతివ్వని వారిపై దాడులకు పాల్పడే సంస్కృతినే బ్రిటిష్ ఫుట్‌బాల్ హులిగానిజంగా పిలుస్తుంటారు. శశి థరూర్ ఆదివారం జైపూర్ లిటరేచర్ ఫెస్టివల్‌లో మాట్లాడారు. 'ఇటీవల కొందరు మా టీంకు మద్దతివ్వట్లేదు కాబట్టి మిమ్మల్ని కొడతాం. జై శ్రీరాం అనట్లేదు కాబట్టి, కొరడాతో దండిస్తాం'అంటున్నారన్నారు. 'ఇది కాదు హిందూయిజం. హిందూయిజానికి దీనితో అస్సలు సంబంధమే లేదు'అని ఆయన పేర్కొన్నారు. ఉత్తమ హిందువు ఆచరించాల్సిన నాలుగు పురుషార్థాలున్నాయని వివరించారు. హిందూయిజం పేరుతో కొందరు తమది మాత్రమే ఉత్తమ మార్గమని ప్రచారం చేసుకుంటూ బ్రిటిష్ ఫుట్‌బాల్ హులిగాన్ స్థాయికి దిగజార్చుతున్నారన్నారు.

అమెరికా ప్రభుత్వ చెల్లింపుల

వ్యవస్థలోకి మస్క్ బృందం

- పేమెంట్ సిస్టమ్స్ యాక్సెస్ సాధించిన మస్క్
- అనవసర చెల్లింపులపై కోత పెట్టే ఛాన్స్



వాషింగ్టన్: సామాజిక భద్రత మొదలు ఆరోగ్య సంరక్షణ దాకా అమెరికా ప్రభుత్వ ఖజానా నుంచి జరిగే ప్రతి నగదు చెల్లింపుపై సమీక్ష జరిపే అధికారం ప్రపంచ కుబేరుడు, నూతన ప్రభుత్వ దక్షత (ఎఫీషియన్సీ) శాఖ అధినేత ఎలాన్ మస్క్‌కు దఖలుపడింది. ఈ మేరకు ట్రెజరీ పేమెంట్ సిస్టమ్స్‌పై యాక్సెస్ చేసే సదుపాయం మస్క్ బృందానికి కల్పించారు. దీంతో ఏ మంత్రిత్వశాఖకు, సంస్థకు, ప్రభుత్వ కాంట్రాక్టర్‌కు, ప్రభుత్వ పథకాల లబ్ధిదారులకు ఎంతెంత మొత్తాలు అమెరికా ప్రభుత్వ ఖాజానా నుంచి చెల్లిస్తున్నారో అంతా మస్క్‌కు తెలియనుంది. ఈ వివరాలను న్యూయార్క్ టైమ్స్ తాజా కథనంలో ప్రచురించింది. '' అత్యంత రహస్యమైన ప్రభుత్వ చెల్లింపుల విధానం డేటా మొత్తం మస్క్ బృందం చేతిలో పెట్టడం సముచితంకాదు. ప్రభుత్వ పథకాలకు సంబంధించిన చెల్లింపులనూ ఈ బృందం ఉద్దేశపూర్వకంగా తొక్కిపెట్టే ప్రమాదముంది. రాజకీయ దురుద్దేశంతో, అనవసర జోక్యంతో చెల్లింపులు ఎట్టిపరిస్థితుల్లోనూ ఆపొద్దు. ఏదైనా సంస్థ లేదంటే లబ్ధిదారులకు చెల్లింపులు అర్థంతరంగా ఆగిపోతే ఆ ప్రభావం నేరుగా దేశంపై, దేశ ఆర్థిక వ్యవస్థపై పడుతుంది '' అని అమెరికా ఆర్థిక మంత్రి స్కాట్ బెసెంట్‌కు రాసిన లేఖలో సెనేటర్ రాన్ వైడెన్ ఆందోళన వ్యక్తంచేశారు. ఆర్థిక శాఖ తాత్కాలిక ఉప మంత్రిగా చేసిన ప్రభుత్వ అధికారి డేవిడ్ లెబ్‌రిక్ రాజీనామా చేసిన రోజునే ఈ లేఖ వెలుగులోకి రావడం గమనార్హం. అత్యంత సున్నితమైన డేటాను యాక్సెస్ చేసే అవకాశం కోసం మస్క్ బృందం ఒత్తిడి వల్లే డేవిడ్ రాజీనామా చేసినట్లు శుక్రవారం వాషింగ్టన్ పోస్ట్ కథనంలో పేర్కొంది.

ఆస్ట్రేలియాను ముంచెత్తిన వరదలు

ఓ మహిళ మృతి, ఇళ్లొదిలి వెళ్లిన వేలాది మంది

కాన్‌బెర్రా: ఆస్ట్రేలియాలోని క్వీన్స్‌ల్యాండ్‌ను వరదలు ముంచెత్తాయి. అవి ముంచెత్తడంతో వేలాది మంది ఇళ్లను వదిలి పారిపోయారు. సోమవారం రికార్డు స్థాయిలో వర్షాలు కురిసే అవకాశం ఉందని, వరద నీరు రెండో అంతస్తు స్థాయికి పెరిగే అవకాశం ఉందని అధికారులు హెచ్చరిస్తున్నారు. వరదలతో టౌన్స్ విల్లే, పర్యాటక కేంద్రమయిన కెయిర్న్స్ మధ్య రహదారులు తెగిపోయాయి. ఉత్తర క్వీన్స్‌ల్యాండ్‌లోని కొన్ని ప్రాంతాల్లో 700 మిల్లీమీటర్లకు పైగా వర్షపాతం నమోదైంది. పలు ప్రాంతాల్లో 24 గంటల్లో ఆరు గంటల్లోనే 250 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. వరదలతో హెర్బర్ట్ నది నీటిమట్టం 15.2 మీటర్లకు చేరుకుంది. కుండపోత వర్షాలు, ఈదురు గాలులు మరింత ఆకస్మిక వరదలకు దారితీసే అవకాశం ఉందని బ్యూరో హెచ్చరించింది. సుమారు 200,000 మంది జనాభా ఉన్న టౌన్స్‌విల్లే నగరంలో గత 60 ఏళ్లలో ఎన్నడూ లేనంత భారీ వరదలు వచ్చాయని క్వీన్స్‌ల్యాండ్ ప్రీమియర్ డేవిడ్ క్రిసఫుల్లీ తెలిపారు.

సాక్షి హైదరాబాద్

సోమవారం ၊ 3 ၊ ఫిబ్రవరి ၊ 2025



మరింత దిగువకు..

జిల్లాలో భూగర్భ జలాలు వేగంగా పడిపోతున్నాయి. వేసవి కాలానికి ముందే గృహ, వాణిజ్య సముదాయాల్లో నీటికి కటకట మొదలైంది.

-8లో



అక్షరం.. అపు'రూపం'..

చేతిరాతను మెరుగుపర్చుకునేందుకు పలువురు నగర వాసులు గ్రాఫాలజిస్టులను సంప్రదిస్తున్నారు. రైటింగ్ స్కిల్స్ కోసం తపన పడుతున్నారు.

- సిటీప్లస్‌లో

గరిష్ఠం/కనిష్ఠం
34.0/18.0

వాతావరణం

నగరంలో సోమవారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉదయం వేళ పొగమంచు అలుముకుంటుంది. గరిష్ఠంగా 34, కనిష్ఠంగా 18 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతాయి.



సరస్వతీ దేవి అలంకరణలో

భాగ్యలక్ష్మి అమ్మవారు

వసంత పంచమి వేడుకలను పురస్కరించుకొని చార్మినార్‌లోని భాగ్యలక్ష్మి అమ్మవారు సరస్వతీ దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. వసంత పంచమి సందర్భంగా ఆదివారం చార్మినార్ భాగ్యలక్ష్మి దేవాలయాన్ని వివిధ రకాల పూలతో సుందరంగా తీర్చిదిద్దారు. అమ్మవారి దర్శనం కోసం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు బారులు తీరారు. -చార్మినార్







అరుదైన రామచిలుకలు.. ఆసక్తిగొలిపే పక్షులు.. అపురూపమైన పెంపుడు శునకాలు.. సరదాగొలిపే పిల్లులు.. చిన్నారులను అమితంగా ఆకట్టుకున్నాయి. మాదాపూర్‌లోని హైటెక్స్‌లో మూడు రోజుల పాటు నిర్వహించిన పెటెక్స్, కిడ్స్ ఎక్స్‌పో, కిడ్స్ బిజినెస్ ఎక్స్‌పో ఆదివారం ముగిసింది. సెలవు రోజు కావడంతో సందర్శకులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. – మాదాపూర్

చిలుకా.. క్షేమమా!

ముగిసిన త్యాగరాజ ఆరాధన సంగీతోత్సవం



సంగీత కచేరీకి హాజరైన గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

మాదాపూర్: గాత్ర కచేరీతో గురుకుల విద్యార్థులు శ్రోతలను విశేషంగా ఆకట్టుకున్నారు. మాదాపూర్‌లోని శిల్పారామంలో నిర్వహిస్తున్న హైదరాబాద్ త్యాగరాజ ఆరాధన సంగీతోత్సవం ఆదివారం ముగిసింది. ముగింపు కార్యక్రమాలలో భాగంగా దేశ విదేశాలకు చెందిన 600 మంది సంగీత కళాకారులు శిల్పారామంలోని సంప్రదాయ వేదికలో కలిసికట్టుగా త్యాగరాజ స్వామి ఘనరాగ పంచరత్న కీర్తనలను ఆలపించారు. సంస్కృతి ఫౌండేషన్ ప్రసిద్ధ కర్ణాటక వయోలిన్ విద్వాంసులు నాద సుదర్ణవ పద్మశ్రీ డాక్టర్ అన్నవరపు రామస్వామిని గురుసన్మానంతో గౌరవించుకున్నారు. కార్యక్రమంలో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ పాల్గొని సంస్కృతి ఫౌండేషన్ తరపున గండపెండేరాన్ని బహూకరించారు. భాషా సాంస్కృతిక శాఖ సంచాలకుడు మామిడి హరికృష్ణ, పద్మశ్రీ ఎల్లా వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఇంటర్ ప్రాక్టికల్స్

సాక్షి, సిటీబ్యూరో: ఇంటర్మీడియట్ పబ్లిక్ ప్రాక్టికల్ పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. హైదరాబాద్ జిల్లాలో జనరల్ విభాగంలో 197, వొకేషనల్ విభాగంలో 57 కలిపి 454 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు ఇంటర్మీడియట్ బోర్డు ప్రకటించింది. జనరల్ 34,549, వొకేషనల్ 7,952 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారు. ప్రతి పరీక్ష కేంద్రానికి చీఫ్ సూపరింటెండెంట్‌ను నియమించారు. మొత్తం 4 స్పెల్స్‌లో పరీక్షలను నిర్వంచనున్నారు. మొదటి స్పెల్‌లో జనరల్ 98, వొకేషనల్ 20 పరీక్ష కేంద్రాలలో సోమవారం పరీక్షలు ప్రారంభం కానున్నాయి.

గన్.. సవాల్!

బిహార్, యూపీ నుంచి సిటీకి అక్రమ ఆయుధాలు


నేరగాళ్ల చేతికి చేరుతుండటమే పెను సవాల్	అఫ్జల్‌గంజ్‌లో కాల్పులు జరిపిన బీదర్ గ్యాంగ్	గచ్చిబౌలిలో విరుచుకుపడిన బత్తుల ప్రభాకర్	నిఘా నిద్రపోవడమే ఇందుకు ప్రధాన కారణం

- 15.01.2025: ఉత్తరప్రదేశ్‌కు చెందిన హరేకృష్ణ బిహార్ నుంచి మూడు తుపాకులు, పది బుల్లెట్లు ఖరీదు చేసుకుని నగరానికి చేరుకున్నాడు. ఇక్కడి నేరగాళ్లకు విక్రయించే ప్రయత్నాల్లో రాచకొండ ఎస్వోటీ పోలీసులకు చిక్కాడు.
- 16.01.2025: కర్ణాటకలోని బీదర్‌లో ఎస్‌బీఐ ఏటీఎం మిషన్లలో నగదు నింపే సీఎంఎస్ ఏజెన్సీ వాహనంపై బిహార్ దొంగలు విరుచుకుపడ్డారు. అక్కడ రూ.87 లక్షలు దోచుకుని అఫ్జల్‌గంజ్ చేరుకుని, ట్రావెల్స్ మేనేజర్ జహంగీర్‌పై కాల్పులు జరిపారు.
- 01.02.2025: తెలుగు రాష్ట్రాల పోలీసులకు మోస్ట్ వాంటెడ్‌గా ఉన్న నేరగాడు బత్తుల ప్రభాకర్ గచ్చిబౌలిలో సైబరాబాద్ సీసీఎస్ పోలీసులపై కాల్పులు జరిపాడు. ఇతడి నుంచి పోలీసులు ఏకంగా మూడు తుపాకులు, 451 తూటాలు స్వాధీనం చేసుకున్నారు.
- బిహార్, ఉత్తరప్రదేశ్ సహా ఉత్తరాది నుంచి నగరానికి వస్తున్న ఆయుధాలకు సంబంధించి తాజా ఉదాహరణలివి. ఈ ఆయుధాలతో పాటు ఆ దందాలు చేసేవారిపైనా పూర్తి స్థాయిలో నిఘా ఉండటం లేదు. ఫలితంగా ఎక్కడపడితే అక్కడ నాటు తుపాకులు లభిస్తున్నాయి. దీంతో నేరగాళ్లు వీటిని వినియోగిస్తూ పోలీసులకు సవాల్ విసురుతున్నారు. గచ్చిబౌలిలో కాల్పులు జరిపిన బత్తుల ప్రభాకర్‌కు ఘరానా నేర చరిత్ర ఉంది. అయితే అతడు ఆయుధం వినియోగించడం ఇదే తొలిసారి కావడం గమనార్హం.

– సాక్షి, సిటీబ్యూరో

అక్రమ ఆయుధాలన్నీ అక్కడి నుంచే..

బిహార్, ఉత్తరప్రదేశ్‌లోని అనేక ప్రాంతాల్లో తుపాకుల తయారీ ఓ కుటీర పరిశ్రమగా సాగుతోంది. నగరానికి సరఫరా అవుతున్న నాటు తుపాకుల్లో దాదాపు 90 శాతం ఈ ప్రాంతాల నుంచి 'దిగుమతి' చేసుకుంటున్నవే. బిహార్‌లోని గయ ప్రాంతంలో తయారవుతున్న నాటు తుపాకులు సేఫ్టీ లాక్‌తో రూపొందుతున్నాయని పోలీసులు చెబుతున్నారు. కేవలం కంపెనీ మేడ్ రివాల్వర్స్, పిస్టల్స్‌కు మాత్రమే ఈ సౌలభ్యం ఉంటుంది. బిహార్ నుంచి నగరానికి సరఫరా అవుతున్న వాటిలో ఆటోమేటెడ్, సెమీ–ఆటోమేటెడ్ రకాలు ఉంటున్నాయనేది ఆందోళన కలిగించే అంశం. .32 లాంటి క్యాలిబర్స్ మాత్రమే కాకుండా... కేవలం డిఫెన్స్, పోలీసు శాఖలు మాత్రమే వాడే ప్రొహిబిటెడ్ బోర్‌గా పిలిచే .9 ఎంఎం తుపాకులు, తూటాలు నాటు పద్ధతిలో తయారవుతున్నాయంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. కేవలం రివాల్వర్లు, పిస్టళ్లు మాత్రమే కాదు.. వీటితో పాటు డబుల్ బ్యారెల్, సింగిల్ బ్యారెల్ తుపాకులు సైతం బిహార్ ఉత్తరప్రదేశ్ నుంచి వచ్చి చేరుతున్నాయని తెలుస్తోంది.



ప్రత్యేక ముఠాలతో అక్రమ రవాణా..

- నగరానికి ఆయా రాష్ట్రాల నుంచి తుపాకులు సరఫరా చేయడానికి ప్రత్యేక ముఠాలు పని చేస్తున్నాయి. అక్కడి కరడుగట్టిన ముఠాలు వీటిని అందిస్తున్నాయి. వీరికి రైలు మార్గం ఓ వరంగా మారింది. జనరల్ బోగీల్లో తనిఖీలు అంతంత మాత్రంగా ఉండటంతో వీటిలోనే ఆయుధాలు రవాణా చేస్తున్నాయి. వీటికి తోడు ట్రాన్స్‌పోర్ట్ లారీలు, కొన్నిసార్లు ప్రైవేట్ బస్సుల్లోనూ ఇవి నగరానికి వస్తున్నాయి. ఓ పక్క ముఠాలే కాకుండా.. అక్కడి నుంచి వచ్చే దినసరి కూలీలు సైతం ఆయుధ వ్యాపారాన్ని అదనపు ఆదాయ మార్గంగా భావిస్తున్నారు.
- పనుల కోసం నగరంలో స్థిరపడిన బిహారీలు రాకపోకలు సాగించే సమయంలో తమతో పాటు కొన్ని ఆయుధాలు తీసుకువచ్చి విక్రయిస్తున్నారు. పాతబస్తీతో పాటు శివార్లలో ఉన్న అనేక ప్రాంతాల్లో వీటిని విరివిగా విక్రయిస్తున్నారు. ఈ ఆయుధాల సరఫరా మూలాలను కనుక్కోవడంలో పోలీసు నిఘా అంతంత మాత్రంగానే ఉందని చెప్పవచ్చు. ఓ ముఠా దొరికినప్పుడు వారిని అరెస్టు చేయడంతో సరి పెట్టాల్సి వస్తోంది. ఎవరైనా చొరవ తీసుకుని కాస్త ముందడుగు వేసి దర్యాప్తు కోసం రాష్ట్రం దాటినా.. వారికి అక్కడి పోలీసుల నుంచి సరైన సహకారం అందుతుందని ఆశించలేం. ఒక్కోసారి ఎదురుదాడులు జరిగే పరిస్థితి ఉంది. బిహార్, ఉత్తరప్రదేశ్‌ల్లో ఈ పరిస్థితులు మరీ ప్రమాదకరంగా ఉంటాయి. ఈ నేపథ్యంలోనే ఆసక్తి ఉన్న అధికారులు సైతం మిన్నకుండిపోవాల్సి వస్తోంది.

నాటు ఆయుధాల ధరలు ఇలా..

- తపంచా: రూ.5 వేల నుంచి రూ.8 వేలు
- రివాల్వర్: రూ.25 వేల నుంచి రూ.50 వేలు
- పిస్టల్: రూ.30 వేల నుంచి రూ.60 వేలు
- ఆటోమేటెడ్ పిస్టల్: రూ.80 వేలకు పైగా..
- ఆటోమేటెడ్ రివాల్వర్: రూ. 90 వేలకు పైగా

(విశ్వసనీయ సమాచారం ప్రకారం)

టార్గెట్ రూ. 333 కోట్లు!

- ఇంత మొత్తం సంపాదించాలని ప్రభాకర్ లక్ష్యం
- 100 మంది యువతులతో సన్నిహితంగా ఉండాలనీ..
- ఈ మేరకు అతడి ఛాతీపై రెండు పచ్చబొట్లు
- స్నేహితుల పేర్లతో హైఎండ్ కార్లు ఖరీదు
- వెలుగులోకి వస్తున్న దోపిడీ దొంగ వ్యవహారం



నిందితుడు ప్రభాకర్

గచ్చిబౌలి: ఎప్పటికైతే తాను రూ.333 కోట్లు సంపాదిస్తాడో అప్పటి నుంచి నేరాలు మానేయాలని భావించాడు బత్తుల ప్రభాకర్ అలియాస్ బిట్టూ. దీంతో పాటు తన జీవితంలో 100 మంది యువతులతో సన్నిహితంగా ఉండాలనీ లక్ష్యంగా నిర్దేశించుకున్నాడు. ఈ మేరకు కొన్నేళ్ల క్రితమే తన ఛాతీపై రెండు వైపులా పచ్చబొట్లు పొడిపించుకున్నాడు. శనివారం గచ్చిబౌలిలోని ప్రిజం పబ్ వద్ద పోలీసులపై కాల్పులు జరిపింది ఇతగాడే. సైబరాబాద్ సీసీఎస్ పోలీసుల విచారణలో అనేక కోణాలు వెలుగులోకి వస్తున్నాయి. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం వివరాలు ఇలా..

చదివింది ఎనిమిదో తరగతి..

పెద్ద పెద్ద కాలేజీలను టార్గెట్‌గా చేసుకుని చోరీలు చేసే బత్తుల ప్రభాకర్ చదివింది మాత్రం ఎనిమిదో తరగతే. ఏపీలోని చిత్తూరు జిల్లా ఇరికిపెంటకు చెందిన ఇతగాడు 7, 8 తరగతులు విజయవాడలో చదివాడు. తల్లిదండ్రులకు దూరంగా ఉంటూ 17 ఏళ్ల వయసు నుంచే చోరీల బాట పట్టాడు. దాదాపు 15 ఏళ్లుగా ఇంజినీరింగ్ కాలేజీలు, కార్పొరేట్ స్కూల్స్‌లో చోరీలు చేస్తూ మోస్ట్ వాంటెడ్ క్రిమినల్‌గా మారాడు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల్లో కేసులున్న ఇతడికి బిట్టూ, రాహుల్ రెడ్డి, సర్వేశ్వర్ రెడ్డి, రాజు తదితర మారుపేర్లు ఉన్నాయి. స్నేహితులు, సన్నిహితంగా ఉండే యువతుల వద్ద, షాపింగ్‌కు వెళ్లినప్పుడు మృదు స్వభావిగా ఉంటాడు. ఎక్కడా ఎవరితోనూ గొడవలు పడిన దాఖలాలు లేవని పోలీసులు చెబుతున్నారు.

రూ.3 వేల చోరీతో మొదలుపెట్టి...

బత్తుల ప్రభాకర్ ఛాతీ భాగంలో కుడి వైపు 3, ఎడమ వైపు 100 అంకెలు, మధ్యలో సిలువ టాటూలు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. వీటిపై పోలీసులు అతగాడిని ప్రశ్నించారు. కొన్నేళ్ల క్రితం తన నేర జీవితం రూ.3 వేల నుంచి చోరీ మొదలైందని, అప్పట్లో ఒకే రోజు రూ.3 లక్షలు, మొత్తమ్మీద రూ.33 లక్షలు చోరీ చేయాలని లక్ష్యంగా నిర్దేశించుకుని '3' టాటూ వేయించుకున్నానని చెప్పాడు. ప్రస్తుతం ఉన్న పరిస్థితుల నేపథ్యంలో రూ.333 కోట్ల సంపాదన లక్ష్యంగా చేసుకున్నానని బయటపెట్టాడు. అలాగే 100 మంది యువతులతో సన్నిహితంగా ఉండాలన్నది మరో లక్ష్యమని, విలాస వంతమైన జీవితం గడుపుతున్న తాను ఇప్పటికే 40 అలా ఉన్నట్లు చెప్పాడు.

గేటెడ్ కమ్యూనిటీలో నివాసం..

అత్యంత విలాసవంతమైన జీవితం గడిపే ఇతగాడు గతంలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ ముసుగులో ఆ రంగానికి చెందిన వారితో కలిసి మైండ్‌స్పేస్ సమీపంలోని ఫ్లాట్‌లో ఉన్నాడు. ప్రస్తుతం నార్సింగి పరిధిలో ఉన్న ఓ గేటెడ్ కమ్యూనిటీలో స్నేహితుల పేరిట ఫ్లాట్ తీసుకొని ఉంటూ ఒడిశాకు చెందిన ఓ యువతితో సహజీవనం చేస్తున్నాడు. కొద్ది రోజుల క్రితం ఆమె సొంత ఊరుకు వెళ్లింది. పోలీసులు నిందితుడి ఫ్లాట్‌ను తనిఖీ చేసినప్పుడు రూ.50 వేలు ఖరీదు చేసే మద్యం బాటిల్ లభించింది. ప్రతిరోజూ ఉదయం జిమ్‌కు వెళ్లడం, వీకెండ్స్‌లో పబ్స్‌లో జల్సాలు చేయడం ఇతడి నైజం. కేవలం హైఎండ్ కార్లు మాత్రమే వాడే ప్రభాకర్.. సెకండ్ హ్యాండ్ వాటిని స్నేహితుల పేరిట కొంటాడు. కొన్నాళ్లు వాడిన తర్వాత ఆ వాహనాన్ని ఆ స్నేహితుడికే వదిలేసి తన మకాం మార్చేస్తాడు. పోలీసులకు చిక్కకుండా ఉండటానికే ఇలాంటి జాగ్రత్తలు తీసుకున్నాడు.

స్నేహితులకూ భారీగా ముట్టచెబుతూ...


ఫ్లాట్‌లో కలిసి ఉండే క్రమంతో తనకు స్నేహితులుగా మారిన వారికి తన గతం తెలియకుండా జాగ్రత్తపడతాడు. అనుకోకుండా ఎవరికైనా తెలిస్తే వారికి భారీ మొత్తం ఇచ్చి నోరు మూయిస్తాడు. చోరీ చేసిన నగదును స్నేహితుల అకౌంట్లలో వేసి, వారి యూపీఐలు తన ఫోన్‌లో యాక్టివేట్ చేసుకుని విచ్చలవిడిగా ఖర్చు చేస్తాడు. జిమ్, పబ్స్‌తో పాటు గోల్ఫ్, బౌలింగ్ ఆటలు, సినిమాలు ఇతడి హాబీ. వీటిలో ఎక్కడికి వెళ్లినా తన ముఖం సీసీ కెమెరాల్లో రికార్డు కాకుండా కచ్చితంగా మాస్క్ ధరిస్తాడు.

బాప్‌రే..



సుమోటో రివిజన్‌తో భారీగా పెరిగిన ఆస్తిపన్ను

- 25 ఆస్తుల్లోనే రూ.3.30 లక్షల వ్యత్యాసం
- జీహెచ్‌ఎంసీలోని అన్ని ఆస్తులనూ లెక్కిస్తే ఎన్ని కోట్లో?



సాక్షి, సిటీబ్యూరో: గ్రేటర్ నగరంలోని పలు భవనాల నుంచి జీహెచ్‌ఎంసీకి ఆశించిన మేర ఆస్తి పన్ను రావడం లేదని గ్రహించిన అధికారులు కొన్ని ప్రాంతాల్లో భవనాలను పరిశీలించారు. వాటిలో చాలా భవనాల యజమానులు చెల్లిస్తున్న ఆస్తిపన్నుకు.. వాస్తవంగా ఉండాల్సిన ఆస్తి పన్నుకు మధ్య బోలెడు వ్యత్యాసం కనిపించింది. ఆస్తిపన్ను అసెస్‌మెంట్ చేసేటప్పుడే చేతివాటానికి మరిగిన బిల్‌కలెక్టర్లు, ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్లు అసెస్‌మెంట్‌లో తక్కువగా చూపి, తక్కువ ఆస్తిపన్ను నిర్ధారించడం ఇందుకు ఒక కారణమైతే, కొందరు యజమానులు అదనపు అంతస్తులు నిర్మించుకొని వాటికి అసెస్‌మెంట్ చేయించుకోకపోవడం మరో కారణంగా తెలుస్తోంది. దీనిద్వారా జీహెచ్‌ఎంసీ ఖజానాకు భారీ నష్టం వాటిల్లుతోంది. అన్ని భవనాలను సవ్యంగా అసెస్ చేసి ఆస్తిపన్ను నిర్ధారిస్తే ప్రస్తుతం వస్తున్న ఆదాయం కంటే ఎంతో ఎక్కువగా వచ్చే అవకాశాలున్నాయి. అందుకు ఊతమిస్తోంది హైదర్‌నగర్ డివిజన్‌లోని ఆస్తిపన్ను వ్యత్యాసం.

సుమోటో రివిజన్‌తో..

జీహెచ్‌ఎంసీ అధికారులు సుమోటో రివిజన్ పేరిట హైదర్‌నగర్ డివిజన్‌లోని రెండు డాకెట్లలోని భవనాలను పరిశీలించారు. ఒక డాకెట్‌లో 52 భవనాలకు, మరో డాకెట్‌లో 253 భవనాలకు వాస్తవంగా ఉండాల్సిన ఆస్తిపన్నుకు, ప్రస్తుతం చెల్లిస్తున్న ఆస్తిపన్నుకు వ్యత్యాసం ఉన్నట్లు గుర్తించారు. అలా వ్యత్యాసం ఉన్న భవనాల్లో (ఆస్తుల్లో) 25 ఆస్తుల మధ్య వ్యత్యాసాలను లెక్కిస్తేనే రావాల్సిన ఆస్తి పన్ను కంటే రూ.3,30,508 ఆస్తిపన్ను తక్కువగా ఉంది. అంటే సగటున ఒక్కో ఆస్తిపై దాదాపు రూ.13వేలు రావాల్సిన దానికంటే తక్కువగా వస్తోంది. ఈ లెక్కన జీహెచ్‌ఎంసీ పరిధిలోని అన్ని భవనాలను సుమోటో రివిజన్ చేస్తే ఎంత ఆస్తిపన్ను పెరుగుతుందో అంచనా వేసుకోవచ్చు.

ఆడిట్ మేరకే..

ఇటీవల జరిగిన జీహెచ్‌ఎంసీ కౌన్సిల్ సమావేశాన్ని పురస్కరించుకొని కూకట్‌పల్లి సర్కిల్‌లోని హైదర్‌నగర్ కార్పొరేటర్ సర్వే పేరిట ట్యాక్స్ విభాగం అధికారులు ఆస్తిపన్ను పెంచారని ప్రజల నుంచి తమకు ఫిర్యాదులొస్తున్నాయంటూ పూర్తి ఆడిట్ వివరాలివ్వాల్సిందిగా అడిగిన ప్రశ్నకు లిఖిత పూర్వకంగా సమాధానమిచ్చిన అధికారులు వెల్లడించిన సమాచారం మేరకు ఈ వ్యత్యాసం కనిపించింది. ఆస్తిపన్ను రివిజన్ అనంతరం ప్రజల నుంచి తమకు వ్యక్తిగతంగా ఎలాంటి ఫిర్యాదులు కూడా రాలేదని చెబుతూ తమ రివిజన్ సరైనదేనని పేర్కొన్నారు. వారిచ్చిన ఆడిట్ మేరకు మొత్తం 305 ఆస్తుల్లో కేవలం 25 ఆస్తులకు సంబంధించిన వివరాలను పరిగణనలోకి తీసుకుంటేనే ప్రస్తుతం చెల్లిస్తున్న ఆస్తిపన్ను కంటే రివిజన్ మేరకు ఎంతో ఆస్తిపన్ను పెరిగింది.

- 1140 సిరీస్‌తో మొదలయ్యే పీటీఐఎన్‌లకు సంబంధించిన ఆస్తిపన్ను రివిజన్ ఇవి.

ఈ లెక్క మేరకు..

ప్రస్తుతం చెల్లిస్తున్న ఆస్తిపన్ను:	రివిజన్ మేరకు ఆస్తిపన్ను:
రూ.1,01,874	రూ.4,32,382

వ్యత్యాసం: రూ. 3,30,508

- జీహెచ్‌ఎంసీ పరిధిలోని అన్ని భవనాలను లెక్కిస్తే ఎన్ని కోట్ల మేర ఆస్తిపన్ను పెరుగుతుందో అంచనా వేసుకోవచ్చు.

చెల్లిస్తున్న ఆస్తి పన్ను	రివైజ్డ్ పన్ను (రూ.లలో)
4,590	20,062
3,436	12,037
3,656	24,587
3,656	16,656
3,640	16,656
3,640	16,656
3,640	16,656
3,640	16,656
3,640	16,656
3,640	16,656
3,640	16,656
3,640	16,656
3,640	21,151
5,128	26,944
5,128	20,093
3,640	12,038
3,640	12,038
3,640	12,038
3,640	12,038
3,640	12,038
3,640	12,038
5,420	21,344
5,420	21,344
5,420	21,344
5,420	21,344

డామిట్.. కథ అడ్డం తిరిగింది!

- కూతురును ఆర్థిక సమస్యల నుంచి గట్టెక్కించాలని తల్లి డ్రామా
- చైన్ స్నాచింగ్ అంటూ డయల్ 100కు ఫోన్
- దర్యాప్తులో అంతా అబద్ధమేనని తేల్చిన పోలీసులు

ఘట్‌కేసర్: కూతురును ఆర్థిక సమస్యల నుంచి గట్టెక్కించాలని ఓ తల్లి ఆడిన డ్రామాను ఘట్‌కేసర్ పోలీసులు ఛేదించారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఘట్‌కేసర్ మండలం అవుషాపూర్ గ్రామానికి చెందిన ఓ వృద్ధురాలి (60) కూతురు ఆర్థిక సమస్యల్లో ఉంది. కూతురు పడుతున్న కష్టాలను గమనించిన తల్లి.. ఏదైనా సాయం చేయాలనుకుంది. తన దగ్గర డబ్బు లేకపోవడంతో పుస్తెల తాడు విక్రయించాలనుకుంది. బంగారం అమ్మితే కుమారుడికి తెలుస్తుందని భయపడి మిన్నకుండిపోయింది. ఎలాగైనా కూతురికి సాయం చేయాలని చైన్ స్నాచింగ్ డ్రామాకు తెరలేపింది. ఆదివారం ఉదయం ఇంటి నుంచి మెయిన్ రోడ్డుకు చేరుకొని తన మెడలోని మూడు తులాల బంగారు పుస్తెల తాడును గుర్తు తెలియని దుండగులు ఎత్తుకెళ్లారని ఏడ్వసాగింది. దీంతో పలువురు స్థానికులు అక్కడ గుమికూడారు. ఈ క్రమంలో వృద్ధురాలు డయల్ 100కు ఫోన్ చేసింది. వెంటనే ఘటన స్థలానికి చేరుకున్న ఇద్దరు ఇన్‌స్పెక్టర్లు, నలుగురు ఎస్సైలు పోలీస్ సిబ్బందితో కలిసి నాలుగు బృందాలుగా ఏర్పడి గాలింపు చర్యలు చేపట్టారు. దర్యాప్తులో భాగంగా పోలీసులు అడిగిన ప్రశ్నలకు వృద్ధురాలు పొంతన లేని సమాధానాలు చెప్పింది. పోలీసులు సీసీ కెమెరాలు పరిశీలించగా దుండగుల ఆచూకీ లభించలేదు. దీంతో వృద్ధురాలిని గట్టిగా నిలదీయడంతో.. కూతురిని ఆర్థిక సమస్యల నుంచి గట్టెక్కించాలని డ్రామా ఆడినట్లు తెలిపింది. కూతురి ఆర్థిక సమస్యలు తీర్చాలని పోలీసులను తప్పుదోవ పట్టించిన వృద్ధురాలిపై చర్యలు తీసుకోనున్నట్లు సమాచారం. అత్యవసర సమయాల్లో వినియోగించే డయల్ 100ను దుర్వినియోగపర్చవద్దని పోలీసులు సూచించారు.

బల్కంపేట ఎల్లమ్మ ఆలయంలో డూప్లికేట్ టికెట్ల కలకలం


రీ ప్రింట్ అయినట్లుగా భావిస్తున్న టికెట్లు

అమీర్‌పేట: బల్కంపేట ఎల్లమ్మ దేవాలయంలో నకిలీ టికెట్ల విక్రయం కలకలం రేపుతోంది. టికెట్ కౌంటర్‌లో పనిచేసే శ్రీహరి అనే వ్యక్తి గత కొంత కాలంగా భక్తులకు నకిలీ టికెట్లు విక్రయించి అక్రమ సంపాదనకు పాల్పడుతున్నాడని ఆరోపిస్తూ కొందరు వ్యక్తులు సామాజిక మాధ్యమాల్లో టికెట్లను వైరల్ చేశారు. ఇంత జరుగుతున్నా ఆలయ అధికారులు పట్టించుకోకపోవడం ఏమిటని భక్తులు ప్రశ్నిస్తున్నారు. నకిలీ టికెట్ల విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా సదరు ఉద్యోగిపై ఎలాంటి చర్యలు తీసుకోలేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. గత నెల 12న ఒక్క రోజే సుమారు 30 వేల విలువైన టికెట్లను విక్రయించినట్లు తెలుస్తోంది. దీనిపై ఆలయ అధికారులను వివరణ కోరగా టికెట్లు ముద్రించే సమయంలో సాంకేతిక సమస్య తలెత్తడంతో కొన్ని టికెట్లు రీ ప్రింట్ అయినట్లు గుర్తించామని సూపరింటెండెంట్ హైమావతి తెలిపారు. దీంతో జనవరి 15 నుంచి మ్యాన్‌వల్‌గా టికెట్లు ఇస్తున్నామన్నారు. టికెట్ కౌంటర్‌లో పనిచేసే శ్రీహరికి మెమో ఇచ్చి వివరణ ఇవ్వాలని కోరడమేగాక విచారణకు అధికారిని నియమించినట్లు తెలిపారు. అతడిపై ఉన్న కోపంతో టికెట్ల అంశాన్ని సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేసి ఉండవచ్చని, దీనిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ఎస్‌ఆర్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఆమె పేర్కొన్నారు.

మరింత దిగువకు..

వేగంగా పడిపోతున్న భూగర్భజలమట్టం!

- డిసెంబర్‌తో పోలిస్తే జనవరిలో గణనీయంగా తగ్గుదల
- 1.05 మీటర్ల లోతుకు పడిపోయిన నీటిమట్టం
- ఇప్పటికే మొరాయిస్తున్న మోటార్లు
- ఇబ్రహీంపట్నం, హయత్‌నగర్, శేరిలింగంపల్లిలో పాతాళంలోకి
- మొదలైన మంచినీటి ఎద్దడి..ఆందోళనలో ప్రజలు



సాక్షి, సిటీబ్యూరో: జిల్లాలో భూగర్భజలాలు వేగంగా పడిపోతున్నాయి. గత డిసెంబర్‌లో జిల్లా సగటు భూగర్భ జలమట్టం ఆనవాళ్లు 9.08 మీటర్ల లోతులో కన్పించగా, తాజాగా జనవరిలో నీటి ఆనవాళ్లు 10.13 మీటర్ల లోతుకు(1.05 మీటర్ల లోతుకు) పడిపోయాయి. వేసవి ప్రారంభానికి ముందే వ్యవసాయ బోర్లు ఆగిపోస్తుండగా, గృహ, వాణిజ్య సముదాయాల్లో అప్పుడే నీటికి కటకట మొదలైంది. ముఖ్యంగా నిర్మాణాలు ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో భూగర్భ జలమట్టం పాతాళానికి పడిపోతుండటం ఆందోళన కలిగిస్తోంది. జిల్లా వ్యాప్తంగా భూగర్భ జలమట్టం 87 ఫీజో మీటర్లు ఉండగా, ఇబ్రహీంపట్నంలో 15.75 మీటర్ల లోతుకు పడిపోయింది..సరూర్‌నగర్‌లో 14.80 మీటర్లు, శేరిలింగంపల్లిలో 13.97 మీటర్ల లోతుకు చేరడం గమనార్హం. నందిగామ, ఆమనగల్, అబ్దుల్లాపూర్‌మెట్‌ల ప్రాంతాల్లో నీటి ఆనవాళ్లు ఆశించిన దానికంటే పైనే కన్పిస్తుండటం విశేషం.

పల్లెల్లో నీటి కటకట...

చెరువులు, కుంటలను ధ్వంసం చేయడం, నీటి ప్రవాహానికి అడ్డుకట్టలు వేయకపోవడం, కొండలు, గుట్టలను చదును చేస్తుండటం, చెట్లను నరికివేస్తుండటం, గెటేట్ కమ్యూనిటీలు, విల్లాలు, ఫాం హౌస్‌లు, పరిశ్రమల పేరుతో భారీగా నిర్మాణాలు చేపడుతుండటం భూగర్భ జలమట్టాలు పడిపోతున్నాయి. ఇంటి చుట్టూ రోడ్డు, ఇతర అవసరాల కోసం కాంక్రీట్ వేస్తుండటం, వర్షపు నీరు భూమిలో పలికి ఇంకేందుకు ఇంకుడు గుంతలను ఏర్పాటు చేయక పోవడం, అవసరానికి మించి నీటిని వినియోగిస్తుండటం వల్ల భూగర్భ జలాలు వేగంగా పడిపోతుండటానికి కారణమవుతున్నాయి. గ్రామాల్లోని బోర్లు కూడా సరిగా పోయడం లేదు. అవసరాల మేరకు నీరు సరఫరా కావడం లేదు. గత నెల వరకు ప్రతి రోజూ నల్లాల్లో నీరు విడుదల చేస్తుండగా, తాజాగా రోజు విడిచి రోజు వదులుతుండటమే ఇందుకు నిదర్శనం.

మోటార్లు మొరాయిస్తున్నాయి



రియల్ ఎస్టేట్ సంస్థల రాకతో వాగులు, వంకలు ధ్వంసమయ్యాయి. నీరు నిలిచే పరిస్థితి లేకుండా పోయింది. వర్షానికి వచ్చిన నీరు వచ్చినట్లే కిందికి వెళ్లిపోతోంది. భూమిలోకి నీరు ఇంకక పోవడంతో భూగర్భ జలాలు ఆశించిన స్థాయిలో పెరగడం లేదు. వ్యవసాయ బోరు కింద నాలుగు ఎకరాల వరి సాగు చేశాను. అప్పుడే మోటార్లు మొరాయిస్తున్నాయి. వేసవికి ముందే బోర్లు ఆగిపోస్తుండటం ఆందోళన కలిగిస్తోంది. చివరి మడి వరకు తడుస్తుందా? అంటే అనుమానమే. పెట్టిన పెట్టుబడి కూడా రాకుండా పోతోంది.

- కె.శంకర్‌నాయక్, కొర్రంతండా, మంచాల

ఇంట్లో మోటార్ ఆగిపోయింది



ఏ ఇంటి చుట్టూ చూసినా సీసీ రోడ్లే. వర్షపు నీరు భూమిలోకి ఇంకని పరిస్థితి. నిజానికి ప్రతి ఇంటి ముందు ఓ ఇంకుడుగుంత ఏర్పాటు చేసుకోవాల్సి ఉన్నా..చాలా మంది దీనిని పట్టించుకోవడం లేదు. పూర్తిగా కాంక్రీట్ జంగిల్‌గా మారింది. ఇంటికో బోరు తవ్విస్తుండటం, అవసరానికి మించి నీటిని వాడుతుండటం తదితర కారణాలతో వల్ల భూగర్భ జలమట్టం వేగంగా పడిపోతుంది. సాధారణంగా ఏప్రిల్/మే మాసంలో కన్పించే నీటి ఎద్దడి ఫిబ్రవరి మొదటి వారంలోనే కన్పిస్తుంది.

- డి.ఆంజనేయులు, హస్తినాపురం

వివిధ మండలాల్లో భూగర్భ జలమట్టం ఇలా (మీటర్ల లోతులో)

మండలం	డిసెంబర్	జనవరి
ఇబ్రహీంపట్నం	14.11	15.75
సరూర్‌నగర్	12.66	14.80
శేరిలింగంపల్లి	12.59	13.97
తలకొండపల్లి	12.43	12.98
హయత్‌నగర్	10.95	12.44
మంచాల	10.29	11.96
షాబాద్	9.19	11.45
గండిపేట్	9.87	10.08
కడ్తాల్	9.76	10.58
చేవెళ్ల	9.14	10.23
మహేశ్వరం	9.74	10.09
శంకర్‌పల్లి	8.45	9.77
కొత్తూరు	8.37	9.41
చౌదరిగూడెం	7.86	9.17
శంషాబాద్	8.36	8.80
రాజేంద్రనగర్	8.33	8.76
మొయినాబాద్	7.87	8.76
యాచారం	8.07	8.74
మాడ్గుల	7.24	7.54
కందుకూరు	6.72	7.69
బాలాపూర్	6.73	7.17
ఫరూఖ్‌నగర్	6.84	7.08
కేశంపేట్	4.69	5.48
కొందుర్గు	4.92	6.42
అబ్దుల్లాపూర్‌మెట్	5.41	6.17
ఆమనగల్	5.30	6.06
నందిగామ	4.90	4.70

వరకట్న.. వేధింపులు తాళలేక..

- మహిళ ఆత్మహత్య


రవళి(ఫైల్)

ఉప్పల్: వరకట్న వేధింపులు తాళలేక ఓ మహిళ ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన ఉప్పల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. యాదాద్రి జిల్లా, మోత్కూరు మండలం, పాటిమట్ల గ్రామానికి చెందిన భోరెడ్డి రాజశేఖర్ రెడ్డికి గుండాల మండలం, సీతారాంపురం గ్రామానికి చెందిన మలిపెద్ది రవళి(25)తో 2019లో వివాహం జరిగింది. బతుకుదెరువు నిమిత్తం నగరానికి వలస వచ్చిన వారు ఉప్పల్‌లోని చిలుకానగర్‌లో ఉంటూ ప్రైవేట్ ఉద్యోగాలు చేస్తున్నారు. వారికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. గత కొన్నేళ్లుగా రవళిని అత్తమామలు, ఆడబిడ్డలు అదనపు కట్నం కోసం వేధిస్తున్నారు. పలు మార్లు పెద్ద మనుషులు జోక్యం చేసుకుని నచ్చజెప్పినా వారి వైఖరి మారలేదు. ఏడాది క్రితం రాజశేఖర్ రెడ్డి భార్యను వదిలేసి స్వగ్రామానికి వెళ్లి పోయాడు. అప్పటి నుంచి రవళి ఒంటరిగా ఉంటోంది. ఈ నేపథ్యంలో మనస్తాపానికి లోనైన ఆమె శనివారం రాత్రి ఇంట్లో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. స్థానికుల సమాచారంతో సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. వరకట్న వేధింపుల కారణంగానే తన కుమార్తె ఆత్మహత్య చేసుకుందని మృతురాలి తల్లి రజిత ఉప్పల్ పోలీస్‌స్టేషన్ ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. గత కొంత కాలంగా పిల్లలిద్దరూ తండ్రి వద్దనే ఉంటున్నట్లు సమాచారం.

మనమంతా ఒక్కటే!



సాక్షి, సిటీబ్యూరో: పోలీస్ స్టేషన్‌లో ఇన్‌స్పెక్టర్ నుంచి హోంగార్డు వరకు ఏడు హోదాలకు చెందిన అధికారులు, సిబ్బంది పని చేస్తూ ఉంటారు. ప్రతి ఒక్కరిదీ ఖాకీ యూనిఫామే అయినప్పటికీ... టోపీ, బెల్ట్, విజిల్ కార్డు ఇలా ప్రతి దాంట్లోనూ ఎన్నో తేడాలు ఉంటాయి. వీటికితోడు ఇప్పటికీ పోలీసు విభాగంలో హైరార్కీ, బాసిజం చాలా ఎక్కువ. అయితే సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలోని జీడిమెట్ల ఠానా ఇన్‌స్పెక్టర్ జి.మల్లేష్ తన సిబ్బంది, అధికారుల్లో మనమంతా ఒక్కటే అనే భావన కలిగించడానికి ప్రయత్నిస్తున్నారు. ఇందులో భాగంగా ఖాకీ దుస్తులకు బదులు వారంలో ఒక రోజు ప్రత్యేక యూనిఫాం ధరించేలా చేస్తున్నారు. సైబరాబాద్ పోలీసు లోగోతో రూపొందించిన దీనిని శనివారం ఠాణా సిబ్బంది మొత్తం ధరించి విధులు నిర్వర్తిస్తున్నారు. సమాజసేవపై ఆసక్తి ఉన్న మల్లేష్ ఇప్పటికే క్రైమ్ ఫ్రీ ఇండియా (సీఎఫ్ఐ) పేరుతో యూట్యూబ్ ఛానల్ నిర్వహిస్తూ వివిధ రకాలైన నేరాల బారినపడకుండా అవగాహన కల్పిస్తున్నారు.

మెదడును లాలించే బ్రెయిన్ ట్యాప్

- మానసిక ఆరోగ్యాన్ని కాపాడే డివైస్ ఆవిష్కరణ
- అమెరికాకు చెందిన బ్రెయిన్ ట్యాప్ సంస్థ రూపకల్పన


బ్రెయిన్ ట్యాప్ ఆవిష్కరణ కార్యక్రమంలో అతిథులు


బ్రెయిన్ ట్యాప్ లైవ్ డెమో

రాయదుర్గం: ఒత్తిడిని తగ్గించి, మనిషి మెదడును ఆరోగ్యంగా ఉంచే అత్యాధునిక పరికరాన్ని అమెరికాకు చెందిన 'బ్రెయిన్ ట్యాప్' సంస్థ భారత్‌లో విడుదల చేసింది. హైదరాబాద్‌లోని టీ హబ్‌లో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో కజకిస్థాన్ గౌరవ కాన్సుల్ నవాబ్ మీర్ నాసిర్ అలీఖాన్, బ్రెయిన్ ట్యాప్ వ్యవస్థాపకుడు డాక్టర్ పాట్రిక్ పోర్టర్, సీఎంఓ సింథియా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్యాట్రిక్ పోర్టర్ మాట్లాడుతూ.. 'బెటర్ బిలియన్ బ్రెయిన్స్'ను తయారుచేయటమే తమ లక్ష్యమని తెలిపారు. మెదడును ఫిట్‌గా ఉంచే సాంకేతికతలను ఆవిష్కరించటంలో బ్రెయిన్ ట్యాప్ అత్యంత ప్రముఖ సంస్థ అని పేర్కొన్నారు. తమ డివైస్ మానసిక ఒత్తిడిని తగ్గించడానికి, సమగ్ర ఆరోగ్యానికి ఉపయోగపడుతుందని తెలిపారు. ప్రఖ్యాత న్యూరాలజిస్ట్ డాక్టర్ ఓంప్రకాశ్ మాట్లాడుతూ బ్రెయిన్‌ట్యాప్ భారతదేశంలో మానసిక ఆరోగ్యాన్ని, మెదడు సామర్థ్యాన్ని పునర్‌నిర్వచించేందుకు సిద్ధంగా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో బ్రెయిన్ ట్యాప్ డివైస్ పనివిధానాన్ని ప్రదర్శించారు. కార్యక్రమంలో బ్రెయిన్ ట్యాప్ బోర్డు డైరెక్టర్ విశాల్ బైజాల్, నిర్వాణ న్యూరో ప్రైవేట్ లిమిటెడ్ సీఓఓ ఛయాల్ బైజాల్, జైళ్లశాఖ మాజీ డీజీ వీకేసింగ్, రెడ్‌క్రాస్ సొసైటీ తెలంగాణ చైర్మన్ అజయ్‌మిశ్రా, ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆసుపత్రి డాక్టర్ సుభద్రా జలాలి, అపోలో ఆసుపత్రి కన్సల్టెంట్ ఫిజీషియన్ డాక్టర్ ఆశిష్ చౌహాన్ తదితరులు పాల్గొన్నారు.

సినీ యూనియన్ నేతలపై దాడి..

ముగ్గురిపై కేసు నమోదు

బంజారాహిల్స్: అకారణంగా యూనియన్ ప్రెసిడెంట్, వైస్ ప్రెసిడెంట్‌పై దాడి చేసిన ముగ్గురు నాయకులపై జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో క్రిమినల్ కేసు నమోదైంది. వివరాల్లోకి వెళితే..శ్రీకృష్ణానగర్‌లోని తెలుగు సినీ అండ్ టీవీ అవుట్‌డోర్ యూనియన్ ఎదుట ప్రెసిడెంట్, కెమెరా అసిస్టెంట్ సీహెచ్.కిషోర్‌బాబుతో పాటు వైస్ ప్రెసిడెంట్ ఎస్ఎల్‌వీఎస్ నారాయణ ఇతర సభ్యులతో కలిసి మాట్లాడుకుంటున్నారు. సమయంలో అక్కడికి వచ్చిన ట్రెజరర్ వంకినేని సురేష్, మాజీ అధ్యక్షుడు మెట్లు వెంకటేశ్వర రావు, జనరల్ సెక్రటరీ సయ్యద్ హుమాయున్ అలీ అకారణంగా వారితో గొడవ పడ్డారు. యూనియన్ ఆడిట్‌కు సంబంధించి మాట్లాడుతూనే వారు ఒక్కసారిగా కిషోర్ బాబు, నారాయణపై దాడికి దిగారు. బాధితుడు కిషోర్‌బాబు డయల్ 100కు ఫోన్ చేసి సమాచారం అందించడంతో సంఘటనా స్థలానికి వచ్చిన పోలీసులు వారిని వారిస్తున్నా వినకుండా పోలీసుల ఎదుటే కిషోర్‌బాబు, నారాయణలపై మరోమారు దాడి చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు క్రిమినల్ కేసు నమోదు చేశారు. ఇదిలా ఉండగా దాడికి పాల్పడిన వంకినేని సురేష్ తెలుగు ఫిలిం ఫెడరేషన్‌లో కూడా ట్రెజరర్‌గా ఉన్నారు. సయ్యద్ హుమాయున్ అలీ 2009లో జూబ్లీహిల్స్ నియోజకవర్గం నుంచి ప్రజారాజ్యం పార్టీ తరుపున పోటీ చేసి ఓడిపోయారు. జూబ్లీహిల్స్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నుమాయిష్‌లో అలజడి

- వ్యాపారులు, స్థానికుల మధ్య ఘర్షణ
- పరస్పర దాడులు
- ఇరు వర్గాలపై కేసులు నమోదు

గన్‌ఫౌండ్రీ: నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో జరుగుతున్న నుమాయిష్‌లో స్వల్ప విషయమై కొందరు స్టాల్స్ నిర్వాహకులు ఎగ్జిబిషన్ సిబ్బందిపై దాడికి పాల్పడిన సంఘటన శనివారం రాత్రి చోటు చేసుకుంది. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు పరిస్థితులను అదుపులోకి తీసుకురావడంతో పాటు గాయపడ్డవారిని ఉస్మానియా ఆసుపత్రికి తరలించి ఇరు వర్గాలపై కేసులు నమోదు చేశారు. వివరాల్లోకి వెళితే..నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో 84వ అఖిల భారత పారిశ్రామిక ప్రదర్శన (నుమాయిష్) కొనసాగుతున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో పోలీసులు నుమాయిష్ లోపల బయట పటిష్టమైన బందోబస్తు చర్యలు చేపట్టారు. నుమాయిష్ లోపల ఎగ్జిబిషన్ సొసైటీ తరపున ప్రైవేట్ సెక్యూరిటీ ఏజెన్సీ సిబ్బందితో పాటు కొందరు వలంటీర్లు పనిచేస్తున్నారు. శనివారం రాత్రి ఒక స్టాల్ నిర్వాహకులకు బయటి నుంచి వచ్చిన వ్యక్తులతో గొడవ జరిగింది. ఈ విషయం తెలుసుకునేందుకు అక్కడికి వెళ్లిన ఎగ్జిబిషన్ సిబ్బందిపై స్టాల్ నిర్వాహకులు దాడికి పాల్పడ్డారు. దీంతో వారు పోలీస్ ఔట్‌పోస్టులో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇదిలా ఉండగా ప్రదర్శన ముగిసిన అనంతరం స్టాల్ నిర్వాహకులు బైక్‌పై గాంధీభవన్ గేటు నుంచి బయటికి వస్తుండగా అక్కడే ఉన్న స్థానిక యువకులు వారితో వాగ్వాదానికి దిగారు. దీంతో ఇరు వర్గాలు పరస్పర దాడులకు దిగాయి. ఈ విషయం తెలియడంతో పెద్ద సంఖ్యలో వ్యాపారులు, స్థానికులు అక్కడికి చేరుకోవడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. రంగంలోకి దిగిన పోలీసులు ఇరువర్గాలను అదుపులోకి తీసుకొని బేగంబజార్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. బేగంబజార్ పోలీస్‌స్టేషన్‌లో సైతం ఇరు వర్గాలు వాదనకు దిగారు. సెంట్రల్‌జోన్ డీసీపీ, ఏసీపీ, ఇతర అధికారులు అక్కడికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. ఇరువర్గాలపై కేసులు నమోదు చేశారు.

బైక్ అదుపుతప్పి యువకుడి మృతి

మరో ఇద్దరికి గాయాలు


బన్నియాదవ్ మృతదేహం


గాయపడిన మణిదీప్, మధు

శామీర్‌పేట్: బైక్ అదుపు తప్పి కిందపడటంతో ఓ యువకుడు మృతిచెందగా మరో ఇద్దరికి గాయాలైన సంఘటన ఆదివారం శామీర్ పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మూడు చింతలపల్లి మండలం, కేశవరం గ్రామానికి చెందిన బన్నియాదవ్(19), మణిదీప్, మధు స్నేహితులు. వీరు ముగ్గురూ కలిసి బైక్‌పై ఆదివారం సాయంత్రం మూడుచింతలపల్లి నుంచి కేశవరం గ్రామానికి వెళ్తున్నారు. స్థానిక ఆర్టిజం ఆశ్రమం సమీపంలో వీరి బైక్ అదుపుతప్పి కింద పడ్డారు. ఈ ఘటనలో తలకు తీవ్ర గాయాలు కావడంతో బన్నియాదవ్ అక్కడికక్కడే మృతి చెందగా, స్నేహితులిద్దరికీ గాయాలయ్యాయి. స్థానికులు వారిని చికిత్స నిమిత్తం ఆర్‌వీఎం హాస్పిటల్‌కు తరలించారు. ఘటనా స్థలానికి చేరుకున్న శామీర్‌పేట పోలీసులు వివరాలు సేకరించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ హాస్పిటల్ కి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

అగ్ని ప్రమాదంలో యువకుడి మృతి


సాయి సత్య శ్రీనివాస్ (ఫైల్)

బాలానగర్: బాలానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఓ ఇంట్లో ఆదివారం తెల్లవారుజామున చోటు చేసుకున్న అగ్ని ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. రాజమండ్రికి చెందిన సాయి సత్య శ్రీనివాస్ (30) రెండేళ్లుగా దాసరి సంజీవయ్య కాలనీలోని ఓ ఇంట్లో నివాసం ఉంటూ పటాన్‌చెరు ప్రాంతంలోని కెమికల్ ఫ్యాక్టరీలో పని చేస్తున్నాడు. ఆదివారం తెల్లవారుజామున ప్రమాదవశాత్తు ఇంట్లో నిప్పంటుకుని మంటలు చెలరేగాయి. మంటల్లో చిక్కుకున్న శ్రీనివాస్‌కు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లుగా ఇన్‌స్పెక్టర్ నరసింహ రాజు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ దుర్మరణం

రాంగ్‌రూట్‌లో వచ్చి ఢీ కొట్టిన ట్రాలీ ఆటో


ప్రతిభా చంద్ (ఫైల్)

గచ్చిబౌలి: రాంగ్ రూట్‌లో వచ్చిన ట్రాలీ ఆటో ఢీ కొట్టడంతో బైక్‌పై వెళుతున్న ఓ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ దుర్మరణం పాలైన సంఘటన గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ మహేష్ గౌడ్ కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మసీద్‌బండలో పీజీ హాస్టల్‌లో ఉంటున్న ప్రతిభా చంద్(25) గచ్చిబౌలిలోని ఓ ఐటీ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పని చేస్తున్నాడు. ఆదివారం తెల్లవారుజామున అతను బైక్‌పై గచ్చిబౌలి నుంచి మసీద్‌బండకు వెళుతున్నాడు. గచ్చిబౌలి స్టేడియం ఎదుట పాలప్యాకెట్ల లోడ్‌తో రాంగ్ రూట్‌లో వచ్చిన టాటా ఏసీ ట్రాలీ ఆటో అతడిని ఢీ కొట్టింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన ప్రతిభా చంద్‌ను కేర్ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ప్రమాదానికి కారణమైన ఆటో డ్రైవర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించారు. మృతుడి హెల్మెట్ ధరించనందునే తలకు తీవ్ర గాయాలు కావడంతో మృతి చెందినట్లు పోలీసులు పేర్కొన్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పోష్ పబ్‌లో తనిఖీలు

కాలం చెల్లిన ఆహార పదార్థాల గుర్తింపు


తనిఖీలు చేస్తున్న టాస్క్‌ఫోర్స్ సిబ్బంది

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ రోడ్డునెంబర్-36లోని పోష్ నోష్ పబ్‌తో పాటు కిష్కింధ కిచెన్ హోటల్‌లో ఆదివారం టాస్క్‌ఫోర్స్ అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించాయి. ఈ సందర్భంగా కిచెన్‌లో అపరిశుభ్ర వాతావరణాన్ని గుర్తించిన అధికారులు కాలం చెల్లిన ఆహార పదార్థాలను, నిత్యావసర సరుకులను సీజ్ చేశారు. రిఫ్రిజిరేటర్లు కూడా శుభ్రంగా లేవని తెలిపారు. మంచినీటి నాణ్యతా నివేదికలు, చెదల నివారణ రికార్డులను కూడా చూపించలేదు. కిచెన్‌లో బొద్దింకలు తిరుగుతున్నట్లుగా నిర్ధారించారు. నిర్వాహకులపై కేసులు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

గ్రంథాలయంలో వసంత పంచమి పూజలు



రహమత్‌నగర్: వసంత పంచమి సందర్భంగా రహమత్‌నగర్ గ్రంథాలయంలో ఆదివారం సరస్వతి మాతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో లైబ్రేరియన్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతుల పంపిణీ



బహుమతులు అందజేస్తున్న జూబ్లీహిల్స్ డివిజన్ కాంగ్రెస్ నేత మామిడి నర్సింగరావు

ఫిలింనగర్: జూబ్లీహిల్స్ రోడ్డునెంబర్-10లోని గాయత్రీహిల్స్‌లో సంక్రాంతి సందర్భంగా గత నెల రంగవల్లుల పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో విజేతలుగా నిలిచినవారికి ఆదివారం బహుమతులను ప్రదానం చేశారు. జూబ్లీహిల్స్ కాంగ్రెస నేత మామిడి నర్సింగరావు ముఖ్యఅతిథిగా విచ్చేసి మహిళలకు బహుమతులు పంపిణీ చేశారు. 63 మంది ఈ పోటీల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో కల్చరల్ మహిళా లీడర్ వాణి, కాలనీ ప్రెసిడెంట్ రాఘవులు, వెంకటేష్ యాదవ్, రమేష్, భరత్ తదితరులు పాల్గొన్నారు.

సింగాడ బస్తీ అధ్యక్షుడిగా అనిల్‌కుమార్



అనిల్‌కుమార్‌ను సన్మానిస్తున్న బస్తీవాసులు

వెంకటేశ్వరకాలనీ: బంజారాహిల్స్ రోడ్ నెంబర్ 10 లోని సింగడా బస్తి అధ్యక్షుడిగా బస్తీ నేత జవ్వాది అనిల్‌కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం బస్తీలో జరిగిన కార్యక్రమంలో బస్తీ సీనియర్ నేతలు అధ్యక్షుడిగా అనిల్‌కుమార్‌ను ప్రకటించారు. బస్తీ ఎన్నికల కోసం నోటిఫికేషన్‌ను విడుదల చేయగా ఎవరూ నామినేషన్ వేయకపోవడంతో అనిల్‌కుమార్ ఎన్నిక ఏకగ్రీవంగా అయినట్లు బస్తీ పెద్దలు తెలిపారు. ప్రధాన కార్యదర్శిగా సతీష్, ఉపాధ్యక్షులుగా గంగరాజు, సలహాదారుగా ఎస్ఎన్.మూర్తి, సంయుక్త కార్యదర్శిగా సుధీర్ నియమితులయ్యారు.

ముదిరాజ్‌లకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి

పంజగుట్ట: ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు ముదిరాజ్ కులస్తులను బీసీ-డి నుండి బీసీ-ఎ లోకి మార్చాలని వివిధ ముదిరాజ్ సంఘాల ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో వివిధ ముదిరాజ్ సంఘాల నాయకులు ఉప్పరి నారాయణ ముదిరాజ్, బోయిని చంద్రశేఖర్ ముదిరాజ్, డాక్టర్ వై.శివ ముదిరాజ్‌లు మాట్లాడుతూ .. ముదిరాజ్‌లను బీసీ-డి నుండి బీసీ-ఎ లోకి మార్చకపోవడంవల్ల విద్యా, ఉద్యోగాల్లో ముదిరాజ్ యువత ఎంతో నష్టపోవాల్సి వస్తుందన్నారు. కార్యక్రమంలో కోట్ల పుష్పలత, లావణ్య, రేణుక, కృష్ణ, తాయప్ప, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

నీటి కోసం తెచ్చిన పైపుల చోరీ

వెంగళరావునగర్: హోటల్ పునర్నిర్మాణం కోసం తెచ్చిన పైపులు చోరీ అయ్యాయి. మధురానగర్ పోలీసులు తెలిపిన మేరకు.. సాంబశివరావు గత రెండేళ్ళుగా మధురానగర్‌లో హోటల్ నిర్వహిస్తున్నాడు. కొద్ది రోజులుగా హోటల్‌కు మరమ్మతు పనులు చేయిస్తున్నాడు. ఇందులో భాగంగా రూ.98 వేలు విలువజేసే 38 పైపులను తీసుకొచ్చి హోటల్ గదిలో ఉంచారు. గతనెల 31వ తేదీ రాత్రి కూలీలు యధావిధిగా పని ముగిసిన తర్వాత ఇంటికి వెళ్ళారు. 1వ తేదీ వచ్చి చూడగా కనిపించలేదు. చుట్టుపక్కల వెదికినా కనిపించకపోవడంతో ఆదివారం మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రాష్ట్రంలో ఉమ్మడి పౌరస్మృతిని అమలు చేయాలి

ఉస్మానియా యూనివర్సిటీ: తెలంగాణలో ఉమ్మడి పౌరస్మృతిని అమలు చేయాలని మహారాష్ట్ర మాజీ గవర్నర్ సీహెచ్ విద్యాసాగర్ రావు కోరారు. ఆదివారం ఓయూ క్యాంపస్ దూర విద్య కేంద్రం సెమినార్ హాలులో విజన్ 2047 ప్రొఫెషనల్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి మాజీ గవర్నర్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. సామాజిక పురోగతి, ఆర్థిక అభివృద్ధికి దేశంలో ఉమ్మడి పౌరస్మృతి అవసరమన్నారు. కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు డాక్టర్ కె.లక్ష్మణ్ పాల్గొన్నారు.

భారీ నిర్లక్ష్యం

- నిషేధిత వేళల్లో తిరుగుతున్న లారీలపై ఎఫ్ఐఆర్
- తనిఖీలు నిర్వహిస్తున్న ట్రాఫిక్ పోలీసులు
- ఉల్లంఘిస్తే జైలుకే..
- రోడ్డెక్కితే వాహనం సీజ్

7 నెలల్లో 4509 లారీలకు జరిమానాలు



నిషేధిత వేళల్లో తిరుగుతున్న డీసీఎంలను సీజ్ చేసిన బంజారాహిల్స్ ట్రాఫిక్ పోలీసులు

బంజారాహిల్స్: తన కూతురిని స్కూల్‌లో దింపేందుకు వెళ్తుండగా నిషేధిత వేళల్లో వచ్చిన ఓ లారీ ఢీకొనడంతో చిన్నారి అక్కడికక్కడే మృతి చెందిన ఘటన వారం రోజుల క్రితం ఫిలింనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. నిషేధిత వేళల్లో ఆ లారీ రోడ్డు పైకి రాకుండా ఉంటే చిన్నారి ప్రాణాలు పోయి ఉండేవికావు. చాలాచోట్ల ట్రాఫిక్ పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నట్లు, లారీలు స్కూల్ వేళల్లో రోడ్డెక్కుతుండడంతో తరచూ రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. అయితే ట్రాఫిక్ పోలీసులు ఎప్పటికప్పుడు ఇ-చలాన్లు విధించడమే కాకుండా ఎఫ్ఐఆర్‌లు కూడా నమోదు చేస్తున్నారు. కేసులు నమోదవుతున్నా లారీలు మాత్రం తిరుగుతూనే ఉన్నాయి. గతేడాది జులై 1వ తేదీ నుంచి ఈ ఏడాది జనవరి 31వ తేదీ వరకు వెస్ట్‌జోన్ ట్రాఫిక్ పరిధిలో నిషేధిత వేళల్లో భారీ వాహనాలు 1504 రోడ్ల పైకి ఎక్కాయి.అంతే కాక డీసీఎం వాహనాలు 2346, రెడీమిక్స్ వెహికల్స్ 614 తిరిగాయి.

- వీరందరికీ పోలీసులు ఇ-చలానాలు జారీ చేశారు. పంజగుట్ట ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో నిషేధిత వేళల్లో డీసీఎం వాహనాలు 347, ఇతర భారీ వాహనాలు 440, ఎస్సార్‌నగర్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో రెడీమిక్స్ వెహికల్స్ 20, డీసీఎంలు 769, భారీ వాహనాలు 399, జూబ్లీహిల్స్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో రెడీమిక్స్ వెహికల్స్ 594, డీసీఎంలు 1,006, ఇతర భారీ వాహనాలు 239, బంజారాహిల్స్ ట్రాఫిక్ పరిధిలో డీసీఎంలు 224, భారీ వాహనాలు 426 రోడ్డెక్కగా వీటన్నింటికీ ఇ-చలానాలు జారీ చేశారు.
- పంజగుట్ట, ఎస్సార్‌నగర్, జూబ్లీహిల్స్, బంజారాహిల్స్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో 21 రెడీమిక్స్ వెహికల్స్, 11 డీసీఎంలు, 13 లారీలపై ఆయా పోలీస్‌స్టేషన్లలో ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారు.ఈ వాహనాలను సీజ్ చేసి ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్లకు తరలిస్తున్నారు.

అనుమతించిన వేళలు ఇవే..

- లారీలు రాత్రి 10 నుంచి ఉదయం 7 గంటల వరకు మాత్రమే ప్రధాన రహదారులపై, అంతర్గత రహదారుల్లోనూ, లింక్ రోడ్లలోనూ తిరగాలి.
- డీసీఎం లాంటి మీడియం గూడ్స్ వెహికల్స్ మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 4 గంటల వరకు, తిరిగి రాత్రి 9 గంటల నుంచి ఉదయం 8 గంటల వరకు తిరగవచ్చు.
- ట్రావెల్ బస్సులు రాత్రి 10 నుంచి ఉదయం 8 గంటల వరకు మాత్రమే తిరగాలి.
- నిషేధిత వేళల్లో తిరిగితే రూ.2000 జరిమానాతో వాహనం సీజ్ చేసి ఎఫ్ఐఆర్ నమోదు చేస్తారు.

ప్రతిరోజూ తనిఖీలు నిర్వహిస్తున్నాం



లారీలు, డీసీఎంలు నిర్దేశించిన వేళల్లో మాత్రమే తిరగాలి. వేళలను ఉల్లంఘించి తిరిగితే వారికి జరిమానా వేసి వాహనం సీజ్ చేసి కేసులు నమోదు చేయిస్తున్నాం. పంజగుట్ట, బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, ఎస్సార్‌నగర్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం వేళల్లో పోలీసులు తనిఖీలు నిర్వహిస్తున్నాం. నిబంధనలు ఉల్లంఘించి తిరిగే వాహనాలను పట్టుకుంటున్నారు. వారికి ఇ-చలాన్లు కూడా జారీ చేస్తున్నాం. తరచూ స్పెషల్ డ్రైవ్‌లు కూడా నిర్వహిస్తున్నాం. కొంత మంది తమకు ఫిర్యాదులు చేస్తుండడంతో వెంటనే వెళ్లి ఆ వాహనాలు సీజ్ చేయడం జరిగింది.

– హరిప్రసాద్ కట్టా, ఏసీపీ ట్రాఫిక్ వెస్ట్‌జోన్

సా-మా హోటల్ వ్యాలెట్ డ్రైవర్‌పై కేసు నమోదు

బంజారాహిల్స్: నిర్లక్ష్యంగా తన కారు నడిపి ఇంజిన్ కాలిపోవడానికి కారకులైన హోటల్ పైన, వ్యాలెట్ డ్రైవర్‌పై చర్యలు తీసుకోవాలంటూ బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు బంజారాహిల్స్ పోలీసులు క్రిమినల్ కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళితే..వెంగళరావునగర్‌లో నివసించే సినీ దర్శకుడు సమీర్ హుస్సేన్ గత నెల 27వ తేదీన ఫిలింనగర్ రోడ్ నెంబర్-1లోని సా-మా ది ఇండియన్ కిచెన్ హోటల్‌కు తన స్నేహితుడితో కలిసి డిన్నర్ చేయడానికి రాత్రి 9 గంటలకు తన స్కోడా కారులో వెళ్లి హోటల్ ముందు పార్కింగ్ చేశాడు. కొద్దిసేపటికే వ్యాలెట్ పార్కింగ్ డ్రైవర్ వచ్చి కారును పార్కింగ్ స్థలంలో పార్క్ చేస్తానంటూ తాళం చెవులు తీసుకున్నాడు. తింటున్న సమయంలోనే రెస్టారెంట్ యజమానురాలు సమ్‌జన వచ్చి మీ కారు కాలిపోతుందని చెప్పడంతో సమీర్ పార్కింగ్ చేసిన స్థలానికి వెళ్లి చూడగా అప్పటికే కారు దగ్ధమైంది. సా-మా హోటల్ నిర్వాహకులు తమ కస్టమర్ల కార్లను కేబీఆర్ పార్కు జీహెచ్ఎంసీ పార్కింగ్ స్థలంలో ప్రతిరోజూ అక్రమంగా పార్కింగ్ చేస్తున్నారు. సమీర్ కారును కూడా అక్కడే పార్కింగ్ చేశారు. కారును నడిపిన వ్యాలెట్ డ్రైవర్ ఆదిత్య మోహన్ జా నిర్లక్ష్యంగా నడపడం వల్ల ఈ ప్రమాదం చోటుచేసుకుందని, దీనిపై హోటల్‌తో పాటు యజమానురాలు సమ్‌జన, వ్యాలెట్ పార్కింగ్ ఏజెన్సీపై చర్యలు తీసుకోవాలంటూ బాధితుడు ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు.

ఏ సమస్య ఉన్నా అందుబాటులో ఉంటా

- మాజీ మంత్రి హరీష్‌రావు..



మాజీ మంత్రి హరీష్‌రావును కలిసిన ముత్యాలు

ఫిలింనగర్: ప్రజలకు ఏ సమస్య వచ్చినా తాను ఎప్పుడూ అందుబాటులో ఉంటానని, అవసరమైతే మీ చెంతకే వస్తానని మాజీ మంత్రి హరీష్ రావు అన్నారు. జూబ్లీహిల్స్ డివిజన్ ఫిలింనగర్‌లోని దుర్గాభవానీనగర్ బీఆర్ఎస్ నాయకుడు ఒర్సు ముత్యాలు ఆదివారం హరీష్‌రావును కలిసి తమ గ్రామంతో పాటు స్థానికంగా తాము ఎదుర్కొంటున్న సమస్యలను ఆయన ముందు ఏకరువు పెట్టారు. సమస్యలపై ఇలాగే పోరాటం చేస్తామని, కార్యకర్తలందరూ ఏమాత్రం వెనక్కి తగ్గకుండా కలసికట్టుగా ఉండాలని సూచించారు. తాను కార్యకర్తలతో పాటు ప్రజలకు కూడా ఎప్పుడూ అందుబాటులో ఉంటానని పేర్కొన్నారు. అవసరమైతే సమస్య ఉన్నచోటికి కూడా కార్యకర్తలతో కలిసి వస్తానని వెల్లడించారు.

7 శాతం రిజర్వేషన్లు కేటాయించాలి

కాచిగూడ: దళితుల్లో అత్యంత వెనుకబడిన 57 ఎంబీఎస్సీ కులాలకు 7శాతం రిజర్వేషన్లు కేటాయించి ఎస్సీ వర్గీకరణ చేపట్టాలని ఎస్సీ 57 ఎంబీఎస్సీ కులాల హక్కుల పోరాట సమితి వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు బైరి వెంకటేశం డిమాండ్ చేశారు. ఆదివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో 57 ఎంబీఎస్సీ కులాల ప్రస్తుత జనాభా 5శాతం ఉండగా దశాబ్దాల క్రితం జనాభా లెక్కలను పరిగణలోకి తీసుకొని ఎస్సీ వర్గీకరణ చేస్తున్నట్టు ప్రభుత్వ వర్గాల ద్వారా తెలిసిందన్నారు. అదే జరిగితే తమ 57 కులాలకు తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. సుప్రీంకోర్టు తీర్పును యధావిధిగా అమలు చేసి ప్రస్తుత జనాభా ఆధారంగా ఎస్సీ వర్గీకరణ చేపట్టాలన్నారు.

ప్రతి విద్యార్థి ఇంగ్లిష్ నేర్చుకోవాలి

ఉస్మానియా యూనివర్సిటీ: ప్రతి విద్యార్థి ఇంగ్లిష్‌ను నేర్చుకోవాలని ఐఆర్ఎస్ ఛైర్మన్, సింగరేణి కాలరీస్ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్.బలరామ్ అన్నారు. ఆదివారం ఓయూ ఇంగ్లీష్ లాంగ్వేజ్ టీచింగ్ సెంటర్ (ఈఎల్‌టీసీ)లో రాష్ట్ర గవర్నర్ నిధులతో ట్రైబల్ విద్యార్థులకు నెలరోజుల పాటు నిర్వహించిన ఉచిత శిక్షణ ముగిసింది.

ఆశయ్యనగర్‌లో గ్యార్వీ షరీఫ్ సేవా కార్యక్రమాలు



ప్రార్థనల్లో పాల్గొన్న సీఎన్ రెడ్డి, ఎంఐఎం నాయకుడు జహంగీర్

రహమత్‌నగర్: పవిత్ర గ్యార్వీ షరీఫ్ మాసాన్ని పురస్కరించుకుని ముస్లిం సోదరులు విరివిగా సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని కార్పొరేటర్ సీఎన్ రెడ్డి కొనియాడారు.ఎస్పీఆర్‌హిల్స్ ఆశయ్యనగర్‌లోఎంఐఎం బస్తీ అధ్యక్షుడు షేక్ జహంగీర్ ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన గ్యార్వీ షరీఫ్ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిధిగా పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.ఈ సందర్భంగా ముస్లిం లను ఉద్దేశ్యించి ఆయన మాట్లాడుతూ ప్రతి వ్యక్తి సేవాగుణం కలిగి ఉండాలని సూచించారు.బస్తీ ఎంఐఎం ప్రధాన కార్యదర్శి ఖాజామొయినొద్దీన్. జాయిం ట్ సెక్రటరి షేక్ మహ్మద్ హుస్సేన్,నాయకులు అబ్దుల్ నబీ.షేక్ సాజిద్,జిలానిలతో పాటు బస్తీ వాసులు పాల్గొన్నారు.

వైభవంగా సరస్వతీ పూజ

సనత్‌నగర్: వసంత పంచమి సందర్భంగా సనాతన ధర్మ బాల సంస్కరణ సమితి ఆధ్వర్యంలో సరస్వతి అష్టోత్తర సహిత పుస్తక పూజ కార్యక్రమం అత్యంత కన్నులపండువగా జరిగింది. మోడల్‌కాలనీ సంస్కృతి కమ్యూనిటీ హాల్‌లో ఆదివారం సాయంత్రం జరిగిన ఈ కార్యక్రమంలో 5-10 తరగతుల విద్యార్థులు సంప్రదాయ దుస్తుల్లో వచ్చి పూజలో పాల్గొన్నారు. మోడల్‌కాలనీ, సుందర్‌నగర్‌లతో పాటు సనత్‌నగర్ పరిసర ప్రాంతాల నుంచి చిన్నారులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. సనాతన ధర్మ బాల సంస్కరణ సమితి ప్రతినిధులు డి.బుచ్చిబాబు, సత్యనారాయణ, హారిక, పావని తదితరులు పూజకు అవసరమైన ఏర్పాట్లు చేశారు.

దేశాన్ని కాపాడే సత్తా కాంగ్రెస్‌కే ఉంది

లిబర్టీ: రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని దేశాన్ని కాపాడే సత్తా ఒక్క కాంగ్రెస్ పార్టీకే ఉందని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మాలమహానాడు జాతీయ ప్రధాన కార్యదర్శి వెన్న సదానందు వెల్లడించారు. ఆదివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీజేపీ సారథ్యంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం అమలు చేస్తున్న విధానాలను వ్యతిరేకిస్తూ జై బాపు జై భీమ్ జై సంవిధాన్ పేరిట కాంగ్రెస్ పార్టీ దేశవ్యాప్తంగా సభలు, సమావేశాలు, సదస్సులు, పాదయాత్రలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. దేశాన్ని రక్షించేందుకు రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు కాంగ్రెస్ పార్టీ ప్రజల్లోకి వెళుతోందన్నారు.

ఇచ్చిన మాట నిలబెట్టుకోవాల్సిందే..

బన్సీలాల్‌పేట్: ఎస్సీ వర్గీకరణ చేస్తామని ఇచ్చిన మాట నిలబెట్టుకోకపోతే రాష్ట్రంలో సీఎం రేవంత్‌రెడ్డి సర్కారు కూలడం ఖాయమని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ హెచ్చరించారు. సికింద్రాబాద్ బన్సీలాల్‌పేట్ డివిజన్ మల్టీపర్పస్ ఫంక్షన్‌హాల్‌లో ఏర్పాటు చేసిన 'వేయిల గొంతులు ...లక్షడప్పుల' జిల్లా సన్నాహాక సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు తీర్పు అనంతరం మొట్టమొదటగా స్పందించి వర్గీకరణ చేస్తామన్న సీఎం రేవంత్‌రెడ్డి 5 నెలలు గడిచినా పట్టించుకోవడం లేదన్నారు. ఎస్సీ వర్గీకరణ అమలుపై ఓపిక నశించిన తర్వాతే ఉద్యమానికి సిద్ధమయ్యామన్నారు. ఈ నెల 7న నగరంలో వేయిల గొంతులు...లక్షడప్పుల కార్యక్రమాన్ని లక్షలాది మందితో మహా సాంస్కృతిక కార్యక్రమంగా నిర్వహించి ప్రపంచానికి చాటుతామన్నారు. జిల్లా ఇన్‌ఛార్జీ టీవీ నర్సింహ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు గోవింద్ నరేష్ మాదిగ, బీసీ నాయకులు పృధ్వీరాజ్ పాల్గొన్నారు.

వైభవంగా అష్టోత్తర శత కలశాభిషేకం



బంజారాహిల్స్: పంజగుట్ట దుర్గా నగర్ కాలనీలోని శ్రీ కళ్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. పూజల్లో భాగంగా ఆదివారం స్వామివారికి అష్టోత్తర శత కలశాలతో ప్రత్యేక అభిషేకం నిర్వహించారు. శ్రీవారి ద్వాత్రింశత్ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆలయంలో విశ్వక్సేనపూజ, పుణ్యాహవచనం, నిత్యం హోమం, ఉత్సవ ప్రధాన హోమం, ఆలయ నవసంధి బలిహరణ, ఆస్థానం, స్వర్ణ పుష్పార్చన, నీరాజన తీర్థగోష్టి వేడుకలు వైభవంగా నిర్వహించారు. స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

ఉత్సాహంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం




ఆత్మీయ సమ్మేళనంలో 2010 బ్యాచ్ టీచర్లు, నాటి విద్యార్థులు

వెంగళరావునగర్: విద్యార్థి దశ నుంచి ఎంత ఎత్తుకు ఎదిగినా చదువు చెప్పిన గురువును మాత్రం మరచిపోకూడదని పలువురు ఉపాధ్యాయులు పేర్కొన్నారు. యూసుఫ్‌గూడ ప్రభుత ఉన్నత పాఠశాలలో 2010లో పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థుల ఆత్మీయ సమేళన కార్యక్రమం ఆదివారం స్కూల్‌లో నిర్వహించారు. ఇందులో భాగంగా నాడు చదువు చెప్పిన టీచర్లను ఘనంగా సత్కరించారు. టీచర్లు తమకు నేర్పిన విద్య ఎంతో ఉపయోగపడ్డాయంటూ విద్యార్థులు ఆనందాన్ని వ్యక్తం చేశారు.

చురుగ్గా ఆస్పత్రి నిర్మాణం

ఏడాదిలోపు అందుబాటులోకి 70 పడకల ఆసుపత్రి

- వేగవంతంగా ఆసుపత్రి నిర్మాణం పనులు
- సీతాఫల్‌మండిలో అధునాతన ఆసుపత్రి



సీతాఫల్‌మండిలో ఆసుపత్రి నిర్మాణం పనులు

సికింద్రాబాద్: సీతాఫల్‌మండిలో అధునాతన ఆసుపత్రి భవన సముదాయ నిర్మాణం పనులు చురుగ్గా సాగుతున్నాయి. రెండు నెలల క్రితం ఈ నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. కొత్త ఆసుపత్రి నిర్మాణం పేరిట గత ప్రభుత్వ హయాంలో పాతభవనాలను నేలమట్టం చేశారు. వివిధ సాంకేతిక సమస్యల ఫలితంగా ఏడాది కాలంగా నిర్మాణం పనులు ముందుకు సాగలేదు.

- సీతాఫల్‌మండిలోని కుట్టివెల్లోడి ప్రభుత్వ ఆసుపత్రి స్థలంలో కొత్తగా 4 అంతస్తుల భవనాన్ని నిర్మించి 70 పడకల ఆసుపత్రిని ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం రూ.12.75 కోట్ల నిధులను మూడేళ్ల క్రితం మంజూరు చేసింది. ఇక్కడ ప్రసూతి సేవలతోపాటు అన్ని రకాల వైద్యపరీక్షలు, శస్త్రచికిత్సలను అందుబాటులోకి తేనున్నారు. ఒక్కో అంతస్తులో ఒక్కో విభాగాన్ని ఏర్పాటు చేసేందుకు ప్రతిపదనలు సిద్ధం చేశారు.

ఏడాదిలోగా అందుబాటులోకి ..

సీతాఫల్‌మండిలో 70 పడకల ఆసుపత్రి నుంచి వైద్య సేవలను ఏడాదిలోగా అందుబాటులోకి తెచ్చేందుకు వైద్యశాఖ అధికారులు కార్యాచరణ సిద్ధం చేసుకున్నారు. సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావుగౌడ్ డిప్యూటీ స్పీకర్ హోదాలో కొనసాగిన సమయంలో ఆసుపత్రి నిర్మాణం కోసం రాష్ట్ర ప్రభుత్వం నుంచి రూ.12.75 కోట్ల నిధులు మంజూరు చేయించారు. ఏడాది క్రితమే పనులు ప్రారంభమైనా అర్థాంతరంగా ఆగిపోవడంతో రోగులు అసౌకర్యానికి గురయ్యారు.

ఒకే ప్రాంగణం నుంచి సేవలు..

సీతాఫల్‌మండిలో ఆసుపత్రి నిర్మాణం పూర్తయిన వెంటనే నాలుగు విభాగాల వైద్య సేవలు ఇక్కడి నుంచే అందించనున్నారు. ప్రస్తుతం మెటర్నిటీ సేవలు మెట్టుగూడలోని ఆర్టీసీ భవనంలో, ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం పక్క భవనంలో సాధారణ వైద్య సేవలు, గాంధీ ఆసుపత్రి నుంచి టీబీ, లెప్రసీ వైద్య సేవలు కొనసాగుతున్నాయి. వీటన్నింటిని ఒకే భవనంలోకి తేవడంతోపాటుగా ఓపీ, అత్యవసర విభాగం, ఫార్మసీ కేంద్రాల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు.

నాటి కలెక్టర్ పేరుతో..

కుట్టివెల్లోడి అనగానే ప్రసూతి ఆసుపత్రి పేరు అని ఈ ప్రాంత ప్రజలు చెబుతారు. కుట్టివెల్లోడి అంటే ఒకప్పటి జిల్లా కలెక్టర్ పేరు. 1962 ప్రాంతంలో హైదరాబాద్ జిల్లా కలెక్టర్‌గా కుట్టివెల్లోడి అనే మహిళా అధికారి పనిచేశారు. ఆ కాలంలో ఆమె నిర్ణయంతో ఇక్కడ సీతాఫల్ మండికి ఆసుపత్రి వచ్చి గర్భిణీలకు వైద్యం, ప్రసూతి సేవలు అందుబాటులోకి వచ్చాయి. దీంతో ఇక్కడి ప్రజలు ఆమె పేరును నామకరణం చేసుకున్నారు.

పర్యాటకుల సందడి



గోల్కొండ: గోల్కొండ కోట ఆదివారం పర్యాటకులతో సరికొత్త శోభను సంతరించుకుంది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన పర్యాటకులు కోటలోని నగీనా బాగ్, ఆయుధాగారం, రాణీమహల్, కోటలోని వివిధ ప్రాంతాల్లో భద్రపరచబడిన ఫిరంగులను ఎంతో ఆసక్తిగా తిలకించారు. మరో వైపు విదేశీ పర్యాటకులు సైతం గోల్కొండ కోటలో కలియతిరుగుతూ ఫొటోలు తీస్తూ కనిపించారు. ఇదిలా ఉండగా నగీనాబాగ్ గార్డెన్స్ చిన్నారుల ఆటపాటలకు వేదిక కాగా యువ జంటలకు క్లాపింగ్ పోర్టికోలోని ఫిరంగులు, రామదాసు చరసాల తదితర ప్రాంతాలు సెల్ఫీలు తీసుకుంటూ సందడిగా గడిపారు.

సాక్షి
సోమవారం । 3 । ఫిబ్రవరి । 2025

అవాస్తవాలు నిర్మించిన కేసీఆర్

● ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరామ్



కాళేశ్వరం ఫియాస్కో ఎ టేల్ ఆఫ్ గ్రీడ్ అండ్ నెగ్లిజెన్స్ పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రొఫెసర్ కోదండరామ్, కె.శ్రీనివాస్‌రెడ్డి

పంజగుట్ట: కాళేశ్వరం కట్టతో పాటు కేసీఆర్ నిర్మించిన ఒక మిథ్యా సౌధాన్ని కూలగొట్టి వాస్తవమనేది మన కళ్లముందుకు తీసుకువచ్చింది 'కాళేశ్వరం ఫియాస్కో ఎ టేల్ ఆఫ్ గ్రీడ్ అండ్ నెగ్లిజెన్స్' పుస్తకమని ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరామ్ అన్నారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో సీనియర్ జర్నలిస్టు రేమిల్ల అవధాని రచించిన 'కాళేశ్వరం ఫియాస్కో ఎ టేల్ ఆఫ్ గ్రీడ్ అండ్ నెగ్లిజెన్స్' పుస్తకాన్ని తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డి ఆదివారం ఆవిష్కరించారు. ముఖ్య అతిథిగా హాజరైన ప్రొఫెసర్ కోదండరామ్ మాట్లాడుతూ.. కాళేశ్వరం కట్టతో పాటు అది ఎంతో అద్భుతమైన ప్రాజెక్టు అంటూ కేసీఆర్ అవాస్తవాలు కూడా నిర్మించారని పేర్కొన్నారు. బ్యారేజీగా కట్టాల్సిన దాన్ని డ్యామ్‌గా మార్చారని, దానికి సరైన డిజైన్లు చేయలేదన్నారు. సరైన పరిశోధనలు చేయకుండానే డ్యామ్ నిర్మించడం వల్ల ఇప్పుడు అనేక సమస్యలు వస్తున్నాయన్నారు. కే.శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. కాళేశ్వరం గురించి మనం ఎంతో మంచి ఆశించామని, అనుకున్న మంచి జరగకపోగా ప్రజల మీద భారం పడిందన్నారు. ప్రాజెక్టులో శాస్త్రీయత, సాంకేతికత లోపించిందని అన్ని రిపోర్టులు చూస్తుంటే అర్థం అవుతుందన్నారు. ఒక జర్నలిస్టుగా, ఒక పరిశోధకుడిగా, ఒక ప్రత్యక్ష సాక్షిగా అవధాని పుస్తకం రూపొందించారని పేర్కొన్నారు. ప్రొఫెసర్ జయధీర్ తిరుమలరావు పుస్తకాన్ని పరిచయం చేయగా, రచయిత అవధాని పాల్గొన్నారు.

'మహా' దాహార్తి తీర్చేందుకు..

ఇక మహా నగరానికి మరో 20 టీఎంసీల నీరు

- గోదావరి జలాల తరలింపునకు టెండర్లు
- రెండు, మూడో దశ పనులకు రూ.7,360 కోట్లు
- ఈ నెల 15లోపు టెండర్ ప్రక్రియ ప్రారంభం



సాక్షి, సిటీబ్యూరో: మహానగర తాగునీటి అవసరాల కోసం మరో 20 టీఎంసీలను గోదావరి జలాలను మల్లన్న సాగర్ రిజర్వాయర్ నుంచి తరలించేందుకు టెండర్ ప్రక్రియకు రంగం సిద్ధమవుతోంది. తాజాగా రాష్ట్ర ప్రభుత్వం గోదావరి తాగునీటి సరఫరా పథకం 2, 3 దశ పనులు చేపట్టేందుకు సుమారు రూ.7,360 కోట్లను మంజూరు చేసింది. దీంతో ఈ నెల 15వ తేదీలోగా టెండర్లను ఆహ్వానించేందుకు జలమండలి కసరత్తు ప్రారంభించింది. గోదావరి జలాల్లో హైదరాబాద్ నగర తాగునీటి అవసరాలకు 30 టీఎంసీల నీటి కేటాయింపులు ఉండగా ఇప్పటికే గోదావరి మొదటి దశ కింద శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి 10 టీఎంసీల నీటిని తరలిస్తున్నారు. తాజాగా రెండు, మూడో దశ కింద మిగిలిన 20 టీఎంసీలు తరలించేందుకు ప్రభుత్వ ఉత్తర్వులు జారీ చేసింది. నగర ప్రాజెక్టును హైబ్రీడ్ యాన్యూటీ మోడల్(హ్యామ్) చేపట్టనున్నారు. మొత్తం వ్యయంలో ప్రభుత్వ వాటా 40 శాతం, నిర్మాణ సంస్థ వాటా 60 శాతం భరించనున్నారు. ప్రభుత్వం తమ వాటా నిధులను హడ్కో వద్ద రుణం తీసుకోనుంది. ప్రాజెక్టు 24 నెలల్లో పూర్తిచేసే విధంగా కసరత్తు చేస్తున్నారు.

రెండు వరసల పైప్‌లైన్లతో..

కాళేశ్వరం ఎత్తిపోతల్లో భాగంగా నిర్మించిన మల్లన్న సాగర్ రిజర్వాయర్ నుంచి గోదావరి జలాలను ఘన్‌పూర్ మీదుగా ఉస్మాన్‌సాగర్ వరకు తరలించనున్నారు. మొత్తం 20 టీఎంసీల్లో నగర తాగునీటి అవసరాలకు 15 టీఎంసీలు, మిగిలిన 5 టీఎంసీలను ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్ జలాశయాల పునరుజ్జీవానికి వినియోగించనున్నారు. రెండు పైప్‌లైన్ల ద్వారా 3000 ఎంఎం డయాతో 50 కిలోమీటర్లు, 2,200 ఎంఎం డయాతో 58 కిలో మీటర్ల వరకు పైప్‌లైన్ పనులు చేపట్టనున్నారు. ఘన్‌పూర్ వద్ద సుమారు 1170 ఎంఎల్‌డీల నీటిశుద్ధి ప్లాంట్ నిర్మించనున్నారు. ఘన్‌పూర్ నుంచి ముత్తంగి జంక్షన్ వరకు 2400 ఎంఎం పైప్‌లైన్ 40 కిలోమీటర్ల వరకు, దాని వెంట 3000 ఎంఎం డయా రింగ్ మెయిన్‌ను కలుపుతూ పైప్‌లైన్ నిర్మాణం చేపడతారు. ఉస్మాన్‌సాగర్‌లో 120 ఎంఎల్‌డీ, హిమాయత్ సాగర్‌లో 70 ఎంఎల్‌డీ వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌ను నిర్మిస్తారు.

సూఫీ బసంత్ ఉత్సవాల్లో అమెరికా కాన్సుల్ జనరల్



శాలిబండ: పాతబస్తీ పత్తర్‌గట్టి ఉర్దూ గల్లీలోని హజ్రత్ షేర్ జీ అలీ రహమతుల్లా ఉర్దూ షరీఫ్ దర్గాలో సూఫీ బసంత్ ఉత్సవాలను ఆదివారం నిర్వహించారు. బసంత్ పంచమి ఉత్సవాన్ని ఒక సూఫీ సంత్ దర్గాలో జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోందని దర్గా నిర్వాహకులు ముజఫర్ అలీ అన్నారు. ఈ ఉత్సవం సమాజంలోని అన్ని మతాల మధ్య సమగ్రత, జాతీయ ఐక్యతను ప్రోత్సహించడానికి ఒక వేదికగా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో అమెరికా కాన్సుల్ జనరల్ జెనిఫర్ ఎ.లార్సన్, టర్కీ కాన్సుల్ జనరల్ ఓసాన్ యాల్మాన్ ఓకాన్, బ్రిటీష్ డిప్యూటీ హై కమిషనర్ గారెత్ విన్ ఓవెన్ పాల్గొన్నారు.

యువతి అదృశ్యం..

సుభాష్‌నగర్: ఓ యువతి అదృశ్యమైన సంఘటన సూరారం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. సాయిబాబానగర్‌లోని ఆర్‌వీ మోడల్ స్కూల్ సమీపంలో నివాసం ఉంటున్న శంకర్ కుమార్తె బాల అక్షయ(19) ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతోంది. గత నెల 30న ఇంట్లో నుంచి బయటికి వెళ్లిన ఆమె తిరిగి రాలేదు. దీంతో ఆందోళనకు గురైన కుటుంబ సభ్యులు ఆమె కోసం గాలించినా ఆచూకీ తెలియరాలేదు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పెద్దమ్మ గుడిలో రథోత్సవాలు ప్రారంభం



రథోత్సవ పూజలు నిర్వహిస్తున్న పెద్దమ్మ గుడి చైర్మన్ పి.విష్ణువర్ధన్‌రెడ్డి

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ శ్రీపెద్దమ్మ ఆలయంలో 31వ వార్షిక, రథోత్సవ మహోత్సవాలు ఆదివారం అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. పెద్దమ్మ తల్లిని దర్శించుకునేందుకు తెల్లవారుజాము నుంచే భక్తులు బారులుదీరారు. తెల్లవారుజామున 3 గంటలకు పెద్దమ్మ తల్లికి అభిషేకం అనంతరం భక్తులను దర్శనానికి అనుమతించారు. ఆలయ చైర్మన పి.విష్ణువర్ధన్‌రెడ్డి రథోత్సవ పూజలు నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా విఘ్నేశ్వర పూజ, కంకణ దీక్షాధారణం, యాగశాల ప్రవేశం, ధ్వజారోహణం, నవగ్రహ కలశ స్థాపనలు నిర్వహించారు. రాత్రి 8 గంటలకు పెద్దమ్మ తల్లి ఉత్సవమూర్తి పల్లకీ సేవ మహోత్సవం కన్నులపండువగా జరిగింది. వేడుకల్లో భాగంగా మంగళవారం సాయంత్రం 6 గంటలకు పెద్దమ్మ తల్లి ఉత్సవమూర్తి రథం ఊరేగింపు నిర్వహించనున్నారు. రథోత్సవాల సందర్భంగా ఆలయాన్ని సుందరంగా ముస్తాబు చేశారు. సుమారు 60 వేల మంది భక్తులు ఆదివారం అమ్మవారిని దర్శించుకున్నారు. జూబ్లీహిల్స్ పరిసరాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి.

సీఎం రేవంత్‌రెడ్డిపై కుట్ర చేస్తున్న ఎమ్మార్పీఎస్


● ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ డాక్టర్ పిడమర్తి రవి



సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న పిడమర్తి రవి తదితరులు

గన్‌ఫౌండ్రీ: ఆంధ్రప్రదేశ్ సీఎం చంద్రబాబు నాయుడిపై ప్రేమ చూపిస్తూ తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డిపై ఎమ్మార్పీఎస్ కుట్ర చేస్తోందని ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ డాక్టర్ పిడమర్తి రవి అన్నారు. బషీర్‌బాగ్ చౌరస్తాలో మాదిగ జేఏసీ, అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో మాదిగల న్యాయమైన డిమాండ్ ఎస్సీ వర్గీకరణ కోసం ప్రత్యేక అసెంబ్లీ సమావేశాలు ఏర్పాటు చేస్తామని ప్రకటించడంపై హర్షం వ్యక్తం చేస్తూ సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి ఆదివారం పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణపై ఇతర రాష్ట్రాల్లో ఎలాంటి కార్యచరణ తీసుకోని ముఖ్యమంత్రులను పట్టించుకోకుండా మన రాష్ట్రంలో ఎమ్మార్పీఎస్ ప్రభుత్వ వ్యతిరేక కార్యక్రమాలు చేయడంలో కుట్ర దాగి ఉందని ఆరోపించారు. ఎస్సీ వర్గీకరణ చేయడం ఇష్టంలేని బీజేపీ, మంద కృష్ణమాదిగ వైఖరిని రాష్ట్ర ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. మంద కృష్ణమాదిగ ఎన్ని కుట్రలు చేసినా మాదిగల మద్దతు సీఎం రేవంత్‌రెడ్డికి ఉంటుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు డాక్టర్ మీసాల మల్లేశం, రాష్ట్ర కన్వీనర్ నర్సింహ మాదిగ, యూత్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు రింగు రాంబాబు, బీఎస్ఎఫ్ రాష్ట్ర కన్వీనర్ బి.సురేష్, మహిళా విభాగం అధ్యక్షురాలు వరలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

అలరించిన రామాయణ కల్పవృక్షం



మాదాపూర్: మాదాపూర్‌లోని సీసీఆర్టీలో నిర్వహిస్తున్న రామాయణ కల్పవృక్షం ఆదివారంతో ముగిసింది. ముగింపు కార్యక్రమాల్లో భాగంగా పలు వర్క్‌షాప్‌లను నిర్వహించారు. రామాయణంలోని అంశాలు ప్రస్తుత పరిస్థితులకు ఎలా వర్తిస్తాయో ప్రముఖులు వివరించారు. పద్మశ్రీ డాక్టర్ డాక్టర్ ఆనంద్ శంకర్ జయంత్ రూపకల్పన చేసిన నాట్యరంభ, శంకరానంద కళాక్షేత్రం ప్రదర్శించి సందర్శకులను ఆకట్టుకున్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

సాక్షి, సిటీ బ్యూరో: పబ్లిక్ హెల్త్ అండ్ మున్సిపల్ ఇంజినీరింగ్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఆదివారం జరిగిన ఎన్నికల్లో జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలోని ఘన వ్యర్థాల నిర్వహణ విభాగంలో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా పనిచేస్తున్న శ్రీనివాసరెడ్డి అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా కుత్బుల్లాపూర్ సర్కిల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా పనిచేస్తున్న లక్ష్మీ గణేష్ ఎన్నికయ్యారు. ఇతర అన్ని పోస్టుల్లోనూ వీరి ప్యానల్ సభ్యులే గెలుపొందారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ ఇంజినీరింగ్ సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. వారికి అవసరమైన శిక్షణ ఇచ్చి అన్ని విధాల అందుబాటులో ఉంటామని పేర్కొన్నారు.



నగరంలో నేడు

- నెక్లెస్ రోడ్డులోని పీపుల్స్ ప్లాజాలో ఉద్యాన వన శాఖ ఆధ్వర్యంలో నర్సరీ ఉత్సవ మేళా ఉదయం 9 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో సాయంత్రం 4 నుంచి రాత్రి 9 గంటల వరకు ఇండస్ట్రియల్ ఎగ్జిబిషన్ అందుబాటులో ఉంటుంది.
- జూబ్లీహిల్స్ రోడ్ నెం.45లోని అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ టీ–శాట్ నెట్‌వర్క్ ప్రాంగణంలో ఉన్న వీ హబ్‌ను గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ మధ్యాహ్నం 12.30 నుంచి 1.30గంట వరకు సందర్శించనున్నారు.
- అపోలో కేన్సర్ సెంటర్, క్యూర్ ఫౌండేషన్ల ఆధ్వర్యంలో జూబ్లీహిల్స్‌లోని అపోలో కేన్సర్ హాస్పిటల్‌లో ఫ్రీ సర్వైకల్ కేన్సర్ వ్యాక్సినేషన్ ప్రోగ్రామ్ ఉదయం 10.45గంటలకు జరుగుతుంది.

గ్రేటర్ సిటీ నలుమూలలా ప్రతిరోజూ నిర్వహించే ఈవెంట్ల వివరాలను ఒక రోజు ముందే మాకు పంపండి. 'సాక్షి' ఎంగేజ్‌మెంట్ కాలం (నగరంలో నేడు)లో ప్రచురిస్తాం. మీ ఈవెంట్ల వివరాలను sakshiupdates123@gmail.com కు మెయిల్ చేయగలరు.

మెడికల్ టూరిజానికి కట్టుబడి ఉన్న టీకన్సల్ట్

టీకన్సల్ట్ వ్యవస్థాపకుడు సందీప్ మక్తాల వెల్లడి

రాయదుర్గం: రాష్ట్రంలో మెడికల్ టూరిజమ్, ఆర్థిక వృద్ధికి టీకన్సల్ట్ కట్టుబడి ఉందని టీకన్సల్ట్ వ్యవస్థాపకుడు సందీప్ మక్తాల వెల్లడించారు. టీకన్సల్ట్ ఇంటిగ్రేటెడ్ హెల్త్ నెట్‌వర్క్ సహకారంతో టీహబ్‌లో 'కొలాబ్రేషన్ కాన్‌క్లేవ్–2025' కార్యక్రమం ముగిసింది. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. సంప్రదాయ వైద్య పద్ధతులను ప్రపంచవ్యాప్తంగా ప్రోత్సహించడం ద్వారా మెడికల్ టూరిజమ్, దేశ ఆర్థిక వ్యవస్థ అభివృద్ధికి తోడ్పడతాయన్నారు. సంప్రదాయ వైద్య నిపుణులతో కలిసి పనిచేందుకు దేశవ్యాప్తంగా పర్యటిస్తానన్నారు. వ్యక్తిగతంగా వైద్య సేవలు అందించే నిపుణులు సమగ్ర ఆరోగ్య సంరక్షణ కోసం ఐక్యంగా పనిచేయాలన్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్కృతిలో కొత్త అధ్యాయం నెలకొంటోందని, 63 దేశాల్లో కొనసాగుతున్న టీకన్సల్ట్ ఆధ్వర్యంలో ఆధునిక వైద్యం, సంప్రదాయ వైద్య విధానాలను కలిపే ఒక సమగ్ర ఆరోగ్య వ్యవస్థను సృష్టించడంలో కీలక మైలురాయిగా నిలుస్తుందన్నారు. ప్రముఖ ఆస్పత్రులు, ఔషధ పరిశ్రమ నాయకులు, సమగ్ర ఆరోగ్య సంరక్షణ ఉద్యమానికి మద్దతు ఉందన్నారు. ఆధునిక వైద్యం, ఆయుర్వేదం, నేచురోపతి, హోమియోపతి ఇతర సంప్రదాయ వైద్య విధానాలను సమగ్రంగా అందించే లక్ష్యంతో టీకన్సల్ట్ తన ప్రస్థానం కొనసాగిస్తుందన్నారు. కార్యక్రమంలో టీకన్సల్ట్ ప్రతినిధులు పాల్గొన్నారు.

బసవతారకం కేన్సర్ ఆస్పత్రిలో ముగిసిన వర్క్‌షాప్



యూరో ఆంకాలజీలో రోబోటిక్ సర్జికల్ సిస్టం వినియోగంపై వర్క్‌షాప్‌లో నిపుణులు

బంజారాహిల్స్: బసవతారకం ఇండో అమెరికన్ కేన్సర్ హాస్పిటల్ అండ్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్‌లోని యూరో ఆంకాలజీ విభాగం ఆధ్వర్యంలో రోబోటిక్ సర్జికల్ సిస్టం వినియోగంపై రెండు రోజుల పాటు జరిగిన వర్క్‌షాప్ ఆదివారం ముగిసింది. ఈ వర్క్‌షాప్‌లో హాస్పిటల్ సర్జికల్ ఆంకాలజీ విభాగాధిపతి డాక్టర్ టీఎస్‌రావు మార్గదర్శకత్వంలో యూరో ఆంకాలజీ విభాగాధిపతి రాకేష్‌శర్మ నేతృత్వంలోని సుశిక్షితులైన శస్త్ర చికిత్స నిపుణులు అత్యాధునిక రోబోటిక్ సర్జికల్ సిస్టంను ఉపయోగించి ఎలాంటి సంక్లిష్టమైన శస్త్ర చికిత్సలు చేయవచ్చో లైవ్‌లో ప్రదర్శిస్తూ శిక్షణ ఇచ్చారు. అలాగే రోబోటిక్ సర్జికల్ వ్యవస్థను ఉపయోగించి ప్రోస్టేటెక్టమీల నుంచి లాప్రోస్కోపిక్ సిస్టెక్టమీలతో పాటు ఖచ్చితత్వంతో కూడిన నెఫ్రెక్టమీ వరకు పలు రకాల శస్త్ర చికిత్సల గురించి వివరించారు. కార్యక్రమంలో బోర్డు సభ్యులు డాక్టర్ రాఘవరావు పోలవరపు, సీఈఓ డాక్టర్ కృష్ణయ్య, మెడికల్ డైరెక్టర్ టీఎస్ రావు, అకడమిక్స్ అసోసియేట్ డైరెక్టర్ కల్పనా రఘునాథ్, మెడికల్ సూపరింటెండెంట్ ఫణి కోటేశ్వరరావు పాల్గొన్నారు.

7 నుంచి మహిళా భక్త సమ్మేళనం



ప్రవ్రాజిక భవాని ప్రాణ మాతాజీ

సాక్షి, సిటీబ్యూరో: గుంటూరు రామకృష్ణ శారదా మిషన్ ఆధ్వర్యంలో ఈ నెల 7 నుంచి 9వ తేదీ వరకు మూడు రోజుల పాటు కన్హా శాంతి వనంలో నిర్వహించే మా శారదా మహిళా భక్త సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని ప్రవ్రాజిక భవాని ప్రాణ మాతాజీ ఒక ప్రకటనలో కోరారు. ఆదర్శ జీవితాన్ని తీర్చిదిద్దేందుకే శారదా మాత అవతరించారని ఆమె తెలిపారు. శారదమ్మ బాటలో ఆధునిక మహిళలు పయనించేలా ప్రేరేపించే సంకల్పంతో దక్షిణ భారత రెండవ మహిళా భక్త సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ మహిళా భక్త సమ్మేళనంలో 7న యువ సమ్మేళనం జరుగుతుందన్నారు. ముఖ్య అతిథిగా ఐపీఎస్ అధికారిని సుమతి పాల్గొంటారని తెలిపారు. విద్యార్థినుల్లో దేశభక్తి, ఆధ్యాత్మిక జ్ఞానాన్ని ప్రేరేపించే అంశాలపై ప్రసంగాలు, చర్చలు జరుగుతాయన్నారు. 8, 9 తేదీల్లో కోల్‌కతా రామకృష్ణ శారదా మిషన్ ప్రధాన కార్యదర్శి ప్రవ్రాజిక అతంద్ర ప్రాణ మాతాజీ, గౌరవ అతిథిగా ఐపీఎస్ అధికారిణి సౌమ్యామిశ్రా హాజరవుతారని తెలిపారు. భక్త సమ్మేళనంలో మా శారదా గుణగణాలపై మాతాజీల ప్రసంగాలు, గ్రూప్ చర్చలు, ఆధ్యాత్మిక ప్రసంగాలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయన్నారు.

ప్రభుత్వ ఉద్యోగులకు అండగా ప్రభుత్వం

● మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ ఉబెదుల్లా కొత్వాల్



ఆల్‌మేవా డైరీ ఆవిష్కరిస్తున్న ఉద్యోగస్తులు

సాక్షి, సిటీబ్యూరో: ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందని మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్ అన్నారు. హజ్‌హౌస్‌లో ఆదివారం నిర్వహించిన తెలంగాణ ఆల్ మేవా డైరీ–2025 ఆవిష్కరణ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మైనార్టీ ఉద్యోగస్తులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానన్నారు. సమావేశంలో ఆల్ మేవా రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు షేక్ ఫరూక్ హుస్సేన్, డాక్టర్ వహీద్ షాహ్ ఖాద్రి, కోశాధికారి ఎండీ రషీద్, పీసీసీ అధికార ప్రతినిధి జహీర్ అక్తర్, షబానాబేగం, డాక్టర్ ఆమేనా బేగం, సాజీద ఖాన్, ఆరిఫ్, అయూబ్, ముజీబ్, అశ్రఫ్ తదితరులు పాల్గొన్నారు.

లక్ష డప్పుల్లో.. మా డప్పు మోగుతుంది



మాట్లాడుతున్న వంగపల్లి శ్రీనివాస్ మాదిగ

- వేల గొంతుల్లో మా గొంతు వినిపిస్తుంది
- మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ మాదిగ

కాచిగూడ: ఎస్సీ వర్గీకరణ కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చేందుకు మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు, పద్మశ్రీ మంద కృష్ణ ఆధ్వర్యంలో ఈ నెల 7వ తేదీన నిర్వహించనున్న 'లక్ష డప్పులు–వేల గొంతులు' కార్యక్రమానికి సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్లు మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ మాదిగ ప్రకటించారు. బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. దారులు వేరైనా లక్ష్యం ఒక్కటే అనే నినాదం మేరకు విభేదాలను పక్కనపెట్టి వర్గీకరణకు అందరం కలిసి పనిచేస్తామని తెలిపారు. ఈ నెల 6వ తేదీన తాము ఇందిరాపార్క్ వద్ద చేపట్టిన దీక్షా కార్యక్రమాన్ని విరమించుకుంటున్నట్లు ప్రకటించారు. ఈ నెల 7న లక్ష డప్పుల్లో మా డప్పు మోగుతుందని.. వేల గొంతుల్లో మా గొంతు సైతం వినిపిస్తుందని తెలియజేశారు. ఎమ్మార్పీఎస్ నేతలు రమేష్ మాదిగ, యాకయ్య మాదిగ, కృష్ణమాదిగ, యాదన్న మాదిగ, లక్ష్మీ, అంజన్న, శాంతి కిరణ్, ఎంఎస్ఎఫ్ నేత చందు, తిరుమలేష్, నరేందర్, రాజేష్ పాల్గొన్నారు.

10న మహా ధర్నా

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: కార్పొరేట్ అనుకూల కేంద్ర బడ్జెట్‌కు వ్యతిరేకంగా తెలంగాణ ప్రజా సంఘాల పోరాట వేదిక రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో 10వ తేదీన హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద మహాధర్నా నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర కన్వీనర్ ఎస్ వీరయ్య తెలిపారు. సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గత బడ్జెట్ కంటే సుమారు రూ.3 లక్షల కోట్లు ఈ బడ్జెట్‌లో అదనంగా కేటాయించినా జీడీపీ లోటు 4.4శాతంగా చూపడం ఆర్థిక వ్యవస్థపై ప్రతికూల ప్రభావం చూపుతుందని అన్నారు. సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్, తెలంగాణ రైతు సంఘం కార్యదర్శి టి.సాగర్, వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శి ఆర్.వెంకట్రాములు, శ్రీరాంనాయక్, ధర్మానాయక్, రమ పాల్గొన్నారు.

అమ్మ రమాబాయి అంబేడ్కర్ అవార్డుకు రామస్వామి భారతి



భాపన్‌పల్లి రామస్వామి, భారతి

లక్డీకాపూల్: అమ్మ రమాబాయి అంబేద్కర్ అవార్డుకు భాపన్‌పల్లి రామస్వామి, భారతి ఎంపికైనట్లు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహ పరిరక్షణ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు గుడిమల వినోద్ కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 'అమ్మ రమాబాయి అంబేద్కర్' 127 జయంతిని ప్రతి సంవత్సరం ఘనంగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా దళితుల అభ్యున్నతికి కృషి చేసిన మహిళను మాత రమాబాయి అంబేద్కర్ అవార్డుతో గౌరవిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ నెల 7వ తేదీన లోయర్ ట్యాంక్‌బండ్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి అవార్డు ప్రదానం చేయనున్నట్లు తెలిపారు.

నిమ్స్‌లో కేన్సర్ రోగులకు లైబ్రరీ

– 4న ప్రారంభించనున్న సీపీ సీవీ ఆనంద్

లక్డీకాపూల్: నిమ్స్‌లో చికిత్స పొందుతున్న కేన్సర్ రోగుల సౌలభ్యం కోసం గ్రంథాలయాన్ని అందుబాటులోకి తీసుకురానున్నారు. ఆకర్షణ సతీష్ తన 19వ లైబ్రరీని నిమ్స్‌లోని రేడియేషన్ అంకాలజీ కేన్సర్ వార్డులో ఏర్పాటు చేయనున్నారు. ప్రపంచ కేన్సర్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 4వ తేదీన ఈ లైబ్రరీని నగర పోలీస్ కమిషనర్ సీవీ.ఆనంద్ ప్రారంభించి కేన్సర్ రోగులకు అంకితం చేయనున్నారు. కార్యక్రమంలో నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ నగరి బీరప్ప పాల్గొంటారని నిర్వాహకులు సతీష్ తెలిపారు. ఈ లైబ్రరీలో 550 తెలుగు కథా పుస్తకాలు, ప్రేరణాత్మక పుస్తకాలను అందుబాటులోకి తీసుకురానున్నట్లు తెలిపారు. ఈ పుస్తకాలు రోగులకు ఓదార్పు, ప్రేరణ అందిస్తాయన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. ఇప్పటికే వివిధ ప్రాంతాల్లో ఆకర్షణ 18 లైబ్రరీలను ఏర్పాటు చేశారు.

శ్రీరామనగర్‌లో సమతా కుంభ్ 2025

9 నుంచి శ్రీరామానుజాచార్య తృతీయ బ్రహ్మోత్సవం

లక్డీకాపూల్: సమతామూర్తి శ్రీరామానుజాచార్య స్వామి మూడవ ఏడాది వార్షికోత్సవాన్ని సమతా కుంభ్–2025గా నిర్వహించనున్నారు. శంషాబాద్ ముచ్చింతల్‌లోని శ్రీరామనగర్‌లో ఈ ఉత్సవాలు ఈ నెల 9 నుంచి 19వ తేదీ వరకు కొనసాగుతాయి. త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామానుజ జీయర్ స్వామి వారి ప్రత్యక్ష పర్యవేక్షణలో స్టాచ్యూ ఆఫ్ ఈక్వాలిటీ వేదికగా శ్రీరామానుజాచార్యకు సుప్రభాత సేవతో ఉత్సవాలు మొదలవుతాయి. ఈ నెల 10న శ్రీరామ అష్టోత్తర శతనామార్చన, 11న నారసింహ అష్టోత్తర శతనామార్చన, 14న శ్రీలక్ష్మీ అష్టోత్తర శతనామార్చన, గద్యత్రయ పారాయణం, 15న శాంతి కళ్యాణ మహోత్సవం, 16న వసంతోత్సవం, తెప్పోత్సవం, 17న డోలోత్సవం, సామూహిక ఉపనయనం, 18న రథోత్సవం, చక్రస్నానం, 19న శ్రీపుష్పయాగం, ద్వాదశారాధన, దేవతోద్వాసన, మహా పూర్ణాహుతి వంటి ప్రత్యేక కార్యక్రమాలు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు.

స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాలి



అభివాదం చేస్తున్న బీసీ సంఘాల నాయకులు

పంజగుట్ట: సంపూర్ణంగా కుల సర్వే పూర్తిచేసి స్థానిక సంస్థల్లో 42 శాతం బీసీలకు రిజర్వేషన్లు కల్పించిన తర్వాతే ఎన్నికలకు వెళ్లాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో బీసీ కుల సంఘాల ఐక్య వేదిక అధ్యక్షుడు కాటం నర్సింహ యాదవ్ అధ్యక్షతన ఆదివారం రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర బీసీ కమిషన్ మాజీ చైర్మన్ డాక్టర్ వకుళాభరణం కృష్ణమోహన్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వానికి బీసీల అభివృద్ధి, సంక్షేమం, రాజకీయ ప్రాతినిధ్యం పెంపుపై చిత్తశుద్ధి ఉంటే కామారెడ్డి డిక్లరేషన్‌లో ఇచ్చిన అన్ని హామీలు అమలుచేయాలని డిమాండ్ చేశారు. అన్ని ప్రభుత్వ నామినేటెడ్ పోస్టుల్లో చైర్మన్, డైరెక్టర్ పోస్టుల్లో 50 శాతం బీసీలకు అవకాశం ఇవ్వాలన్నారు. కాటం నర్సింహ యాదవ్ మాట్లాడుతూ.. బీసీలను అన్ని సందర్భాల్లో ఓట్లువేసే యంత్రాలుగా పరిగణిస్తున్నారని విమర్శించారు. బీసీ దళ్ అధ్యక్షుడు దుండ్ర కుమారస్వామి, బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు జి.ఆనంద్ గౌడ్, రాష్ట్ర సర్పంచుల ఫోరం అధికార ప్రతినిధి సురేందర్ ముదిరాజ్, వేదిక కార్యనిర్వాహక అధ్యక్షుడు చారి, ప్రొఫెసర్ బాలప్రకాష్, విశ్వనాథ్ ముదిరాజ్, ఎ.వెంకటేష్, బి.రాజేష్ యాదవ్ పాల్గొన్నారు.


సాక్షి సిటీ ప్లస్
11
హైదరాబాద్, సోమవారం, 3, ఫిబ్రవరి, 2025



'సార్.. నా రాత ఒకప్పుడు ముత్యాలు పేర్చినట్టుండేది. ఇప్పుడు కోడి కెలికినట్టు ఉంటోంది'.. 'మేడమ్.. ప్లీజ్, అర్జెంట్‌గా నా రైటింగ్ స్టైల్ బాగవ్వాలి.. లేకపోతే చెక్ బుక్ మీద సంతకం కూడా సరిగా రావడం లేదు'.. 'అమ్మో.. నాలుగు పేజీలు రాయాలట.. నా వల్ల కావడం లేదు. ఎప్పుడో కాలేజీ రోజుల్లో అంటే ఓకే. ఇప్పుడు రాయడం ఎంత కష్టంగా ఉందో' ఇలాంటి అభ్యర్థనలతో హ్యాండ్ రైటింగ్ నిపుణులను సంప్రదిస్తున్నవారు నగరంలో పెరిగారు. చేతిరాత అధ్వాన్నంగా మారిందని కొందరు, నాలుగులైన్లు రాస్తే చేతులు నొప్పులు పుడుతున్నాయని మరికొందరు.. ఇలా రకరకాల సమస్యలను ఎదుర్కొంటూ నగరవాసులు రైటింగ్ డాక్టర్స్/ గ్రాఫాలజిస్టులను కలుస్తున్నారు. 'గతంలో చిన్నపిల్లలు, కాలేజీ విద్యార్థులు మాత్రమే తమ రైటింగ్ స్కిల్స్‌ను మెరుగుపరచాలని వచ్చేవారు. ఇప్పుడు మధ్యవయస్కులు, ఉద్యోగస్తులు, గృహిణులు వస్తున్నారు' అని చేతిరాత నిపుణులు డాక్టర్ రణధీర్ కుమార్ చెబుతున్నారు.

- సాక్షి, సిటీబ్యూరో

అక్షరం.. అపురూపం..





- రాయడం మర్చిపోతున్న ఆధునికులు
- టెక్నాలజీ రాతతో వాయిస్ టైపింగ్ వైపు దృష్టి
- అన్నింటికీ కీప్యాడ్ మంత్రమే జపిస్తున్న వైనం
- రాతకు సాధనే శరణ్యమంటున్న గ్రాఫాలజిస్ట్‌లు
- అవసరార్థం రాయాల్సి వస్తే తప్పని అవస్థలు

ఇచ్చట నేను క్షేమం.. అచ్చట మీరు క్షేమంగా ఉన్నారని భావిస్తా.. ఇలా ఆప్యాయత ఉట్టిపడే అక్షరాలతో అల్లుకున్న అనుబంధాల లేఖలు లేవు. 'తొలిసారి మిమ్మల్ని చూసింది మొదలు' అంటూ చూపుల్ని పంచుకున్న ప్రేమలేఖలూ లేవు. ఎందుకంటే.. ఇప్పుడు చేతిరాతలే లేవు.. బుడి బుడి అడుగులు వేసే వయసులో పలక, బలపం చేతబట్టి 'అ ఆ ఇ ఈ' లను దిద్దడం నేర్చుకున్నాం. బలపం నుంచి పెన్సిళ్లు, పెన్నులు, కాగితాలు, పుస్తకాలు.. ఇలా అక్షరాలు ఆసీనులయ్యే ఆసనాలు, ఆవిష్కరించే సాధనాలు మారేకొద్దీ.. మన చేతిరాత మరింత మెరుగులు దిద్దుకుంది. మన చేతుల్లో నుంచి ఊపిరి పోసుకున్న గీత మన తలరాతను సైతం దిద్దగలిగింది. అంతటి చరిత్ర ఉన్న అక్షరం ఇప్పుడు వంకర్లు పోతోంది. రాత.. గీత తప్పుతోంది. చేతిరాత చెదిరి 'పోయేకాలం' వచ్చేసింది.. డిజిటల్ కోరల్లో చిక్కిన చేతిరాత.. చావు బతుకుల మధ్య కొట్టుమిట్టాడుతోంది.

రాస్తున్నాం కానీ.. రాత ఏదీ..

మనం పేపర్ మీద పెన్ను పెట్టి ఎన్ని రోజులైంది? బహుశా కొన్ని నెలలు గడిచినా ఆశ్చర్యపోనక్కర్లేదేమో కదా? ఒక్కసారి సెల్ఫ్ చెక్ చేసుకుంటే మనకే అర్థమవుతుంది. చేతిరాతకు ఎంతగా దూరమవుతున్నామో.. ఒకప్పటికన్నా ఇప్పుడే మనం ఎక్కువగా రాస్తున్నాం. అయితే పెన్నుతోనో.. పెన్సిల్‌తోనో కాదు. కేవలం కీబోర్డ్‌తోనే అనేది అక్షర సత్యం. కంప్యూటర్ కావచ్చు, మొబైల్స్ కావచ్చు.. ఇవన్నీ చేతిరాత అంతాన్నే కోరుతున్నాయి. పచారీ సామాన్ల జాబితా నుంచి సమావేశంలో నోట్స్ రాసుకోవడం వరకూ.. పుట్టిన రోజు శుభాకాంక్షల నుంచి పోయిన రోజు సంతాప సందేశాల వరకూ అన్నీ టెక్ట్స్ మెసేజ్‌లో, మెయిల్స్, మరొకటో దీంతో రాయాల్సిన అవసరం రోజురోజుకూ తగ్గిపోతోంది. ఫలితంగా అష్టకష్టాలూ పడి నేర్చుకున్న 'మనదైన' చేతిరాత మనల్ని వీడిపోతోంది. చరిత్ర చూసుకుంటే చేతిరాత పత్రాలు సృష్టించిన ఎన్నో అద్భుతాలు కనిపిస్తాయి. ప్రేమలు అంకురించడం దగ్గర్నుంచి యుద్ధాలు ప్రారంభించడం వరకూ సమస్యలు పరిష్కరించడం దగ్గర్నుంచి శాంతి నెలకొల్పడం వరకూ సంచలనాలను సృష్టించడం దగ్గర్నుంచి స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు అందించడం వరకూ.. అన్నింట్లో చేతి రాత పత్రాల ప్రాధాన్యత మనకు స్పష్టంగా కనబడుతుంది.



'రైట్' ఈజ్ బ్రైట్..

హ్యాండ్ రైటింగ్ బావున్నంత మాత్రాన నాలుగు మార్కులు పడితే పడతాయేమో.. అంతకు మించి ఏం లాభంలే.. అని తీసి పారేసే విషయం కాదిది. కార్పొరేట్ కంపెనీలు, బహుళజాతి సంస్థలు.. ఉద్యోగులను నియమించుకునే సమయంలో వారి విద్యార్హతలు, ప్రవర్తనా తీరుతెన్నులతో పాటు వ్యక్తి చేతిరాతను తద్వారా వ్యక్తిత్వాన్ని అంచనా వేస్తూ.. పనితీరును, సామర్థ్యాలను విశ్లేషించి అనంతరం ఉద్యోగిగా అవకాశం ఇవ్వడం ఇప్పుడు నగరంలోని కార్పొరేట్ కల్చర్‌లో సర్వ సాధారణం. చేతిరాతను విశ్లేషించేందుకు దాదాపు ప్రతి కంపెనీ ఒక గ్రాఫాలజిస్ట్‌ను అందుబాటులో ఉంచుకుంటోందంటే సంస్థలు ఈ విషయానికి ఇస్తున్న ఇంపార్టెన్స్ ఏమిటో తెలుస్తుంది.

చేతిరాతతో చెప్పకోదగ్గ విజయాలు..

చేతిరాత మార్చుకునే ప్రక్రియ మన జీవనశైలిని కూడా మార్చుకునేందుకు ఉపకరిస్తుందని గ్రాఫాలజిస్టులు చెబుతున్నారు. సహజంగా వచ్చే కొన్ని ప్రవర్తనాలోపాలను రాసే తీరుతో మార్చుకోవచ్చని స్పష్టం చేస్తున్నారు. విద్యార్థులు రాయడం ద్వారానే చదవడం నేర్చుకుంటారు. కొన్ని పరిశోధనల ప్రకారం రాయడం అలవాటున్నవారి ఆలోచనలు, రాయడం అలవాటు లేనివారితో పోలిస్తే మరింత సృజనాత్మకంగా ఉంటాయి. అదే విధంగా కీబోర్డ్‌తో పోల్చుకుంటే రాసేటప్పుడు బ్రెయిన్ పనిచేసే తీరు భిన్న ఫలితాలు అందిస్తుంది. డైరీ రాయడం వల్ల ఒత్తిడి తగ్గుతుందని వ్యాధి నిరోధకత పెరుగుతుందని పరిశోధనల విశ్లేషణ.



సర్వే జనా 'లిఖి'నో భవంతు..

డాక్‌మెయిల్ అనే బ్రిటిష్ కంపెనీ చేసిన సర్వే పరిశీలిస్తే.. ఆధునికుల్లో సగటున ఓ వ్యక్తి 41 రోజులకు నాలుగులైన్లు రాయాల్సిన అవసరం పడడం లేదట. అలాగే ప్రతి ముగ్గురిలో ఒకరికి ఆరు నెలలపాటు కలం పట్టే ఖర్మే పట్టడం లేదట. ప్రతి ఏడుగురిలో ఒకరు తమ హ్యాండ్ రైటింగ్ మారిన తీరు తమకే అవమానకరంగా మారిందన్నారు. గత కొంత కాలంగా తమ చేతిరాత గుర్తించదగిన రీతిలో మారిపోయిందని సర్వేలో పాల్గొన్నవారిలో సగం మంది చెప్పారు. 'చేతిరాత అవసరం తగ్గుతున్నప్పటికీ, టెక్నాలజీతో సంబంధం లేకుండా కూడా కమ్యూనికేట్ చేయగల సామర్థ్యాలను ప్రజలు నిలబెట్టుకోవాల్సిందే' అని డాక్‌మెయిల్ కంపెనీ డైరెక్టర్ బ్రాడ్‌వే వ్యాఖ్యానించడం గమనార్హం.

రాతే వ్యక్తిత్వానికి దిక్సూచి..

నిత్య జీవితంలో వాడకం తగ్గడం వల్ల మనం చేతిరాతను మర్చిపోతున్నాం. అకస్మాత్తుగా ఏదైనా అవసరం వస్తే అప్పటికప్పుడు నాలుగు లైన్లు రాయడానికి కూడా చాలా మంది ఇబ్బంది పడుతూ మమ్మల్ని సంప్రదిస్తున్నవారు ఇటీవల పెరిగారు. చేతిరాత మనిషి వ్యక్తిత్వానికి దిక్సూచి వంటిది. దాన్ని పోగొట్టుకోవడం తెలివైన పనికాదు. అవసరమైన చోట కంప్యూటర్లు వినియోగిస్తూనే రాతను కాపాడుకునే నేర్పును మనం అలవర్చుకోవాలి.

- డా.రణధీర్‌కుమార్, గ్రాఫాలజిస్ట్





చేజారనివ్వకుండా..

- నిద్రకు ముందు ప్రతి రోజూ కాసేపైనా డైరీ రాయడం అలవాటుగా మార్చుకోండి.
- ఆలోచనలకు ఎప్పటికప్పుడు అక్షరరూపం ఇవ్వడానికి ప్రయత్నించండి.
- చిన్న చిన్న కథలు, ఉత్తరాలు స్వయంగా రాయండి.
- మన లక్ష్యాలను, కలలను తరచూ పేపర్‌పై పెడుతుండాలి.
- మనకు బాగా ఇష్టమైనవారికి చేతిరాతతో శుభాకాంక్షలు పంపడం అలవాటు చేసుకోండి.



రాయలేక పోతున్నా..

చదువుకునేటప్పుడు నా చేతిరాత చాలా బావుండేదని అందరూ మెచ్చుకునేవారు. ఉద్యోగంలో చేరాక రాయాల్సిన అవసరం తగ్గిపోయింది. మధ్య మధ్యలో సరదాగా ఏదైనా రాసినా, నా రాత నాకే నచ్చన మానేశాను. అనుకోకుండా ఈ మధ్యే ఒక కోర్సులో జాయిన్ అయ్యి, అక్కడ నోట్స్ రాసుకోడానికి నానా కష్టాలు పడ్డాను. పెన్ను సజావుగా కదలడానికి. దాదాపు నెలరోజులు పట్టింది.

- సిహెచ్.వంశీ, సాఫ్ట్‌వేర్ ఇంజినీర్



బాలికా సాధికారత.. పరుగుతో చేయూత

- ప్రభుత్వం ద్వారా విభిన్న సంక్షేమ కార్యక్రమాలు : మంత్రి శ్రీధర్ బాబు
- ఉత్సాహంగా సేవా భారతి 'రన్ ఫర్ గర్ల్ చైల్డ్' 2025

సాక్షి సిటీ బ్యూరో, గచ్చిబౌలి : తెలంగాణ రాష్ట్రంలో బాలికల, మహిళల సాధికారతకు రాష్ట్ర ప్రభుత్వం విశేషంగా కృషి చేస్తోందని ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. ముఖ్యంగా ప్రభుత్వం ఆధ్వర్యంలోని సంక్షేమ పథకాలన్నీ మహిళల పేరుపైనే అందిస్తున్నామని అన్నారు. సేవా భారతి తెలంగాణ అధ్వర్యంలో బాలికల సాధికారత, 'కిషోరి వికాస్' కార్యక్రమం గురించి అవగాహన కల్పించడానికి నగరంలోని గచ్చిబౌలి స్టేడియం వేదికగా 'రన్ ఫర్ గర్ల్ చైల్డ్' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ తొమ్మిదో ఎడిషన్‌లో భాగంగా 21/10/5 కిలో మీటర్ల విభాగాల్లో రన్నింగ్ ఈవెంట్లను నిర్వహించగా దాదాపు 11 వేలకు పైగా ఔత్సాహికులు పాల్గొన్నారు. ఇందులో ముఖ్య అతిథిగా పాల్గొన్న మంత్రి శ్రీధర్ బాబు మహిళల సంరక్షణకు నగరంలో పటిష్టమైన భద్రతా చర్యలను చేపట్టామని, ఇందుకోసమే నగరానికి అంతర్జాతీయ కంపెనీల భాగస్వామ్యం పెరిగిందని అన్నారు. సేవా భారతి 10,500 మంది బాలికల జీవితాలను ప్రభావితం చేసిందని, 2030 నాటికి 100,000 మంది లక్ష్యంతో ముందుకు సాగాలని మంత్రి పిలుపునిచ్చారు. బాలికల సాధికారతకు, బడుగు, బలహీన వర్గాల చిన్నారులకు విద్య, ఆరోగ్యం విషయంలో మరింత ప్రోత్సాహాన్ని అందించడానికి రెట్టించిన ఉత్సాహంతో పనిచేస్తామని సేవాభారతి జాతీయ ప్రధాన కార్యదర్శి పరాగ్ అభయాంకర్ పేర్కొన్నారు. వివిధ విభాగాల్లో విజేతలుగా నిలిచిన రన్నర్లకు మంత్రి శ్రీధర్ బాబు, స్థానిక ఎమ్మెల్యే అరికపూడి గాంధీ మెమెంటోలను ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో సేవాభారతి తెలంగాణ అధ్యక్షుడు దుర్గా రెడ్డి, ఇన్ఫోసిస్ సీఎస్ఆర్ హెడ్ వంశీపరం జ్యోతి, ఫిల్టరేషన్ గ్రూప్ సీఎఫ్ఓ వినోద్, యూఎస్టీ గ్లోబల్ సీఎస్ఆర్ హెడ్ తిరుమల్ విజయ్, ఫ్రీడమ్ ఆయిల్ జీయం చేతన్, గ్లోబల్ డేటా డైరెక్టర్ రాజీవ్ గుప్తా, పాలెక్ శ్యాం పాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.







భాగ్యనగరంలో.. జిరో స్వరం..

- సంస్కృతి సమ్మేళనంతో అలరించిన సంగీతం
- తారామతి బారాదరి వేదికపై జిరో ఫెస్టివల్
- అరుణాచల్ ప్రదేశ్ తర్వాతి స్థానం భాగ్యనగరానిదే
- పర్యావరణ స్పృహతో అలరించిన ఉత్సవం



సాక్షి, సిటీబ్యూరో: ఘనమైన వారసత్వ చరిత్ర, అద్భుతమైన కళాత్మకతకు నెలవైన భాగ్యనగరంలో విభిన్న సంస్కృతులు దర్శనమిస్తాయి. ఆ వారసత్వానికి సంగీత స్వరాలను సమ్మిళితం చేస్తూ నిర్వహించిన 'జిరో ఆన్ టూర్' నగరవాసులను అలరించింది. అరుణాచల్ ప్రదేశ్‌కు చెందిన ఈ ప్రత్యేక సాంస్కృతిక మ్యూజికల్ ఫెస్ట్ మొట్టమొదటిసారి నగరంలోని తారామతి బారాదరి వేదికగా ఆదివారం నిర్వహించారు. ఈ ప్రతిష్టాత్మక మ్యూజిక్ ఫెస్ట్ అరుణాచల్ ప్రదేశ్ తర్వాత ఇతర నగరాల్లో నిర్వహించడం ఇదే ప్రథమం. సిగ్నేచర్ ప్యాకేజ్డ్ డ్రింకింగ్ వాటర్ ఆధ్వర్యంలో ఈ జిరో ఆన్ టూర్ కళాత్మక కార్యక్రమం కళ- పర్యావరణ పరిరక్షణ అనే అంశాలపై సమ్మిళిత ఉత్సవంగా నిర్వహించడం విశేషం. హృదయాన్ని హత్తుకునే పాటలు ఊర్రూతలూగించే సంగీతం, విభిన్న సంస్కృతులు, సంగీత వాయిద్యాలతో సమ్మోహనంగా జరిగిన ఉత్సవంలో రామ్ మిరియాల, రబ్బీ షెర్గిల్, శక్తిశ్రీ గోపాలన్, తబా చాకే వంటి ప్రముఖ గాయకులు, సంగీత ప్రముఖులు తమ పాటలతో అలరించడం మరో విశేషం. ఇందులో హైదరాబాద్ ర్యాపర్స్, మణిపూరి గిటారిస్ట్ అందరూ చూపును ఆకర్షించారు.



హైదరాబాద్‌లోని తారామతి బరాదరి వారసత్వపు భారీ గోడల మధ్య జానపద బాణీలతో మట్టి స్వరాల ఆత్మ ప్రతిధ్వనిస్తుండగా.. దీనికి ప్రతిస్పందిస్తూ సంగీత ప్రియులు సాహిత్య సంగమంలో మునిగితేలారు. రోజంతా జరిగిన ఈ వేడుకలో భాగంగా రీయూసబుల్ బాటిల్స్, కప్పులు పై అవగాహన కల్పించారు. ఇందులో భాగంగా ఏర్పాటు చేసిన కార్యక్రమాలు సంగీతాభిమానులను ఆకట్టుకున్నాయి. ముఖ్యంగా సిగ్నేచర్ ప్యాకేజ్డ్ డ్రింకింగ్ వాటర్ ఆధ్వర్యంలో బెంగళూరుకు చెందిన ప్రముఖ ఆర్టిస్ట్ కేపీ రాహుల్ రూపొందించిన 12 అడుగుల ఇన్‌స్టాలేషన్ తారామతికి మరింత అందాన్ని తీసుకొచ్చింది. మడ అడవుల ఆవశ్యకతను సజీవంగా ప్రదర్శించిన ఈ కళ.. ఒడిశా తీరంలో మడ అడవులను పునరుద్ధరించడానికి సిగ్నేచర్ కృషిని ప్రతిబింబించింది. ఏడాదిన్నర కాలంగా ఈ బ్రాండ్ ఐజీఎస్ఎస్‌తో కలిసి 62 ఎకరాల నదీ తీరాన తోటల ద్వారా పర్యావరణ వ్యవస్థను పునరుద్ధరిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా డియాజియో ఇండియా వీపీ, పోర్ట్‌ఫోలియో హెడ్ వరుణ్ కూరిచ్ మాట్లాడుతూ.. జిరో ఫెస్టివల్‌తో సుస్థిరమైన జీవనానికి భవిష్యత్తు ప్రయాణాన్ని ప్రదర్శించామని తెలిపారు. సంగీతం ప్రకృతి సమ్మిళితంగా జిరో ఆన్ టూర్ హైదరాబాద్‌లో తనదైన ముద్ర వేయడం సంతోషంగా ఉందన్నారు.




నేచర్ సిగ్నేచర్ మార్క్..

నగరానికి అపటానీ గిరిజన సంస్కృతి..

'జిరో ఫెస్టివల్ కేవలం సంగీతం గురించి మాత్రమే కాదు.. పర్యావరణం, సంస్కృతి, సమాజంతో లోతైన సంబంధాన్ని పెంపొందించడం గురించి భాగ్యనగరం వేదికగా యావత్ భారత్‌కు తెలియజేస్తుంది. ఏళ్లుగా ఈ ఉత్సవం సంస్కృతుల సమ్మేళనంగా స్థానిక, జాతీయ, అంతర్జాతీయ కళాకారుల మధ్య సహకారాన్ని ప్రోత్సహిస్తోంది. ఈ ఉత్సవం అపటానీ గిరిజన సంస్కృతితో సహా అరుణాచల్ ప్రదేశ్ జానపద సంప్రదాయాలను వెలుగులోకి తీసుకురావడంలో కీలక పాత్ర పోషించింది.

- అనుప్ కుట్టి, బాబీ హానో, జిరో ఫెస్టివల్ వ్యవస్థాపకులు



కూ.. ఛుక్.. ఛుక్.. ఛుక్.. ఇది రైలు శబ్ద విన్యాసం..!
గుప్పు.. గుప్పు.. వెలువడే పొగ బండి.. రైలును ఉద్దేశించి అనాదిగా చెప్పే మాట.
ఇప్పుడా శబ్దం మారింది, ఆ పొగ మాయమైంది. అది విద్యుదీకరణ విప్లవం ఫలితం..
మనదేశ పట్టాల మీద ఆ విప్లవానికి బీజం పడి ఫిబ్రవరి 3వ తేదీకి సరిగ్గా వందేళ్లు కావస్తోంది.

1925 ఫిబ్రవరి 3వ తేదీ.. బొంబాయి (ప్రస్తుత ముంబై) నగరంలోని విక్టోరియా టెర్మినస్ (ప్రస్తుత ఛత్రపతి శివాజీ మహారాజ్ టెర్మినస్) రైల్వేస్టేషన్ కిక్కిరిసి ఉంది. బ్రిటిష్ అధికారులు, పోలీసుల హడావుడి మధ్య నగర ప్రజలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఇంతలో చుక్ చుక్‌మనే శబ్దం, గుప్పుమనే పొగ లేకుండానే మూడు కోచ్‌లతో కూడిన రైలు కామ్‌గా వచ్చి ఆగింది. అంతే చప్పట్లతో ఆ ప్రాంతం మారుమోగింది. గ్రేట్ ఇండియన్ పెనిన్సులా రైల్వే హార్బర్ బ్రాంచి ఆ తొలి సబర్బన్ ఎలక్ట్రిక్ రైలును నడిపింది.

– సాక్షి, హైదరాబాద్:

విద్యుత్ రైలుకి వందనం

1925 ఫిబ్రవరి 3న దేశంలో తొలి విద్యుత్ రైలు పరుగులు

ముంబై-కుర్లా మార్గంలో మొదట వినియోగం • 1961 తర్వాత ఊపందుకున్న రైల్వే విద్యుదీకరణ • పెద్ద దేశాల్లో రైల్వే విద్యుదీకరణ అత్యధికంగా జరిగిన దేశం మనదే..

ముంబై-కుర్లా మార్గంలో..


అప్పటికే పలు అభివృద్ధి చెందిన దేశాల్లో ఎలక్ట్రిక్ రైళ్లు పరుగుతీస్తున్నాయి. మన దేశంలో పెద్ద నగరమైన ముంబైలోనూ వాటిని ప్రవేశ పెట్టాలని నాటి బ్రిటిష్ ఇండియా ప్రభుత్వం నిర్ణయించింది. తొలుత ముంబై-కుర్లా మార్గాన్ని పూర్తి చేసింది. మన దేశంలో ప్రవేశపెట్టిన ఈ తొలి విద్యుత్ లోకోమోటివ్‌ను స్విస్ లోకోమోటివ్ అండ్ మెషీన్‌వర్క్స్ సంస్థ తయారు చేసింది. ఇంగ్లండ్‌లో ఉపయోగించిన న్యూపోర్ట్-షిల్డన్ విద్యుదీకరణ తరహా విధానాన్ని ఇక్కడ అనుసరించారు. దానికోసం 1,500 వోల్ట్స్ డీసీ విద్యుత్‌ను ఉపయోగించారు. ఈ రైలుకు మూడు కోచ్‌లను అనుసంధానం చేశారు. వాటిని ఇంగ్లండ్‌కు చెందిన కామెల్-లెయిర్డ్, జర్మనీకి చెందిన ఉర్దింగెన్ వ్యాగన్ ఫాబ్రిక్ సంస్థలు తయారు చేశాయి.

వరుసగా విద్యుత్ రైళ్లను ప్రారంభిస్తూ..

గ్రేట్ ఇండియన్ పెనిన్సులా రైల్వేకు పోటీగా 1929లో బాంబే బరోడా- సెంట్రల్ ఇండియా రైల్వే బాంబే చర్చ్‌గేట్ నుండి బోరివలి వరకు 1500 వోల్ట్స్ డీసీ కరెంటును ఉపయోగించి ఈఎంయూ రైళ్లను నడపడం ప్రారంభించింది. గ్రేట్ ఇండియన్ పెనిన్సులా రైల్వే 1928లో కొన్ని బ్యాటరీ-ఆపరేటెడ్ ఎలక్ట్రిక్ లోకోమోటివ్‌లను దిగుమతి చేసుకుంది. ముంబై వీటీ నుంచి పుణె, ఇగత్‌పురి వరకు మార్గాన్ని 1929-30 నాటికి విద్యుదీకరించి కరెంటు రైళ్లను ప్రారంభించింది. ఆగస్టు 1927 నాటికి 41 స్విస్ క్రోకోడిల్ ఎలక్ట్రిక్ లోకోమోటివ్‌లు ముంబైకి చేరుకున్నాయి. తర్వాతి తరం ఇంజన్లను ఇంగ్లండ్‌లో వల్కన్ ఫౌండ్రీ , మెట్రోపాలిటన్ వికర్స్ సంస్థల నుంచి దిగుమతి చేసుకున్నారు. ఈ రెండో తరం ఇంజన్ల గరిష్ట వేగం అప్పట్లోనే గంటకు 136 కిలోమీటర్లు కావటం విశేషం. వాటిని 112 కిలోమీటర్ల వేగంతో నడిపేందుకు అనుమతించారు. కానీ మన దేశంలోని ట్రాక్ సామర్థ్యం దృష్ట్యా అవి 55 కిలోమీటర్ల వేగానికే పరిమితం అయ్యాయి.

1930 తర్వాత బ్రేక్ పడి..

దేశంలో వరుసగా విద్యుత్ రైళ్లను ప్రవేశ పెడుతూ వచ్చిన బ్రిటిష్ ఇండియా ప్రభుత్వం.. 1930 తర్వాత వేగం తగ్గించుకుంది. స్వాతంత్ర్యోద్యమం ఉవ్వెత్తున ఎగిసిపడటమే దానికి కారణం. 1930 నుంచి 1947 మధ్య 388 కిలోమీటర్ల మార్గాన్ని మాత్రమే విద్యుదీకరించారు. ఇక స్వాతంత్ర్యం తర్వాత తొలి ఐదేళ్లు రైల్వే మార్గాల విద్యుదీకరణ పూర్తిగా నిలిచిపోయింది. 1951-56 మధ్య 141 కి.మీ. 1956-61 మధ్య 246 కి.మీ. మేర విద్యుదీకరించారు. 1961 తర్వాత వేగం పుంజుకుంది. కొత్త మార్గాలన్నీ ఎలక్ట్రిక్ విధానంలో చేపడుతూ వచ్చినా అది పరిమితంగానే ఉండిపోయింది. దీంతో 90శాతం ప్రాంతాల్లో డీజి ల్ రైళ్లే నడుస్తూ వచ్చాయి. దక్షిణ భారత్‌కు సంబంధించి 1931లోనే మద్రాస్ బీచ్ స్టేషన్-తాంబారం స్టేషన్ మధ్య కరెంటు రైళ్లను నడిపారు. కానీ తర్వాత పురోగతి లేకుండా పోయింది. తిరిగి 1980 దశకంలో కదలిక వచ్చింది. ఆ సమయంలోనే ఏపీ, తెలంగాణ ప్రాంతాల్లో లైన్ల విద్యుదీకరణ మొదలైంది.



విజయవాడ - గూడూరు మధ్య తొలిసారిగా..

విజయవాడ-గూడూరు-చెన్నై సెక్షన్ విద్యుదీకరణ పనులతో తెలుగు నేలపై కరెంటు రైళ్ల వినియోగానికి బీజం పడింది. 1976లో ప్రారంభమైన పనులు 1980 నాటికి పూర్తయ్యాయి. తర్వాత వరుసగా విద్యుదీకరణ పనులు జరుగుతున్నాయి. స్థానిక పరిస్థితులు, వాతావరణ కారణాలు, సాంకేతిక సమస్యలు.. వెరసి ఒక మార్గంలో కొంతదూరం విద్యుదీకరణ పనులు పూర్తయితే.. మిగతా మార్గంలో జరిగేవి కావు. దీనితో దూరప్రాంతాలకు వెళ్లే రైళ్లకు విద్యుదీకరణ ఉన్నంత వరకు కరెంటు ఇంజిన్లు వాడి, తర్వాత డీజిల్ ఇంజిన్ జత చేసి ముందుకు పంపేవారు. ఇటీవలి వరకు ఇది కొనసాగడం గమనార్హం. ప్రస్తుతం దేశంలో తెలంగాణ, ఏపీ సహా 20 రాష్ట్రాల్లో మొత్తం లైన్లను విద్యుదీకరించారు. ప్రస్తుతం కొత్తగా చేపట్టే రైల్వే లైన్లతో సమాంతరంగా విద్యుదీకరణ పనులు కూడా జరుపుతారు.

మొట్టమొదటి ఎలక్ట్రిక్ రైలును ధ్వంసం చేసిన కార్మికులు..

ప్రపంచంలో తొలి ఎలక్ట్రిక్ రైలు స్కాట్లాండ్‌లో రూపొందింది. అక్కడి అబెర్డీన్ నగరానికి చెందిన రసాయన శాస్త్రవేత్త రాబర్ట్ డేవిడ్‌సన్ 1837లో గాల్వానిక్ సెల్స్ (బ్యాటరీలు)తో నడిచే ఎలక్ట్రిక్ లోకోమోటివ్‌ను రూపొందించారు. అది ఫలితం ఇవ్వకపోవడంతో మార్పులు చేసి మరో ఏడు టన్నుల బరువును లాగ గలిగిన లోకోమోటివ్‌ను అభివృద్ధి చేశారు. దాని వేగం గంటకు 6 కిలోమీటర్లు. ప్రయోగ పరీక్షలో ఆరు టన్నుల బరువును రెండున్నర కిలోమీటర్ల దూరం లాగింది. గ్లాస్గో రైల్వేలో దీనిని నడపాలని నిర్ణయించారు. ఈలోపే తమ ఉద్యోగ భద్రతకు ముప్పు వస్తుందని ఆందోళన చెందిన రైల్వే కార్మికులు ఆ లోకోమోటివ్‌ను ధ్వంసం చేశారు.

- మొదటి ఎలక్ట్రిక్ ప్యాసింజర్ రైలును 1879లో బెర్లిన్‌లో వెర్నర్ వాన్ సిమెన్స్ ఆధ్వర్యంలో సిద్ధమైంది. 2.2 కిలోవాట్స్ శక్తి గల మోటారుతో నడిపారు. మూడు కోచ్‌లతో కూడిన ఆ రైలు గంటకు 13 కిలోమీటర్ల వేగంతో నడిచింది.
- సొరంగ మార్గాలు, కిక్కిరిసిన పట్టణ ప్రాంతాల్లో డీజిల్, బొగ్గు రైలు పొగతో జనం విసిగిపోయి ఎలక్ట్రిక్ రైళ్ల వైపు మొగ్గుచూపటం ప్రారంభించారు. కొన్ని పట్టణాలు అప్పట్లోనే పొగ రైళ్లను నిషేధించాయి.
- అమెరికాలో తొలి ఎలక్ట్రిక్ రైలు 1895లో మొదలైంది. బాల్టిమోర్ ఒహియోను న్యూయార్క్ మధ్య దాన్ని ప్రారంభించారు.

రైల్వే లైన్ల విద్యుదీకరణ.. పెద్ద దేశాల పరిస్థితి ఇదీ..

దేశం	రైల్వేలైన్ నిడివి	విద్యుదీకరించిన మార్గం (కి.మీ.లలో)
అమెరికా	2,20,044	1929 (0.87%)
చైనా	1,59,000	1,19,000 (74.84%)
రష్యా	1,05,000	54,054 (51.48%)
భారత్	68,584	64,244 (94%)

మన దేశంలో కరెంటు రైలు విశేషాలెన్నో..

» మన దేశంలో ప్రస్తుతం వినియోగిస్తున్న విద్యుత్ లోకోమోటివ్‌లు 10,230, డీజిల్ ఇంజన్లు 4,560..

» చిత్తరంజన్ లోకోమోటివ్ వర్క్స్‌లో 1961లో మన దేశం సొంతంగా ఎలక్ట్రిక్ లోకోమోటివ్‌ను రూపొందించింది. డబ్ల్యూసీఎం-5 లోకమాన్య అని దానికి పేరు పెట్టారు. అయితే ఇప్పటికీ శక్తివంతమైన లోకోమోటివ్‌ల తయారీ కోసం మన దేశం విదేశీ కంపెనీలపై ఆధారపడుతోంది.

» 2015లో స్విస్ కంపెనీ ఆల్‌స్టామ్‌తో కేంద్రం ఒప్పందం చేసుకుని, బిహార్‌లోని మాధేపురాలో ఎలక్ట్రిక్ లోకోమోటివ్‌ల తయారీ యూనిట్ ప్రారంభించింది. ఇక్కడ 12,000 హార్స్‌పవర్ సామర్థ్యమున్న లోకోమోటివ్‌లు తయారు చేస్తున్నారు. 250 కంటే అధికంగా వ్యాగన్లు ఉండే సరుకు రవాణా రైళ్లకు ఈ లోకోమోటివ్‌లను వాడుతున్నారు.

» ప్రపంచంలో తొలిసారిగా పాత డీజిల్ రైలు ఇంజన్‌ను ఎలక్ట్రిక్ లోకోమోటివ్‌గా మార్చిన ఘనత మన రైల్వేదే. ఇప్పటికే ప్రయోగాత్మకంగా మూడు ఇంజన్లను మార్చి వినియోగిస్తున్నారు. పాత డీజిల్ ఇంజన్లన్నీ ఎలక్ట్రిక్‌గా మార్చే ప్రతిపాదన ఉంది. అయితే ఏదైనా సమస్య ఏర్పడి ఎలక్ట్రిక్ రైళ్ల వినియోగంలో ఇబ్బందులు తలెత్తితే.. అత్యవసరంగా వినియోగించేందుకు వీలుగా 3 వేల డీజిల్ ఇంజన్లను సిద్ధంగా ఉంచాలని రైల్వేశాఖ నిర్ణయించింది.



మహాకుంభ మేళాకు వస్తున్న భక్తుల కోసం రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ 'తీర్థయాత్రి సేవా' పేరుతో పలు సేవలు అందిస్తోంది. భక్తుల కోసం అన్నదానం, వైద్యసేవలు, విద్యుత్ వాహనాలు, అత్యవసర బోట్లు, విశ్రాంతి గదులు తదితర సౌలభ్యాలు కల్పించింది.

ఛత్తీస్‌గఢ్‌లో ఎదురుకాల్పులు

నారాయణపూర్ – కాంకేర్ జిల్లాల సరిహద్దులో ఘటన

చర్ల: ఛత్తీస్‌గఢ్‌లోని నారాయణపూర్ – కాంకేర్ జిల్లాల సరిహద్దు అటవీ ప్రాంతంలో ఆదివారం రాత్రి పోలీసులకు, మావోయిస్టులకు మధ్య ఎదురుకాల్పులు జరిగాయి. రెండు జిల్లాల సరిహద్దుల్లోని అబూజ్‌మడ్ అటవీ ప్రాంతంలోని అంతగఢ్, కోయిలిబెడా పోలీస్ స్టేషన్‌ల పరిధిలో గల పానీదోబీర్ అడవుల్లో సుమారు గంటన్నర పాటు ఇరుపక్షాల మధ్య ఎదురుకాల్పులు కొనసాగాయి. అయితే మావోయిస్టుల వైపు నుంచి కాల్పులు ఆగిపోయినట్లు తెలుస్తుండగా, ఎదురుకాల్పులు జరిగిన ప్రాంతం దట్టమైన అడవి కావడం, గుట్టల మధ్యలో ఉండటంతో ఎటువంటి సమాచారం అందడం లేదని, సోమవారం ఉదయం కల్లా పూర్తి వివరాలు తెలుస్తాయని కాంకేర్ జిల్లా ఎస్పీ దివ్యాంగ్ పాటిల్ తెలిపారు. అలాగే బీజాపూర్ జిల్లా గంగులూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని తోడ్కా – కుర్చేలి గ్రామాల మధ్య అటవీ ప్రాంతంలో శనివారం జరిగిన ఎదురు కాల్పుల్లో మృతి చెందిన 8 మంది మావోయిస్టులను గుర్తించారు. మృతుల్లో మావోయిస్టు పార్టీ వెస్ట్ బస్తర్ డివిజన్ గంగులూరు ఏరియా కమిటీ సభ్యుడు కమలేశ్ అలియాస్ నీలకాంత్, జనతన్ సర్కార్ కమాండర్ సన్ను దాదా ఉన్నట్లు ఎస్పీ జితేంద్ర కుమార్ యాదవ్ తెలిపారు. వీరిలో కమలేశ్‌పై రూ.5 లక్షల రివార్డు ఉన్నట్లు చెప్పారు.

ఇన్‌ఫార్మర్ నెపంతో ఒకరి హత్య

పోలీస్ ఇన్‌ఫార్మర్ నెపంతో మావోయిస్టులు శనివారం అర్ధరాత్రి ఓ ఎంపీటీసీ మాజీ సభ్యుడిని హత్య చేశారు. ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర సరిహద్దులో ఉండే గడ్చిరోలి జిల్లాలోని బహదూర్‌ఘాట్‌లో శనివారం అర్ధరాత్రి ఎంపీటీసీ మాజీ సభ్యుడు శుక్రం మడవి ఇంటికి వచ్చిన మావోయిస్టులు.. ఇంటి వద్దనే ఆయనను తీవ్రంగా కొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. శుక్రం మడవి పోలీస్ ఇన్‌ఫార్మర్‌గా పనిచేస్తున్నందునే ఈ శిక్ష విధించామని, ఇంకా ఎవరైనా పోలీస్ ఇన్‌ఫార్మర్లుగా మారితే వారికి కూడా ఇదే శిక్ష ఉంటుందని హెచ్చరిస్తూ, మావోయిస్టులు మడవి మృతదేహం వద్ద ఒక లేఖ విడిచి వెళ్లారు.

'మన మిత్ర'.. మరో మారీచుడే!

• నాడు 'సేవా మిత్ర'... నేడు 'మన మిత్ర' • పేర్లు మారినా కుట్రలు మాత్రం అవే.. • 520 రకాల సేవలా?.. 420 మోసాలా?

వాట్సాప్ గవర్నెన్స్ ముసుగులో చంద్రబాబు సర్కారు రాజకీయ కుతంత్రం

- ఆధార్ నంబర్‌తో కుటుంబ వివరాలు మొత్తం బహిర్గతం
- గిట్టని వారికి సంక్షేమ పథకాలు నిలిపివేత.. ప్రత్యర్థి పార్టీ సానుభూతిపరుల ఓట్ల తొలగింపు.. ఎన్నికల్లో అక్రమాలే లక్ష్యం
- పౌరుల వ్యక్తిగత డేటా ప్రైవేట్ సంస్థ గుప్పిట్లోకి
- అసలు ప్రజల డేటా మూడో వ్యక్తి వద్దకు ఎలా వెళ్లింది?
- టీడీపీ కూటమి సర్కారు తీరుపై రాష్ట్ర ప్రజల్లో తీవ్ర ఆందోళన..
- ఈ ప్రభుత్వానికి నిజంగానే చిత్తశుద్ధి ఉంటే "దిశ" యాప్ తరహాలో సర్కారే స్వయంగా రూపొందించి ఎందుకు నిర్వహించడం లేదని మండిపాటు
- 2019 ఎన్నికల ముందు కూడా టీడీపీ ఇవే కుట్రలు



సాక్షి, అమరావతి:

మొన్న "సేవా మిత్ర..!".. నేడు "మన మిత్ర..!" పేర్లు మారినా కుతంత్రాలు మాత్రం మారలేదు!!

రామాయణంలో మారీచుడు ఎలా రూపాలు మార్చుకుని దారుణాలకు ఒడిగట్టేవాడో... రాష్ట్ర రాజకీయాల్లోనూ ఎప్పటికప్పుడు మాయ వేషాలతో కుట్రలకు పదును పెడుతున్నారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వాట్సాప్ గవర్నెన్స్ ముసుగులో చంద్రబాబు సర్కారు రాజకీయ కుతంత్రాలపై సర్వత్రా మండిపడుతున్నారు. వాట్సాప్ గవర్నెన్స్‌లో నమోదు చేసే ఆధార్ నంబర్‌తో ఆయా కుటుంబల వివరాలు మొత్తం బహిర్గతం కావడంతో గిట్టని వారికి సంక్షేమ పథకాలను నిలిపి వేయడం తోపాటు ప్రత్యర్థి పార్టీ సానుభూతిపరుల ఓట్లు తొలగించే కుట్ర దాగి ఉన్నట్లు పేర్కొంటున్నారు. ఎన్నికల్లో అక్రమాలే అసలు లక్ష్యంగా పౌరుల వ్యక్తిగత డేటా మొత్తం ప్రైవేట్ సంస్థ గుప్పిట్లో పెట్టారని.. అసలు ప్రజల వ్యక్తిగత డేటా మూడో వ్యక్తి వద్దకు ఎలా వెళ్లిందని ప్రశ్నిస్తున్నారు. తమ వ్యక్తిగత వివరాలు ఇంకా ఎన్ని చోట్లకు చేరిపోతాయో...! ఎన్ని చేతులు మారుతాయో? అనే ఆందోళన ప్రజల్లో నెలకొంది. ఈ ప్రభుత్వానికి పౌర సేవలపై నిజంగానే చిత్తశుద్ధి ఉంటే ''దిశ'' యాప్ తరహాలో ప్రభుత్వమే స్వయంగా రూపొందించి ఎందుకు నిర్వహించడం లేదని ప్రశ్నిస్తున్నారు. 2019 ఎన్నికల ముందు టీడీపీ సేవా మిత్ర మొబైల్ యాప్‌తో లక్షలాది మంది ఓట్లు తొలగించే కుట్రకు పాల్పడిన సీఎం చంద్రబాబు ఇప్పుడు తన కుతంత్రానికి సరికొత్త రూపాన్నిచ్చారు. అదే.. 'మన మిత్ర' మొబైల్ యాప్. మీ ఆధార్ నంబర్ వాట్సాప్ చేస్తే చాలు.. ప్రభుత్వ సేవలు ఇట్టే అందిస్తామంటూ అరచేతిలో వైకుంఠం చూపిస్తున్నారు. ఈ అందమైన మాయాజాలం వెనుక భారీ కుట్ర దాగి ఉంది. బాలనాగమ్మను మాయల ఫకీరు చిలుకలో బంధించి ఎత్తుకుపోయినట్టు... యావత్ రాష్ట్ర ప్రజల వ్యక్తిగత డేటా అంతా నిక్షిప్తం చేసి అక్రమాలకు పాల్పడేందుకు రాజకీయ మాయల ఫకీరు వేసిన ఎత్తుగడే మన మిత్ర యాప్. ఒక్క ఆధార్ నంబరుతో మొత్తం కుటుంబ సభ్యుల ఆధార్ నంబర్లు, చిరునామాలు, బ్యాంకు ఖాతాలు, ఆస్తుల వివరాలు, ఓటరు నంబర్లు, సోషల్ మీడియా ఖాతాలు... సర్వం మాయల ఫకీరు గుప్పిట్లోకి వెళుతుంది. ఆ తరువాత ఏడు సముద్రాలు దాటి విదేశాలకు చేరుతుంది. అక్కడ నుంచి సైబర్ నేరస్తులు ప్రజల బ్యాంకు ఖాతాలను కొల్లగొట్టొచ్చు...! ఫొటోలను మార్ఫింగ్ చేసి వేధించవచ్చు...! అర్హులైనప్పటికీ కూటమి ప్రభుత్వం సంక్షేమ పథకాలను తొలగించవచ్చు...! ప్రభుత్వ పెద్దలే ప్రత్యర్థి పార్టీల సానుభూతిపరుల ఓట్లను గంపగుత్తగా తొలగించవచ్చు...! చంద్రబాబు సర్కారు వాట్సాప్ గవర్నెన్స్ ఎత్తుగడ వెనుక ఇంత దారుణ పన్నాగం దాగి ఉంది. రాజ్యాంగం కల్పించిన ప్రజల వ్యక్తిగత గోప్యత హక్కుకు భంగం కలిగించే కుతంత్రం ఇది. ఆధార్ చట్టాన్ని ఉల్లంఘిస్తున్న అరాచక పర్వం ఇది. వ్యక్తిగత గోప్యతను పరిరక్షించాల్సిందేనన్న సుప్రీంకోర్టు ఆదేశాలను బేఖాతర్ చేస్తున్న బరితెగింపు ఇది. ఎన్నికల్లో అక్రమాలకు బరి తెగించాలనే టీడీపీ దీర్ఘకాలిక దురాలోచన దీని వెనుక ఉన్నట్లు సాంకేతిక నిపుణులు, రాజకీయ పరిశీలకులు హెచ్చరిస్తున్నారు. యావత్ రాష్ట్ర ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచిస్తున్నారు.

గవర్నెన్స్ ముసుగు.. డేటా చోరీ కుట్ర!

వాట్సాప్‌లో మీ ఆధార్ నంబర్ మెసేజ్ చేస్తే చాలు.. 520 రకాల పౌర సేవలు అందిస్తామని మంత్రి నారా లోకేశ్ ఆర్భాటంగా ప్రకటించారు. ప్రస్తుతం 161 సేవలను అందుబాటులోకి తెచ్చామని, త్వరలో మిగిలినవి కూడా అందిస్తామంటూ దీనికి 'మన మిత్ర' అనే పేరు ప్రకటించారు. కానీ ఇక్కడే అసలు మతలబు ఉంది. ఆ పౌర సేవలను ప్రభుత్వ సాంకేతిక వ్యవస్థ ద్వారా కాకుండా ప్రైవేట్ సంస్థ భాగస్వామ్యంతో అందిస్తామని తెలిపారు. 'వాట్సాప్ గవర్నెన్స్' ద్వారా పౌర సేవలు పొందాలంటే 95523 00009 నంబర్‌కు ప్రజలు తమ ఆధార్‌ను వాట్సాప్ చేయాలి. అలా చేయగానే ప్రజల వ్యక్తిగత వివరాలు బహిర్గతమవుతున్నాయి. ఇక పౌర సేవలు పొందేందుకు ఆ వాట్సాప్ నంబరులో సూచించే ఫారాన్ని ఆన్‌లైన్‌లో పూరించాలి. దాంతో ఆయా వ్యక్తుల అదనపు వివరాలన్నీ వెల్లడవుతున్నాయి. పేరు, ఇంటి నంబరు, ఓటరు కార్డు నంబర్, కుటుంబ సభ్యుల ఆధార్ కార్డు నంబర్లు, మొబైల్ నంబర్లు, ఈ మెయిల్ ఐడీ... ఇలా సమస్త వివరాలు సంబంధిత వ్యక్తుల ప్రమేయం లేకుండానే బహిర్గతమవుతున్నాయి. అంటే ప్రజల వ్యక్తిగత గోప్యత అన్నది పూర్తిగా ప్రశ్నార్థకంగా మారినట్లు నిర్ధారణ అవుతోంది.

పౌరుల డేటా ప్రైవేట్ సంస్థ గుప్పిట్లోకి...

వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా ప్రజల వ్యక్తిగత డేటా ఎక్కడికి చేరుతోందన్నది అత్యంత కీలకంగా మారింది. వాట్సాప్ గవర్నెన్స్‌ను రాష్ట్ర ప్రభుత్వం సొంతంగా ప్రవేశ పెట్టలేదు. ప్రభుత్వ విభాగం ఏపీ టెక్నాలజీ సర్వీసెస్ ద్వారా సొంతంగా ఎలాంటి మొబైల్ యాప్‌ను రూపొందించలేదు. ఓ ప్రైవేట్ సంస్థతో ఒప్పందం చేసుకుంది. నిజంగా చిత్తశుద్ధి, పారదర్శకత ఉంటే ప్రభుత్వమే సొంతగా మొబైల్ యాప్‌ను రూపొందించవచ్చు. వైఎస్సార్‌సీపీ హయాంలో మహిళల భద్రత కోసం 'దిశ' మొబైల్ యాప్‌ను పోలీసు శాఖే స్వయంగా రూపొందించింది. ప్రజలు అన్ని రకాల పోలీసు సేవలు పొందేందుకు 'పోలీసు సేవా యాప్'ను ప్రవేశపెట్టింది. ప్రపంచంలో పలు అభివృద్ధి చెందిన దేశాల్లో ఆయా ప్రభుత్వాలే సొంతంగా మొబైల్ యాప్‌లు రూపొందించి పౌర సేవలు అందిస్తున్నాయి. అంతేగానీ సున్నితమైన ప్రజల వ్యక్తిగత సమాచారంతో ముడిపడిన అంశాలపై ప్రైవేట్ సంస్థలతో ఒప్పందాలు కుదుర్చుకోలేదు. మరి పౌర సేవల కోసం టీడీపీ కూటమి ప్రభుత్వం సొంతంగా యాప్ ఎందుకు రూపొందించలేదన్నది సందేహాలకు తావిస్తోంది. అంటే ప్రజల వ్యక్తిగత వివరాలన్నీ ప్రైవేట్ సంస్థకు అందుబాటులోకి వచ్చినట్లేనని నిపుణులు స్పష్టం చేస్తున్నారు.

పథకాల్లో కోత... ఓట్ల తొలగింపు

ఎన్నికల్లో అక్రమాలే అసలు లక్ష్యం..

వాట్సాప్ గవర్నెన్స్ ముసుగులో సేకరించే ప్రజల వ్యక్తిగత సమాచారాన్ని దుర్వినియోగం చేసి ఎన్నికల్లో అక్రమాలకు పాల్పడాలన్నదే టీడీపీ సర్కారు అసలు కుట్ర. వైఎస్సార్‌సీపీ, ఇతర ప్రతిపక్ష పార్టీల సానుభూతిపరులను వేధించడం.. వారికి ప్రభుత్వ పథకాలు అందకుండా చేయడం.. టీడీపీకి ఓట్లు వేయరని భావించే వారి ఓట్లను తొలగించే పన్నాగం దాగి ఉంది. 2029 ఎన్నికల్లో అక్రమాలకు పాల్పడాలన్న దీర్ఘకాలిక దురాలోచన ఉందన్నది స్పష్టమవుతోంది. అందుకోసం ఎంత పకడ్బందీగా కుట్ర పన్నారంటే.. ఒకరి ఆధార్ నంబరు టైప్ చేస్తే చాలు ఆ కుటుంబంలోని ఇతర సభ్యుల ఆధార్ నంబర్లు, వారి వ్యక్తిగత డేటా కూడా మొత్తం బట్టబయలవుతోంది. సాధారణంగా ఎక్కడైనా ఆధార్ నంబరు నమోదు చేస్తే సంబంధిత వ్యక్తి మొబైల్‌కు ఓటీపీ వస్తుంది. దాన్ని నమోదు చేశాకే మిగతా ప్రక్రియను కొనసాగించేందుకు వీలుంటుంది. కానీ టీడీపీ ప్రభుత్వం తెచ్చిన వాట్సాప్ గవర్నెన్స్‌లో ఇలాంటిదేమీ లేదు. ఒకరి ఆధార్ నంబరు వెల్లడిస్తే ఆ కుటుంబ సభ్యుల ఆధార్ నంబర్లు, వ్యక్తిగత డేటా సైబర్ నేరస్తులకు కూడా అందుబాటులోకి వచ్చేస్తోంది. వాట్సాప్ గవర్నెన్స్ అన్ని రకాల సైబర్ నేరాలు, మోసాలకు తలుపులు బార్లా తెరుస్తోంది.

ఆధార్ చట్టం ఉల్లంఘన...

ఎన్నికల్లో అక్రమాలే లక్ష్యంగా టీడీపీ కూటమి ప్రభుత్వం ఆధార్ చట్టాన్ని నిర్భీతిగా ఉల్లంఘిస్తోంది. ఆధార్ సంబంధిత డేటా పరిరక్షణ కోసం కేంద్రం రూపొందించిన యూఐడీఏఐ చట్టం పటిష్ట మార్గదర్శకాలను నిర్దేశించింది. వాటి ప్రకారం..

- ఆధార్ డేటాను భారత్‌లోనే భద్రపరచాలి. దేశ సరిహద్దులు దాటించి విదేశీ సర్వర్ల ద్వారా డేటా ప్రాసెసింగ్ అన్నది పూర్తిగా నిషిద్ధం. కానీ చంద్రబాబు ప్రభుత్వం విదేశీ
- ప్రైవేట్ సంస్థతో ఒప్పందం చేసుకుంది. తద్వారా ప్రజల ఆధార్ డేటా దేశ సరిహద్దులు దాటేందుకు ఆస్కారం ఇచ్చింది.
- ఆధార్ నంబరు, డేటాను ఇతర ప్రభుత్వ విభాగాలకు సంబంధించిన అంశాల్లో కూడా ప్రచురించకూడదని చట్టం చెబుతోంది. రేషన్ కార్డు, జనన ధ్రువపత్రం, కుల ధ్రువీకరణ పత్రం, ఇతర సర్టిఫికెట్లలో ఆధార్ పూర్తి నంబరు ప్రచురించకూడదు. కేవలం ఆధార్‌లోని చివరి నాలుగు అంకెలే ప్రచురించాలి. అందుకు విరుద్ధంగా వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా ఆధార్ నంబరును పూర్తిగా అంటే మొత్తం పది అంకెలను బహిర్గతం చేస్తున్నారు.

ఐటీ, డేటా భద్రతా చట్టాలకు విరుద్ధంగా.

పార్లమెంట్ ఆమోదించిన ఐటీ చట్టం-2000, 'డిజిటల్ పర్సనల్ డేటా ప్రొటెక్షన్ యాక్ట్-2023'ను చంద్రబాబు ప్రభుత్వం యథేచ్ఛగా ఉల్లంఘిస్తోంది. ప్రజల వ్యక్తిగత గోప్యతకు భంగం కలిగిస్తే ఐటీ చట్టం మూడేళ్ల వరకు జైలు శిక్ష విధించేందుకు అవకాశం కల్పించింది. ప్రజల వ్యక్తిగత డేటా పరిరక్షణలో విఫలమైతే ఒక్కో ఉల్లంఘనకు ఏకంగా రూ.250 కోట్ల వరకు జరిమానా విధించేందుకు కేంద్ర డిజిటల్ పర్సనల్ డేటా ప్రొటెక్షన్ యాక్ట్ అవకాశం కల్పించింది. వీటిని టీడీపీ సర్కారు ఏమాత్రం లెక్క చేయడం లేదు.

సుప్రీం తీర్పు బేఖాతర్...

వ్యక్తిగత డేటా పరిరక్షణ ప్రజల ప్రాథమిక హక్కు అని సుప్రీం కోర్టు తీర్పులు స్పష్టం చేస్తున్నాయి. తమ వ్యక్తిగత వివరాలను ఎలా ఉపయోగించాలన్నది పూర్తిగా ప్రజలే నిర్ణయించుకోవాలి. ఇతరులు ఎవరికీ ప్రజల వ్యక్తిగత డేటా మీద నియంత్రణ ఉండకూడదని 2017లో ఇచ్చిన తీర్పులో సుప్రీంకోర్టు తేల్చి చెప్పింది. దీనికి విరుద్ధంగా ప్రజల వ్యక్తిగత డేటాను వారి అనుమతితో నిమిత్తం లేకుండానే ఇతర విభాగాలు, ప్రైవేట్ సంస్థలకు చంద్రబాబు ప్రభుత్వం అందుబాటులోకి తేవడం విస్మయపరుస్తోంది.

2019లో 'సేవామిత్ర' యాప్‌తో అక్రమాలు

2014-19 మధ్య కూడా టీడీపీ ప్రభుత్వం ఇదే తరహాలో ప్రైవేట్ సంస్థ ద్వారా ప్రజల వ్యక్తిగత డేటా చోరీకి పాల్పడింది. 2016లో నిర్వహించిన ప్రజాసాధికార సర్వే ద్వారా సేకరించిన ప్రజల వ్యక్తిగత వివరాలను హైదరాబాద్‌లోని ఐటీ గ్రిడ్స్ అనే ప్రైవేట్ సంస్థ ద్వారా టీడీపీ ప్రధాన కార్యాలయానికి అనుసంధానించారు. టీడీపీ ఎన్నికల వ్యూహం కోసం రూపొందించిన 'సేవా మిత్ర' యాప్‌లోకి ప్రజల వ్యక్తిగత డేటాను చేరవేశారు. పేరు, చిరునామా, కులం, మతం, ఆధార్ నంబరు, ఓటరు కార్డు నంబరు, పోలింగ్ బూత్ నంబరు, బ్యాంకు ఖాతా నంబరు... ఇలా పూర్తి వివరాలు టీడీపీ సేవా మిత్ర యాప్‌లో అనుసంధానమయ్యాయి. అనంతరం వాటిని దుర్వినియోగం చేస్తూ టీడీపీ ఎన్నికల అక్రమాలకు పాల్పడింది. వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులని భావించిన దాదాపు 35 లక్షల మంది ఓట్లను తొలగించేందుకు బరి తెగించింది. దానిపై అప్పట్లోనే వైఎస్సార్‌సీపీ పూర్తి ఆధారాలతో ఫిర్యాదు చేయడంతో హైదరాబాద్ పోలీసులు కేసు నమోదు చేశారు.

మన ఊరు- మన గుడి



అంతర్వేది క్షేత్రంలో లక్ష్మీ నృసింహస్వామి శిలా రూపంలో పశ్చిమముఖంగా అవతరించారు. ఏటా మాఘ మాసంలో శుద్ధ సప్తమి (రథసప్తమి) నుంచి తొమ్మిది రోజులపాటు క్షేత్రంలో లక్ష్మీనరసింహుని దివ్య తిరుకల్యాణ మహోత్సవాలు కనుల వైకుంఠంగా సాగుతాయి. మాఘమాసం సూర్యభగవానుడికి ప్రీతికరమైంది. సూర్యనారాయణ మూర్తి సాక్షాత్తూ నారాయణ స్వరూపం. కలియుగంలో కనిపించే దేవుడు సూర్యనారాయణుడు. ఈ కారణంగా రథసప్తమి రోజు నుంచి కళ్యాణోత్సవాలు మొదలు పెట్టడం ఆనవాయితీగా వస్తోంది. ఈ ఏడాది ఫిబ్రవరి 4 నుంచి 13వ తేదీ వరకు నిర్వహించే స్వామివారి వార్షిక దివ్య తిరుకల్యాణ మహోత్సవాలు జరగనున్నాయి. 7వ తేదీ దశమి నాడు రాత్రి 12.55 గంటలకు మృగశిరా నక్షత్రయుక్త వృశ్చిక లగ్నంలో జరగనున్నాయి. తరువాత 8వ తేదీ భీష్మ ఏకాదశి నాడు నూతన వధూవరులుగా మూర్తీభవించే శ్రీస్వామి, అమ్మవార్లను రథంపై ఉంచి యాత్ర నిర్వహించనున్నారు.12వ తేదీ మాఘ పౌర్ణమి రోజున వశిష్ఠ నదీ సంగమ ప్రాంతాలలో స్వామివారికి చక్ర స్నానం నిర్వహిస్తారు.

> దక్షిణకాశీగా పేరొందిన అంతర్వేది క్షేత్రం మహిమాన్వితమైనది. ఉమ్మడి తెలుగు రాష్ట్రాలలో విరాజిల్లుతున్న నర్శింహుని క్షేత్రాలలో ఇది పురాణ ప్రసిద్ధి చెందింది. లక్ష్మీ నరసింహస్వామి కల్యాణానికి రాష్ట్రం నలుమూలల నుంచి వేలాదిగా భక్తులు తరలి వస్తారు. స్వామివారి కల్యాణంలో భక్త కుటుంబాల వారే కర్తలుగా శుభ కార్యక్రమం జరిపించడంలో ముఖ్యభూమిక పోషిస్తున్నారు.



అంతర్వేది లక్ష్మీ నరసింహ స్వామి

కల్యాణం చూతము రారండి

> • ఫిబ్రవరి 4 నుంచి 13 వరకు కల్యాణోత్సవాలు • 7వ తేదీ రాత్రి 12.55 గంటలకు కళ్యాణ ముహూర్తం • స్వామివారి కళ్యాణ తంతులో పలు కుటుంబాల భాగస్వామ్యం • మొగల్తూరు రాజ వంశీయులతోపాటు సామాన్య కుటుంబాల వరకు.. • రెండు తెలుగు రాష్ట్రాల నుంచి భక్తుల రాక

భక్తజనమే పెళ్లిపెద్దలుగా...

లక్ష్మీ నర్శింహస్వామి ఆలయాన్ని నిర్మించడం దగ్గర నుంచి ఆయన కళ్యాణంలో పలు కుటుంబాల వారు కర్తలుగా నిలబడి కళ్యాణాన్ని నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. నరసింహుని కళ్యాణంలో గోదావరికి ఇరు వైపుల వారు భాగస్వాములే. ఇటు కోనసీమ వాసులతోపాటు.. అటు పశ్చిమ గోదావరి జిల్లాలకు చెందిన కొన్ని కుటుంబాల వారు ఈ కళ్యాణ తంతు లో తమ వంతు సేవలందిస్తారు. అంతర్వేదిలో శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారి చక్ర స్నానం డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా పేరూరు వేద పండితుల చేతులు మీదుగా నిర్వహిస్తుండడం దశాబ్దాల కాలంగా వస్తోంది. కళ్యాణానికి ముందు స్వామి, అమ్మవార్లను పెండ్లి కుమారుడు, కుమార్తెలు చేసే అవకాశం బెల్లంకొండ, ఉండపల్లి వారి కుటుంబాల వారికి దక్కింది.రథసప్తమి రోజున నిర్వహించే ముద్రికాలంకణలో స్వామికి పంచెను బెల్లంకొండ కుటుంబాల వారు, అమ్మవారికి చీర ఉండపల్లి కుటుంబాల వారు ఇవ్వడం ఆనవాయితీగా వస్తోంది. కల్యాణ మహోత్సవంలో పశ్చిమ గోదావరి జిల్లా మొగల్తూరు రాజులు పెండ్లి కుమారుడి తరుపున నిలబడి కళ్యాణంలో పాల్గొంటారు. ప్రస్తుత వారసుడు రాజా కలిదిండి కుమార రామగోపాల రాజాబహుద్దర్ కళ్యాణోత్సవాలకు కల్యాణం లో స్వామివారి తరుపున నిలబడతారు. పశ్చిమగోదావరి జిల్లా పెనుమంత్ర మండలం పొలమూరుకు చెందిన కలిదిండి కుటుంబానికి చెందిన సుబ్బరాజు ఆధ్వర్యంలో కల్యాణోత్సవానికి తలంబ్రాలను తీసుకువస్తున్నారు. అలాగే శృంగవరప్పాడుకు చెందిన రావి, యెనుముల కుటుంబాలకు చెందిన వారు రథోత్సవం రోజున స్వామివారి ఉత్సవ మూర్తులను పల్లకిలో ఊరేగింపుగా తీసుకుని వస్తారు. పల్లకి ముందు భాగంలో రావి కుటుంబానికి చెందివారు... వెనుక భాగంలో యెనుముల కుటుంబాల వారు స్వామివారి ఉత్సవ మూర్తులను ఆలయం నుంచి రథం వరకు తీసుకు వస్తారు. ఇలా పలు కుటుంబాల వారు స్వామి వారి కళ్యాణంలో భాగస్వాములు.

> **లక్ష్మీ నరసింహుడే ఇక్కడ ఆదిదేవుడు**
> సాధారణంగా పరమేశ్వరుడికే ఆదిదేవుడని పేరు. అయితే కలియుగంలో నర, మృగ అవతారంలో మొట్టమొదటిగా ఉద్భవించిన రూపం లక్ష్మీ నరసింహస్వామి. ఈ కారణంగా పరమ శివుడినే కాకుండా లక్ష్మీ నర్శింహ స్వామి వారిని కూడా ఆదిదేవునిగా కొలుస్తారు ఇక్కడ.





రథోత్సవం

– నిమ్మకాయల సతీష్ బాబు, వి.ఎస్.బాపూజీ
సాక్షి, అమలాపురం, సఖినేటిపల్లి
ఫోటోలు: గరగ ప్రసాద్

పండుగ- పర్వం

పలుకు తేనెల తల్లి పుట్టిన రోజు శ్రీపంచమి



సకల విద్యాస్వరూపిణి, సకల వాఙ్మయానికీ మూలకారకురాలు, భాష, లిపి, కళలకు అధిదేవత సరస్వతీ మాత. పలుకు తేనెలతల్లి, వేదాలకు జనయిత్రి, వీణా పుస్తకధారిణి అయిన ఆ చల్లని తల్లి కరుణ అందరికీ అవసరం. ఉన్నత విద్యాప్రాప్తి, ఉన్నతోద్యోగం, పదోన్నతి లభించాలన్నా సరస్వతీ దేవి ఆవిర్భవించిన మాఘశుద్ధపంచమి రోజున ఆమెను పుస్తకాది రూపాలలో, విగ్రహంలో ఆవాహన చేసి పూజిస్తే మంచిది. విశేష అర్చన, పూజ, వ్రతోత్సవాలు చేస్తే ఆమె అనుగ్రహం కలుగుతుంది.ఆమెను తెల్లని పూలు, తెల్లని పట్టు వస్త్రంతో అలంకరించి, పెరుగు, వెన్న, వరిపేలాలు, తెల్ల నువ్వులతో చేసిన లడ్లు, చెరుకురసం, బెల్లం, తేనె, పాలకోవా, చక్కెర, కొబ్బరికాయ, రేగుపళ్లు నివేదిస్తే ప్రసన్నురాలై కోరిన కోరికలు తీరుస్తుందని శాస్త్రోక్తి.

(నేడు శ్రీ పంచమి)

కారణజన్ముడు కైవల్యాన్ని చేరిన భీష్మాష్టమి



మహాభారతంలో ఒక ప్రధానమైన, శక్తివంతమైన పాత్ర భీష్ముడిది. సత్యవర్తనుడిగా, పరాక్రముడిగా భీష్ముని పాత్ర చెప్పుకోదగినది. ఆయన అసలు పేరు దేవవ్రతుడు. ఆయన కారణజన్ముడు. అష్టవసువులలో ఒకడు. విష్ణు సహస్ర నామాలను మానవాళికి అందించిన భీష్ముడు పరమ పదాన్ని చేరిన మాఘశుద్ధ అష్టమికే భీష్మాష్టమి అని పేరు. అంపశయ్య మీద ఉన్నప్పుడు ధర్మరాజుకు వర్ణాశ్రమ ధర్మాలు, రాజధర్మాలు, ఆపద్ధర్మాలు, మోక్ష ధర్మాలు, శ్రాద్ధ ధర్మాలు, స్త్రీ ధర్మాలు, దానధర్మాలు.. లాంటి ఎన్నెన్నో ధర్మాలను గురించి ధర్మరాజుకు ఉన్న సందేహాలన్నింటికీ చక్కటి సమాధానాలిచ్చాడు భీష్ముడు. సంతానం లేని వారు భీష్ముడిని తలచుకుని ఆయనకు తర్పణం చేసినట్లయితే వారికి సంతానం కలిగేందుకు మార్గం సుగమం అవుతుందని పెద్దలు చెబుతారు.

(5, బుధవారం భీష్మాష్టమి)

ఆత్మదర్శనం

ద్వంద్వాతీతం కావాలి



భౌతిక ప్రపంచంలో విజయం సాధించడానికి మనస్సు అవసరమేమో గాని దైవసామ్రాజ్యంలోకి వెళ్ళడానికి హృదయం ఒక్కటే మార్గం. లౌకికమైన తెలివితేటలతో, జిత్తులతో దైవత్వాన్ని చేరనే లేవు. ఈ రెండూ భిన్నమార్గాలు. హృదయంతో ఉన్నప్పుడే నీలో స్వచ్ఛత ఉంటుంది. ఆ స్వచ్ఛతే నిన్ను నీలోనికి తీసుకు వెళ్తుంది. మనస్సుని దాటినప్పుడే అది ఎంత అనవసరమో అర్థమౌతుంది. అప్పుడే అజ్ఞానం అంతమై జ్ఞానంతో మరొకసారి జన్మిస్తావు. దీనికోసం మనస్సును అణచివేయాల్సిన అవసరం లేదు. మనస్సుకు అతీతం కావాలి. పసిపిల్లవాడిలాగా ఎటువంటి నమ్మకాలు లేకుండా స్వచ్ఛంగా ఒక ద్రష్టలాగా ఉండిపోవాలి. పసిబిడ్డకు నీది నాది అన్న భేదం ఉండదు. ప్రపంచం అంతా ఒక్కటే. ద్రష్టగా జీవిస్తూ ఉండాలి, మనస్సుతో కాదు. సాక్షిగా చూస్తున్నప్పుడే అద్వైతంలో ఉంటావు. అదే దైవదర్శనం, ఆత్మదర్శనం అంటే. ద్వైతం ఉన్నచోటే మనస్సు ఉంటుంది. నిజానికి ద్వైతం అన్నదే లేదు. ఉన్నది ఒక్క చైతన్యమే. అదే నీవు. నీకు భిన్నంగా ఏదీ లేదు. దైవమంటే నీకు భిన్నంగా ఎక్కడో ఉంది అని అనుకోవడమే ద్వైతం. ప్రేమ–ద్వేషం, ఆరోగ్యం – అనారోగ్యం, యవ్వనం – వృద్ధాప్యం, కోపం–శాంతం, చీకటి – వెలుతురు మొదలైన ద్వంద్వాలన్నీ ద్వైతంలోనే ఉంటాయి. సత్యం అనేది అద్వైతం. భిన్నధ్రువాలే ఉండవు. ద్వైతంలో చీకటి ఉంటే దానికి వెంటనే వెలుతురు ఉంటుంది, ఆందోళన ఉంటే ప్రశాంతత ఉంటుంది. కానీ ఆనందం అనేది ద్వంద్వాలకు అతీతమైనది. ద్వంద్వానికి అతీతమవ్వాలి. ద్వేషం, ఒత్తిడి, ఆందోళన ద్వైతంలోనే అనుభవమౌతాయి. ఎప్పుడైతే నీవు ఆత్మతత్వంలో ఉంటావో అప్పుడు మనస్సుకు అతీతంగా ఉంటావు.



– స్వామి మైత్రేయ, ఆధ్యాత్మిక గురువు

సాక్షి సినిమా

అసలు మీ ప్రాబ్లమ్ ఏంటి?



''ఒక మంచి అవకాశాన్ని సద్వినియోగం చేసుకునే వీలు ఉండడమే నా దృష్టిలో పెద్ద అదృష్టం. నాకు వచ్చిన పాత్రలకు తగ్గట్టుగా నన్ను నేను మల్చుకోగలగడం నా అదృష్టం. నన్ను ఒక సినిమాకి తీసుకుంటున్నారంటే ఎవరి కారణాలు వారికి ఉంటాయి. అయితే నాకు అవకాశాలు రావడానికి కేవలం అదృష్టం మాత్రమే కారణమని మీరనుకుంటే అనుకోండి... అది మీ ఇష్టం'' అంటూ కాస్త ఘాటుగా స్పందించారు పూజా హెగ్డే. షాహిద్ కపూర్ సరసన ఆమె నటించిన హిందీ చిత్రం 'దేవా' ఇటీవల విడుదలైంది. ఈ చిత్రం ప్రమోషన్స్‌లో పాల్గొన్నప్పుడు 'సల్మాన్ ఖాన్, హృతిక్ రోషన్ వంటి స్టార్స్ సినిమాల్లో మీకు అవకాశాలు రావడానికి అదృష్టమే కారణమా?' అని ఓ విలేకరి రెండు మూడు సార్లు అడగడంతో పై విధంగా స్పందించారు పూజా హెగ్డే. ప్రతిభతో కాకుండా అదృష్టంతో మాత్రమే అవకాశాలు వచ్చినట్లుగా పూజా హెగ్డేకి ఆ ప్రశ్న అనిపించి ఉంటుందని, అందుకే ఆమె ఈ విధంగా స్పందించి ఉంటారని ఊహించవచ్చు. ఇక మరో విలేకరి 'పెద్ద హీరోల సినిమాలకు అవకాశం వచ్చినప్పుడు మీరు ఏ ప్రాతిపదికన వాటిని అంగీకరిస్తారు' అని అడగ్గా... ''అసలు మీ ప్రాబ్లమ్ ఏంటి?'' అని ఘాటుగా స్పందించారు పూజా హెగ్డే. వాతావరణం వేడెక్కుతోందని గ్రహించిన షాహిద్ కపూర్ కల్పించుకుని, ''నీలా మారిపోయి ఆ హీరోలతో డ్యాన్స్ చేయాలని అతనికి (విలేకరిని ఉద్దేశించి) అనిపిస్తుందేమో'' అంటూ కూల్ చేశారు.

• పూజా హెగ్డే

వారాహి అమ్మవారి

ఆలయం చుట్టూ...



• బ్రహ్మానందం

వారాహి అమ్మవారిని దర్శించుకున్నారు బ్రహ్మానందం. మరి... ఏం కోరుకున్నారనేది ప్రస్తుతానికి సస్పెన్స్. సుమంత్ హీరోగా రూపొందుతున్న 'మహేంద్ర గిరి వారాహి' చిత్రంలోని ఓ సన్నివేశం ఇది. ఫిబ్రవరి 1న బ్రహ్మానందం పుట్టినరోజు సందర్భంగా ఈ చిత్రంలోని ఆయన లుక్‌ని విడుదల చేశారు. సంతోష్ జాగర్లపూడి దర్శకత్వంలో రాజశ్యామల ఎంటర్‌టైన్‌మెంట్‌పై కాలిపు మధు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ''సుమంత్ హీరోగా సంతోష్ దర్శకత్వంలో రూపొందిన 'సుబ్రహ్మణ్యపురం' సినిమా మంచి విజయాన్ని సొంతం చేసుకుంది. ఈ కాంబినేషన్‌లో రూపొందుతున్న 'మహేంద్రగిరి వారాహి' కూడా మంచి సక్సెస్ అవుతుందనే నమ్మకం ఉంది. మహేంద్రగిరిలో కొలువుదీరిన వారాహి అమ్మవారి ఆలయం చుట్టూ తిరిగే కథాంశంతో ఈ సినిమాను రూపొందిస్తున్నాం'' అని కాలిపు మధు తెలిపారు.



• విష్ణువర్ధన్, సచిన్, అఖిల్, తమన్

ఈ సారి టైటిల్ గెలుస్తాం

– అక్కినేని అఖిల్

సెలబ్రిటీ క్రికెట్ లీగ్ (సీసీఎల్) పదకొండో సీజన్ ఈ నెల 8 నుంచి మార్చి 2 వరకు జరగనున్న సంగతి తెలిసిందే. ఈ లీగ్‌లో ఇప్పటివరకు నాలుగు సార్లు విజేతగా నిలిచిన తెలుగు వారియర్స్ జట్టు మరో సారి పోటీకి సిద్ధమైంది. ఈ నేపథ్యంలో తెలుగు వారియర్స్ టీమ్ జెర్సీ ఆవిష్కరణ కార్యక్రమం హైదరాబాద్‌లో జరిగింది. ఈ సందర్భంగా తెలుగు వారియర్స్ జట్టు కెప్టెన్ అక్కినేని అఖిల్ మాట్లాడుతూ– ''సెలబ్రిటీ క్రికెట్ లీగ్ ఐడియాతో పదమూడేళ్ల క్రితం విష్ణు దీనిని ప్రారంభించారు. ఇప్పుడు 11వ సీజన్‌లోకి అడుగుపెట్టాం. దశాబ్ద కాలానికి పైగా ఓ కార్యక్రమం కొనసాగిందంటే, అది సక్సెస్ అయినట్లే లెక్క. ఇక ఈ లీగ్‌లో మేం ఇప్పటివరకు నాలుగు సార్లు టైటిల్ గెలిచాం. ఈ సీజన్‌లో టైటిల్ గెలిచి, ఐదోసారి చాంపియన్‌గా నిలుస్తామనే నమ్మకం ఉంది. ఈ నెల 14, 15 తేదీల్లో ఉప్పల్ స్టేడియమ్‌లో క్రికెట్ ఆడుతున్నాం. అందరూ వచ్చి సపోర్ట్ చేయాలని కోరుకుంటున్నాం'' అన్నారు. తమన్ మాట్లాడుతూ– ''మాది చాలా క్రేజీ టీమ్. అఖిల్ అగ్రెసివ్ కెప్టెన్. మూడు నెలలుగా చాలా ప్రాక్టీస్ చేశాం'' అని చెప్పారు. ''సీసీఎల్ 11వ సీజన్‌కు చేరుకోవడం మాకు గర్వ కారణం'' అని తెలిపారు సీసీఎల్ వ్యవస్థాపకుడు విష్ణువర్ధన్. టీమ్‌లోని అశ్విన్, రఘు, ఆది, సామ్రాట్, తెలుగు వారియర్స్ జట్టు యజమాని సచిన్ జోషి, రిక వ్యాలీ చైర్మన్ షౌరబ్ అర్భాత్ మాట్లాడారు.

ఆకాశంలో ఒక తార ఆరంభం



• దుల్కర్ సల్మాన్, అశ్వినీ దత్, అల్లు అరవింద్, పవన్ సాదినేని, గుణ్ణం గంగరాజు

దుల్కర్ సల్మాన్ హీరోగా పాన్ ఇండియా సినిమా 'ఆకాశంలో ఒక తార' ఆరంభమైంది. అల్లు అరవింద్ గీతా ఆర్ట్స్, స్వప్నా దత్ స్వప్న సినిమా సమర్పణలో లైట్ బాక్స్ మీడియా బ్యానర్‌పై సందీప్ గుణ్ణం, రమ్య గుణ్ణం ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. పవన్ సాదినేని దర్శకత్వం వహిస్తున్నారు. ఈ చిత్రం ప్రారంభోత్సవం సందర్భంగా చిత్రీకరించిన ముహూర్తం సన్నివేశానికి నిర్మాత అశ్వినీ దత్ కెమేరా స్విచాన్ చేయగా మరో నిర్మాత అల్లు అరవింద్ క్లాప్ కొట్టారు. నిర్మాత గుణ్ణం గంగరాజు గౌరవ దర్శకత్వం వహించారు. ''ఈ చిత్రానికి సంబంధించిన ఇతర నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలను త్వరలో తెలియజేస్తాం. 'ఆకాశంలో ఒక తార'ను తెలుగు, మలయాళ, తమిళ, కన్నడ, హిందీ భాషల్లో విడుదల చేస్తాం'' అని చిత్రబృందం పేర్కొంది. ఈ చిత్రానికి కెమేరా: సుజిత్ సారంగ్.



• బన్నీ వాసు, నాగచైతన్య, అల్లు అరవింద్, సందీప్ రెడ్డి, దేవిశ్రీ ప్రసాద్, సాయిపల్లవి, చందు మొండేటి

నా రియల్ లైఫ్ హీరోలు వీళ్లే!

– హీరో నాగచైతన్య

''ఒక యాక్టర్‌కి ఒక లిస్ట్ ఉంటుంది.. ఫలానా డైరెక్టర్‌తో చేస్తే కెరీర్‌కి ఉపయోగపడుతుందని. కానీ నా లిస్ట్‌లో గీతా ఆర్ట్స్ పేరు టాప్‌లో ఉంటుంది. ఈ బేనర్‌లో సినిమా చేసిన ఏ యాక్టర్ అయినా ఒక మంచి రిజల్ట్‌తో బయటికొస్తారు'' అని హీరో నాగచైతన్య అన్నారు. నాగచైతన్య, సాయిపల్లవి జంటగా నటించిన తాజా చిత్రం 'తండేల్'. 2018లో జరిగిన వాస్తవ సంఘటనల ఆధారంగా రూపొందిన ఈ చిత్రానికి చందు మొండేటి దర్శకత్వం వహించారు. అల్లు అరవింద్ సమర్పణలో గీతా ఆర్ట్స్ పతాకంపై బన్నీ వాసు నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 7న విడుదల కానుంది. ఈ సందర్భంగా 'తండేల్ జాతర' అంటూ యూనిట్ ఆదివారం హైదరాబాద్‌లో నిర్వహించిన ఈ సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో నాగచైతన్య మాట్లాడుతూ– ''ఈ వేడుకకు వచ్చినందుకు సందీప్ రెడ్డిగారికి ధన్యవాదాలు. ఈ మధ్యకాలంలో మీలా నిజాయతీ ఉన్న వ్యక్తిని చూడలేదు. మీ సినిమాలే కాదు... మీ ఇంటర్వ్యూల్లో ఓ నిజాయితీ కనిపిస్తుంది. ఇక నా రియల్ లైఫ్‌కి, తండేల్ రాజు క్యారెక్టర్‌కి చాలా తేడా ఉంటుంది. నేను రాజుగా ట్రాన్స్‌ఫార్మ్ కావడానికి టైమ్ ఇచ్చారు. చందు నన్ను నమ్మాడు. చందూతో నాకిది మూడో సినిమా. ప్రతి సినిమాకి నన్ను కొత్తగా చూపిస్తాడు. దేవిశ్రీ ప్రసాద్ ట్రూ రాక్‌స్టార్. 'నమో నమః శివాయ...' పాట రిహార్సల్స్ జరుగుతున్నప్పుడు దేవి సెట్‌కి వచ్చి ఎంతో ఎనర్జీ ఇచ్చాడు. కెమేరామేన్ శ్యామ్ సార్, ఇతర యూనిట్ అందరికీ థ్యాంక్స్. శ్రీకాకుళం నుంచి వచ్చిన మత్స్యకారులందరూ వేదిక మీదకు రావాలి. వీళ్లు లేకుండా ఈ తండేల్ రాజు క్యారెక్టరే లేదు. చందు నాకు ఈ కథను ఓ ఐడియాలా చెప్పాడు. చాలా ఎగ్జయిట్ అయ్యాను. ఆ తర్వాత మచ్చలేశంకి తీసుకెళ్లాడు. అక్కడ వీళ్లందర్నీ కలిశాను. అక్కడి మట్టి వాసన, వాళ్ల లైఫ్ స్టయిల్, ఎదుర్కొన్న సవాళ్ల, అనుభవాలు, తీసుకునే ఆహారం అన్నీ తెలుసుకున్నాను. అప్పుడు తండేల్ రాజు పాత్ర ఎలా చేయాలో ఐడియా వచ్చింది. పాకిస్తాన్‌లో సంవత్సరం పైన జైల్లో ఎన్నో సవాళ్ల ఎదుర్కొని వచ్చారు కదా... మళ్లీ ఎందుకు వేటకి వెళుతున్నారని వీళ్లని అడిగితే... 'మాకు ఇదే వచ్చు. సముద్రం తప్ప వేరే తెలియదు' అన్నారు. వాళ్ల ఆడవాళ్లల్లో భయం కనిపించింది. ఇది నిజమైన హ్యూమన్ ఎమోషన్. వీళ్లే నా రియల్ లైఫ్ హీరోలు. వ్యక్తులుగా వీళ్లు నన్ను ఎంతో ఇన్‌స్పైర్ చేశారు. ఈ సినిమా చూసి మీరంతా సంతోషపడతారని అనుకుంటున్నాను'' అని అన్నారు.

> ''ఈ సినిమా సక్సెస్ మీట్‌లో మాట్లాడతాను. ఇక ఈ ఈవెంట్‌కు బన్నీ (అల్లు అర్జున్) వస్తారని అనుకున్నాం. కానీ ఫారిన్ నుంచి వచ్చాడు. గ్యాస్ట్రైటిస్ ప్రాబ్లమ్‌తో రాలేకపోయాడు'' అని తెలిపారు అల్లు అరవింద్.

''ట్రైలర్, టీజర్, సాంగ్స్... ఏది చూసినా సినిమాలో మంచి ఎమోషనల్ కనెక్ట్ కనిపిస్తోంది. నాగచైతన్య – సాయిపల్లవి స్క్రీన్‌పై రియల్ పీపుల్‌లా కనిపిస్తున్నారు. ఇలా ఆర్టిస్టులు కనిపించిన సినిమాలన్నీ హిట్స్‌గా నిలిచాయి. 'అర్జున్ రెడ్డి' సినిమా కోసం హీరోయిన్‌గా సాయిపల్లవిని సంప్రదించాలని కో ఆర్డినేటర్‌తో మాట్లాడాను. ఆమె స్లీవ్‌లెస్ డ్రెస్‌లు ధరించరని చెప్పారు. భవిష్యత్‌లో అలానే ఉంటారా? అనిపించింది. ఆమె ఇప్పటికీ అలానే ఉన్నారు'' అన్నారు ముఖ్య అతిథిగా పాల్గొన్న దర్శకుడు సందీప్‌రెడ్డి వంగా.

''నాగచైతన్య, సాయిపల్లవి, అరవింద్‌గారు, చందు... ఇలాంటి టీమ్ అంతా కష్టపడి చేసిన మూవీ తప్పకుండా హిట్ అవుతుంది'' అన్నారు మరో ముఖ్య అతిథిగా పాల్గొన్న నిర్మాత 'దిల్' రాజు.

''ఈ సినిమా సక్సెస్‌మీట్‌లో మాట్లాడతాను'' అన్నారు చందు మొండేటి.

సాయిపల్లవి మాట్లాడుతూ– ''తండేల్ రాజుగా నాగచైతన్యగారు మారిన తీరు స్ఫూర్తిదాయకం. చందూగారికి ఫుల్ క్లారిటీ ఉంటుంది. దర్శకుడు సందీప్‌గారు ఎవరితో మాట్లాడారో నాకు తెలియదు. 'అర్జున్‌రెడ్డి' మూవీలో షాలినీ బాగా యాక్ట్ చేశారు. ఎవరు చేయాల్సిన మూవీ వారికే వెళ్తుంటుంది. 'తండేల్' వాస్తవ ఘటనల ఆధారంగా రూపొందింది. ఈ ఘటనలో భాగమైన మహిళలందరూ ధైర్యవంతులు'' అన్నారు.

దేవిశ్రీ ప్రసాద్ మాట్లాడుతూ– ''నాగార్జునగారి 'ఢమరుకం' కోసం శివుడు పాట చేశాను. ఇప్పుడు చైతూ కోసం శివుడి పాట చేశాను. తండ్రీకొడుకులతో శివుడి పాట చేయడం సంతోషంగా ఉంది'' అని చెప్పారు. ''రాజు–సత్యల మధ్య జరిగే కథ ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది. కార్తీక్ రాసిన మంచి కథకు చందు మంచి స్క్రీన్‌ప్లే ఇచ్చారు'' అన్నారు బన్నీ వాసు.

2018లో శ్రీకాకుళం నుంచి గుజరాత్‌కు వలస వెళ్లిన మత్స్యకారులు పొరపాటున పాకిస్తాన్ బోర్డర్ క్రాస్ చేసి, అక్కడి కోస్టుగార్డులకు బందీలుగా చిక్కారు. ఈ ఘటన ఆధారంగా 'తండేల్' తీశారు. ఈ ఘటనలో నిజంగా భాగమైన వారిలో తండేల్ రామారావు, రాజు, కిశోర్ తదితరులు ఈ వేడుకలో పాల్గొని, వారి అనుభవాలను పంచుకున్నారు.

బీసీసీఐ నజరానా రూ. 5 కోట్లు

న్యూఢిల్లీ: వరుసగా రెండోసారి మహిళల అండర్–19 టి20 ప్రపంచకప్ గెలిచిన యువ భారత జట్టుకు భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) భారీ నజరానా ప్రకటించింది. విజేత జట్టుకు రూ. 5 కోట్ల నగదు బహుమతి ఇవ్వనున్నట్లు ఆదివారం బోర్డు వెల్లడించింది. 'విశ్వ విజేతలకు శుభాకాంక్షలు. అండర్–19 ప్రపంచకప్ టైటిల్ నిలబెట్టుకున్న జట్టు సభ్యులకు నగదు బహుమతి ఇవ్వాలని నిర్ణయించాం. రెండోసారి వరల్డ్‌కప్ గెలిచిన జట్టు, సహాయక సిబ్బంది రూ. 5 కోట్లు అందిస్తాం' అని బీసీసీఐ ఒక ప్రకటనలో తెలిపింది. ఒక్క మ్యాచ్‌లోనూ ఓడిపోకుండా టైటిల్ గెలిచిన భారత జట్టుకు హైదరాబాద్‌కు చెందిన నౌషీన్ అల్ ఖదీర్ హెడ్ కోచ్‌గా వ్యవహరించింది. ఈ విజయం దేశంలో మహిళల క్రికెట్ ప్రాధాన్యత మరింత పెంచుతుందని బోర్డు అధ్యక్షుడు రోజర్ బిన్నీ అన్నారు. జట్టంతా సమష్టిగా రాణించడంతోనే ఈ ప్రదర్శన సాధ్యమైందని బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా అన్నారు. 2023లో తొలిసారి జరిగిన అండర్–19 టి20 ప్రపంచకప్ గెలిచిన భారత జట్టుకు కూడా అప్పట్లో బోర్డు రూ. 5 కోట్ల నజరానా అందించింది.

- భవిష్యత్ బాగుంది... టీమిండియా టీనేజ్ స్టార్స్‌పై స్టోరీ
- 376 పరుగుల లక్ష్యాన్ని వికెట్ కోల్పోకుండా ఛేదించిన సర్వీసెస్
- డేవిస్‌కప్ మ్యాచ్‌లో 4–0తో నెగ్గిన భారత్

సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో



అజేయం... అద్వితీయం

వరుసగా రెండోసారి అండర్–19 టి20 ప్రపంచకప్ నెగ్గిన భారత అమ్మాయిల జట్టు

త్రిష... త్రిష... త్రిష... ఈ ప్రపంచకప్‌ను అద్దం ముందు పెడితే తెలంగాణ ఆల్‌రౌండర్ ప్రదర్శనే ప్రతిబింబిస్తుందంటే అందులో ఏమాత్రం అతిశయోక్తి ఉండదు. కేవలం ఈ ఫైనల్ మ్యాచ్‌లో కనబరిచిన ఆల్‌రౌండ్ షోకే ఆమెను ఆకాశానికెత్తేయడం లేదు. టోర్నీ ఆరంభం నుంచి ప్రతి మ్యాచ్‌లోనూ తనదైన శైలిలో ఓపెనింగ్ దూకుడు, బౌలింగ్‌లో జట్టుకు అవసరమొచ్చినప్పుడు కీలకమైన వికెట్లు తీయడం త్రిషకే చెల్లింది. సఫారీ జట్టుతో టైటిల్ సమరంలో త్రిషతోపాటు స్పిన్నర్లు పారుణిక (4–0–6–2), ఆయుశి (4–2–9–2), వైష్ణవి (2/23)ల మాయాజాలంతో 'ఫైనల్ వార్' వన్‌సైడ్ అయ్యింది.

టైటిల్ పోరులో దక్షిణాఫ్రికాపై 9 వికెట్ల తేడాతో ఘనవిజయం

- త్రిష ఆల్‌రౌండ్ షోకు 'ఫైనల్ వార్' వన్‌సైడ్
- బౌలింగ్‌లో 3/15, బ్యాటింగ్‌లో 44 నాటౌట్
- త్రిషకు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'... 'ప్లేయర్ ఆఫ్ ద సిరీస్'

కౌలాలంపూర్: ఎలాంటి సంచలనం చోటు చేసుకోలేదు. ఆధిపత్యం అటు ఇటు కూడా మారలేదు. తొలి బంతి మొదలు విజయ తీరం చేరేదాకా భారత అమ్మాయిలదే హవా. ఏ లక్ష్యంతోనైనా మలేసియాలో అడుగు పెట్టారో ఆ లక్ష్యాన్ని అజేయంగా, అద్వితీయ ఆటతీరుతో మన అమ్మాయిలు అందుకున్నారు. వరుసగా రెండోసారి టి20 అండర్–19 ప్రపంచకప్ టైటిల్‌ను భారత అమ్మాయిలు సాధించారు. దక్షిణాఫ్రికా వేదికగా 2023 జనవరిలో జరిగిన తొలి అండర్–19 టి20 ప్రపంచకప్‌లో షఫాలీ వర్మ సారథ్యంలో భారత జట్టు విజేతగా నిలిచింది. ఈసారి డిఫెండింగ్ చాంపియన్ హోదాలో ఈ మెగా ఈవెంట్‌లో బరిలోకి దిగిన భారత్ తమ జైత్రయాత్రను అ'ద్వితీయ'ంగా ముగించింది. టోర్నీ మొత్తంలో ఓటమెరుగని మన జట్టే మరోసారి విశ్వ విజేతగా నిలిచింది. ఆదివారం జరిగిన ఫైనల్లో నికీ ప్రసాద్ నేతృత్వంలోని భారత జట్టు తొమ్మిది వికెట్ల తేడాతో దక్షిణాఫ్రికాను చిత్తు చేసింది. తొలుత స్పిన్ వలలో సఫారీ జట్టును 82 పరుగులకే పరిమితం చేసింది. మరో ముగ్గురు పది పైచిలుకు పరుగులు చేశారంతే! లెగ్ స్పిన్‌తో గొంగడి త్రిష 4–0–15–3తో అద్భుతమైన స్పెల్ వేయగా... మిగతా స్పిన్నర్లు పారుణిక సిసోడియా, ఆయుషి శుక్లా, వైష్ణవి శర్మ తలా 2 వికెట్లు పడగొట్టారు. ఆంధ్ర సీమర్ షబ్నమ్ షకీల్‌కు ఒక వికెట్ దక్కింది. అనంతరం భారత జట్టు స్టార్ ఓపెనర్ త్రిష (33 బంతుల్లో 44 నాటౌట్; 8 ఫోర్లు) దూకుడైన బ్యాటింగ్‌తో 11.2 ఓవర్లలోనే వికెట్ మాత్రమే కోల్పోయి 84 పరుగులు చేసి గెలిచింది. ఆల్‌రౌండ్ మెరుపులతో 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'తో పాటు ఈ మెగా టోర్నీలోనే త్రిష (309 పరుగులు; 7 వికెట్లు) అద్వితీయ ప్రదర్శనకు 'ప్లేయర్ ఆఫ్ ద టోర్నీ' అవార్డు కూడా దక్కించుకుంది.

స్పిన్ వలలో విలవిల

దక్షిణాఫ్రికాకు సీనియర్, జూనియర్, జెండర్ (పురుషులు, మహిళలు) ఇలా ఏ స్థాయిలోనూ ప్రపంచకప్ భాగ్యం లేదన్నది మరోసారి నిరూపితమైంది. మొదట బ్యాటింగ్‌కు దిగి భారీ స్కోరుతో 'కప్' భాగ్యం దక్కించుకుందామనుకున్న సఫారీ యువతుల జట్టు భారత స్పిన్ వలలో చిక్కి శల్యమైంది. రెండో ఓవర్లోనే పారుణికతో భారత్ మాయాజాలం నుంచి ఆఖరి దాకా బయట పడలేకపోయింది. సిమోన్ లౌరెన్స్ (0)ను పారుణిక డకౌట్ చేయగా, జెమ్మా బోథా (14 బంతుల్లో 16; 3 ఫోర్లు) బౌండరీల దూకుడుకు ఆదిలోనే షబ్నమ్ చెక్ పెట్టింది. ఇక అక్కడితో దక్షిణాఫ్రికా పతనం మొదలైంది.

ధనాధన్

ప్రపంచకప్ కోసం 83 పరుగుల లక్ష్య దూరంలో ఉన్న భారత్‌ను ఓపెనర్ త్రిష తన షాన్‌దార్ బ్యాటింగ్ పెర్ఫార్మెన్స్‌తో మరింత సులువుగా, వేగంగా విజయతీరాలకు తీసుకెళ్లింది. బౌండరీలతో తనమార్క్ స్ట్రోక్ ప్లేతో అలరించిన ఆమె జట్టు గెలిచేదాకా క్రీజులో నిలిచింది.

స్కోరు వివరాలు

దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్: జెమ్మా (సి) కమలిని (బి) షబ్నమ్ 16; లౌరెన్స్ (బి) పారుణిక 0; దియారా (బి) ఆయుశి 3; కైలా రేనెకె (సి) పారుణిక (బి) త్రిష 7; కరబో మెసో (బి) ఆయుశి 10; మీక్ వాన్ (స్టంప్డ్) కమలిని (బి) త్రిష 23; కోలింగ్ (బి) వైష్ణవి 15; శేషిని నాయుడు (బి) త్రిష 0; ఆష్లే వాన్‌విక్ (సి) వైష్ణవి (బి) పారుణిక 0; మోనాలిసా (బి) వైష్ణవి 0, ఎన్‌తబిసెంగ్ నిని (నాటౌట్) 2; ఎక్స్‌ట్రాలు 6; **మొత్తం (20 ఓవర్లలో ఆలౌట్) 82. వికెట్ల పతనం:** 1–11, 2–20, 3–20, 4–40, 5–44, 6–74, 7–74, 8–80, 9–80, 10–82. **బౌలింగ్:** జోషిత 2–0–17–0, పారుణిక 4–0–6–2, షబ్నమ్ 2–0–7–1, ఆయుశి 4–2–9–2, వైష్ణవి 4–0–23–2, త్రిష 4–0–15–3. **భారత్ ఇన్నింగ్స్:** కమలిని (సి) లౌరెన్స్ (బి) రేనెకె 8; త్రిష (నాటౌట్) 44; సనిక (నాటౌట్) 26; ఎక్స్‌ట్రాలు 6; **మొత్తం (11.2 ఓవర్లలో వికెట్ నష్టానికి) 84. వికెట్ల పతనం:** 1–36. **బౌలింగ్:** ఎన్‌తబిసెంగ్ 1–0–7–0, ఫే కోలింగ్ 2–0–19–0, కైలా రేనెకె 4–1–14–1, శేషిని 1–0–12–0, వాన్‌విక్ 1–0–12–0, మోనాలిసా 1.2–0–10–0, జెమ్మా బోథా 1–0–9–0.

ఆహా... ఆదివారం

భారత క్రీడాభిమానులకు ఆదివారం పండుగలా గడిచింది. మధ్యాహ్నం కౌలాలంపూర్‌లో భారత అమ్మాయిల జట్టు ఆల్‌రౌండ్ ప్రదర్శనతో వరుసగా రెండోసారి అండర్–19 టి20 ప్రపంచకప్‌ను సొంతం చేసుకుంది. తెలంగాణ అమ్మాయి గొంగడి త్రిష చిరస్మరణీయ ఆటతీరుతో అదరగొట్టింది. భారత జట్టు రెండోసారి విశ్వవిజేతగా నిలువడంలో కీలకపాత్ర పోషించింది.

రాత్రి ఇటు ముంబైలో భారత పురుషుల జట్టు ఇంగ్లండ్‌పై వీరంగం సృష్టించింది. ముఖ్యంగా అభిషేక్ శర్మ ఆకాశమే హద్దుగా చెలరేగిపోయి టి20ల్లో రెండోసారి 'శత'క్కొట్టాడు. కేవలం 37 బంతుల్లోనే సెంచరీ అందుకున్న అభిషేక్ అమోఘమైన ఆటతో భారత జట్టు ఈ మ్యాచ్‌లో ఏకంగా 150 పరుగుల తేడాతో ఇంగ్లండ్‌ను చిత్తు చేసింది. ఐదు మ్యాచ్‌ల సిరీస్‌ను 4–1తో సొంతం చేసుకుంది.




అభిషేక్... అమోఘం

ఇన్నింగ్స్ తొలి బంతికే సామ్సన్ సిక్స్‌తో భారత్ ఆట ఆరంభం. మూడో ఓవర్లో బౌండరీతో అభిషేక్ ధాటి కాస్త ఆలస్యం! అంతే ఇక ఆ ఓవర్లోనే రెండు సిక్స్‌లతో పదునెక్కిన ప్రతాపం. ఆర్చర్, మార్క్ వుడ్, ఓవర్టన్ ఇలా పేసర్లు మారినా... లివింగ్‌స్టోన్, రషీద్‌లు స్పిన్నేసినా... బంతి గమ్యం, అభిషేక్ వీరవిహారం... ఈ రెండూ ఏమాత్రం మారలేదు. 13 సిక్సర్లతో 'వాంఖెడే'కు అభిషేకం... 37 బంతుల్లోనే శతకం... 18వ ఓవర్ దాకా అతనొక్కడిదే విధ్వంసం! ఆఖరి పోరు గెలిచి ఆతిథ్య దేశం ఆధిక్యానికి గండి కొట్టేద్దామనుకుంటే ఇంగ్లండ్ కనీసం జట్టంతా కలిపి 100 పరుగులైనా కొట్టలేకపోయింది. ప్రత్యర్థి పేస్, స్పిన్ వైవిధ్యం అభిషేక్ శర్మ ధాటిని ఏ ఓవర్లోనూ, ఏ బౌలింగ్‌తోనూ అసలు ప్రభావమే చూపలేకపోయింది.

సిక్సర్లతో వాంఖెడే అభిషేకం

- 37 బంతుల్లోనే శతకం
- 54 బంతుల్లో 13 సిక్స్‌లు, 7 ఫోర్లతో 135
- ఆఖరి టి20లో ఇంగ్లండ్‌పై 150 పరుగులతో భారత్ జయభేరి



అభిషేక్

ముంబై: ఏఐ... అదేనండీ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వైపే ఇప్పుడు ప్రపంచం చూస్తోంది. కానీ వాంఖెడే స్టేడియంలో మాత్రం మరో ఏఐ... అదే భయ్యా అభిషేక్ ఇంటలిజెంట్ బ్యాటింగ్ వైపే ఓ గంటసేపు కన్నార్పకుండా చూసేలా చేసింది. ఇది కదా ఫన్... ధన్ ధనాధన్! ఇదే కదా ఈ టి20 ద్వైపాక్షిక సిరీస్‌లో గత నాలుగు మ్యాచ్‌ల్లోనూ మిస్సయ్యింది. అయితేనే ఆఖరి పోరులో ఆవిష్కృతమైంది. అభిషేక్ శర్మ (54 బంతుల్లో 135; 7 ఫోర్లు, 13 సిక్స్‌లు) అమోఘ శతకం, అదేపనిగా విధ్వంసం ముంబై వాసుల్ని మురిపించింది. టీవీ, మొబైల్ యాప్‌లలో యావత్ భారత అభిమానుల్ని కేరింతలతో ముంచెత్తింది. అతని ఆటలో అయ్యో ఈ షాట్‌ను చూడటం మిస్ అయ్యామే అని బహుశా ఏ ఒక్కరికీ అనిపించి ఉండకపోవచ్చు! ఎందుకంటే ప్రతి షాట్ హైలైట్సే తలదన్నేలా ఉంది. ఆదివారం అసలైన టి20 వినోదాన్ని పంచిన చివరి టి20లో భారత్ 150 పరుగుల భారీ తేడాతో ఇంగ్లండ్‌ను చిత్తు చేసి ఐదు మ్యాచ్‌ల సిరీస్‌ను 4–1తో సొంతం చేసుకుంది. మొదట భారత్ నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్లను కోల్పోయి 247 పరుగుల భారీ స్కోరు చేసింది. శివమ్ దూబే (13 బంతుల్లో 30; 3 ఫోర్లు, 2 సిక్స్‌లు) ఉన్న కాసేపు మెరిపించాడు. బ్రైడన్ కార్స్ 3, మార్క్‌వుడ్ 2 వికెట్లు తీశారు. తర్వాత కష్టమైన లక్ష్యం ఛేదించేందుకు దిగిన ఇంగ్లండ్ 10.3 ఓవర్లలోనే 97 పరుగుల వద్దే ఆలౌటైంది. ఓపెనర్ ఫిల్ సాల్ట్ (23 బంతుల్లో 55; 7 ఫోర్లు, 3 సిక్స్‌లు) బాదిన అర్ధశతకంతో ఆ మాత్రం స్కోరు చేసింది. మిగతావారిలో జాకబ్ బెథెల్ (10; 1 సిక్స్) తప్ప అందరివి సింగిల్ డిజిట్లే! షమీ 3 వికెట్లు పడగొడితే ఒక్క ఓవర్ వేసిన అభిషేక్, దూబే, వరుణ్‌లు తలా 2 వికెట్లు తీసి ఇంగ్లండ్‌ను 11వ ఓవర్ ముగియక ముందే స్పిన్‌తో దున్నేశారు.

ఇంగ్లండ్ పాలిట సిక్సర పిడుగల్లే...

మ్యాచ్ గురించి మాట్లాడుకోవడానికి ఏమీ లేదు. ఎందుకంటే మ్యాచ్ అంతటిని అభిషేక్ ఒక్కడే షేక్ చేశాడు. ఐదు పదుల బంతులు (54) ఎదుర్కొంటే ఇందులో కేవలం 5 మాత్రమే డాట్ బాల్స్. అంటే పరుగు రాలేదు. కానీ మిగతా 49 బంతుల్లో 'రన్'రంగమే... ప్రత్యర్థి బౌలర్లెమో లబో... దిబో! ఇది అభిషేక్ సాగించిన విధ్వంసం. 17 బంతుల్లోనే అతను సాధించిన ఫిఫ్టీ భారత్ తరఫున రెండో వేగవంతమైన అర్ధశతకమైంది. అంతేనా... పవర్ ప్లే (6 ఓవర్లు)లో జట్టు స్కోరు 95/1 ఇది భారత్ తరఫున అంతర్జాతీయ టి20ల్లోనే అత్యధిక స్కోరైంది. ఆ తర్వాత 37 బంతుల్లోనే దంచేసిన మెరుపు శతకం శాశ్వత దేశాల మధ్య రెండో వేగవంతమైన సెంచరీగా పుటలకెక్కింది. 2017లో మిల్లర్ (దక్షిణాఫ్రికా) బంగ్లాదేశ్‌పై 35 బంతుల్లో శతక్కొట్టాడు. 3.5 ఓవర్లో 50 పరుగులు దాటిన భారత్ స్కోరు అతనొక్కడి జోరుతో 6.3 ఓవర్లోనే వందకు చేరింది. భారత్ 12వ ఓవర్లో 150, 16వ ఓవర్లో 200 పరుగుల్ని అవలీలగా దాటేసింది. మిగతావారిలో శివమ్ దూబే కాస్త మెరిపించాడు. అయితే దూబే (2–0–11–2) బౌలింగ్ స్పెల్‌తో గత మ్యాచ్ 'కన్‌కషన్' విమర్శలకు తాజా మ్యాచ్‌లో బంతితో సమాధానమిచ్చాడు. అభిషేక్ శర్మకు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'... వరుణ్ చక్రవర్తికి 'ప్లేయర్ ఆఫ్ ద సిరీస్' అవార్డులు లభించాయి.

స్కోరు వివరాలు

భారత్ ఇన్నింగ్స్: సామ్సన్ (సి) ఆర్చర్ (బి) వుడ్ 16; అభిషేక్ (సి) ఆర్చర్ (బి) రషీద్ 135; తిలక్ వర్మ (సి) సాల్ట్ (బి) కార్స్ 24; సూర్యకుమార్ (సి) సాల్ట్ (బి) కార్స్ 2; దూబే (సి) రషీద్ (బి) కార్స్ 30; హార్దిక్ (సి) లివింగ్‌స్టోన్ (బి) వుడ్ 9; రింకూసింగ్ (ఎల్బీడబ్ల్యూ) (బి) ఆర్చర్ 9; అక్షర్ రనౌట్ 15; షమీ నాటౌట్ 0; రవి బిష్ణోయ్ (సి) కార్స్ (బి) ఓవర్టన్ 0; ఎక్స్‌ట్రాలు 7; **మొత్తం (20 ఓవర్లలో 9 వికెట్లకు) 247. వికెట్ల పతనం:** 1–21, 2–136, 3–145, 4–182, 5–193, 6–202, 7–237, 8–247, 9–247. **బౌలింగ్:** జోఫ్రా ఆర్చర్ 4–0–55–1, మార్క్‌వుడ్ 4–0–32–2, ఓవర్టన్ 3–0–48–1, లివింగ్‌స్టోన్ 2–0–29–0, అదిల్ రషీద్ 3–0–41–1, బ్రైడన్ కార్స్ 4–0–38–3.

ఇంగ్లండ్ ఇన్నింగ్స్: సాల్ట్ (సి) సబ్–జురేల్ (బి) దూబే 55; డకెట్ (సి) అభిషేక్ (బి) షమీ 0; బట్లర్ (సి) తిలక్‌వర్మ (బి) వరుణ్ 7; హ్యారీ బ్రూక్ (సి) వరుణ్ (బి) రవి బిష్ణోయ్ 2; లివింగ్‌స్టోన్ (సి) రింకూ (బి) వరుణ్ 9; జాకబ్ (బి) దూబే 10; కార్స్ (సి) వరుణ్ (బి) అభిషేక్ 3; ఓవర్టన్ (సి) సూర్యకుమార్ (బి) అభిషేక్ 1; ఆర్చర్ నాటౌట్ 1; రషీద్ (సి) సబ్–జురేల్ (బి) షమీ 6; మార్క్‌వుడ్ (సి) సబ్–జురేల్ (బి) షమీ 0; ఎక్స్‌ట్రాలు 3; **మొత్తం (10.3 ఓవర్లలో ఆలౌట్) 97. వికెట్ల పతనం:** 1–23, 2–48, 3–59, 4–68, 5–82, 6–87, 7–90, 8–90, 9–97, 10–97. **బౌలింగ్:** షమీ 2.3–0–25–3, హార్దిక్ పాండ్యా 2–0–23–0, వరుణ్ 2–0–25–2, రవి బిష్ణోయ్ 1–0–9–1, శివమ్ దూబే 2–0–11–2, అభిషేక్ 1–0–3–2.

1 భారత్ తరఫున అంతర్జాతీయ టి20ల్లో అత్యధిక వ్యక్తిగత స్కోరు (135) చేసిన ప్లేయర్‌గా అభిషేక్ నిలిచాడు. శుబ్‌మన్ గిల్ (126 నాటౌట్; న్యూజిలాండ్‌పై) రెండో స్థానంలో ఉన్నాడు.

2 భారత్ తరఫున అంతర్జాతీయ టి20ల్లో వేగవంతమైన సెంచరీ (37 బంతుల్లో) చేసిన రెండో ఆటగాడు అభిషేక్. రోహిత్ శర్మ (35 బంతుల్లో; శ్రీలంకపై) అగ్రస్థానంలో ఉన్నాడు.

13 ఈ మ్యాచ్‌లో అభిషేక్ కొట్టిన సిక్స్‌లు. భారత్ తరఫున అంతర్జాతీయ టి20 మ్యాచ్‌లో ఇదే అత్యధికం. రోహిత్ (10 సిక్స్‌లు; శ్రీలంకపై), సామ్సన్ (10 సిక్స్‌లు; దక్షిణాఫ్రికాపై), తిలక్ (10 సిక్స్‌లు; దక్షిణాఫ్రికాపై) రెండో స్థానాల్లో ఉన్నారు.



తొలి కల నెరవేరింది

క్రికెట్ బ్యాట్ పట్టుకున్నప్పటి నుంచి జాతీయ జట్టుకు ప్రాతినిధ్యం వహించాలనే ఏకైక లక్ష్యం పెట్టుకున్నాని... అలాంటిది అండర్–19 స్థాయిలోనే రెండుసార్లు టి20 ప్రపంచకప్ గెలిచిన భారత మహిళల జట్టులో భాగం కావడం చాలా సంతోషంగా ఉందని రైజింగ్ స్టార్ గొంగడి త్రిష పేర్కొంది. మలేసియా వేదికగా జరిగిన మహిళల అండర్–19 టి20 వరల్డ్‌కప్‌లో అద్వితీయ ప్రదర్శన కనబర్చి 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా నిలిచిన 19 ఏళ్ల త్రిష తన తొలి కల నెరవేరిందని పేర్కొంది. సీనియర్ జట్టులోనూ అవకాశం దక్కితే నిరూపించుకునేందుకు సిద్ధంగా ఉన్నానంటున్న తెలుగమ్మాయి త్రిషతో

'సాక్షి' ప్రత్యేక ఇంటర్వ్యూ...

రెండుసార్లు అండర్–19 ప్రపంచకప్ గెలవడం చిరస్మరణీయం

- ఇక సీనియర్ స్థాయిపై దృష్టి
- కౌలాలంపూర్ నుంచి 'సాక్షి'తో 'ప్లేయర్ ఆఫ్ ద టోర్నీ' త్రిష

త్రిష

రెండు సార్లు ప్రపంచకప్ గెలవడం ఎలా అనిపిస్తోంది?

ఈ ఆనందం మాటల్లో వర్ణించలేను. సాధారణంగా అండర్–19 ప్రపంచకప్‌లో ఒక్కసారి పాల్గొనే అవకాశం రావడమే కష్టం. అలాంటిది నాకు రెండుసార్లు ఆ చాన్స్ వచ్చింది. చిన్న వయసు నుంచే రాణిస్తుండటంతో రెండుసార్లు వరల్డ్‌కప్ ఆడగలిగా. జట్టు విజయాల్లో నావంతు పాత్ర పోషించినందుకు సంతోషంగా ఉన్నాను.

'ప్లేయర్ ఆఫ్ టోర్నమెంట్'గా నిలవడంపై స్పందన?

2023లో జరిగిన ప్రపంచకప్‌లో బ్యాటింగ్ చేసేందుకు ఎక్కువ అవకాశాలు రాలేదు. ఈసారి ఓపెనర్‌గా బరిలోకి దిగడం కలిసొచ్చింది. నా ప్రదర్శన జట్టు విజయానికి దోహదపడితే అంతకుమించి ఇంకేం కావాలి. టోర్నీ టాప్ స్కోరర్‌గా నిలవడంతో పాటు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్', 'ప్లేయర్ ఆఫ్ ద టోర్నీ' అవార్డులు గెలుచుకోవడం చాలా ఆనందంగా ఉంది.

వరల్డ్‌కప్‌నకు ముందు ఎలాంటి సాధన చేశారు?

కెరీర్‌లో అత్యధికంగా హైదరాబాద్‌లోనే ప్రాక్టీస్ చేశా. మిథాలీ రాజ్ ఆట అంటే నాకు చాలా ఇష్టం. ఆమె అడుగుజాడల్లోనే సుదీర్ఘ కాలం భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించాలని అనుకుంటున్నా. హైదరాబాద్‌కే చెందిన నౌషీన్ అల్ ఖదీర్ భారత అండర్–19 జట్టు హెడ్ కోచ్‌గా ఉండటం కూడా కలిసొచ్చింది. ఆమెకు నా ఆటతీరు బాగా తెలియడంతో మెరుగయ్యేందుకు తగిన సూచనలు ఇస్తూ ప్రోత్సహించింది.

జట్టు సభ్యులతో మీ అనుబంధం?

చాన్నాళ్లుగా అండర్–19 జట్టు తరఫున ఆడుతున్నాను. ప్లేయర్ల మధ్య మంచి అనుబంధం ఉంది. అండర్–19 ఆసియా కప్‌లోనూ దాదాపు ఇదే జట్టుతో ఆడాం. అక్కడా విజేతగా నిలవగలిగాం. ఇప్పుడు అదే టీమ్ స్పిరిట్ ఇక్కడ కూడా కొనసాగించాం. ప్లేయర్లంతా ఒక కుటుంబంలా ఉంటాం.

ఈ వరల్డ్‌కప్‌లో మీకు అప్పగించిన బాధ్యతలు?

ప్రపంచకప్ ప్రారంభం కావడానికి ముందే జట్టు యాజమాన్యం నా బాధ్యతలను స్పష్టంగా వివరించింది. ఓపెనర్‌గా బరిలోకి దిగుతుండటంతో బ్యాటింగ్ భారం మోయాల్సి ఉంటుందని ముందే తెలుసు. కేవలం వ్యక్తిగత ప్రదర్శనే కాకుండా... జట్టుగానూ అంతా కలిసి కట్టుగా కదంతొక్కడంతోనే రెండోసారి ప్రపంచకప్ గెలవగలిగాం.

గత ప్రపంచకప్‌నకు, ఈ వరల్డ్‌కప్‌నకు మధ్య మీ ప్రదర్శనలో వచ్చిన తేడా ఏంటి?

2023లో జరిగిన ప్రపంచకప్‌లో మిడిలార్డర్‌లో బ్యాటింగ్ చేశా. ఆ సమయంలో అంతర్జాతీయ అనుభవం ఉన్న షఫాలీ వర్మ, రిచా ఘోష్‌లతో పాటు మరికొంత మంది సీనియర్ ప్లేయర్లు జట్టులో ఉండటంతో ఎక్కువ బ్యాటింగ్ చేసే అవకాశం దక్కలేదు. 2023 ఫైనల్లోనూ టాప్ స్కోరర్‌గా నిలిచినా... చివరి వరకు క్రీజులో ఉండి జట్టును గెలిపించలేక పోయా. దీంతో ఈసారి మరింత మెరుగైన ప్రదర్శన చేయాలని ముందే అనుకున్నాను. నా ప్రణాళికలు ఫలించాయి.



తండ్రి రామిరెడ్డితో త్రిష

మీ ఆటతీరు వెనుక కుటుంబ సభ్యుల పాత్ర ఎంత ఉంది?

కేవలం ఈ ప్రపంచకప్‌లో నా ప్రదర్శన అనే కాదు... నేనీస్థాయికి రావడం వెనక మా నాన్న రామిరెడ్డి కృషి ఎంతో ఉంది. ఆయన చేసిన త్యాగాలే ఈ రోజు నా బ్యాట్ నుంచి పరుగుల రూపంలో వస్తున్నాయనుకుంటా. ప్రతి దశలో మా నాన్న నాకు అండగా నిలవడంతోనే నిలకడైన ప్రదర్శన కనబర్చగలిగాను. ఎక్కడ మ్యాచ్ జరిగినా నా వెంట నాన్న ఉంటారు. వరల్డ్‌కప్ మొత్తం నా వెన్నంటి నిలిచి... ఎప్పటికప్పుడు నాలో స్ఫూర్తినింపారు. అందుకే 'ప్లేయర్ ఆఫ్ ద టోర్నమెంట్' అవార్డును మా నాన్నకు అంకితమిస్తున్నాను.

భవిష్యత్తు ప్రణాళికలు ఏంటి?

అవకాశం వచ్చిన ప్రతిసారి రాణించాలని చిన్నప్పటి నుంచే కలలు కన్నాను. వ్యక్తిగతంగా ఇప్పటికి నా మొదటి కల నెరవేరింది. అవకాశం వస్తే సీనియర్ జట్టు తరఫున కూడా ఇదే ప్రదర్శన కొనసాగించాలనుకుంటున్నా.

టోర్నీలో త్రిష గణాంకాలు

మ్యాచ్‌లు	7
ఇన్నింగ్స్‌లు	7
పరుగులు	309
అత్యధిక స్కోరు	110
సగటు	77.25
సెంచరీలు	1
ఫోర్లు	45
సిక్స్‌లు	5

అభినందనల వెల్లువ

అండర్–19 ప్రపంచకప్ గెలిచిన భారత జట్టుకు అభినందనలు. ఇది భారత నారీ శక్తికి నిదర్శనం. సమష్టి కృషి, సడలని సంకల్పానికి దక్కిన ఫలితం ఇది. ఈ విజయం యువ క్రీడాకారులకు స్ఫూర్తినిస్తుంది. –నరేంద్ర మోదీ, ప్రధానమంత్రి

వరుసగా రెండోసారి అండర్–19 ప్రపంచకప్ గెలిచిన యువ భారత జట్టుకు అభినందనలు. ఈ విజయం చాలా మందికి స్ఫూర్తి. భవిష్యత్తు కోసం కొత్త ప్రమాణాలు నిర్దేశించింది. –సచిన్ టెండూల్కర్

ఐసీసీ మహిళల అండర్–19 టి20 ప్రపంచకప్‌లో విజేతగా నిలిచిన యువ భారత జట్టుకు ప్రత్యేక అభినందనలు. రెండోసారి ఈ ట్రోఫీ చేజిక్కించుకోవడంలో తెలుగు అమ్మాయిలు గొంగడి త్రిష, షబ్నమ్ కీలకపాత్ర పోషించడం ఈ ఆనందాన్ని రెట్టింపు చేసింది.
–వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు

వరుసగా రెండోసారి మహిళల అండర్–19 టి20 ప్రపంచకప్ గెలిచిన భారత జట్టుకు అభినందనలు. ట్రోఫీ చేజిక్కించుకోవడంలో తెలంగాణ ప్లేయర్ త్రిష కీలకపాత్ర పోషించింది. త్రిష లాంటి క్రీడాకారులు రాష్ట్రానికి గర్వకారణం. త్రిష భవిష్యత్తులో భారత సీనియర్ జట్టు తరఫునా రాణించాలి. –రేవంత్ రెడ్డి, తెలంగాణ ముఖ్యమంత్రి

అండర్–19 ప్రపంచకప్‌లో అజేయంగా నిలిచి భారత్ తమ ఆధిపత్యం చాటుకుంది. ఇది అదిరిపోయే ప్రదర్శన. దీనికి సాటి ఏది లేదు. యావత్ దేశం గర్విస్తోంది.
–మిథాలీరాజ్, భారత మహిళల జట్టు మాజీ కెప్టెన్

స్టాక్ మార్కెట్లు

(శుక్రవారం ముగింపు)

దేశీ సూచీలు (శనివారం ముగింపు)

సూచీ	మార్పు	ముగింపు
సెన్సెక్స్ ▲	5	77,560
నిఫ్టీ ▼	26	23,482

విదేశీ సూచీలు

సూచీ	ముగింపు		మార్పు
నాస్‌డాక్	19,627	▼	54
డోజోన్స్	44,545	▼	337
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,674	▲	27
డాక్స్	21,732	▲	5
షాంఘై	3,251	▼	2
నికాయ్	39,514	▲	99

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

ఫారెక్స్ రేట్లు రూ. లలో

	కరెన్సీ		కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	86.05	87.07
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	105.20	108.00
€	యూరో	ఎస్‌బీఐ	88.77	91.39
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	54.62	55.98
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	53.19	55.39
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	60.95	65.62
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	22.13	23.69
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	22.19	23.74
¥	చైనా యువాన్	థామస్‌కుక్	11.01	12.83

గృహ రుణం.. స్మార్ట్‌గా తీర్చేద్దాం..!

రుణంతో సొంతింటి కలను కెరీర్ ఆరంభంలోనే నెరవేర్చుకుంటోంది నేటి తరం యువత. 25–30 ఏళ్ల కాలానికి రుణం తీసుకుని, క్రమం తప్పకుండా చెల్లించడం ఒక విధంగా పొదుపే. కానీ, అందరికీ అంత సుదీర్ఘకాలం పాటు రుణ వాయిదాలు చెల్లించే నగదు ప్రవాహ వెసులుబాటు ఉండకపోవచ్చు. వివాహం అనంతరం పెరిగిపోయిన ఖర్చులతో ఈఎంఐ చెల్లింపులు భారంగా మారొచ్చు. దీంతో త్వరగా రుణ భారం నుంచి బయటపడిపోవాలని అనిపిస్తుంటుంది. అయితే ఈ దిశగా ఆచరణ చాలా మందికి తోచదు. వ్యవస్థలో వడ్డీ రేట్లు గరిష్ట స్థాయిలో ఉన్నాయి. కనుక గృహ రుణాన్ని నిర్ణీత కాలానికంటే ముందుగా తీర్చేయడం మంచి ఆలోచనే అవుతుంది. ఇందుకు ఎన్నో మార్గాలున్నాయి. ఈ దిశగా నిపుణులు ఏమంటున్నారో తెలియజేసే కథనమిది...

– సాక్షి, బిజినెస్ డెస్క్

- తొలి నాళ్లలో ఈఎంఐలో 80–90% వడ్డీకే
- ఏటా అదనంగా చెల్లిస్తూ వెళ్లాలి
- దీంతో అసలుకు మరింత జమ
- ఏటా ఒక్క అదనపు ఈఎంఐతో ఎంతో ఆదా
- వేతన పెంపు స్థాయిలో చెల్లింపులు



ముంబైకి చెందిన నీరవ్ (35) 2015లో రూ.40 లక్షల గృహ రుణాన్ని 30 ఏళ్ల కాలానికి 8.5 శాతం వడ్డీ రేటుపై తీసుకున్నారు. నెలవారీ రూ.31,000 చొప్పున ఇంటి రుణానికి చెల్లిస్తున్నారు. దీంతో వేతనంలో సగానికి పైనే రుణ చెల్లింపులకు పోతోంది. రుణ ఖాతా వార్షిక నివేదికను ఒక్కసారి పరిశీలించగా, తొలి నాళ్లలో తాను చెల్లిస్తున్న ఈఎంఐలో అధిక భాగం వడ్డీ చెల్లింపులకే వెళుతున్నట్టు అర్థమైంది. దీంతో నిపుణుల సాయంతో ఐదేళ్లలోనే ఆ రుణాన్ని తీర్చివేశారు. నీరవ్ మాదిరే ప్రతి ఒక్కరూ తమకు వీలైన మార్గంలో గృహ రుణ భారాన్ని ముందుగానే వదిలించుకోవచ్చు. ఈఎంఐలో తొలి ఏడాది 90 శాతం వడ్డీ చెల్లింపులకు వెళుతుంది. ఏటా ఇది క్రమంగా తగ్గుతూ, అసలు వాటా పెరుగుతూ పోతుంది. ముఖ్యంగా 20–25 ఏళ్ల కాలానికి సంబంధించి గృహ రుణాల్లో మొదటి ఐదేళ్లలో వడ్డీ చెల్లింపులే ఎక్కువగా ఉంటాయి. ఉదాహరణకు రూ.75 లక్షల గృహ రుణాన్ని 25 ఏళ్ల కాలానికి 8.5 శాతం వడ్డీ రేటుపై తీసుకున్నారని అనుకుందాం. అప్పుడు నెలవారీ ఈఎంఐ రూ.60,392 అవుతుంది. 25 ఏళ్లలో వడ్డీ రూపంలోనే రూ.1.06 కోట్లు చెల్లించాల్సి వస్తుంది. అసలు రూ.75 లక్షలు కూడా కలిపితే మొత్తం రూ.1.81 కోట్లు అవుతుంది. అంటే తీసుకున్న మొత్తానికి రెట్టింపునకు పైగా వడ్డీ రూపంలో చెల్లించాలి. ఒకవేళ గృహ రుణంపై వడ్డీ రేటు 9.5 % గా ఉంటే అప్పుడు 25 ఏళ్లలో వడ్డీ రూపంలో 1.22 కోట్లు చెల్లించాల్సి వస్తుంది.



చాలా ఆదా చేసుకోవచ్చు..

గృహ రుణాన్ని కాల వ్యవధి చివర్లో కంటే మొదటి ఐదేళ్లలో తీర్చేయడం ఎంతో ప్రభావవంతంగా ఉంటుంది. ఎందుకంటే ఆరంభ సంవత్సరాల్లో ఈఎంఐలో వడ్డీ భాగమే ఎక్కువగా ఉంటుంది''అని బ్యాంక్ బజార్ సీఈవో ఆదిల్ శెట్టి తెలిపారు. రూ.50 లక్షల రుణాన్ని 9 శాతం వడ్డీపై 20 ఏళ్ల కాలానికి తీసుకున్నారని అనుకుందాం. ఈ కాలంలో వడ్డీ రూపంలోనే రూ.58 లక్షలు చెల్లించాల్సి ఉంటుంది. ఏడాది పూర్తయిన వెంటనే రూ.5 లక్షల మొత్తాన్ని అదనంగా చెల్లించడం ద్వారా మొత్తం కాల వ్యవధిలో 17.6 లక్షల మేర వడ్డీని ఆదా చేసుకోవచ్చు. అంటే అప్పుడు నికరంగా రూ.40.4 లక్షలు చెల్లిస్తే సరిపోతుంది. అంతేకాదు 240 నెలల్లో తీరిపోవాల్సిన రుణ భారం, 190 నెలలకే ముగిసిపోతుంది. అంటే రుణాన్ని 50 నెలల ముందే ముగించేయొచ్చు. తొలి నాళ్లలో వడ్డీలకే సింహభాగం పోతుంది. దీంతో అసలు పెద్దగా తగ్గదు. ఇలా వడ్డీకి ఎక్కువ మొత్తం జమ అవుతున్న తొలి సంవత్సరాల్లో చేసే అదనపు చెల్లింపులతో అసలు భాగం తగ్గుతుంది. ఫలితంగా ఈఎంఐలో వడ్డీ భాగం తగ్గి, అసలు జమ వేగాన్ని అందుకుంటుంది.

ముందుగా చెల్లిస్తే ఎంత ఆదా?

రూ.50 లక్షల రుణం. కాల వ్యవధి 20 ఏళ్లు. వడ్డీ 9 శాతం. రూ.5 లక్షలను రుణం తీసుకున్న అనంతరం ఏడాది, రెండేళ్లు, మూడేళ్లు, నాలుగేళ్లు, ఐదేళ్లు పూర్తి అయిన వెంటనే చెల్లించనట్టయితే, తద్వారా ఎంత మేర ఆదా అవుతుందో టేబుల్‌లో తెలుసుకోవచ్చు.

ఎన్నాళ్లలో	వడ్డీ నికర చెల్లింపు (రూ.లక్షల్లో)	ఆదా అయ్యే వడ్డీ (రూ.లక్షల్లో)	నికర రుణ వ్యవధి (నెలల్లో)	తగ్గిన రుణ వ్యవధి (నెలల్లో)
ఏడాది	40.4	17.6	190	50
రెండేళ్లు	42	15.9	194	46
మూడేళ్లు	43.6	14.4	197	43
నాలుగేళ్లు	45	12.9	201	39
ఐదేళ్లు	46.4	11.6	204	36

ఈక్విటీలో పెట్టుబడులు

గృహ రుణాన్ని ముందుగా వదిలించుకునేందుకు ఈక్విటీ పెట్టుబడుల మార్గాన్ని సైతం ఆశ్రయించొచ్చు. ఈక్విటీల్లో పదేళ్లకు పైన కాలంలో వార్షిక రాబడులు 12–15 శాతంగా ఉండొచ్చు. గృహ రుణంపై 9 శాతం వడ్డీయే పడుతుంది. కనుక ప్రతి నెలా గృహ రుణ ఈఎంఐ చెల్లిస్తూనే, ఈఎంఐలో 10–20 శాతం మేర ఈక్విటీ ఫండ్‌లో ఇన్వెస్ట్ చేస్తూ వెళ్లాలి. ఐదేళ్ల ముగిసిన తర్వాత నుంచి అప్పటి వరకు ఇన్వెస్ట్ చేసిన మొత్తానికి సమానంగా ఉపసంహరించుకుంటూ గృహ రుణ చెల్లింపులకు వినియోగించుకోవాలి. లేదా పదేళ్ల పాటు ఈక్విటీల్లో ఇన్వెస్ట్ చేసిన తర్వాత, మార్కెట్లు బుల్లిష్‌గా ఉన్న తరుణంలో ఆ మొత్తాన్ని ఉపసంహరించుకుని గృహ రుణానికి జమ చేసుకోవచ్చు. ఒక ఆర్థిక సంవత్సరంలో ఈక్విటీల్లో 1.25 లక్షల మొత్తంపై పన్ను లేదు. కనుక ఏడాదిలో రూ.1.25 లక్షల్లోపే వెనక్కి తీసుకోవడం ద్వారా పన్ను లేకుండా చూసుకోవచ్చు. పైన చెప్పుకున్న నీరవ్ ఉదాహరణను తీసుకుందాం. రూ.40 లక్షల రుణాన్ని 30 ఏళ్ల కాలానికి 8.50 శాతం రేటుపై తీసుకున్నారు. అప్పుడు నెలవారీ ఈఎంఐ రూ.31,000. మొత్తం కాల వ్యవధిలో సుమారు రూ.61 లక్షలు వడ్డీ పడుతోంది. ప్రతి నెలా ఈఎంఐలో 20 శాతం అంటే, 6,200 చొప్పున 12 శాతం రాబడిని ఇచ్చే ఈక్విటీ ఫండ్‌లో 30 ఏళ్ల పాటు ఇన్వెస్ట్ చేసుకోవాలి. తద్వారా గృహ రుణం తీరిపోయే సమయానికి రూ. 62 లక్షలు సమకూరుతుంది. వడ్డీకి సమానంగా నిధి ఏర్పడి రుణంపై చెల్లించిన వడ్డీకి సమానంగా నిధి ఏర్పడినట్టు అవుతుంది.





ఏటా 5 % లేదా ఒక ఈఎంఐ

అసలులో ఏటా నిర్ణీత శాతాన్ని అదనంగా చెల్లించాలి. రూ.50 లక్షల రుణాన్ని 9 శాతం రేటుపై 20 ఏళ్లకు తీసుకుంటే నెలవారీ ఈఎంఐ రూ. 44,986 అవుతుంది. కేవలం వడ్డీ రూపంలోనే రూ. 58 లక్షలు చెల్లించాలి. ఏటా రుణ బకాయిలో 5% చొప్పున ఒకే విడత తీర్చుతూ వెళితే చెల్లించాల్సిన వడ్డీ రూ.29.8 లక్షలకు తగ్గిపోతుంది. దీంతో 240 నెలలకు బదులు 143 నెలల్లోనే రుణాన్ని ముగించేయొచ్చు. ఏటా ఒక ఈఎంఐ (రూ.44,986) చొప్పున అదనంగా చెల్లిస్తూ వెళితే మొత్తం చెల్లించాల్సిన వడ్డీ రూ.58 లక్షలకు బదులు రూ.45 లక్షలు అవుతుంది. రూ.13 లక్షల వడ్డీ ఆదా అవడంతో పాటు రుణం 45 నెలల ముందే తీరిపోతుంది.

ఎన్నో మార్గాలు..

- ఉద్యోగులు అయితే వార్షిక బోనస్‌ను ముందస్తు రుణ చెల్లింపులకు వినియోగించుకోవచ్చు.
- కొందరికి బోనస్‌లు రావు. కానీ వార్షికంగా ఎంతో కొంత వేతన పెంపు ఉంటుంది. పెరుగుతున్న వేతనం స్థాయిలోనే గృహ రుణం ఈఎంఐని పెంచుకుంటూ వెళ్లాలి. ఏడాదికి ఒక్క ఈఎంఐ అదనంగా చెల్లించినా చాలా మొత్తాన్ని ఆదా చేసుకోవచ్చు.
- స్వయం ఉపాధి, వ్యాపారాల్లోని వారు సైతం భిన్న సందర్భాల్లో వచ్చే అదనపు ఆదాయ వనరులను ఇందుకు వినియోగించుకోవచ్చు.
- చాలా తక్కువ రాబడులు ఇచ్చే డెట్ పెట్టుబడులు ఉంటే వాటిని ఉపసంహరించుకుని గృహ రుణ చెల్లింపులకు మళ్లించుకోవచ్చు. కాకపోతే గృహ రుణం వడ్డీ రేటు కంటే, తక్కువ రాబడులు ఇస్తున్న పెట్టుబడులనే ఇందుకు పరిగణనలోకి తీసుకోవాలి.
- ఈక్విటీ డివిడెండ్ రాబడులు ఉన్న వారు ఆ మొత్తాన్ని ఇందుకు వినియోగించుకోవచ్చు.
- దీర్ఘకాల లక్ష్యాలైన రిటైర్మెంట్ (ఎన్‌పీఎస్), పిల్లల భవిష్యత్ విద్య (పీపీఎఫ్, ఈక్విటీ తదితర) కోసం ఉద్దేశించిన పెట్టుబడులను ఉపసంహరించుకోవద్దని నిపుణుల సూచన.
- గృహ రుణం ముందుగా చెల్లించేస్తే 'ఫోర్‌క్లోజర్' చార్జీలు విధించని బ్యాంక్‌ను ఎంపిక చేసుకోవాలి.
- పదవీ కాలంలోనే గృహ రుణాన్ని ముగించేలా చూసుకోవాలని ఆదిల్ శెట్టి సూచన.

హోమ్‌లోన్ ఓవర్‌డ్రాఫ్ట్ అకౌంట్...

ఈ ఖాతా తెరవడం ద్వారా మిగులు నిధులను డిపాజిట్ చేసుకోవచ్చు. దీంతో రుణం అసలు వేగంగా తగ్గిపోతుంది. "ఓవర్‌డ్రాఫ్ట్ అకౌంట్‌లో మిగులు నిల్వలను కావాలనుకున్నప్పుడు జమ చేసుకోవచ్చు. ఈ విషయమై అధికారికంగా బ్యాంక్‌కు తెలియజేయక్కర్లేదు" అని ఆదిల్ శెట్టి వివరించారు.

20-20-60

''ఆదాయంలో 20 % పొదుపు చేసి పెట్టుబడులకు వినియోగించుకోవాలి. 20 శాతం రుణ ఈఎంఐలకి, మిగిలిన 60 శాతం జీవన అవసరాలకు వినియోగించుకోవాలి'' అని ఎఫ్‌పీఎస్‌బీ ఇండియా (అమెరికాకు చెందిన స్టాండర్డ్ బోర్డు లిమిటెడ్ సబ్సిడరీ) సీఈవో కృష్ణ మిశ్రా సూచించారు. అంటే ఆదాయంలో గృహ రుణ ఈఎంఐ 20 శాతానికి పరిమితం చేసుకోవడం మంచి ఆలోచన అవుతుంది. జీవన అవసరాల్లో 10 శాతాన్ని ఆదా చేసి, ఆ మేరకు గృహ రుణ ముందస్తు చెల్లింపులకు కేటాయించుకోవచ్చు. అంటే ఆదాయంలో జీవన అవసరాలను 60 శాతానికి బదులు 50 శాతానికి పరిమితం చేసుకోవాలి.



సిగ్నేచర్ గ్లోబల్ | బ్రోకరేజ్: మోతీలాల్ ఓస్వాల్ | కొనొచ్చు

స్టాక్స్ వ్యూ

ప్రస్తుత ధర: రూ. 1,240 **టార్గెట్:** రూ. 2,000


ఎందుకంటే: రియల్టీ రంగ కంపెనీ సిగ్నేచర్ గ్లోబల్(ఇండియా) గురుగ్రామ్‌లోని కీలక ప్రాంతాలలో పటిష్ట కార్యకలాపాలు కలిగి ఉంది. ప్రస్తుతం నెలకొన్న డిమాండును సొమ్ము చేసుకునే బాటలో సాగుతోంది. ఇందుకు అనుగుణంగా 24.3 మిలియన్ చదరపు అడుగుల(ఎంఎస్‌ఎఫ్)లో ప్రాజెక్టులను అభివృద్ధి చేస్తోంది. 2024–27 మధ్య కాలంలో ముందస్తు అమ్మకాల(ప్రీసేల్స్)లో 35 వార్షిక వృద్ధిని అంచనా వేస్తోంది. వెరసి మొత్తం రూ. 28,500 కోట్ల అమ్మకాల బుకింగ్స్‌ను ఆశిస్తోంది. అందుబాటు ధరల ప్రాజెక్టుల నుంచి వ్యూహాత్మకంగా మధ్య, మధ్యస్థాయి ప్రీమియం ప్రాజెక్టులవైపు దృష్టిపెట్టి ముందుకు సాగుతోంది. తద్వారా ఆకర్షణీయ స్థాయిలో రూ. 9,500 కోట్ల నిర్వహణ నగదు ఫ్లో(ఓసీఎఫ్)ను సాధించనున్నట్లు అంచనా. ఇది కంపెనీ నికర నగదు స్థాయికి చేరేందుకు దోహదం చేయనుంది. వెరసి ఈ నిధులను భవిష్యత్ వృద్ధికి వీలుగా భూముల కొనుగోలుకి వెచ్చించనుంది. కంపెనీ ప్రస్తుతం 51 ఎంఎస్‌ఎఫ్‌లో ప్రాజెక్టులను అభివృద్ధి చేస్తోంది. వీటిలో 25.3 ఎంఎస్‌ఎఫ్ నిర్మాణంలో ఉన్నాయి. మరో 25.4 ఎంఎస్‌ఎఫ్ ప్రాజెక్టులను రానున్న ఏడాది, రెండేళ్ల కాలంలో చేపట్టనుంది. ఇటీవల తెరతీసిన ప్రాజెక్టుతో కలిపి ప్రస్తుత నికర విలువ(ఎన్‌పీవీ) పద్ధతిలో కంపెనీ 30 ఎంఎస్‌ఎఫ్ ప్రాజెక్టులను ప్రవేశపెట్టనుంది. వీటి విలువ రూ. 15,000 కోట్లుగా అంచనా. అయితే రెసిడెన్షియల్ విభాగంలో మందగమన పరిస్థితులు, భవిష్యత్ ప్రాజెక్టుల మానిటైజేషన్ ఆలస్యంకావడం తదితరాలను కీలక రిస్కులుగా పరిగణించవచ్చు.



క్లీన్ సైన్స్ | బ్రోకరేజ్: యూఎల్‌జేకే రీసెర్చ్ | కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 1,428 **టార్గెట్:** రూ. 1,703

ఎందుకంటే: స్పెషాలిటీ కెమికల్స్ తయారీ దిగ్గజం క్లీన్ సైన్స్ అండ్ టెక్నాలజీ 35 దేశాలకుపైగా కార్యకలాపాలు విస్తరించింది. దీంతో మొత్తం ఆదాయంలో 60 శాతానికిపైగా ఎగుమతుల ద్వారానే సమకూర్చుకుంటోంది. కంపెనీ పటిష్టస్థాయిలో సాంకేతిక సామర్థ్యాలను కలిగి ఉంది. స్పెషాలిటీ కెమికల్స్‌కు కీలకమైన కేటలిటిక్ ప్రాసెస్‌లో నిలకడను కొనసాగిస్తోంది. ముడిసరుకులు, సరఫరాలు తదితరాలలో సొంతవనరులు సమకూర్చుకోవడం(బ్యాక్‌వార్డ్ ఇంటిగ్రేషన్) ద్వారా పోటీలో ముందునిలవగల ప్రొడక్టులను రూపొందించగలుగుతోంది. వీటితో అత్యుత్తమ మార్జిన్లను సాధిస్తోంది. ఇందుకు క్లయింట్లతో దీర్ఘకాలిక ఒప్పందాలను కొనసాగించడం దోహదపడుతోంది. ప్రధానంగా పరిశోధన, అభివృద్ధి(ఆర్అండ్‌డీ)పై పెట్టుబడుల ద్వారా కంపెనీ వ్యూహాత్మకంగా విభిన్న ప్రొడక్టుల(మిక్స్)ను ప్రవేశపెడుతోంది. పెట్టుబడి వ్యయాల సమర్థవంత వినియోగం, క్లీన్ ఫినో కెమ్ లిమిటెడ్ పేరుతో కొత్తగా ఏర్పాటు చేసిన అనుబంధ సంస్థ ద్వారా నాలుగో తయారీ యూనిట్‌కు తెరతీయడం వంటి అంశాలు కంపెనీకి బలాన్నిస్తున్నాయి. పటిష్ట బ్యాలన్స్‌షీట్ నేపథ్యంలో మరిన్ని విస్తరణ కార్యక్రమాలకు ప్రణాళికలు వేయనుంది. ఇందుకు పెట్టుబడులను అంతర్గత వనరుల ద్వారా సమకూర్చుకునే అవకాశముంది. వెరసి ఆర్థికంగా మరింత పటిష్టంకావడంతోపాటు వృద్ధి బాటలో సాగనుంది. ఆర్అండ్‌డీ దన్నుకుతోడు కెమికల్ తయారీలో ప్రత్యేక ఎడిటివ్‌గా వినియోగించే హెచ్ఏఎల్‌ఎస్(హాల్స్) సిరీస్‌లోకి ప్రవేశించింది. ప్రపంచ వ్యాప్తంగా రూ. 8,500 కోట్ల మార్కెట్‌గల హాల్స్‌తో లబ్ధి పొందనుంది.



గమనిక: ఈ కాలమ్‌లో షేర్లపై ఇచ్చిన సలహాలు వివిధ బ్రోకరేజ్ సంస్థలు వ్యక్తం చేసిన అభిప్రాయాలు మాత్రమే

యూటీఐ నుంచి రెండు కొత్త ఫండ్‌లు

న్యూ ఫండ్ ఆఫర్స్

యూటీఐ మ్యూచువల్ ఫండ్ రెండు ఇండెక్స్ ఫండ్‌లను ఆవిష్కరించింది. నిఫ్టీ మిడ్‌స్మాల్‌క్యాప్ 400 మొమెంటం క్వాలిటీ 100 ఇండెక్స్ ఫండ్, నిఫ్టీ ఇండియా మాన్యుఫాక్చరింగ్ ఇండెక్స్ ఫండ్ వీటిలో ఉన్నాయి. మిడ్–స్మాల్ క్యాప్ సెగ్మెంట్లో వృద్ధి అవకాశాలున్న నాణ్యమైన స్టాక్స్‌లో ఒకే ఫండ్ ద్వారా ఇన్వెస్ట్ చేసేందుకు మిడ్‌స్మాల్‌క్యాప్ ఇండెక్స్ ఫండ్ ఉపయోగపడుతుందని సంస్థ హెడ్ (ప్యాసివ్, ఆర్బిట్రేజ్, క్వాంట్ స్ట్రాటెజీస్) శర్వన్ కుమార్ గోయల్ తెలిపారు. మరోవైపు, దేశీయంగా తయారీ పరిశ్రమ సంస్థల వృద్ధి అవకాశాలను అందిపుచ్చుకునేందుకు మాన్యుఫాక్చరింగ్ ఇండెక్స్ ఫండ్ ఉపయోగకరంగా ఉంటుందని వివరించారు. ఈ రెండు న్యూ ఫండ్ ఆఫర్లు ఫిబ్రవరి 10తో ముగుస్తాయి. కనీసం రూ. 1,000 నుంచి ఇన్వెస్ట్ చేయొచ్చు. గణనీయంగా వృద్ధి అవకాశాలున్న కేటగిరీలు, పరిశ్రమల్లో ఇన్వెస్ట్ చేయడం ద్వారా మెరుగైన ప్రయోజనాలను పొందేందుకు ఈ రెండు ఫండ్‌లు ఇన్వెస్టర్లకు తోడ్పడగలవని గోయల్ వివరించారు.

హెచ్‌డీఎఫ్‌సీ ఎంఎఫ్ నిఫ్టీ100 క్వాలిటీ 30 ఇండెక్స్ ఫండ్..

హెచ్‌డీఎఫ్‌సీ మ్యూచువల్ ఫండ్ కొత్తగా నిఫ్టీ100 క్వాలిటీ 30 ఇండెక్స్ ఫండ్‌ను ఆవిష్కరించింది. ఈ న్యూ ఫండ్ ఆఫర్ ఫిబ్రవరి 14న ముగుస్తుంది. పటిష్టమైన ఆర్థిక పనితీరుతో, వ్యాపార కార్యకలాపాలు సాగించే నాణ్యమైన సంస్థల్లో ఇన్వెస్ట్ చేయడం ద్వారా దీర్ఘకాలంలో సంపదను పెంపొందించుకోవాలనుకునే ఇన్వెస్టర్లకు ఇది అనువైనదిగా ఉంటుంది. రిటర్న్ ఆన్ ఈక్విటీ, రుణాలు తదితర అంశాల ప్రాతిపదికన నిఫ్టీ 100 ఇండెక్స్‌లో నుంచి ఎంపిక చేసిన 30 స్టాక్స్ ఈ ఇండెక్స్‌లో ఉంటాయి. ఈ పథకంలో ఇన్వెస్టర్లు కనీసం రూ. 100 నుంచి ఇన్వెస్ట్ చేయొచ్చని హెచ్‌డీఎఫ్‌సీ అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీ ఎండీ నవనీత్ మునోట్ తెలిపారు.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..
ఇక ఆర్‌బీఐ వైపు మార్కెట్ చూపు
కొత్త పన్ను విధానంలోకి ఇక భారీగా..!

ఇది ప్రజల బడ్జెట్!!

కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్

- పన్నుల ఊరటకు ప్రధాని సుముఖంగానే ఉన్నా.. అధికారులను ఒప్పించేందుకే సమయం పట్టింది
- కొత్త రేట్లతో మధ్యతరగతిపై భారం భారీగా తగ్గుతుంది



న్యూఢిల్లీ: వచ్చే ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రజల బడ్జెట్ అని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ వ్యాఖ్యానించారు. అమెరికా దివంగత అధ్యక్షుడు అబ్రహాం లింకన్ వ్యాఖ్యను ఉటంకిస్తూ.. 'ఇది ప్రజాభిప్రాయంతో, ప్రజల కోసం, ప్రజలు రూపొందించుకున్న బడ్జెట్'గా అభివర్ణించారు. పన్నులపరంగా కొత్త రేట్లతో మధ్యతరగతికి గణనీయంగా ఊరట లభిస్తుందని ఆమె చెప్పారు. 'వారి చేతిలో మరింతగా డబ్బు మిగులుతుంది. దీంతో వినియోగం, పొదుపు, పెట్టుబడులు పెరుగుతాయి' అని వివరించారు. రేట్ల కోత ఆలోచనకు ప్రధాని నరేంద్ర మోదీ పూర్తిగా మద్దతునిచ్చినప్పటికీ, బ్యూరోక్రాట్లను ఒప్పించేందుకే సమయం పట్టిందని మంత్రి వివరించారు. ద్రవ్యోల్బణంపరంగా ప్రతికూల ప్రభావాలను తగ్గించేందుకు ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని నిజాయితీగా పన్నులు చెల్లించే మధ్యతరగతి వర్గాలు కోరుకుంటున్న నేపథ్యంలో ఆ బాధ్యతను ప్రధాని తనకు అప్పగించారని ఆమె పేర్కొన్నారు. పన్నుపరంగా ఉపశమనం కల్పించేందుకు ప్రధాని సత్వరం అంగీకరించినప్పటికీ ఆర్థిక శాఖ, కేంద్రీయ ప్రత్యక్ష పన్నుల బోర్డు (సీబీడీటీ) అధికారులను ఒప్పించడానికి సమయం పట్టిందని చెప్పారు. సంక్షేమ పథకాలు, ఇతర స్కీములకు అవసరమైన ఆదాయాన్ని వసూలు చేసే బాధ్యత వారిపై ఉండటమే ఇందుకు కారణమని తెలిపారు.

డాలరుతో పోలిస్తే తప్ప రూపాయి పటిష్టంగానే ఉంది..

బలోపేతమవుతున్న అమెరికా డాలరుతో పోలిస్తే మాత్రమే రూపాయి మారకం విలువ క్షీణించిందని, మిగతా కరెన్సీలతో పోలిస్తే స్థిరంగానే ఉందని నిర్మలా సీతారామన్ స్పష్టం చేశారు. స్థూల ఆర్థికమూలాలు పటిష్టంగా ఉండటమే ఇందుకు కార ణమని ఆమె చెప్పారు. స్వల్ప వ్యవధిలో డాలరుతో పోలిస్తే రూపాయి 3 శాతం పడిపోవడం వల్ల దిగుమతులకు మరింతగా చెల్లించాల్సి రానుండటం ఆందోళన కలిగించే విషయమే అయినా, దేశీ కరెన్సీ అన్ని రకాలుగా బలహీనపడిందనే విమర్శలు ఆమోదయోగ్యం కావని తెలిపారు.

మరోవైపు, వచ్చే ఆర్థిక సంవత్సరంలో మూలధన వ్యయాలను రూ. 10.18 లక్షల కోట్ల నుంచి రూ. 11.21 లక్షల కోట్లకు నామమాత్రంగా పెంచడంపై స్పందిస్తూ.. కేవలం అంకెలను కాకుండా ఎంత సమర్థవంతంగా ఖర్చు చేస్తున్నారనేది చూడాలని మంత్రి చెప్పారు.

ఏడాదిగా కసరత్తు..

గతేడాది జూలైలో బడ్జెట్ ప్రవేశపెట్టినప్పటి నుంచే పన్ను కోతల అంశంపై కసరత్తు జరుగుతోందని నిర్మలా సీతారామన్ తెలిపారు. తాము నిజాయితీగా పన్నులు కడుతున్నప్పటికీ, దానికి తగ్గట్లుగా తమ సమస్యల పరిష్కారానికి చర్యలు ఉండటం లేదని మధ్యతరగతి ప్రజల్లో అభిప్రాయం వ్యక్తమవుతున్న విషయాన్ని ప్రధాని దృష్టికి తీసుకెళ్లినట్లు ఆమె చెప్పారు. 'మీరేం చేయగలరో చూడండి అని ప్రధాని నాకు సూచించారు. ప్రజల కోసం ఏదైనా చేయాలనే విషయంలో ఆయన స్పష్టంగానే ఉన్నారు. కాకపోతే ఆర్థిక శాఖ, సీబీడీటీ అధికారులను ఒప్పించడానికి సమయం పట్టింది. ఇలా చేయడం వల్ల తలెత్తే ప్రభావాల గురించి వారు నాకు తరచుగా గుర్తు చేసేవారు. వారిని తప్పుపట్టడానికి లేదు. ఎందుకంటే ఆదాయాన్ని సమకూర్చాల్సిన బాధ్యత వారిపై ఉంది. అయితే, అంతిమంగా అందరూ ఒక అభిప్రాయానికి రావడంతో ఇది సాధ్యపడింది' అని మంత్రి వివరించారు. ప్రస్తుతం దేశంలో 8.65 కోట్ల మంది ఆదాయ పన్ను రిటర్నులను దాఖలు చేస్తున్నారని, టీడీఎస్ వర్తిస్తున్నా రిటర్నులను ఫైలింగ్ చేయని వారి సంఖ్యను కూడా కలిపితే ఇది 10 కోట్లు దాటుతుందని వివరించారు.

యాదగిరిగుట్టలో సూర్యప్రభ వాహన సేవ రేపు

యాదగిరిగుట్ట: రథసప్తమిని పురస్కరించుకొని ఈ నెల 4వ తేదీన యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీ నరసింహస్వామి వారి ఆలయంలో సూర్య ప్రభ వాహన ప్రత్యేక అలంకార సేవను నిర్వహించనున్నట్లు ఈవో భాస్కర్‌రావు ఆదివారం ఒక ప్రకటనలో వెల్లడించారు. ఉదయం 8 గంటలకు శ్రీస్వామి వారిని ఆలయ తిరు మాడ వీధుల్లో సూర్యప్రభ వాహనంపై ఊరేగించనున్నట్లు పేర్కొన్నారు. అనంతరం తూర్పు రాజగోపురం వద్ద చతుర్వేద పారాయణం చేసి, రథ సప్తమి విశిష్టతను భక్తులకు అర్చకులు వివరిస్తారని తెలిపారు. అదేరోజు రాత్రి 7 గంటలకు శ్రీస్వామి వారిని బంగారు రథంపై ఆలయ అంతఃప్రాకారంలో ఊరేగించనున్నట్లు పేర్కొన్నారు. రథ సప్తమి సందర్భంగా 4వ తేదీన ఉదయం 7 నుంచి 10 గంటల వరకు సువర్ణ పుష్పార్చన పూజను రద్దు చేసినట్లు తెలిపారు.



నేటి నుంచి పాతగుట్టలో అధ్యయనోత్సవాలు

యాదగిరిగుట్ట: పాతగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో గురు వారం వరకు అధ్యయనోత్సవాలు జరగనున్నాయి. సోమవారం ఉద యం తిరుమంజనం, తొళక్కంతో ఉత్సవాలను ప్రారంభిస్తారు. మంగళవారం ఉదయం పురప్పాట్ సేవ, తిరుమంజనం, దివ్య ప్రబంధ సేవా కాలం చేపడతారు. బుధవారం ఉదయం ప్రత్యేక పూజలతో పాటు సాయంత్రం నమ్మాళ్వార్ పరమపదోత్సవం నిర్వహిస్తారు. చివరి రోజున పురప్పాట్ సేవ, శ్రీరామానుజా చార్య తిరుమంజనం, నూత్తందాది శాత్తుమొరై నిర్వహించి అధ్యయనోత్సవాలను ముగిస్తారు.



మంచు జలపాతం కాదు.. మహా వినాశనానికి సంకేతం!

భారీ హిమానీనదం కరుగుతూ ఆ నీరు సముద్రంలోకి జలపాతంలా దూకుతున్న ఈ దృశ్యం.. మహా వినాశనానికి సంకేతమట. గ్లోబల్ వార్మింగ్ కారణంగా భూమ్మీద అత్యంత వేగంగా మంచు కరిగిపోతున్న ప్రాంతమైన నార్వేలోని స్వాల్‌బార్డ్‌లో ఉన్న బ్రస్వెల్‌బ్రీన్ హిమానీనదం ఇది. ఇజ్రాయెలీ ఫొటోగ్రాఫర్ రో గలిట్జ్ తీసిన ఈ చిత్రం.. ఇంటర్నేషనల్ ట్రావెల్ ఫొటోగ్రాఫర్-2024 అవార్డుల్లో 'ప్లానెట్ ఎర్త్- ల్యాండ్‌స్కేప్, క్లైమేట్, వాటర్' కేటగిరీ కింద ఎంపికైంది.

ఆలయంలో బారులు తీరిన భక్తులు



వసంత పంచమి.. అక్షరాభ్యాసం



తన కుమారుడికి అక్షరాభ్యాసం చేయిస్తున్న దిల్ రాజు

భైంసా: నిర్మల్ జిల్లా బాసర సరస్వతీదేవి ఆలయంలో వసంత పంచమి వేడుకలు కొనసాగుతున్నాయి. ఆదివారం సెలవు దినం కావడంతో భక్తులు భారీగా తరలివచ్చారు. వేకువజాము నుంచే బాసర గోదావరి నదీతీరంలో భక్తులు కనిపించారు. పుణ్యస్నానాలు ఆచరించి, సరస్వతీ అమ్మవారిని దర్శించుకుని చిన్నారులకు అక్షరాభ్యాస పూజలు జరిపించారు. అమ్మవారి దర్శనానికి 3 గంటల సమయం పట్టింది. తెలంగాణ ఫిలిమ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ దిల్‌రాజు కుటుంబ సమేతంగా బాసరకు వచ్చారు. అమ్మవారిని దర్శించుకుని తన కుమారుడికి అక్షరాభ్యాసం చేయించారు. సాయంత్రం కలెక్టర్ అభిలాష అభినవ్ వసంత పంచమి ఏర్పాట్లను పరిశీలించారు. ఎస్పీ జానకీషర్మిల బందోబస్తును పర్యవేక్షించారు. కాగా, సోమవారం భక్తుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. భక్తులకు తగినట్లుగా ఏర్పాట్లు చేయాలని ఆలయ సిబ్బందికి ఉన్నతాధికారులు సూచించారు.



'బూన్ గైడ్ ఉండగా.. పరీక్షల భయం దండగ'.. ఈ మాట ఎప్పుడైనా విన్నారా? దేశంలో పర్సనల్ కంప్యూటర్లు (పీసీ) సామాన్యులకు అందుబాటులోకి రాని 1980లలో కాలేజీ కుర్రాళ్లు తమను పరీక్షల గండం గట్టెక్కించే గైడ్ గురించి గొప్పగా చెప్పుకొనే మాట అన్నమాట. అయితే కాలంతోపాటు కంప్యూటర్ల పనితీరు, సామర్థ్యాలు అనూహ్యంగా పెరగడంతో ఇప్పుడు విద్యార్థులు మొదలు ఉద్యోగుల దాకా ఏ రంగానికి చెందిన వారికి కావాల్సిన సమాచారమైనా చిటికెలో అందించే ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సాంకేతికత యావత్ ప్రపంచాన్ని అబ్బురపరుస్తోంది. ఈ నేపథ్యంలో ప్రస్తుతం అందుబాటులో ఉన్న ఏఐ అప్లికేషన్లు, వాటి ఉపయోగాలపై కథనం.

చిటికెలో సమస్త సమాచారాన్ని అందిస్తున్న కృత్రిమమేధ యాప్‌లు

అక్షరాలు, అంకెల విశ్లేషణ మొదలు సొంతంగా నేర్చుకొని చెప్పగల సామర్థ్యం సొంతం

అంతా.. ఏఐమయం

సాక్షి, హైదరాబాద్: కృత్రిమ మేధ (ఏఐ) రంగం కేవలం ఐదంటే ఐదేళ్లలో ప్రపంచ గమనాన్ని మార్చేసింది. అదెలాగో తెలియాలంటే జనరేటివ్ ఏఐ ఎదుగుదలను చూడాలి. ఓపెన్ ఏఐ అనే సంస్థ 2019లో తొలిసారి 'జీపీటీ-2'ను అందుబాటులోకి తెచ్చింది. ఎలాంటి ప్రశ్నలడిగినా తడుముకోకుండా అక్షరాల్లో బదులివ్వడం దీని ప్రత్యేకత. అయితే ఓపెన్‌సోర్స్ కోడ్ అందరికీ అందుబాటులో ఉండటంతో ఏఐ వేగంగా అభివృద్ధి చెందింది. ఒక్కమాటలో చెప్పాలంటే ఏఐ అప్లికేషన్ల శకం మొదలైంది.

అందరికీ చిరపరిచితం సిరి, అలెక్సా..

మనలో చాలామందికి చిరపరిచితమైన చాట్‌జీపీటీ వర్చువల్ అసిస్టెంట్ అప్లికేషన్. సిరి, అలెక్సా, 'ఓకే గూగుల్' లాంటివన్నీ ఈ కోవకు చెందిన జనరేటివ్ ఏఐ అప్లికేషన్లే. మీరేదైన ప్రశ్న అడిగితే.. ఇంటర్నెట్ మొత్తాన్ని వెతికి సమాధానాలు చెబుతాయి. స్క్రీన్లపై అయితే పదాల రూపంలో.. మొబైల్‌ఫోన్లు ఇతర గాడ్జెట్ల ద్వారానైతే మాటల్లో బదులిస్తాయి. ఇవి కాకుండా ఫొటోలు, వీడియోలను గుర్తుపట్టేందుకు, వాటిని వర్గీకరించేందుకు గూగుల్ ఫొటోస్, డీప్‌ఆర్ట్ వంటివి అందుబాటులో ఉన్నాయి. మీకు ఇంగ్లిష్ అంత బాగా రాకపోయినా...తప్పుల తడకలా ఉండే వాక్యాలను కూడా సరి చేయాలంటే 'గ్రామర్‌లీ', 'క్విల్‌బోట్' వంటి ఏఐ అప్లికేషన్లు వాడుకోవచ్చు. అంకెల్లోని సమాచారాన్ని (ఎక్సెల్ షీట్లు) చదివేసి విశ్లేషించేందుకు 'జూలియస్.ఏఐ' ఉపయోగపడుతుంది. ఆఫీసుల్లో ఉద్యోగులకు నిత్యం ప్రాణ సంకటంగా మారే పవర్ పాయింట్ ప్రెజెంటేషన్లకు 'కాన్వా'తోపాటు బోలెడన్ని అప్లికేషన్లు అందుబాటులో ఉన్నాయి.

అంచనాలకూ ఏఐ యాప్స్..

ఇప్పటి వరకు మనం చూసిన అప్లికేషన్లన్నీ నెట్‌లో ఉన్న సమాచారం ఆధారంగా పనిచేస్తాయి. కానీ ప్రిడిక్టివ్ అనలటిక్స్ రకం ఏఐ అప్లికేషన్లు ఉన్న సమాచారం ఆధారంగా అంచనాలు కట్టేందుకు వాడతారు. ప్రముఖ ఐటీ కంపెనీ 'ఐబీఎం' వాట్సన్ పేరుతో సిద్ధం చేసిన జనరేటివ్ ఏఐ అప్లికేషనే అందుకు ఉదాహరణ. ఆరోగ్య రంగంలో కొత్త సంచలనం ఇది. ఇమేజ్ రికగ్నిషన్ సాఫ్ట్‌వేర్ ద్వారా ఇది ఎక్స్-రేలను చదివేస్తుంది. వైద్య నివేదికలు, వైద్య పరిశోధనలకు సంబంధించిన సమాచారాన్ని (సైంటిఫిక్ జర్నళ్ల ద్వారా) ఔపోసన పట్టేస్తుంది. ఈ సమాచారం ఆధారంగా వైద్యుల కంటే ముందే కేన్సర్ వంటి ప్రాణాంతక జబ్బులను కూడా కచ్చితంగా గుర్తించేలా దీన్ని సిద్ధం చేశారు. 'అడా', 'బాబిలోన్ హెల్త్' వంటివి కూడా మన ఆరోగ్య సమాచారాన్ని విశ్లేషించి సలహా సూచనలు ఇవ్వగలిగే ఏఐ అప్లికేషన్లు.

సొంతంగా సృష్టిస్తాయి కూడా...

మనిషిని, యంత్రాన్ని వేరు చేసేదేమిటని ఎవరిని అడిగినా చెప్పే సమాధానం యంత్రం సొంతంగా ఏదీ సృష్టించలేదని చెబుతారు. అది నిజం కూడా. కానీ జనరేటివ్ ఏఐ అప్లికేషన్లతో ఈ పరిస్థితి కూడా మారిపోయింది. 'డాల్-ఈ', 'మిడ్‌జర్నీ' వంటి అప్లికేషన్లు సొంతంగా బొమ్మలు గీయగలవు. సంగీతాన్ని సృష్టించగలవు. కర్ణాటక సంగీతాన్ని నేర్చుకొని తమదైన రాగాలు తయారు చేయగలవు కూడా..! అంతెందుకు.. ఒక సినిమా స్టోరీ రాయాలనుకోండి.. కథ తాలూకా ప్రధాన ఇతివృత్తాన్ని చెబితే చాలు.. ఏఐ అప్లికేషనే స్క్రీన్ ప్లేతో కలిపి కథ మొత్తాన్ని రాసిచ్చేస్తుంది!



డబ్బు లెక్కలకూ యాప్‌లు..

స్టాక్‌మార్కెట్‌లో పెట్టుబడులంటే ఒకటికి పదిసార్లు ఆలోచించుకోవాల్సిన అవసరం ఉంటుంది. అలాగే ఫలానా కంపెనీ షేర్ కొన్నేళ్లుగా ఎలాంటి లాభాలు తెచ్చిపెడుతోందో? లేదా ఇబ్బందులు ఎదుర్కొంటోందో తెలియాలి. అయితే 'మింట్', 'రాబిన్‌హుడ్' వంటి అప్లికేషన్లు ఈ పనులన్నీ చిటికెలో చక్కబెట్టేస్తాయి. లార్జ్ లాంగ్వేజ్ మాడ్యూల్స్ (ఎల్ఎల్ఎం) ఆధారంగా కంపెనీల ఆర్థిక పరిస్థితులన్నింటినీ మదించి పెట్టుబడుల సలహాలిస్తాయి.

డీప్‌సీక్ రాకతో విప్లవం..

తాజాగా 'డీప్‌సీక్' సృష్టించిన ప్రభంజనం అంతాఇంత కాదు. లార్జ్ లాంగ్వేజ్ మోడల్ (ఎల్ఎల్ఎం) ఏఐ అభివృద్ధికి భారీ స్థాయిలో నిధులు ఖర్చవుతాయన్న ఊహలను పటాపంచలుచేస్తూ చైనా సంస్థ డీప్‌సీక్ అభివృద్ధి చేసిన ఓపెన్ సోర్స్ ఆధారిత ఎల్ఎల్ఎం మోడల్ 'ఆర్1'ను చూసి ఎన్విడియా వంటి దిగ్గజ సంస్థలే నోరెళ్లబెట్టాయి. ఇప్పుడున్న ఏఐ మోడల్స్ కన్నా ఎంతో మెరుగైన తార్కిక విశ్లేషణ సామర్థ్యం డీప్‌సీక్ ఆర్1కు ఉండటమే దాన్ని మరో మెట్టుపై నిలబెడుతోంది. దీని రాకతో ఏఐ రంగంలో విప్లవాత్మక మార్పులు ఖాయమని నిపుణులు అంటున్నారు.

ఏ వయసు వారు - ఏ అప్లికేషన్లు

టీనేజీ (13-19 ఏళ్లు)

తోటివారితో మాట్లాడేందుకు..	స్నాప్‌చాట్ (ఏఐ ఫిల్టర్లు లెన్స్‌లతో)
ఎలాంటి కంటెంట్ చూడాలో తెలుసుకోవడానికి	టిక్‌టాక్
వయసైపోతే ఎలా ఉంటారో చూసుకునేందుకు	ఫేస్‌యాప్
అందంగా కనిపించేందుకు, మేకప్ సలహాలకు	యూక్యామ్ మేకప్
అన్ని విషయాలు పంచుకునేందుకు	రెప్లికా
ఏం చేస్తున్నారో ప్రపంచానికి చెప్పేందుకు	ఇన్‌స్టాగామ్
చెవులకు ఇంపుగా సంగీతం కోసం	స్పాటిఫై
వీడియో ఎడిటింగ్ కోసం	క్యాప్‌కట్
ఏఐ సృష్టించే ఆర్ట్ కోసం	మిడ్‌జర్నీ

యుక్త వయసు నుంచి మధ్య వయసు వారు.. (20-35 ఏళ్లు)

వేర్వేరు పనుల కోసం	చాట్‌జీపీటీ, గూగుల్ జెమిని
విషయాలను అందంగా చెప్పేందుకు	క్లాడ్ ఏఐ
ఉద్యోగాలు వెతుక్కునేందుకు	నెట్‌వర్కింగ్ లింక్డిన్
మీ రాతలను సరిచేసేందుకు	క్విల్‌బోట్ మైక్రోసాఫ్ట్ ఆఫీసుతో
ఉత్పాదకత పెంపునకు	'మైక్రోసాఫ్ట్ కో-పైలట్'
ఒక భాష నుంచి మరోదానికి	'డీప్‌ఎల్'
ఫైనాన్షియల్ ప్లానింగ్, పెట్టుబడులు	'రాబిన్‌హుడ్'

మధ్య వయస్కుల వారికి... (36-55 ఏళ్లు)

రోజువారీ సమాచారం కోసం	గూగుల్ అసిస్టెంట్, సిరి (ఆపిల్), అలెక్సా (అమెజాన్)
బిజినెస్ విశ్లేషణ కోసం	ఐబీఎం వాట్సన్, సేల్స్‌ఫోర్స్ ఐన్‌స్టీన్, మింట్.
ఆరోగ్య పరీక్షల కోసం	బాబిలోన్ హెల్త్, అడా.

సీనియర్ సిటిజెన్స్ (56 ఏళ్ల పైబడ్డ వాళ్లు)

రోజువారీ సమాచారం కోసం	గూగుల్ అసిస్టెంట్, సిరి (ఆపిల్), అలెక్సా (అమెజాన్)
ఆరోగ్య పరీక్షల కోసం	బాబిలోన్ హెల్త్, అడా.
మెదడుకు మేత	లుమోసిటీ

ఏఐ కంపెనీలకు భారీ ఆదాయం..

ఏఐ అప్లికేషన్ల రంగం ద్వారా కంపెనీలకు 2023లో వచ్చిన ఆదాయం సుమారు 180 కోట్ల డాలర్లు. ఇది 2028 నాటికి సుమారు 1,880 కోట్ల డాలర్లకు చేరుతుందని అంచనా. మార్కెట్ అంచనాల ప్రకారం 2030 నాటికి ఇది 3,000 కోట్ల డాలర్ల కంటే ఎక్కువ అవుతుంది.

త్వరలో ఎయిర్‌పోర్ట్ ఠాణా

- విమానాశ్రయ ప్రయాణికుల కోసం ప్రత్యేక పోలీస్‌స్టేషన్
- ప్రభుత్వానికి సైబరాబాద్ పోలీసుల ప్రతిపాదన



సాక్షి, హైదరాబాద్: రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం (ఆర్‌జీఐఏ) కోసం ప్రత్యేక పోలీస్ స్టేషన్‌ను ఏర్పాటు చేయాలని సైబరాబాద్ పోలీసులు నిర్ణయించారు. ఇది విమానాశ్రయ ప్రాంగణంలోనే 24 గంటలూ పనిచేస్తుంది. ఈ పోలీస్‌స్టేషన్ విమాన ప్రయాణికులు, ఎయిర్‌లైన్స్ ఉద్యోగులతో పాటు విమానాశ్రయ కార్గో అవసరాలను తీరుస్తుంది. ప్రత్యేక ఠాణా ఏర్పాటుతో కేసుల ఫిర్యాదు, సమస్యల తక్షణ పరిష్కారానికి వీలవుతుందని కమిషనరేట్ ఉన్నతాధికారి ఒకరు తెలిపారు.

శంషాబాద్ టౌన్ పీఎస్‌గా..: ప్రస్తుతం విమానాశ్రయ పరిధిలో ఆర్జీఐ విమానాశ్రయ పోలీస్ స్టేషన్ సేవలందిస్తుంది. అయితే ఈ స్టేషన్ ఎయిర్‌పోర్ట్ నుంచి ఏడు కి.మీ. దూరంలో ఉండటంతో కొంత అసౌకర్యంగా ఉంది. దీంతో కొత్త పోలీస్‌స్టేషన్ ఏర్పాటుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించామని, త్వరలోనే ఆమోదం లభిస్తుందని ఆ ఉన్నతాధికారి తెలిపారు. ఆ తర్వాత ప్రస్తుత ఆర్జీఐ విమానాశ్రయ పోలీస్ స్టేషన్ పేరును శంషాబాద్ పట్టణ పోలీస్ స్టేషన్‌గా మార్చనున్నట్లు అధికారి తెలిపారు. కొత్తగా రానున్న ఎయిర్ పోర్ట్ ఠాణాలో ఒక ఇన్‌స్పెక్టర్, ఇద్దరు సబ్ ఇన్‌స్పెక్టర్లు, పది మంది కానిస్టేబుళ్లను నియమించనున్నారు. పూర్తిస్థాయి స్టేషన్ వచ్చేవరకూ సైబరాబాద్ పోలీసులు 24/7 పోలీస్ అవుట్‌పోస్ట్‌ను నిర్వహిస్తారు.

'హైటెక్ కుర్రాడు'కి సీఎం అభినందన

హైబ్రీడ్ త్రీ ఇన్ వన్ సైకిల్ రూపొందించిన విద్యార్థిని 'ఎక్స్' వేదికగా అభినందించిన రేవంత్‌రెడ్డి



సాక్షి, నాగర్‌కర్నూల్: సోలార్ విద్యుత్, బ్యాటరీ, పెట్రోల్‌తో నడిచే హైబ్రీడ్ త్రీ ఇన్ వన్ సైకిల్‌ను తయారు చేసిన 14 ఏళ్ల విద్యార్థి గగన్‌చంద్రను ఆదివారం సీఎం రేవంత్‌రెడ్డి 'ఎక్స్' వేదికగా అభినందించారు. నాగర్‌కర్నూల్ జిల్లాలోని నల్లమల ప్రాంతమైన బల్మూర్‌కు చెందిన 9వ తరగతి విద్యార్థి గౌరమోని గగన్‌చంద్ర ఆవిష్కరణపై జనవరి 31న 'సాక్షి' మెయిన్‌లో 'హైటెక్ కుర్రాడు' శీర్షికన కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే గగన్‌చంద్ర ఆవిష్కరణ, సృజనాత్మకత తనకు స్ఫూర్తిదాయకం అంటూ సీఎం రేవంత్‌రెడ్డి 'ఎక్స్'వేదికగా తన వ్యక్తిగత ఖాతాలో పోస్టు చేశారు. '14 ఏళ్ల కుర్రాడు గగన్‌చంద్ర సృజనాత్మక ఆవిష్కరణ, స్ఫూర్తిదాయకమైన స్టోరీ నా దృష్టికి వచ్చింది. సోలార్, బ్యాకప్ బ్యాటరీ, పెట్రోల్‌తో నడిచేలా హైబ్రీడ్ త్రీ ఇన్ వన్ సైకిల్ రూపొందించిన ఆవిష్కరణ అద్భుతమైనది. ఇలాంటి నూతన ఆవిష్కరణలు, ప్రయోగాలకు ఎప్పుడూ ప్రోత్సాహం ఇస్తామని చెబుతూ మనస్ఫూర్తిగా అభినందిస్తున్నా'అని తన పోస్టింగ్‌లో పేర్కొన్నారు.

చిల్లర చోరీల నుంచి భారీ దోపిడీలకు..

కరుడుగట్టిన దొంగ బత్తుల ప్రభాకర్ స్కెచ్‌లు
- రెండు భారీ దోపిడీలకు ప్రణాళిక
- పట్టుకోబోయిన పోలీసులపై ప్రిజం పబ్ వద్ద కాల్పులు
- ప్రభాకర్ నుంచి 3 పిస్టళ్లు, 451 తూటాలు స్వాధీనం
- ఇంజనీరింగ్ కాలేజీల్లోనే చోరీలు చేస్తున్న ప్రభాకర్
- మాదాపూర్ డీసీపీ వినీత్, సైబరాబాద్ క్రైమ్స్ డీసీపీ నర్సింహ వెల్లడి



వివరాలు వెల్లడిస్తున్న మాదాపూర్ డీసీపీ వినీత్ తదితరులు

గచ్చిబౌలి: పోలీసులపై కాల్పులు జరిపిన కరడుగట్టిన నేరస్తుడు బత్తుల ప్రభాకర్ (28) త్వరలో మరో రెండు భారీ దోపిడీలకు ప్రణాళిక వేసుకున్నాడని పోలీసులు తెలిపారు. ఈ మధ్యకాలంలో అతడు ఇంజనీరింగ్ కాలేజీల్లో మాత్రమే చోరీలు చేస్తున్నట్లు చెప్పారు. గచ్చిబౌలిలోని ప్రిజం పబ్‌లో శనివారం రాత్రి సీసీఎస్ కానిస్టేబుళ్లపై కాల్పులు జరిపిన అతడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. అతడి నుంచి మూడు దేశీయంగా తయారైన పిస్టళ్లు, 451 తూటాలను స్వాధీనం చేసుకున్నట్లు మాదాపూర్ డీసీపీ వినీత్, సైబరాబాద్ క్రైమ్స్ డీసీపీ నర్సింహ తెలిపారు. ఆదివారం మాదాపూర్ డీసీపీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో కేసు వివరాలను వెల్లడించారు. 'రెండు తెలుగు రాష్ట్రాల్లో వాంటెడ్ నేరస్తుడిగా ఉన్న బత్తుల ప్రభాకర్ ప్రిజం పబ్‌కు శనివారం రాత్రి 7.30 గంటలకు వచ్చినట్లు సీసీఎస్ పోలీసులకు సమాచారం అందింది. దీంతో హెడ్ కానిస్టేబుళ్లు వెంకట్ రెడ్డి, వీరస్వామి, ప్రదీప్‌రెడ్డిలు అక్కడికి వెళ్లి అతడిని పట్టుకునేందుకు ప్రయత్నించారు. అంతలోనే ప్రభాకర్ తన జేబులోని పిస్టల్ తీసి రెండు రౌండ్లు కాల్పులు జరపగా, వెంకట్‌రెడ్డి పాదానికి బుల్లెట్ గాయమైంది. ప్రభాకర్ అక్కడి నుంచి పారిపోయేందుకు ప్రయత్నించగా ప్రదీప్‌రెడ్డి, వీరస్వామిలతోపాటు పబ్ బౌన్సర్లు కలిసి అతి కష్టం మీద పట్టుకున్నారు. ఆ సమయంలో అతడి నుంచి రెండు కంట్రీ మేడ్ పిస్టల్స్, 23 బుల్లెట్లు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నార్సింగిలోని అతడి నివాసం నుంచి మరో కంట్రీ మేడ్ పిస్టల్‌తో పాటు 7.6 ఎంఎం 451 బుల్లెట్లు, రూ.62 వేల నగదు, సెల్ ఫోన్, దోపిడీకి ఉపయోగించే పరికరాలు స్వాధీనం చేసుకున్నాం' అని వివరించారు.

ఇంజనీరింగ్ కాలేజీలలోనే చోరీలు

ఏపీలోని పశ్చిమగోదావరి, వైజాగ్ ప్రాంతాలలో 2013 నుంచి ప్రభాకర్ చోరీలు చేస్తుండేవాడు. 66 కేసుల్లో జైలుకు వెళ్లాడు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడులో 23 కేసుల్లో వాంటెడ్‌గా ఉన్నాడు. 21 చోరీల్లో రూ.2.5 కోట్లు కొల్లగొట్టాడు. జైలు నుంచి వచ్చిన తరువాత ఇంజనీరింగ్ కాలేజీల్లో మాత్రమే చోరీ చేస్తున్నాడు. గత డిసెంబర్‌లో మొయినాబాద్ పీఎస్ పరిధిలోని కేజీ ఇంజనీరింగ్ కాలేజీలో రూ.8 లక్షలు చోరీ చేశాడు. జనవరిలో వీజేఐటీలో రూ.16 లక్షలు దోచుకున్నాడు అని పోలీసులు తెలిపారు.

శత్రువును చంపేందుకు పిస్టల్స్ కొనుగోలు

వైజాగ్ సెంట్రల్ జైలులో ఉన్నప్పుడు ఓ ఖైదీ బత్తుల ప్రభాకర్‌ను అవమానించటంతో అతడిని చంపేందుకు పిస్టల్స్‌ను కొన్నట్లు పోలీసులు తెలిపారు. అతడు త్వరలో రెండు పెద్ద దోపిడీలు చేసే ప్లాన్‌లో ఉన్నాడని చెప్పారు. బిహార్‌కు చెందిన అన్షు అనే వ్యక్తి ద్వారా పిస్టళ్లు కొనుగోలు చేసినట్లు గుర్తించారు. నిందితుడిని పట్టుకున్న హెడ్ కానిస్టేబుళ్లను డీసీపీలు అభినందించారు. ప్రభాకర్‌కు సహకరించినవారి కోసం గాలిస్తున్నారు.

కచ్చిడి @ రూ. 3.9 లక్షలు



బంగాళాఖాతంలో లభ్యమయ్యే అరుదైన కచ్చిడి చేప కాకినాడ మత్స్యకారుల వలకు చిక్కి, కాసుల పంట పండించింది. ఒక చేప అత్యధికంగా రూ.3.9 లక్షల ధర పలికింది. మొత్తం 3 చేపలు వలకు చిక్కగా... రూ.6 లక్షల ఆదాయం వచ్చింది.
- కాకినాడ రూరల్

పూల రవీందర్‌కు బీటీఎఫ్ మద్దతు

సాక్షి, హైదరాబాద్: ఉమ్మడి వరంగల్, ఖమ్మం, నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న పూల రవీందర్‌కు బహుజన టీచర్స్ ఫెడరేషన్ (బీటీఎఫ్) మద్దతు తెలిపింది. హైదరాబాద్‌లో ఆదివారం జరిగిన ఓ కార్యక్రమంలో బీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు యస్.యాదగిరి ఈ మేరకు మద్దతు లేఖ అందజేశారు. బడుగు, బలహీనవర్గాల ప్రతినిధి అయిన పూల రవీందర్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని ఆయన టీచర్లను కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఇ.రవీందర్, ఉపాధ్యక్షుడు గద్దం యాదయ్య, రాష్ట్ర నాయకుడు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్ మూలాలపై ఏఎన్‌బీ గురి

కింగ్‌పిన్స్ లక్ష్యంగా దాడులకు వ్యూహం
ఇతర రాష్ట్రాల్లోని కీలక వ్యక్తుల జాడ గుర్తింపు
డ్రగ్స్ సోదాల్లోకి నార్కోటిక్స్ డాగ్ స్క్వాడ్స్
120 జాగిలాలకు అత్యాధునిక శిక్షణ



సాక్షి, హైదరాబాద్: డ్రగ్స్ ముఠాల కట్టడిపై తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో (టీజీ ఏఎన్‌బీ) మరింత ఫోకస్ పెట్టింది. మత్తు పదార్థాలు వాడేవారు, సరఫరా చేసే పెడ్లర్ల వరకే పరిమితం కాకుండా.. ఇతర రాష్ట్రాల్లో, విదేశాల్లో ఉంటూ డ్రగ్స్ రవాణాలో కీలకంగా వ్యవహరిస్తున్న కింగ్‌పిన్ (కీలక నిందితు)లను కూడా పట్టుకునేందుకు ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తోంది. మత్తు ముఠాలను మూలాల నుంచి పెకిలించేలా మెరుపు దాడులకు అధికారులు సిద్ధమవుతున్నారు. ఇతర రాష్ట్రాల్లోని మాదకద్రవ్యాల కేంద్రాలపై ఆకస్మిక దాడులకు రంగం సిద్ధం చేసినట్టు టీజీఏఎన్‌బీ ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. గతేడాది రాష్ట్రవ్యాప్తంగా నమోదైన 1,942 ఎన్‌డీపీఎస్ కేసులలో టీజీఏఎన్‌బీ 4,682 మందిని అరెస్ట్ చేసింది. రూ.143 కోట్లు విలువైన మాదక ద్రవ్యాలను స్వాధీనం చేసుకుంది.

మూలాలపై ఫోకస్

మత్తుపదార్థాల రవాణా, విక్రయం వ్యవస్థీకృత నేరంగా మారింది. ఈ దందాలోకి దిగినవారు మళ్లీ బయటికి రాలేక మరింత లోతుకు కూరుకుపోతున్నారు. ఏజెంట్లు కింగ్‌పిన్స్‌గా, కస్టమర్లు సప్లయర్లుగా మారుతూ మరింత ముదిరిపోతున్నారు. ప్రధానంగా గోవా, ముంబై, బెంగళూరులో డ్రగ్స్ కింగ్‌పిన్స్ తలదాచుకుంటున్నారు. హైదరాబాద్‌లో పోలీస్ నిఘా పెరగడంతో నైజీరియన్ గ్యాంగ్ బెంగళూరుకు మకాం మార్చింది. దీంతో హైదరాబాద్‌లో సప్లయర్లు, కస్టమర్లు తప్ప కింగ్‌పిన్స్ చిక్కడం లేదు. ఎప్పటికప్పుడు కొత్తవారి ద్వారా, సరికొత్త మార్గాల్లో సరుకును మార్కెట్‌లోకి పంపుతున్నారు. ఈ నేపథ్యంలో ఇతర రాష్ట్రాల్లో ఉండి మన రాష్ట్రంలో డ్రగ్స్ దందా నడుపుతున్న కీలక వ్యక్తులపై ఏఎన్‌బీ దృష్టి పెట్టింది. పట్టుబడిన పెడ్లర్లు, సప్లయర్లు, కస్టమర్లతోపాటు డీఆర్ఐ, నార్కోటిక్స్ బ్యూరో నుంచి సేకరించిన డేటా ఆధారంగా టీజీ ఏఎన్‌బీ స్పెషల్ ఆపరేషన్స్‌కు ప్రణాళిక రూపొందించింది. కింగ్‌పిన్స్ స్థావరాలు, వారి మొబైల్ నంబర్లు, ద్వితీయ శ్రేణి సప్లయర్ల వివరాలను సేకరించి, మెరుపు దాడులకు సిద్ధమయ్యారు. సంగారెడ్డి జిల్లాలో పట్టుబడ్డ ఓ డ్రగ్స్ ముఠాకు మహారాష్ట్ర డ్రగ్స్ పెడ్లర్లతో లింకులు ఉన్నట్లు గుర్తించారు. ఇతర రాష్ట్రాల పోలీసులతో సమన్వయం చేసుకుంటూ మాదకద్రవ్యాలపై ఉక్కుపాదం మోపేందుకు రంగం సిద్ధంచేసింది.

కీలకంగా డాగ్ స్క్వాడ్

అనుమానిత ప్రాంతాల్లో గంజాయి, ఇతర మత్తు పదార్థాలను గుర్తించేందుకు చేసే తనిఖీల్లో బాంబ్ స్క్వాడ్ తరహాలో నార్కోటిక్స్ డాగ్ స్క్వాడ్‌ను కూడా అధికారులు సిద్ధం చేశారు. సుమారు 120 జాగిలాలకు అత్యుత్తమ శిక్షణ పూర్తి ఇచ్చారు. వీటిని రైల్వే స్టేషన్లు, బస్ స్టేషన్లు, రైళ్లలో తనిఖీ చేసేందుకు ఉపయోగించనున్నట్లు అధికారులు తెలిపారు. సరిహద్దు చెక్‌పోస్టుల వద్ద సెర్చ్ ఆపరేషన్స్‌లోనూ వీటిని ఉపయోగించనున్నారు.



Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.

కులగణన సర్వే దేశానికి ఆదర్శం

టీపీసీసీ అధికార ప్రతినిధి 'చనగాని'



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం చేపట్టిన కులగణనలో 96 శాతం మంది పాల్గొనడం దేశానికి ఆదర్శమని టీపీసీసీ అధికార ప్రతినిధి చనగాని దయాకర్ అభిప్రాయపడ్డారు. రాష్ట్రంలో కులగణన పారదర్శకంగా జరిగిందని, కులగణనపై జరుగుతున్న విష ప్రచారాలను తిప్పికొట్టాలని ఆదివారం ఒక ప్రకటనలో ఆయన కోరారు. చెప్పిన మాట ప్రకారం కులగణన చేశామని స్పష్టం చేశారు. రానున్న ఎన్నికల్లో బీసీ కులాలకు పెద్ద పీట వేస్తామని వెల్లడించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో మంచి అవకాశాలు రాబోతున్నాయని తెలిపారు. బీసీలను పట్టించుకోని బీఆర్ఎస్, బీజేపీలకు.. కులగణన గురించి మాట్లాడే అర్హత లేదని 'చనగాని' పేర్కొన్నారు.



యాదగిరిగుట్టకి భక్తుల తాకిడి

యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయానికి.. ఆదివారం వివిధ ప్రాంతాల భక్తులు తరలి వచ్చారు. దీంతో ధర్మ దర్శనానికి మూడున్నర గంటలు, వీఐపీ దర్శనానికి గంట సమయం పట్టిందని భక్తులు తెలిపారు. శ్రీ స్వామిని 40 వేల మంది భక్తులు దర్శించుకున్నారు. వివిధ పూజలతో యాదగిరీశుడికి నిత్యాదాయం రూ.45,73,274 వచ్చినట్లు ఆలయాధికారులు వెల్లడించారు. - యాదగిరిగుట్ట

గాలిలోనే విద్యుత్ తీగలకు మరమ్మతులు

స్పేసర్లతో సమస్య పరిష్కారం



వీధిలో తీగలను సరిచేస్తున్న దృశ్యం

ఏటూరునాగారం: ఎలాంటి ఆధారం లేకుండా నిచ్చెన సాయంతో విద్యుత్ తీగలను సరిచేసి.. వాటి మధ్య స్పేసర్లను అమర్చి సమస్యను పరిష్కరించారు. వివరాలివి. ములుగు జిల్లా ఏటూరునాగారం మండల కేంద్రంలో స్తంభాలకు తీగలు వదులుగా ఉండటంతో.. విద్యుత్ సరఫరాలో తరచూ అంతరాయం ఏర్పడుతోంది. న్యూట్రల్, మెయిన్ తీగలు తగిలి ఫ్యూజులు పోతున్నాయి. ఈ క్రమంలో స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ జేఎల్ఎం అమరేందర్ ఆదివారం విద్యుత్ తీగల మధ్య స్పేసర్లను అమర్చారు. ఏ ఆధారం లేకుండా నిచ్చెన సహాయంతో రామాలయం, వరప్రసాద్ వీధుల్లో తీగలకు స్పేసర్లు ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరించారు.

బలహీనపడుతున్న వివాహ బంధం

- దేశంలో కొన్నేళ్లుగా పెరుగుతున్న విడాకుల కేసులు
- సమస్యలకు పరిష్కారం వెతుక్కోకుండానే కోర్టుకెక్కుతున్న దంపతులు
- నచ్చినట్లు బతకాలన్న ధోరణి పెరగడమూ కారణమంటున్న నిపుణులు
- విడాకుల శాతంలో 7వ స్థానంలో తెలంగాణ.. తొలి స్థానంలో మహారాష్ట్ర
- తీర్పుల్లో సుదీర్ఘ జాప్యంతో అనధికారికంగా విడిపోతున్న జంటల సంఖ్యా ఎక్కువే



2024 ఏప్రిల్ నాటికి వివిధ రాష్ట్రాలవారీగా అత్యధిక విడాకుల కేసులు (శాతాల్లో)

మహారాష్ట్ర	18.7
కర్ణాటక	11.7
యూపీ	8.8
పశ్చిమ బెంగాల్	8.2
ఢిల్లీ	7.7
తమిళనాడు	7.1
తెలంగాణ	6.7
కేరళ	6.3

సాక్షి, హైదరాబాద్: పెళ్లంటే నూరేళ్ల పంట.. ఇది నిన్నటితరం వరకు దంపతులు అనుసరించిన జీవనమార్గం.. కానీ నేటి ఆధునిక కాలంలో ఈ సామెత దంపతులందరికీ వర్తించట్లేదని ఇటీవలి గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. దేశంలో ఏటేటా విడాకుల కేసులు పెరుగుతున్నాయని ఫ్యామిలీ కోర్టుల్లో పేరుకుపోయిన లక్షలాది కేసులు చెప్పకనే చెబుతున్నాయి. జీవితాన్ని తమ నియంత్రణలోనే ఉంచుకోవాలన్న ఆలోచన, వివాహ బంధంలో అసంతృప్తి, పాత-ఆధునిక భావాల మధ్య సంఘర్షణ వంటి కారణాలతో జంటలు విడిపోతున్నాయని నిపుణులు చెబుతున్నారు. కొన్ని జంటలైతే ఏడాది, రెండేళ్లలోపే వైవాహిక బంధానికి స్వస్తి పలుకుతున్నాయని అంటున్నారు. వివాదాలను పరస్పర అంగీకారంతో పరిష్కరించే ప్రయత్నాలు జరగకపోవడం, ఇతర మార్గాలను అన్వేషించకుండానే కోర్టు మెట్లు ఎక్కడం కూడా ఒక కారణమనే అభిప్రాయం వినిపిస్తోంది. గతేడాది ఏప్రిల్ వరకు అందుబాటులో ఉన్న గణాంకాలను పరిశీలిస్తే విడాకుల శాతంలో దేశంలోనే ఏడో స్థానంలో తెలంగాణ నిలిచింది.

విడాకుల శాతం పెరగడానికి ప్రధాన కారణాలు...

- దంపతుల మధ్య కమ్యూనికేషన్ లేకపోవడం
- కుటుంబంలో ఆర్థికపరమైన ఇబ్బందులు
- వైవాహిక బంధంలో భావోద్వేగాలు కొరవడటం
- పరస్పర నమ్మకం సన్నగిల్లడం
- జీవితంపై అసంతృప్తి, అభద్రతాభావం తీవ్రం కావడం
- భిన్నమైన కుటుంబ నేపథ్యాలు కలిగి ఉండటం
- స్వతంత్రంగా ఉండాలని కోరుకోవడం
- ఉద్యోగులైన భార్యాభర్తల పనివేళల్లో అంతరాలు ఉండటం
- మద్యపానం, ధూమపానం అలవాట్లు

విడాకుల కేసుల గణాంకాలు..

- 2022 నాటికి దేశవ్యాప్తంగా ఫ్యామిలీ కోర్టుల్లో 11.4 లక్షల విడాకుల కేసులు పెండింగ్‌లో ఉన్నాయి.
- ఇండోర్ ఫ్యామిలీ కోర్టులో 8,400 కేసులు పెండింగ్‌లో ఉండగా వాటిలో 5,500 విడాకుల కేసులే. వాటిలోనూ 3 వేల కేసులు పెళ్లయిన ఏడాదిలో దాఖలైనవే.
- 2018లో 2,250 కేసులు దాఖలవగా 2022లో 2,723 కేసులు నమోదయ్యాయి.
- గత పదేళ్లలో అత్యధిక అక్షరాస్యత ఉన్న కేరళలో విడాకుల శాతం 350 శాతం పెరిగింది. అదే సమయంలో పంజాబ్, హరియాణాలలో 150 శాతం విడాకుల కేసుల్లో పెరుగుదల కనిపించింది.
- గత ఐదేళ్లలో ఢిల్లీలో డివోర్స్‌ల శాతం రెండింతలయ్యింది.

'కాబోయే వధూవరుల మధ్య హేతుబద్ధమైన చర్చలు, వాస్తవ పరిస్థితులపై స్పష్టమైన అభిప్రాయాల మార్పిడి జరగకపోవడం విడాకుల కేసుల పెరుగుదల ప్రధాన కారణాల్లో ఒకటి. ఇద్దరి అభిప్రాయాలు, జీవనశైలి, అభిరుచులు, ఇష్టాయిష్టాలు, జీతాలు వంటి వాటిపై వాస్తవ విషయాల గురించి విడమరిచి చర్చించుకోకపోవడం, కుటుంబాల స్థిరచరాస్తులు, వేతనాలు, చదువులు వంటి విషయాల్లో అబద్ధాలు, అవాస్తవాలు చెప్పడం వంటివి పెళ్లి అయ్యాక బయటపడుతున్నాయి. దీంతో ఇరు కుటుంబాలు, దంపతుల మధ్య ఘర్షణ మొదలవుతోంది. అమ్మాయి ఉద్యోగం చేస్తూ సంపాదిస్తున్నా కుటుంబానికి, భర్తకు ఎక్కువ సేవ చేయాలని అత్తామామలు ఆశించడం, ఆమె సంపాదనంతా తమకు ఇవ్వాలని పట్టుబట్టడం, ఆర్థిక విషయాల్లో భేదాభిప్రాయాలు పెరగడం ఘర్షణలకు కారణమవుతున్నాయి.

– సి.వీరేందర్, సీనియర్ సైకాలజిస్ట్

అమ్మాయి, అబ్బాయి పెరిగిన వాతావరణం, కుటుంబ పరిస్థితులు భిన్నంగా ఉండటం, వివాహ వ్యవస్థ గురించి స్పష్టమైన అవగాహన, అభిప్రాయాలు లేకపోవడం వంటివి విడాకుల శాతం పెరగడానికి కారణ మవుతోంది. జీవితంలోకి కొత్త వ్యక్తి వచ్చాక చోటుచేసుకోబోయే మార్పు చేర్పులపై భయాందోళనలు, ఇద్దరి మధ్య అపార్థాలు పెరగడం, కొత్త ప్రదేశంలో, కొత్త కుటుంబంలో అమ్మాయి కుదురుకోకపోవడం ప్రభావం చూపుతోంది.

– కొండపాక సంపత్‌కుమార్, మీడియేషన్ సెంటర్, సిటీ సివిల్ కోర్టు కాంప్లెక్స్

బడ్జెట్‌లో అన్యాయంపై సీఎం యుద్ధం చేయాలి

కాంగ్రెస్ సీనియర్ నేత వీహెచ్



సాక్షి, న్యూఢిల్లీ: కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి జరిగిన అన్యాయంపై సీఎం రేవంత్‌రెడ్డి కేంద్రంతో యుద్ధం చేయాలని కాంగ్రెస్ సీనియర్ నేత వి.హనుమంత రావు సూచించారు. అప్పుడే అడిగినవి కేంద్రం ఇస్తుందని అభిప్రాయపడ్డారు. రాష్ట్రం నుంచి కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లు ఉన్నా.. బడ్జెట్‌లో అన్యాయం జరుగుతుంటే నోరు మెదపడం లేదని మండిపడ్డారు. ప్రజలు ఓట్లు వేస్తే గెలిచినవారు కేంద్రాన్ని అడగరా? అని ప్రశ్నించారు. ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో వీహెచ్ ఆదివారం విలేకరులతో మాట్లాడారు. కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వానికి మద్దతుగా నిలుస్తున్న ఏపీ, గుజరాత్, బిహార్ వంటి రాష్ట్రాలకే బడ్జెట్‌లో ప్రాధాన్యమిచ్చారని విమర్శించారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వానికి చంద్రబాబు బేషరతుగా మద్దతు ఇచ్చారు కాబట్టే.. విశాఖ స్టీల్‌ప్లాంట్, అమరావతి, పోలవరం ప్రాజెక్టుకు పెద్ద ఎత్తున నిధులు కేటాయించారని ఆరోపించారు. తెలంగాణలో మూసీ ప్రక్షాళన కోసం నిధులు మంజూరు చేయాలని ప్రధాని మోదీని సీఎం రేవంత్‌రెడ్డి కలిసినా.. బడ్జెట్‌లో కేటాయింపులు లేవన్నారు. సబ్‌కా సాత్ సబ్ కా వికాస్ అనే కేంద్ర ప్రభుత్వ నినాదం కేవలం ప్రచారానికే పరిమితమైందని వీహెచ్ విమర్శించారు.

శాట్ చైర్మన్ అభినందనలు..



సాక్షి, హైదరాబాద్: అండర్-19 టీ 20 మహిళల ప్రపంచకప్‌ను గెలుచుకున్న భారత మహిళా జట్టుకు తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి అభినందనలు తెలిపారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. మహిళా క్రికెటర్లను చూసి దేశం గర్విస్తోందని పేర్కొన్నారు. తెలంగాణ బిడ్డ గొంగడి త్రిష అంతర్జాతీయ వేదికపై సత్తా చాటి..తెలుగువారందరికీ గర్వకారణంగా నిలిచిందని అన్నారు.

అన్ని వర్గాలకు ప్రయోజనకరం ఈ బడ్జెట్


కేంద్ర మంత్రి రామ్‌దాస్ అథావలే



సాక్షి, హైదరాబాద్: తమ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ సామాజిక న్యాయం, సాధికారతను ప్రోత్సహించే విధంగా ఉందని కేంద్ర మంత్రి రాందాస్ అథావలే అన్నారు. ఆదివారం బేగంపేటలోని ప్లాజా హోటల్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ, మధ్యతరగతితో పాటు షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలు, వెనుకబడిన తరగతులు, రైతులకు ఉపయోగపడేలా బడ్జెట్‌ను తీర్చిదిద్దడం గొప్ప విషయమన్నారు. అన్నివర్గాలకు ప్రయోజనం కలిగించే ఈ బడ్జెట్ దేశ చరిత్రలో నిలిచిపోతుందని అభిప్రాయపడ్డారు. కేంద్ర సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వ శాఖకు తాజా బడ్జెట్‌లో 1.4 శాతం కేటాయింపులు పెరిగాయన్నారు. ఎస్సీ సంక్షేమానికి రూ.1,68,478 కోట్లు, గిరిజన సంక్షేమానికి రూ.1,29,249 కోట్లు కేటాయించారన్నారు. ఈ కేటాయింపులు దేశవ్యాప్తంగా ఉన్న అట్టడుగు వర్గాల అభ్యున్నతి విషయంలో తమ ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమని పేర్కొన్నారు.

బడ్జెట్.. ఆఫ్‌బీట్

ఆర్థిక మంత్రి చెప్పకముందే.. బడ్జెట్ బయటికొచ్చేసిన వేళ..



బడ్జెట్ అంటే కేవలం ఆదాయం, వ్యయం లెక్కలే కాదు.. వేటి ధరలు తగ్గబోతున్నాయి? ఏవి పెరగబోతున్నాయి? పన్నులేమైనా తగ్గిస్తారా, పెంచుతారా? కొత్తగా వచ్చే ప్రయోజనాలేంటన్న ఆసక్తి అందరిలో ఉంటుంది. కేంద్ర ఆర్థిక మంత్రి పార్లమెంటులో బడ్జెట్ ప్రవేశపెట్టేదాకా ఇవన్నీ రహస్యమే. ఎందుకంటే ముందే బడ్జెట్ ప్రతిపాదనలు బయటికి తెలిస్తే... చాలా తేడాలు వచ్చేస్తాయి. ధరలు పెరిగిపోయేవి ముందే కొని దాచేసుకోవడం, తగ్గిపోయేవాటిని మార్కెట్లోకి వదిలేయడం, స్టాక్ మార్కెట్లలో కంపెనీల షేర్ల కొనుగోళ్లు, అమ్మకాలు.. ఇలా మరెన్నో. కొన్నిసార్లు మోసాలకూ, అవకతవకలకూ చాన్స్ ఉంటుంది. ఇలా మన దేశ బడ్జెట్ ఓసారి ముందే లీకై, కేంద్ర ఆర్థిక మంత్రి రాజీనామాకు దారి తీయడం తోపాటు... బడ్జెట్‌కు రూపకల్పన చేసే ప్రక్రియనే మార్చేసింది తెలుసా?

అది 1950వ సంవత్సరం.. జాన్ మథాయ్ కేంద్ర ఆర్థిక మంత్రిగా ఉన్నారు. ఆయన, వివిధ శాఖల ఉన్నతాధికారులు కూర్చుని కేంద్ర బడ్జెట్ రూపకల్పన పూర్తిచేశారు. ప్రింట్ చేసి పార్లమెంటులో బడ్జెట్ ప్రవేశపెట్టడమే తరువాయి. అప్పట్లో రాష్ట్రపతిభవన్‌లోని ప్రెస్‌లో బడ్జెట్ ప్రతులను ముద్రించేవారు. ఇప్పుడున్నంత కఠినంగా సెక్యూరిటీ ఉండేది కాదు. దీనితో బడ్జెట్ పత్రాలు లీకయ్యాయి. రాష్ట్రపతి భవన్‌కు వెళ్లిన కొందరు జర్నలిస్టుల చేతికి చిక్కాయి. జాన్ మథాయి పార్లమెంటులో బడ్జెట్ ప్రవేశపెట్టేలోపే జనానికి అందులోని అంశాలు తెలిసిపోయాయి. ధనికులు, పెద్దలకు ప్రయోజనం కలిగించేలా బడ్జెట్ ఉందన్న విమర్శలు చెలరేగాయి. ఈ దెబ్బకు బడ్జెట్ పత్రాల ప్రింటింగ్‌ను ఢిల్లీలోని మింటో రోడ్‌లో ఉన్న ప్రభుత్వ ప్రెస్‌కు మార్చారు. తర్వాత 1980లో కేంద్ర సెక్రటేరియట్ ఉన్న నార్త్ బ్లాక్ భవనంలోని బేస్‌మెంట్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక ప్రింటింగ్‌లో ముద్రించడం ప్రారంభించారు.

ఇప్పుడు బడ్జెట్ పత్రాల రూపకల్పన, ప్రింటింగ్ అంటే... అధికారులు, సిబ్బంది క్వారంటైన్‌లో ఉన్నట్టే. ఎవరూ వారం పాటు కాలు బయటపెట్టడానికి వీల్లేదు, ఫోన్లు వాడటానికి అస్సలు వీల్లేదు.

అధ్యక్షా...ఆగాల్సిందేనా !

ఇంకా కొలిక్కి రాని బీజేపీ జిల్లా అధ్యక్షుల ఎన్నికలు

కనీసం 50 శాతమైనా జిల్లా అధ్యక్షుల ఎన్నిక పూర్తయితేనే రాష్ట్ర అధ్యక్షుడి ఎన్నికకు రూట్ క్లియర్



సాక్షి, హైదరాబాద్ : బీజేపీ జిల్లా అధ్యక్షుల ఎన్నికలు ఇంకా ఓ కొలిక్కి రాలేదు. వాస్తవానికి పదిరోజుల క్రితమై ఈ ఎన్నికలు పూర్తికావాల్సి ఉన్నా.. వాయిదా పడుతూ వచ్చాయి. దీంతో జిల్లా అధ్యక్షుల ఎన్నిక ఇప్పట్లో జరిగేనా అన్న చర్చ కేడర్‌లో జరుగుతోంది. రాష్ట్రవ్యాప్తంగా 50 శాతం వరకూ బీజేపీ జిల్లా అధ్యక్షులను ఎన్నుకుంటూనే రాష్ట్ర అధ్యక్షుడి ఎన్నికకు మార్గం సుగమమవుతుంది. ఈ నెల 16, 17 తేదీల్లోగానే ఆయా జిల్లా అధ్యక్షుల ఎన్నికలు జరగాల్సి ఉండగా, అవి ఆగిపోయాయి. దీంతో ఈ నెల 26 తర్వాత ఒకటి, రెండురోజుల్లో పూర్తిచేయాల్సిన రాష్ట్ర అధ్యక్ష ఎన్నిక కూడా వాయిదా పడుతుందా అన్న అనుమానం నెలకొంది. ఒకవేళ 50 శాతం జిల్లా అధ్యక్షుల ఎన్నికలు పూర్తికాక, రాష్ట్ర అధ్యక్షుడి ఎన్నిక జరగకపోతే...జాతీయ అధ్యక్షుడి ఎన్నిక పూర్తయ్యాకే రాష్ట్ర పార్టీకి కొత్త అధ్యక్షుడిని నియమించే అవకాశముందని పార్టీ నేతలు చెబుతున్నారు. జిల్లా అధ్యక్షుల ఎన్నికలో భాగంగా బీసీ, ఎస్సీ, ఎస్టీ, మహిళలకు తగిన ప్రాధాన్యం కల్పించడం తోపాటు సామాజికవర్గాల వారీగా కూడా సమతూకం పాటించాల్సి ఉంది.ఈ నేపథ్యంలో పలు జిల్లాల్లో దీనికి సంబంధించి కొందరి పేర్లపై ఏకాభిప్రాయం కుదర లేదని పార్టీ నాయకులు చెబుతున్నారు. కొన్ని జిల్లాల్లో అధ్యక్ష పదవులకు ప్రతిపాదనలు పంపిన ముగ్గురేసి అభ్యర్థుల పేర్లపై అభ్యంతరాలు వ్యక్తం కావడంతో ఈ ప్రక్రియ నిలిచినట్టుగా తెలుస్తోంది. గతంలోనూ ఇదే విధంగా జిల్లా అధ్యక్షులను నియమించడంపై బహిరంగంగానే కేడర్ కొట్లాడుకోవడం, విమర్శలు ఎదురైన విషయాన్ని కూడా ఇప్పుడు గుర్తుచేసుకోవడం గమనార్హం.

మూడేసి పేర్ల జాబితాపై స్పష్టతేదీ ?

ఒక్కో జిల్లాకు ముగ్గురేసి నాయకులతో ఆశావహుల జాబితాను సిద్ధం చేసి జాతీయ నాయకత్వానికి పంపినా, వీటి నియామకంపై ఇంకా స్పష్టత రాలేదు. కొందరు రాష్ట్ర, జిల్లా నాయకులు ఢిల్లీ వెళ్లి ఆయా జిల్లాల జాబితాలపై ఫిర్యాదులు, ఆరోపణలు చేయడంతో ఈ వివాదం మరింతగా ముదిరిందని చెబుతున్నారు. ప్రస్తుతం ఢిల్లీలో ఉన్న కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి నగరానికి వచ్చాక జిల్లా అధ్యక్షుల ఎన్నికపై ఓ స్పష్టత వస్తుందని పార్టీ నేతలు చెబుతున్నారు. ఇదిలాఉంటే జిల్లా అధ్యక్షుల ఎన్నిక పూర్తయ్యాకే... రాష్ట్ర అధ్యక్షుడిగా ఎవరిని నియమించాలనే దానిపై అభిప్రాయసేకరణ జరుపుతారు. రాష్ట్ర పార్టీ అధ్యక్ష, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుల ఎన్నికల అధికారి అయిన కేంద్ర మంత్రి శోభా కరాంద్లజే ఇక్కడకు రావాల్సి ఉంది. ఈ అభిప్రాయ సేకరణ సందర్భంగా ఒక పేరుపై ఏకాభిప్రాయానికి వస్తే జాతీయ నాయకత్వం అనుమతి తీసుకొని ఆమె ఇక్కడే పార్టీ కొత్త అధ్యక్షుడిని ప్రకటించే అవకాశాలు కూడా ఉన్నాయని రాష్ట్ర ముఖ్యనేత ఒకరు 'సాక్షి'కి వెల్లడించారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా



విజయవాడ దుర్గాఘాట్ వద్ద కృష్ణా నదిలో ఆక్వాడెవిల్స్ ఆధ్వర్యంలో ఆదివారం రివర్‌క్రాసింగ్ ఈతపోటీలు నిర్వహించారు. నగరవాసులు పెద్ద ఎత్తున ఈ పోటీల్లో పాల్గొన్నారు. - సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

అవగాహనే అసలు మందు



ప్రజలకు క్యాన్సర్‌పై అవగాహన కల్పించేందుకు మహాత్మాగాంధీ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ ఆధ్వర్యంలో విశాఖ ఆర్కేబీచ్‌లో ఆదివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో పెద్ద ఎత్తున యువత పాల్గొన్నారు. - సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

యువ జలతరంగం



విశాఖలోని రుషికొండ బీచ్‌లో యువత ఆదివారం సందడి చేశారు. అలలతో పోటీపడుతూ ఆటపాటలతో సెలవు రోజు హాయిగా గడిపారు - సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

క్లుప్తంగా...

చదవలేదని చితకబాదాడు

సోదరుడి పిల్లలను కొట్టిన తమ్ముడు



జాను

చిట్టమూరు: తన అన్న కుమార్తె, కుమారుడు బాగా చదవడం లేదని తమ్ముడు చిన్నారులను విచక్షణారహితంగా కొట్టిన ఘటన తిరుపతి జిల్లా, చిట్టమూరు మండలం కోగిలి దళితవాడలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ చిన్న బలరామయ్య కథనం మేరకు...కోగిలి దళితవాడకు చెందిన దామవరపు రాజయ్య, పోలమ్మ దంపతులకు జాను, నిత్య అనే కుమారుడు, కుమార్తె ఉన్నారు. రాజయ్య, పోలమ్మలు శనివారం కూలి పనులకు వెళ్లారు. పోలయ్య తమ్ముడు ముత్యాలయ్య పిల్లలకు సాయంత్రం ఏబీసీడీలు చెప్పమని అడిగాడు. వారు చెప్పలేకపోవడంతో ఇంట్లోకి తీసుకువెళ్లి తలుపునకు గడియ పెట్టి కర్రతో విచక్షణారహితంగా బాదాడు. కూలి పనులకు వెళ్లి తిరిగి ఇంటికి వచ్చిన తల్లిదండ్రులు పిల్లలకు తగిలిన దెబ్బలు చూసి తల్లడిల్లిపోయారు. ముత్యాలయ్యపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆదివారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ చిన్న బలరామయ్య తెలిపారు.

ఏపీలో ఉద్యోగులకు రూ.25 వేల కోట్ల బకాయిలు

కాకినాడ సిటీ: ఏపీలోని ప్రభుత్వోద్యోగులకు రూ.25 వేల కోట్ల బకాయిలున్నాయని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు కేఆర్ సూర్యనారాయణ చెప్పారు. కాకినాడ అంబేడ్కర్ భవన్‌లో ఆదివారం జరిగిన సంఘం కాకినాడ జిల్లా మూడో కౌన్సిల్ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా విలేకర్లతో మాట్లాడుతూ, ప్రతి నెలా ఉద్యోగులకు సుమారు రూ.6,500 కోట్ల వేతనాలు చెల్లించాలని, దీంతో పాటు పలు బెనిఫిట్లు చెల్లించాల్సి ఉందని అన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై తమకు పూర్తిగా అవగాహన ఉన్నందువల్ల బకాయి పడిన మూడు డీఏల్లో తక్షణం ఒకటి ప్రకటించాలని డిమాండ్ చేశారు. అలాగే ఉద్యోగులకు ప్రతి నెలా వేతనం ఇచ్చేలా చెల్లింపులపై చట్టబద్ధత చేయాలని కోరారు. అలాగే 14వ వేతన సవరణ అధ్యయన కమిషన్‌ను రిటైర్డ్ హైకోర్టు జడ్జి నేతృత్వంలో నియమించాలన్నారు.

ఏప్రిల్ 27న చేనేతల ఆత్మగౌరవ సభ

గన్నవరం: చేనేతల సమస్యలపై గళమెత్తేందుకు గుంటూరు జిల్లా మంగళగిరి కేంద్రంగా ఏప్రిల్ 27న చేనేత కార్మికుల ఆత్మగౌరవ సభ నిర్వహించాలని ఆల్ ఇండియా వీవర్స్ ఫెడరేషన్ నిర్ణయించింది. ఈ మేరకు కృష్ణాజిల్లా గన్నవరంలో ఆదివారం ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడు బండారు ఆనంద్‌ప్రసాద్ నేతృత్వంలో జరిగిన చేనేతల బహిరంగ సభ సన్నాహక సమావేశం జరిగింది. మాజీ మంత్రి, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్, ఆప్కో చైర్‌పర్సన్ డాక్టర్ సజ్జా హేమలత, పలువురు ఫెడరేషన్, చేనేత సంఘాల నుంచి బహిరంగ సభ ఏర్పాట్లపై అభిప్రాయాలను సేకరించారు. ఆనంద్‌ప్రసాద్ మీడియాతో మాట్లాడుతూ..రాష్ట్రంలో వ్యవసాయ రంగం తర్వాత అత్యధిక మందికి ఉపాధి కల్పిస్తున్న చేనేత రంగం తన ఉనికిని చాటుకునేందుకు పోరుబాటకు సిద్ధంకావాల్సిన సమయం వచ్చిందన్నారు. చేనేతల సమస్యల పరిష్కారానికి వీవర్స్ ఫెడరేషన్‌తో పాటు అన్ని సంఘాలను ఐక్యం చేస్తున్నట్లు తెలిపారు. అందరి సమన్వయంతో మంగళగిరిలో జరగనున్న బహిరంగ సభను విజయవంతం చేసి చేనేతల సమస్యలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకువెళ్తామని చెప్పారు.

గిరిజనుల హక్కులను హరించేందుకు కూటమి కుట్ర

ఎమ్మెల్సీ రవిబాబు

సాక్షి, విశాఖపట్నం: గిరిజనుల హక్కులను హరించేందుకు కూటమి ప్రభుత్వం కుట్రకు తెరలేపుతోందని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ, రాష్ట్ర ఎస్టీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ కుంభా రవిబాబు మండిపడ్డారు. ఇటీవల విశాఖలో జాతీయ టూరిజం ఇన్వెస్టర్స్ సమ్మిట్ సందర్భంగా జరిగిన సభలో స్పీకర్ అయ్యన్నపాత్రుడు గిరిజనులకు రక్షణ కవచంలా ఉండే 1/70 చట్టానికి తూట్లు పొడిచేలా వ్యాఖ్యలు చేయడం పట్ల గిరిజనులంతా మండిపడుతున్నారన్నారు. గిరిజనుల రక్షణ చట్టాన్ని హరించేందుకు కుట్రలకు పాల్పడితే సహించేది లేదంటూ హెచ్చరించారు. ఆదివారం లాసన్స్‌బే కాలనీలో ఆయన విలేకరులతో మాట్లాడారు.

ఆ రొయ్యపై మనసైంది

ఆక్వా రైతులు ఫ్లోరిడా రొయ్యపై మన'సై'ందని అంటున్నారు. మేలు రకం ఉత్పత్తిగా ఇప్పటికే మార్కెట్ నుంచి ప్రశంసలు అందుకుంటున్న 'సై' ఆక్వా రకం రొయ్యను తమ చెరువుల్లోనూ దింపేందుకు సైసై అంటున్నారు. వ్యాధుల తీవ్రత గణనీయంగా తగ్గడం, దిగుబడిపై నమ్మకం కుదరడంతో ఇప్పటికే పలువురు రైతులు ఈ రకంతో లాభాలు చూస్తున్నారు. వనామీలో సుమారుగా 10కి పైగా తల్లిరొయ్యల ఉత్పత్తి సంస్థలు వారి జెనెటికల్‌లైన్స్‌ను హేచరీల ద్వారా అందిస్తున్నాయి.





ఎక్స్‌పోర్ట్‌కు సిద్ధమైన సైఆక్వా కౌంట్ రొయ్యలు

రొయ్యల రైతులను ఊరిస్తున్న ఫ్లోరిడా రకం

రికార్డు స్థాయి ఎఫ్‌సీఆర్ నమోదు

వనామీలో సునామీ సృష్టిస్తున్న కొత్త జెనెటికల్ లైన్

జిల్లాలో ఆక్వా రైతులు ఎప్పటికప్పుడు అప్‌డేట్ అవుతున్నారు. సామాజిక మాధ్యమాల సాయంతో పలు రకాల సంస్థల సహకారంతో కొత్త కొత్త రకాలను పరిచయం చేసుకుంటున్నారు. వారిని మరింత ఉత్సాహపరిచేలా వనామీలో కొత్తరకం జెనెటికల్ లైన్ ఇప్పుడు రికార్డు స్థాయిలో ఎఫ్‌సీఆర్ (ఫీడ్ కన్వర్షన్ రేషియో) నమోదవుతుంది. జిల్లాలో ఎక్కువ మంది రొయ్యల రైతులు ఇప్పుడు ఈ రకం రొయ్యల సాగు చేసేందుకు ఉత్సాహ పడుతున్నారు. జిల్లాలో రొయ్యల సాగు విస్తీర్ణం 4200 ఎకరాల వరకు ఉంటుంది. - పోలాకి

ఏమిటీ 'సై' ఆక్వా

'సై' ఆక్వా అనేది ఫ్లోరిడాకు చెందిన తల్లిరొయ్యల ఉత్పత్తి సంస్థ. ఎప్పటికప్పుడు శాస్త్రీయంగా కొత్త జెనెటిక్స్ ఎంపిక, ఎగ్ ప్రొడక్షన్, లార్వాల ఉత్పత్తి, ఉత్తమ స్థాయి ఆరోగ్య నిర్వహణ చేసి మేలు రకం ఉత్పత్తులను మార్కెట్‌లోకి విడుదల చేస్తారు. గతంలో టైగర్ రొయ్యల సాగు తర్వాత ఆక్వారంగం అనేక ఒడిదొడుకులు ఎదుర్కొంది. వనామీ రకం సాగుతో కొంత వరకు బయటపడింది. ఆ తర్వాత రొయ్యల సాగు ఇలాంటి కొత్త జెనెటికల్ లైన్స్‌తో ఎప్పటికప్పుడు అప్‌డేట్ అవుతూ వస్తోంది. వనామీలో సుమారుగా 10కి పైగా తల్లిరొయ్యల ఉత్పత్తి సంస్థలు వారి జెనెటికల్ లైన్స్‌ను హేచరీల ద్వారా అందిస్తున్నాయి. ఆయా ప్రాంతాల వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా ఆ ఉత్పత్తుల వాడకం జరుగుతుంది. మూడేళ్ల కిందటే జిల్లా పరిచయమైన సై ఆక్వా బ్యాలెన్స్ లైన్ రికార్డు స్థాయిలో విజయవంతమైంది.

బ్యాలెన్స్ లైన్ ప్రత్యేకత

అందుబాటులో ఉన్న జెనెటికల్ లైన్స్‌తో పోల్చితే తక్కువ కాలంలో ఎక్కువ పెరుగుదల కనబరుస్తూ, వ్యాధులను తట్టుకుంటూ, చక్కటి ఎఫ్‌సీఆర్ నమోదు కావటం దీని ప్రత్యేకత. ఆక్వా సాగులో మేత వినియోగం కీలకం. సగానికిపైగా పెట్టుబడి ఫీడింగ్ కోసం వెచ్చిస్తారు. సాధారణంగా 1కిలో రొయ్యల ఉత్పత్తికి 1.1కిలో నుంచి 1.3కిలో వరకు మేత వినియోగం జరిగితే రొయ్యలసాగు లాభ దాయకం అనుకోవచ్చు. సై ఆక్వా సాగు చేస్తున్న రైతులు ఇప్పుడు ఇదే ఎఫ్‌సీఆర్‌లో రొయ్యల ఉత్పత్తి చేస్తున్నారు. గతంలో 1.5కు పైగా ఎఫ్‌సీఆర్ నమోదైన సందర్భాలు కూడా ఉన్నాయి.

బ్రూడ్ స్టాక్ దిగుమతి పెంచుతున్నాం



ఇండియన్ కోస్ట్‌లో మా బ్యాలెన్స్ జెనెటికల్ లైన్ డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని, బ్రూడ్‌స్టాక్(తల్లి రొయ్య) దిగుమతులు పెంచేందుకు ప్రతిపాదనలు చేశాం. రైతులకు అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేసి సాంకేతికంగా మరింత ముందకు తీసుకెళ్లేందుకు కృషిచేస్తాం.

- జి.విద్యాధరరావు, టెక్నికల్ సేల్స్ మేనేజర్, సైఆక్వా

రెండేళ్లుగా సాగు చేస్తున్నాం



రెండేళ్లుగా ఈ రకం పీఎల్‌ను మేము సాగు చేస్తున్నాం. కొత్త జెనెటికల్స్ అందుబాటులోకి వచ్చిన తర్వాత పాత కాలపు వ్యాధుల తీవ్రత బాగా తగ్గింది. బ్యాలెన్స్‌లైన్ అందుబాటులోకి వచ్చిన తర్వాత వైట్ గట్, రన్నింగ్ మోర్టాలిటీ వంటి వ్యాధుల తీవ్రత తగ్గింది.

- చింతు అప్పన్న, ఆక్వా రైతు, బిలమర

డిమాండ్ ఉంది



ఇటీవల కాలంలో రైతుల నుంచి సై ఆక్వా బ్యాలెన్స్ లైన్ రకం రొయ్య పిల్లలకు డిమాండ్ పెరిగింది. అందుకు తగ్గస్థాయిలో మేము కూడా సిద్ధం చేసుకోవాల్సి వస్తోంది. కొన్నిసార్లు అడ్వాన్స్ బుకింగ్ లేకపోతే పీఎల్(పోస్ట్ లార్వా) అందించలేకపోతున్నాం.

- ఎస్.కల్యాణ చక్రవర్తి, రమా ష్రింప్ హేచరీస్, తోనంగి, గార

ఆధ్యాత్మిక సమాచారం

గుబ్బల మంగమ్మ గుడికి పోటెత్తిన భక్తులు



బుట్టాయగూడెం: ఏలూరు జిల్లా బుట్టాయగూడెం మండలంలోని మారుమూల గ్రామమైన కామవరం సమీపంలోని అటవీ ప్రాంతంలో కొలువై ఉన్న గుబ్బల మంగమ్మ గుడికి ఆదివారం భక్తులు పోటెత్తారు. తెల్లవారుజాము నుంచే ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాతో పాటు విజయవాడ, మచిలీపట్నం, తెలంగాణ రాష్ట్రంలోని భద్రాచలం, పాల్వంచ, కొత్తగూడెం, సత్తుపల్లి, అశ్వారావుపేట ప్రాంతాల నుంచి కూడా పెద్ద ఎత్తున భక్తులు వాహనాలతో తరలివచ్చారు.

వైభవంగా వసంత పంచమి



కొత్తపల్లి: నల్లమల అటవీ ప్రాంతంలోని కర్నూలు జిల్లా శివపురం గ్రామ శివారులో వెలసిన కొలను భారతి దేవి క్షేత్రంలో వసంత పంచమి వేడుకలు వైభవంగా జరిగాయి. అమ్మవారిని జ్ఞాన స్వరూపిణి సరస్వతీదేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారు జాము నుంచే అమ్మవారికి అభిషేకం, సర్వసతి హోమాలు, చిన్నారులతో సామూహిక అక్షరాభ్యాసాలు చేయించారు. శ్రీశైలం దేవస్థానం సూపరింటెండెంట్ నాగేశ్వరరావు ఆలయ వేద పండితులతో కలిసి ఉదయం కొలనుభారతి దేవి క్షేత్రానికి చేరుకొని అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించారు.

ఉరుకుంద క్షేత్రం .. ఉత్సవ వైభవం



మంత్రాలయం/కౌతాళం: వేద మంత్రాలు.. మంగళవాయిద్యాలు, కోలాటాలు, నందికోల, వీరభద్ర వేషధారుల ప్రదర్శనలతో కర్నూలు జిల్లాలోని ఉరుకుంద క్షేత్రం పులకించింది. ఈరన్న స్వామి ఆలయ మహా కుంభాభిషేక మహోత్సవంలో భాగంగా రెండో రోజు ఆదివారం ఉదయం రుద్రహోమం, చండీహోమం, మహా సుదర్శన హోమం, శాంతి హోమాలు నిర్వహించారు.

రాట్నాలమ్మకు ప్రత్యేక పూజలు



పెదవేగి : భక్తుల పాలిట కల్పతరువు శ్రీ రాట్నాలమ్మకు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఏలూరు జిల్లా పెదవేగి మండలం రాట్నాలకుంట గ్రామంలో వేంచేసి వున్న అమ్మవారికి ఆదివారం ప్రీతికరమైన రోజు. ఈ మేరకు జిల్లా నలుమూలల నుంచి అధిక సంఖ్యలో వచ్చిన భక్తులు మొక్కుబడులను చెల్లించుకున్నారు.

రత్నగిరికి పోటెత్తిన భక్తులు



అన్నవరం: మాఘ మాసం తొలి ఆదివారం కావడంతో కాకినాడ జిల్లా అన్నవరం పుణ్యక్షేత్రంలోని రత్నగిరికి భక్తులు పోటెత్తారు. ఉదయం నుంచీ భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. ఎక్కువ మంది కార్లు, ఇతర వాహనాల్లో తరలి రావడంతో దేవస్థానంలోని పార్కింగ్ స్థలాలన్నీ వాహనాలతో నిండిపోయాయి. ఆలయం వద్ద రద్దీ ఏర్పడింది. సత్యదేవుని ఉచిత దర్శనానికి గంట, ప్రత్యేక దర్శనానికి అరగంట పట్టింది.

రథసప్తమికి విస్తృత ఏర్పాట్లు



తిరుమల: తిరుమలలో ఈ నెల 4వ తేదీ నిర్వహించనున్న రథసప్తమి వేడుకలకు టీటీడీ విస్తృత ఏర్పాట్లు చేస్తోంది. ఏటా మాఘ మాసంలో సప్తమినాడు మలయప్పస్వామి వారు 7 ప్రధాన వాహనాలపై ఊరేగి భక్తులను అనుగ్రహిస్తారు. వాహనసేవలు తిలకించేందుకు వచ్చే భక్తులు చలికి, ఎండకు, వర్షానికి ఇబ్బందులు పడకుండా నాలుగు మాడ వీధుల్లోని గ్యాలరీల్లో జర్మన్ షెడ్లు ఏర్పాటు చేశారు. శ్రీవారి భక్తులకు నిరంతరాయంగా అన్నప్రసాదాలు, తాగునీరు అందించేందుకు గ్యాలరీల్లో ఫుడ్ కౌంటర్లు ఏర్పాటు చేశారు.

శాస్త్రోక్తంగా బాలాలయ పూజలు



కాణిపాకం: కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయక స్వామి దేవస్థానంలో ఆదివారం బాలాలయ పూజలు అత్యంత వైభవంగా సాగాయి. శ్రీ వీరాంజనేయస్వామి ఆలయ పునఃనిర్మాణ పనుల్లో భాగంగా బాలాలయ పూజలను పండితులు శాస్త్రోక్తంగా జరిపించారు.

జాబ్ మేళా రేపు

తిరుపతి అర్బన్: జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ఆ విభాగం జిల్లా అధికారి లోకనాథం ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. సూళ్లూరుపేటలోని ఎస్‌వీఎస్‌సీ ప్రభుత్వ డిగ్రీకళాశాలలో ఉదయం 9 గంటల నుంచి మేళా ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. 10వ తరగతి లేదా ఇంటర్ లేదా ఏదైనా డిగ్రీ, ఐటీఐ, డిప్లొమా చదువుకున్న వారు అర్హులుగా పేర్కొన్నారు. జాబ్‌మేళాకు పలు కంపెనీల ప్రతినిధులు హాజరుకానున్నట్లు చెప్పారు. ఆసక్తి ఉన్న వారు బయోడేటాతోపాటు సర్టిఫికెట్ల జెరాక్స్ తీసుకురావాలని సూచించారు. అదనపు సమాచారం కోసం 9491458910 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

6 నుంచి వర్డ్ ఫర్ ఛాంపియన్‌షిప్ పోటీలు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో వర్డ్ ఫర్ ఛాంపియన్‌షిప్ పోటీలు నిర్వహించాలని రాష్ట్ర సమగ్రశిక్ష శాఖ అధికారులు జారీ చేసిన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఆ ఉత్తర్వుల మేరకు జిల్లాలోని 2వ తరగతి నుంచి 5వ తరగతి వరకు విద్యార్థులకు వర్డ్ పవర్ ఛాంపియన్‌షిప్ పోటీలు నిర్వహించాలన్నారు. ఈ పోటీలను ఈ నెల 6వ తేదీ నుంచి మార్చి 7 వరకు సంబంధిత షెడ్యూల్ మేరకు చేపట్టాలని ఆదేశించారు.

నిబంధనలకు నీళ్లు.. అంతా ఒకే వర్గం వాళ్లు!

సంస్థాగత ఎన్నికలపై బీజేపీ నేతల్లో తీవ్ర అసంతృప్తి

నిబంధనలకు విరుద్ధంగా జిల్లా అధ్యక్షులను నియమించారనే విమర్శలు

రాష్ట్ర అధ్యక్ష పదవికి జిల్లా అధ్యక్షుల అభిప్రాయం కీలకం

అందువల్ల నిబంధనలకు విరుద్ధమైనా తమ వారినే ముఖ్య నేతలు ఎంపిక చేశారనే ఆరోపణలు



సాక్షి, అమరావతి: బీజేపీ సంస్థాగత ఎన్నికల ప్రక్రియలో భాగంగా ఇటీవల జిల్లా అధ్యక్షుల ఎంపిక జరిగిన తీరుపై ఆ పార్టీ నేతల్లో అసంతృప్తి పెల్లుబికుతోంది. ఇది పేరుకే ఎన్నిక గానీ... వాస్తవానికి పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు, పార్టీ సంఘటనా కార్యదర్శి కనుసన్నల్లో తమకు నచ్చిన వారికే జిల్లా అధ్యక్ష పదవులను కట్టబెట్టారని ఆ నేతల్లో అంతర్గతంగా పెద్ద ఎత్తున చర్చ సాగుతోంది. ఎన్నికలకు ముందు రోజు రాత్రి జిల్లా ఎన్నికల అధికారులకు ముఖ్య నేతలు ఫోన్ చేసి తాము చెప్పిన వారినే అధ్యక్షులుగా ప్రకటించాలని ఒత్తిడి చేశారని పలువురు నేతలు ఆరోపిస్తున్నారు. నిబంధనలను ఏమాత్రం పట్టించుకోకుండా పక్కా పథకం ప్రకారం తమకు నచ్చినవారినే జిల్లా అధ్యక్షులుగా నియమించుకున్నారని సీనియర్ నాయకులు అసంతృప్తి వ్యక్తంచేస్తున్నారు.

రాష్ట్ర అధ్యక్ష ఎన్నికపై ప్రభావం ఉంటుందనే..

బీజేపీ జిల్లా అధ్యక్షుల ఎన్నికల తర్వాత రాష్ట్ర అధ్యక్ష పదవికి ఎన్నికలు ఉంటాయి. ఈ ఎన్నికల్లో జిల్లా అధ్యక్షుల అభిప్రాయం కీలకం. అందువల్ల మెజారిటీ జిల్లాల అధ్యక్షులుగా తమ మనుషులు ఉండాలనే ముందస్తు వ్యూహంలో భాగంగానే ఈ ఎన్నికలను పూర్తిగా నిబంధనలకు విరుద్ధంగా నడిపించారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

నిబంధనలకు విరుద్ధంగా నియామకాలు ఇలా...

- బీజేపీ సంస్థాగత ఎన్నికల్లో కొన్ని నిబంధనలు పాటించాలని జాతీయ నాయకత్వం రాష్ట్ర శాఖలను ఆదేశించింది.
- కనీసం ఆరేళ్ల పార్టీలో క్రియాశీలక సభ్యత్వం ఉండటంతోపాటు 45 నుంచి 60 ఏళ్ల మధ్య వయసు గల వారే జిల్లా అధ్యక్షులుగా పోటీకి అర్హులని జాతీయ నాయకత్వం స్పష్టంగా నిబంధనల్లో పేర్కొన్నట్లు నాయకులు చెబుతున్నారు.
- కర్నూలు జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన రామకృష్ణ వయసు కేవలం 40 సంవత్సరాలేనని, అతనిపై తీవ్ర నేరారోపణలతో కూడిన కేసులు కూడా ఉన్నట్లు ఆ పార్టీ నేతలే విమర్శిస్తున్నారు.
- నంద్యాల జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన అభిరుచి మధుకు నిబంధనల ప్రకారం కనీసం ఆరు సంవత్సరాల క్రియాశీలక సభ్యత్వం లేదని, ఆయనపై గతంలో రౌడీషీటర్‌గా అభియోగాలు ఉన్నాయని ఆ పార్టీలో అంతర్గతంగా చర్చ సాగుతోంది.
- అనంతపురం జిల్లా అధ్యక్షుడిగా రాజేష్ నామినేషన్ దాఖలు చేసే సమయంలోనే అతనికి అర్హత లేదని ఎన్నికల అధికారి సావిత్రి తిరస్కరించారని, అయినా ఆయన్నే తిరిగి జిల్లా అధ్యక్షులుగా నియమించినట్లు బీజేపీలో తీవ్ర చర్చ నడుస్తోంది.
- అన్నమయ్య జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన సాయిలోకేష్ కేవలం మూడు సంవత్సరాల కిందటే బీజేపీలో చేరినట్లు అదే పార్టీ నాయకులు చెబుతున్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అధ్యక్ష పదవిని 60 ఏళ్లు దాటిన వ్యక్తికి కట్టబెట్టారనే విమర్శలు వినిపిస్తున్నాయి.
- అదేవిధంగా జిల్లా అధ్యక్ష పదవికి పోటీ చేసే వారు నామినేషన్ వేయడానికి మద్దతుగా మండల అధ్యక్షులు బలపరచాలనే నిబంధన ఉంది. కానీ, ఆ నిబంధనను ఎక్కడా పాటించలేదని తెలుస్తోంది. ఇలా అన్ని జిల్లాల్లోనూ నిబంధనలకు విరుద్ధంగా ఒకే వర్గం వారిని అధ్యక్షులుగా నియమించారనే చర్చ జోరుగా సాగుతోంది.





గాడ్స్ ఓన్ కంట్రీ... చూడాల్సినవి ఇవి అని చెప్పకోవడం కష్టం. జాబితా వేళ్ల మీద లెక్కపెట్టేటంత చిన్నదిగా ఉండదు. ఆర్ట్ అండ్ కల్చర్, ఆధ్యాత్మికం, ధార్మికం, వీకెండ్ పిక్‌నిక్ స్పాట్స్, బీచ్‌లు, బ్యాక్ వాటర్స్, పర్వతాలు, కొండవాలులో టీ తోటలు, సముద్రం మీద సూర్యాస్తమయాలు, జలపాతాలు, వన్యప్రాణులు, హాలిడే రిసార్టులు... ఇలా పరస్పరం వైవిధ్యభరితమైన పర్యటనల నిలయం ఈ రాష్ట్రం.



కేరళలో ఆధ్యాత్మికం కూడా ఆద్యంతం అలరిస్తుంది. త్రివేంద్రంలోని పద్మనాభ స్వామి ఆలయం మొదలు అంబళంపుర శ్రీకృష్ణుడు, చెట్టికుళాంగుర భగవతి, శబరిమల అయ్యప్ప, కొట్టరక్కర గణపతి, తిరునెల్లి ఆలయం, చర్చ్‌లు, మసీదులు ప్రతిదీ టూరిస్టులకు కనువిందు చేస్తాయి. శబరిమలైకి మహిళలను అనుమతించడం కోసం తృప్తి దేశాయ్ చేసిన ఉద్యమంతో ఉత్తరాదివాసుల దృష్టి కూడా కేరళ మీద కేంద్రీకృతమైంది. ఇప్పుడు కేరళలో హిందీవాళ్లు కూడా కనిపిస్తున్నారు.

● కేరళ ట్రిప్

దేవుని దేశం తిరిగొద్దాం



గిన్నిస్ బుక్‌లో జటాయుపురా

జటాయు నేచర్ పార్క్... కొల్లం జిల్లా, చాదయమంగళం పట్టణం, జటాయుపురాలో ఉంది. రామాయణంలో సీతాపహరణం ఘట్టంలో రావణాసురుడితో జటాయువు పోరాడిన ప్రదేశం ఇదేనని చెబుతారు. నేచర్ పార్కులో 65 ఎకరాల విస్తీర్ణంలో డిజిటల్ మ్యూజియమ్ ఉంది. లైట్ అండ్ సౌండ్ షోలో రామాయణంలోని జటాయువు ఘట్టాన్ని ప్రదర్శిస్తారు. ప్రపంచంలో 'లార్జెస్ట్ ఫంక్షనల్ స్టాచ్యూ ఆఫ్ ఎ బర్డ్' కేటగిరీలో ఈ పార్కు గిన్నిస్ రికార్డులో నమోదైంది. ఈ కొండ మీదకు ట్రెకింగ్, రాక్ క్లైంబింగ్, బైక్ రైడింగ్‌తోపాటు ఆర్చరీ వంటి యాక్టివిటీస్ ఉన్నాయి. పిల్లలు, యువత, సీనియర్ సిటిజెన్ అందరికీ ఈ టూర్ అందమైన జ్ఞాపకంగా మిగులుతుంది. వెయ్యి అడుగుల ఎత్తులో జటాయువు పక్షిని నిర్మించడం, పక్షి ఆకారం లోపల మ్యూజియాన్ని ఏర్పాటు చేయడం ప్రపంచంలో ఎనిమిదో వింత అని చెప్పవచ్చు.

త్రివేంద్రం పద్మనాభుడు

అనంత పద్మనాభ స్వామి ఆలయం అప్పుడప్పుడూ వార్తల్లో కనిపిస్తుంటుంది. తలుపులు తెరుచుకోని ఆరోగది మీదనే అందరి దృష్టి. అంతకంటే గొప్ప ఆసక్తి ఇక్కడి పద్మనాభుడి రూపం. ఈ ఊరికి తిరువనంతపురం అనే పేరు రావడానికి కారణం ఈ ఆలయమే. కేరళ రాజధాని నగరం ఇది. బంగారు గోపురం ఉన్న ఈ ఆలయం ట్రావెన్‌కోర్ రాజ వంశం సంపన్నతకు ప్రతీక.

అలెప్పీ హౌస్‌బోట్

హౌస్‌బోట్‌లో ప్రయాణం చేయకపోతే కేరళ టూర్ వృథా అనే చెప్పాలి. ఇప్పుడు హౌస్‌బోట్‌లు మరింత పెద్దవిగా క్రూయిజ్‌లుగా మారాయి. టూర్ ప్యాకేజ్‌లో డే క్రూయిజ్ ప్యాకేజ్ కూడా ఉండేటట్లు చూసుకోవాలి. ఈ ప్రయాణంలో కేరళ సంప్రదాయ భోజనంలో రకరకాలను ఆస్వాదించవచ్చు. భోజనాన్ని అరిటాకులో వడ్డించడం మాత్రమే కాదు అరటికాయ చిప్స్, చేపను అరిటాకులో చుట్టి వేయించిన ఫిష్‌ఫ్రై ఇక్కడ ప్రత్యేకం. చికెన్ కర్రీలో కొబ్బరి ముక్కలు కూడా చాలా రుచిగా ఉంటాయి. కొబ్బరి నూనె వంటల మీద అపోహ ఉంటుంది. కానీ ఈ వంటలు చాలా రుచిగా ఉంటాయి.

అరబిక్ కడలి

కేరళ టూర్‌కి కాలంతో పని లేదు. అరేబియా తీరం– పశ్చిమ కనుమల మధ్య విహారానికి ఎప్పుడైనా రెడీ కావచ్చు. ఎండకాలం చల్లగా అలరిస్తుంది. జూన్ నుంచి చిరు వానలు పలకరిస్తాయి. శీతాకాలం పచ్చదనం తన గాఢతను ప్రదర్శిస్తుంది. తలలు వాల్చి ఆహ్వానం పలికే కొబ్బరితోటలు, కోమలత్వాన్ని తాకి చూడమనే అరటి గుబుర్లు, ఎటూ వంగని పోకచెట్లు, ఏ చెట్టు దొరుకుతుందా అల్లుకుపోదామని వెతుక్కునే మిరియాల తీగలు, కాయల బరువుతో భారంగా వంగిపోతున్న కాఫీ చెట్లు, టూర్‌కి మినిమమ్ గ్యారంటీ ఇచ్చే అరేబియా సముద్రం మీద సూర్యాస్తమయాలు... ఇవన్నీ ప్రకృతి ప్రసాదితాలు.



కళల నిలయం

కేరళ ప్రకృతిసోయగంతోపాటు కళలతోనూ ఆకట్టుకుంటుంది. కలరిపయట్టు వంటి యుద్ధ క్రీడ, మోహినీ అట్టం, కథాకళి వంటి నాట్యరీతులు, రాజారవివర్మ చిత్రలేఖన సమ్మేళనం ఇక్కడే పుట్టాయి. భరత్‌పుఝ నది తీరాన త్రిశూర్ జిల్లాలోని చెరుత్తురుతి పట్టణంలో కేరళ కళామండలం ఉంది. కళల సాధన కోసం ఏర్పాటు చేసిన ఈ కళామండలంలో నిత్యం సంప్రదాయ నాట్య రీతుల సాధన జరుగుతూ ఉంటుంది. మరో హాలులో కేరళ సంప్రదాయ నాట్య రీతుల నాట్య ముద్రలు, భంగిమలు, ఆహార్యంతో ఉన్న బొమ్మల మ్యూజియం ఒక ఎడ్యుకేషన్. ఈ కళల కోసమే కాదు, కేరళ కళామండలం భవన నిర్మాణశైలిని చూడడం కోసం ఆర్కిటెక్చర్ విద్యార్థులు వెళ్లాల్సిన ప్రదేశం.

ఆది శంకరుడు పుట్టిన నేల

కాలడి ఓ చిన్న పట్టణం. పెరియార్ నది ఒడ్డున ఎర్నాకుళం జిల్లాలో ఉంది. ఆది శంకరాచార్యుడు పుట్టిన ప్రదేశం ఇది. ఇక్కడ ఆయన నివసించిన ఇల్లు, ఆయన తల్లి సమాధి ఉన్నాయి. ఇక్కడి స్నానఘట్టంలో ముత్తల కడవు (మొసలి మడుగు)ను కూడా చూడవచ్చు. ఆది శంకరుడు సన్యసించాలనుకున్నప్పుడు తల్లి అంగీకరించలేదు. ఆమె అంగీకారం కోసం ఆది శంకరుడు నాటకం ఆడిన ఘట్టం ఇది. స్నానఘట్టంలో దిగి మొసలి పట్టుకున్నదని, సన్యసించడానికి ఒప్పుకుంటేనే వదులుతుందని తల్లిని మాయ చేసి అంగీకారం పొందిన కథనాన్ని చెబుతారు పూజారులు. పెరియార్ నది కొచ్చి ఎయిర్‌పోర్టులో దిగడానికి ముందే పర్యాటకుల దృష్టిని ఆకర్షిస్తుంది. పచ్చటి చేనులో నీలి రంగు వస్త్రాన్ని మలుపు తిప్పుతూ పరిచినట్లు ఉంటుంది దృశ్యం.



వాస్కోడిగామా ఎంట్రీ!

కేరళ రాష్ట్రంలో సగం తీరప్రాంత జిల్లాలైతే మిగిలిన సగం కొండప్రాంత జిల్లాలు. రైలు ప్రయాణంలో తమిళనాడు నుంచి కేరళకు వెళ్లేటప్పుడు పాలక్కాడ్ నుంచే మార్పు కనిపిస్తుంది. మనదేశంలో వలస పాలనలో మగ్గిపోవడానికి దారులు పడింది కూడా ఈ రాష్ట్రం నుంచే. పోర్చుగీసు నావికుడు వాస్కోడిగామా మనదేశంలోకి ప్రవేశించింది కోళికోడ్ పట్టణానికి సమీపంలోని కప్పడ్ అనే చిన్న తీరగ్రామంలో. కప్పడ్ బీచ్‌లో వాస్కోడిగామా జ్ఞాపకచిహ్నాలున్నాయి. చర్చ్‌లు యూరోపియన్ నిర్మాణశైలిలో అందంగా ఉంటాయి. నది తీరాన నిర్మించడంలో గొప్ప అభిరుచి వ్యక్తమవుతుంటుంది. ఎర్నాకుళంలో సెయింట్ మేరీస్ బాసిలికా చర్చ్, మలయత్తూర్ చర్చ్, శాంతాక్రజ్ కేథడ్రల్, జార్జ్ ఫ్రాన్సిస్ చర్చ్, సముద్రతీరాన నిర్మించిన వల్లరపాదమ్ చర్చ్‌లు ప్రశాంత వాతావరణంలో మౌనముద్ర దాల్చి ఉంటాయి. ముఖ్యమైన మసీదులు ముప్పైకి పైగా ఉంటాయి.

మీన్ ముట్టి జలపాతం

వయనాడు... కేరళ రాష్ట్రంలో అత్యున్నత స్థాయి ప్రకృతి సౌందర్యాన్ని ఇముడ్చుకున్న ప్రదేశం. ఆ రాష్ట్రానికి శిఖరాగ్రం కూడ ఇదే. మీన్‌ముట్టి వాటర్ ఫాల్స్‌కి రెండు కిలోమీటర్ల దూరం దట్టమైన అడవిలో ట్రెకింగ్ చేయాలి. ఈ కొండ మీద మీన్‌ముట్టి వాటర్ ఫాల్స్ దగ్గర నుంచి చూస్తే ఒక వైపు తమిళనాడు నీలగిరులు, మరోవైపు కర్నాటకకు చెందిన కూర్గ్ కొండలు దోబూచులాడుతుంటాయి. వరదలు ముంచెత్తినప్పటికీ పర్యాటకం తిరిగి మామూలు స్థితికి చేరుకుంటోంది. ట్రీ హౌస్‌లో బస చేయాలనే సరదా తీరాలంటే ముందుగానే ప్లాన్ చేసుకోవాలి. ఇక్కడ పర్యటిస్తే కేరళ వాళ్లు తమ రాష్ట్రాన్ని 'గాడ్స్ ఓన్ కంట్రీ' అని చెప్పుకోవడంలో అతిశయోక్తి లేదనిపిస్తుంది.



– వాకా మంజులారెడ్డి,
సాక్షి ఫీచర్స్ ప్రతినిధి

ప్యాకేజ్‌లిలా...

- సౌత్ కేరళ 4 రాత్రులు 5 రోజులకు 55 వేలు. 5 రాత్రులు 6 రోజులకు దాదాపుగా అరవై వేలు.
- ఎంటైర్ కేరళకు ఆఫర్ నడుస్తోంది. పది రాత్రులు 11 రోజులకు 55 వేలు. ఈ ఆఫర్ మార్చి 30 వరకు మాత్రమే వర్తిస్తుంది. ఇందులో కొదుండుళూర్‌లోని చేరమాన్ జుమా మసీద్, చీయప్పార జలపాతం, వాలర జలపాతం, ఇడుక్కి దేవికులమ్ హిల్స్, కొచ్చిలోని బోల్గట్టీ ఐలాండ్, హౌస్‌బోట్, విలేజ్ లైఫ్ ఎక్స్‌పీరియెన్స్ మొదలైనవి కవర్ అవుతాయి.
- సెంట్రల్ కేరళ ప్యాకేజ్ 820 వేలు. ఇందులో అళప్పుఝ, పెరియార్ టైగర్ రిజర్వ్, తెక్కడి, మునార్, ఫోర్ట్ కొచ్చి మొదలైనవి ఉంటాయి.

షాపింగ్

జరీ అంచు హాఫ్‌వైట్ చీర లేదా లంగా–ఓణీ తెచ్చుకోవడం మరువద్దు. ఉడెన్ కార్వింగ్ బాక్సులు, హోమ్ డెకరేషన్ ఐటమ్స్ అందంగా ఉంటాయి. కొబ్బరి, అరటి నారతో చేసిన టేబుల్ మ్యాట్స్, కోషెలు, హ్యాండ్‌బ్యాగ్‌లు, వాల్ హ్యాంగింగ్స్ కొనుక్కోవచ్చు.

ఇవి తినాలి

కోకోనట్ హల్వా, అరటికాయ చిప్స్, అరటికాయ బజ్జీ ప్రసిద్ధి. కొబ్బరి బోండాం తప్పకుండా తాగాలి.



వేడుకలివి

ఫిబ్రవరి 14 నిషగంధి డాన్స్ ఫెస్టివల్ జరుగుతుంది. ఫిబ్రవరి 19 నుంచి 25 వరకు పరియాణమ్ పేట్ పూరమ్, పాలక్కాడ్, భగవతి టెంపుల్, త్రిశూర్ ఆలయంలో ఉత్రాళిక్కవు పూరమ్ వేడుకలు జరుగుతాయి.

ఆరోగ్యదేవుడు ధన్వంతరి

ఆయుర్వేదంలో వైద్యానికి మూల పురుషుడు ధన్వంతరి. ధన్వంతరికి 'ముక్కిడి' పేరుతో 35 ఔషధాల మిశ్రమాన్ని నివేదిస్తారు. త్రిశూర్ జిల్లా, నెల్లువాయ్ గ్రామంలో ఉన్న ఆలయం పురాతనమైనది. దేవతలు, రాక్షసులు పాల సముద్రాన్ని చిలికినప్పుడు వచ్చిన అమృతభాండాన్ని ధన్వంతరి పట్టుకుని వస్తాడు. ఒక చేతిలో శంకు, ఒక చేతిలో చక్రం, ఒకచేతిలో అమృత భాండం, మరో చేతిలో జలూకం(జలగ, ఆయుర్వేద వైద్యంలో జలగను ఉపయోగిస్తారు)తో ఉద్భవించాడు ధన్వంతరి. ఆ మూర్తినే ఇక్కడ ప్రతిష్ఠించారని చెబుతారు. మున్నువరువట్టం, గురువాయూర్‌లలో కూడా ధన్వంతరి ఆలయం ఉంది. శబరిమలకు వెళ్లిన వాళ్లు ఈ ఆలయాన్ని కూడా దర్శించుకుంటారు.

టీ తోటల మునార్


మున్నార్ అంటే మూడు నదుల కలయిక. ముథిరాప్పుజ, నల్లతన్ని, కుండలి నదుల మధ్య ఉన్న హిల్‌స్టేషన్ ఇది. టీ తోటలు విస్తారంగా ఉంటాయి. ఈ తోటల మధ్య జలపాతాలు తెల్లగా పాలధారలను తలపిస్తుంటాయి. వర్షాకాలంలో దట్టంగా అలముమున్న నల్లటి మేఘాలను చీల్చుకుంటూ భూమ్మీద పాలను కుమ్మరిస్తున్నట్లు ఉంటుంది అట్టుకడ జలపాతం.ఈ టూర్‌లో ఎరవికులమ్ నేషనల్ పార్క్‌ను, నీలగిరులు అనే పేరు రావడానికి కారణమైన నీలకురింజి మొక్కలను చూడాలి. మున్నార్, ఊటీ, కొడైకెనాల్ వంటి ప్రదేశాలను ఒకసారి చూసిన వాళ్లు కూడా కురింజి పూలు పూసినప్పుడు మళ్లీ చూడాలని ఆశపడతారు. బొటానికల్‌గా ఇవి 50 రకాల జాతులున్నాయి. కాని మనకు చూడడానికి అన్నీ నీలంగానే ఉంటాయి, షేడ్‌లు మాత్రం ఏ చిత్రకారుడూ మిక్స్ చేయలేనంత లలితంగా ఉంటాయి. నీలకురింజి పూలు పన్నెండేళ్లకోసారి పూస్తాయి. 2018లో పూశాయి, మళ్లీ పూసేది 2030లోనే. కోవిడ్ సమయంలో కూర్గ్ కొండల్లో కొన్ని చోట్ల విరిశాయి. కానీ సీజన్‌లో పూసినట్లు కొండ మొత్తం విస్తరించలేదు. ఇక్కడ జంతు సంచారం కూడా ఎక్కువ. నీలగిరి థార్ ఇక్కడ మాత్రమే కనిపించే జింక జాతి.



కోటలు... తోటలు!

కేరళ గ్రామాల్లో మన దగ్గర ఉన్నట్లు ఇళ్లన్నీ ఒక చోట, పొలాలు ఒకచోట ఉండవు. రెండు – మూడు ఎకరాల స్థలంలో కొబ్బరి చెట్లు, మధ్యలో ఇల్లు ఉంటుంది. తోట పక్కన మరొక తోట... ఆ తోటలో ఒక ఇల్లు... చాలా ఇళ్లకు పై కప్పు ఎర్ర పెంకులే ఉన్నాయి. రెండస్తుల ఇల్లు కూడా పై కప్పు వాలుగా, ఎర్ర పెంకులతో ఉంటుంది. రాజుల ప్యాలెస్‌లు కూడా భారీ నిర్మాణాలేమీ కాదు. రాజస్థాన్ కోటలు, ప్యాలెస్‌లను చూసిన కళ్లతో ఇక్కడి ప్యాలెస్‌లను చూస్తే కళ్లు విప్పార్చలేం. కానీ ప్రకృతి సహజమైన, శాంతియుతమైన జీవనశైలికి నిదర్శనంగా కనిపిస్తాయి. పాలక్కాడ్, తలస్సేరి కోటలు పర్యాటకులను అలరిస్తుంటాయి. చిన్న చిన్న ప్యాలెస్‌లను రిసార్టులుగా మార్చేశారు. భరత్‌పుఝ నది ఒడ్డున ఉన్న ప్యాలెస్‌ను 'ది రివర్ రిట్రీట్' పేరుతో హెరిటేజ్ ఆయుర్వేదిక్ రిసార్టుగా మార్చారు. అందులో భోజనం చేయడం జిహ్వాకు వైద్యం.





ఏళ్ల తరబడి కష్టపడి తెచ్చుకున్న పేరు, పాడవడానికి అయిదు నిమిషాలు చాలు. ఇది అర్థం చేసుకుంటే వ్యాపారంలో భిన్నంగా ఆలోచించగలుగుతాం.

- వారెన్ బఫెట్, విఖ్యాత అమెరికన్ ఇన్వెస్టర్

సాక్షి ప్లస్
సోమవారం। 3-2-2025

బిజినెస్ రీల్

కొత్త పన్ను విధానంలోకి ఇక భారీగా..!

- 90% మంది చేరతారని అంచనా
- సీబీడీటీ చైర్మన్ రవి అగర్వాల్



న్యూఢిల్లీ: తాజా బడ్జెట్‌లో తెర తీసిన ఆదాయ పన్ను భారీ రిబేట్లు కారణంగా కొత్త విధానంలోకి మరింత మంది వ్యక్తిగత పన్ను చెల్లింపుదారులు చేరతారని ప్రభుత్వం భావిస్తోంది. 90 శాతానికిపైగా పన్ను చెల్లింపుదారులు కొత్త విధానాన్ని ఎంపిక చేసుకోనున్నట్లు కేంద్ర ప్రత్యక్ష పన్నుల బోర్డు(సీబీడీటీ) చైర్మన్ రవి అగర్వాల్ ఒక ఇంటర్వ్యూలో అభిప్రాయపడ్డారు. ప్రస్తుతం 75 శాతంమంది కొత్త విధానంలో ఉన్నారు. ఆర్థిక మంత్రి సీతారామన్ రూ. 12 లక్షల వరకూ ఆదాయంపై పన్ను లేకుండా ప్రతిపాదించడంతో పలువురు కొత్త విధానంలోని మారనున్నట్లు తెలియజేశారు. పన్ను శ్లాబుల పునర్వ్యవస్థీకరణ సైతం ఇందుకు సహకరించనున్నట్లు పేర్కొన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) వినియోగాన్ని మరింత పెంచడం ద్వారా మానవ జోక్యం లేని పన్నుల నిర్వహణకు ప్రభుత్వం, ఆదాయ పన్ను శాఖలు ప్రాధాన్యత ఇస్తున్నట్లు వివరించారు. ఆదాయాన్ని ప్రకటించడంలో సాధారణ పన్ను చెల్లింపుదారులకు సులభమైన పద్ధతులను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు తెలియజేశారు. ఇందుకు ప్రవేశపెట్టిన సరళతర ఐటీఆర్‌-1, ముందస్తుగా నమోదయ్యే ఐటీ రిటర్నులు, మూలంవద్ద పన్ను(టీడీఎస్)లో ఆటోమాటిక్ మదింపు తదితరాలను ప్రస్తావించారు. మినహాయింపులు, తగ్గింపులవంటివి లేని నూతన పన్ను విధానంలో పన్ను చెల్లింపుదారులకు మదింపు మరింత సులభమవుతుందని పేర్కొన్నారు. వెరసి ఐటీ నిపుణుల అవసరంలేకుండానే ఐటీఆర్‌ను దాఖలు చేయవచ్చని తెలియజేశారు.

టెక్స్‌మాకో లాభం హైజంప్

క్యూ3లో రూ. 76 కోట్లు



న్యూఢిల్లీ: మౌలిక రంగ కంపెనీ టెక్స్‌మాకో రైల్ అండ్ ఇంజినీరింగ్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25) మూడో త్రైమాసికంలో ప్రోత్సాహకర ఫలితాలు సాధించింది. అక్టోబర్‌-డిసెంబర్(క్యూ3)లో కన్సాలిడేటెడ్ నికర లాభం రెట్టింపునకుపైగా జంప్‌చేసి రూ. 76 కోట్లను తాకింది. అత్యధిక రవాణా వేగన్ల డెలివరీలు ఇందుకు దోహదపడ్డాయి. గతేడాది (2023-24) ఇదే కాలంలో కేవలం రూ. 30 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం 48% ఎగసి రూ.1,326 కోట్లకు చేరింది. నిర్వహణ లాభం (ఇబిటా) రూ. 91 కోట్ల నుంచి రూ. 139 కోట్లకు బలపడింది. 2024 డిసెంబర్‌కల్లా ఆర్డర్ బుక్ విలువ రూ. 7,612 కోట్లను తాకింది.

కోడిగుడ్లు (హోల్‌సేల్‌-నెక్ / 100కు రూ.లలో)

3-2-2025

విశాఖ	490-00
చిత్తూరు	533-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	465-00
విజయవాడ	500-00
రిటైల్ ధర (డజను)	72.00
హైదరాబాద్	460-00
వరంగల్	462-00
రిటైల్ ధర	5.20

ఇక ఆర్‌బీఐవైపు మార్కెట్ చూపు

- బడ్జెట్ ప్రతిపాదనల ఎఫెక్ట్
- క్యూ3 ఫలితాలకూ ప్రాధాన్యం
- విదేశీ అంశాలూ కీలకమే
- ఈ వారం ట్రెండ్‌పై నిపుణులు



ముంబై: లోక్‌సభలో వారాంతాన ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై ఈ వారం దేశీ స్టాక్ మార్కెట్లు స్పందించనున్నట్లు నిపుణులు పేర్కొన్నారు. రంగాలవారీగా పెట్టుబడుల కేటాయింపులు, పథకాలు తదితర ప్రతిపాదనల ఆధారంగా స్టాక్స్ కదలికలు నమోదుకానున్నట్లు తెలియజేశారు. రూ. 12 లక్షలవరకూ ఆదాయంపై పన్ను చెల్లింపులు లేకపోవడంతో శనివారం ట్రేడింగ్‌లో వినియోగ రంగ కౌంటర్లు జోరు చూపాయి. బీమా రంగానికి బూస్టినిస్తూ ఇప్పటివరకూ 75 శాతంగా అమలవుతున్న ఎఫ్‌డీఐలను 100 శాతానికి పెంచుతూ బడ్జెట్‌లో ప్రతిపాదించారు. బడ్జెట్‌లో యువత, మహిళలు, రైతులకు సైతం మద్దతుగా పలు చర్యలు ప్రతిపాదించారు. ఈ బాటలో ఇన్వెస్టర్లు మరిన్ని రంగాలవైపు దృష్టిపెట్టనున్నట్లు మోతీలాల్ ఓస్వాల్ వెల్త్ మేనేజ్‌మెంట్ రీసెర్చ్ హెడ్ సిద్ధార్థ ఖేమ్కా అభిప్రాయపడ్డారు. వినియోగ రంగం మరింత జోరు చూపవచ్చని రెలిగేర్ బ్రోకింగ్ రీసెర్చ్ ఎస్‌వీపీ అజిత్ మిశ్రా, యాక్సిస్ సెక్యూరిటీస్ సీఈవో, ఎండీ ప్రణవ్ హరిదాసన్ అంచనా వేశారు.

7న పాలసీ నిర్ణయాలు

కొత్త ఏడాదిలో తొలిసారి పరపతి సమీక్షను చేపట్టనున్న రిజర్వ్ బ్యాంక్ శుక్రవారం(7న) విధాన నిర్ణయాలను ప్రకటించనుంది. దాదాపు ఐదేళ్ల తదుపరి ఆర్‌బీఐ వడ్డీ రేట్లను తగ్గించవచ్చని మెహతా ఈక్విటీస్ రీసెర్చ్ సీనియర్ వీపీ ప్రశాంత్ తాప్సీ అంచనా వేస్తున్నారు. గత 11 సమావేశాలలో వడ్డీ రేట్లకు కీలకమైన రెపోను 6.5 శాతం వద్దే యథాతథంగా కొనసాగిస్తున్న సంగతి తెలిసిందే. 2022 మే నుంచి 2023 ఫిబ్రవరి కాలంలో రెపో రేటులో 2.5 శాతం కోతను అమలు చేసింది. రిటైల్ ధరల ఇండెక్స్(సీపీఐ) డిసెంబర్‌లో 4 నెలల కనిష్టం 5.22 శాతానికి దిగివచ్చింది. వచ్చే ఆర్థిక సంవత్సరంలో 4 శాతానికి పరిమితంకానున్న అంచనాల నేపథ్యంలో ఈసారి ఆర్‌బీఐ రెపో రేటును పావు శాతం తగ్గించవచ్చని ఆర్థికవేత్తలు భావిస్తున్నారు.

దిగ్గజాలు రెడీ

ఈ ఏడాది(2024-25) మూడో త్రైమాసిక ఫలితాల సీజన్ ఇప్పటికే వేడెక్కింది. మరిన్ని దిగ్గజాలు ఈ వారం క్యూ3((అక్టోబర్‌-డిసెంబర్) ఫలితాలు విడుదల చేయనున్నాయి. జాబితాలో ఏషియన్ పెయింట్స్, అపోలో టైర్స్, భారతీ ఎయిర్‌టెల్, ఐటీసీ, ఎస్‌బీఐ, ఎంఅండ్‌ఎం, ఎల్‌ఐసీ, టైటన్, ఎస్‌హెచ్‌పీసీ, టాటా పవర్, పీసీ జ్యువెలర్స్ తదితరాలున్నాయి. పనితీరు ఆధారంగా ఇన్వెస్టర్లు వివిధ స్టాక్స్‌లో పొజిషన్లు తీసుకునే వీలున్నట్లు మార్కెట్ వర్గాలు అభిప్రాయపడ్డాయి. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు సైతం ఇన్వెస్టర్లను ఆకట్టుకోనున్నట్లు ఏంజెల్ వన్ డెరివేటివ్స్ సీనియర్ విశ్లేషకులు ఓషో కృష్ణన్ పేర్కొన్నారు.

ఇతర అంశాలు

ముడిచమురు ధరలు, డాలరుతో మారకంలో రూపాయి కదలికలకూ మార్కెట్లో ప్రాధాన్యత ఉన్నట్లు నిపుణులు పేర్కొన్నారు. రూపాయి ఇటీవల బలహీనపడుతుంటే చమురు ధరలు పటిష్టంగా కదులుతున్నాయి. మరోపక్క యూఎస్ డాలరు, ట్రెజరీ ఈల్డ్స్ మరింత పుంజుకుంటే సెంటిమెంటుపై ప్రభావంపడే వీలున్నట్లు విశ్లేషకులు భావిస్తున్నారు. ఇప్పటికే దేశీ స్టాక్స్‌లో విదేశీ ఇన్వెస్టర్లు (ఎఫ్‌పీఐలు) అమ్మకాలకు మొగ్గు చూపుతున్నారు. జనవరిలో ఎఫ్‌పీఐలు 8 బిలియన్ డాలర్ల విలువైన స్టాక్స్ విక్రయించినట్లు అంచనా.

గత వారమిలా

గత వారం(జనవరి 27-ఫిబ్రవరి1) దేశీ స్టాక్ మార్కెట్లు జోరు చూపాయి. సెన్సెక్స్ నికరంగా 1,316 పాయింట్లు(1.7 శాతం) బలపడి 77,506 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం 390 పాయింట్లు(1.7 శాతం) పుంజుకుని 23,482 వద్ద స్థిరపడింది. కాగా.. ఎఫ్‌పీఐల అమ్మకాల కారణంగా జనవరిలో సెన్సెక్స్, నిఫ్టీ 3.5 శాతం క్షీణించగా.. మిడ్, స్మాల్ క్యాప్స్ 9 శాతం చొప్పున పతనమయ్యాయి.

తగ్గిన ఓఎన్‌జీసీ లాభం

- క్యూ3లో రూ. 8,240 కోట్లు
- షేరుకి రూ. 5 డివిడెండ్

న్యూఢిల్లీ: ఇంధన రంగ ప్రభుత్వ దిగ్గజం ఓఎన్‌జీసీ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2024-25) మూడో త్రైమాసికంలో ఆసక్తికర ఫలితాలు ప్రకటించింది. అక్టోబర్‌-డిసెంబర్(క్యూ3)లో నికర లాభం 17 శాతం క్షీణించి రూ. 8,240 కోట్లకు పరిమితమైంది. ముడిచమురు ధరలు నీరసించడం ప్రభావం చూపింది. గతేడాది(2023-24) ఇదే కాలంలో రూ. 9,892 కోట్లు ఆర్జించింది. కంపెనీ బోర్డు.. వాటాదారులకు షేరుకి రూ. 5 చొప్పున రెండో మధ్యంతర డివిడెండ్ ప్రకటించింది. గడిచిన నవంబర్‌లో రూ. 6 చెల్లించిన సంగతి తెలిసిందే. కాగా.. మొత్తం ఆదాయం సైతం 3 శాతం వెనకడుగుతో రూ. 33,771 కోట్లకు చేరింది. ఈ కాలంలో బ్యారల్‌కు ముడిచమురు ధర 72.57 డాలర్లు చొప్పున అందుకుంది. గత క్యూ3లో 81.13 డాలర్లు చొప్పున లభించింది. నేచురల్ గ్యాస్ ఒక్కో ఎంబీటీయూ 6.5 డాలర్లు చొప్పున విక్రయించింది. ముడిచమురు ఉత్పత్తి స్వల్పంగా 2 శాతం పెరిగి 4.653 మిలియన్ టన్నులను తాకింది. నేచురల్ గ్యాస్ ఉత్పత్తి నామమాత్ర వృద్ధితో 4.978 బీసీఎంకు చేరింది.



డిజిటల్ ప్రపంచంలో..
సంపద ఇలా భద్రం..



అజిత్ మీనన్
సీఈవో, పీజీఐఎం ఇండియా మ్యుచువల్ ఫండ్

డిజిటల్ టెక్నాలజీ వినియోగం వేగవంతం కావడంతో కమ్యూనికేషన్, వ్యాపారాల నుంచి హెల్త్‌కేర్, వినోదం వరకు మన జీవితాలన్నింటిలో చాలా మార్పులు వస్తున్నాయి. కృత్రిమ మేథ, మెషిన్ లెర్నింగ్ మొదలైనవి డేటా విశ్లేషణ, ఆటోమేషన్ వంటి అంశాల్లో విప్లవాత్మక మార్పులు తెస్తున్నాయి. ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ అప్లికేషన్స్ సౌకర్యవంతంగా ఉంటున్నాయి. రోబోటిక్స్, ఆటోమేషన్‌లాంటివి తయారీ, లాజిస్టిక్స్, వ్యవసాయం లాంటి రంగాల్లో పెను మార్పులు తెస్తున్నాయి. ఇవన్నీ సౌకర్యవంతంగా ఉంటున్నప్పటికీ వీటి వినియోగం విషయంలో బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన అవసరం ఉంది. పర్సనల్ ఫైనాన్స్‌కి సంబంధించి పోర్ట్‌ఫోలియోలను ఆన్‌లైన్‌లో ట్రాకింగ్ చేయడం నుంచి పెట్టుబడుల వరకు అన్నీ కూడా ఫోన్ ద్వారానే చేసే వీలుంటోంది.

అయితే, ఈ సౌకర్యం వెనుక మన డిజిటల్ భద్రతకు ముప్పులు కూడా పొంచి ఉంటున్నాయి. ఇన్వెస్టర్ల విషయానికొస్తే తమ పాస్‌వర్డ్‌లు లేదా యాప్‌లను సురక్షితంగా ఉంచుకోవడం ఒకెత్తైతే, ఏళ్లతరబడి ఆర్థిక ప్రణాళికలను సైబర్ నేరగాళ్ల నుంచి కాపాడుకోవడం మరో ఎత్తుగా ఉంటోంది.

సైబర్ నేరగాళ్లు కేవలం పెద్ద వ్యాపారులు, సంపన్నులనే కాదు.. చిన్న చిన్న ఇన్వెస్టర్లను కూడా టార్గెట్ చేసుకుంటున్నారు. ఫిషింగ్, ర్యాన్సమ్‌వేర్ లాంటివి ప్రయోగిస్తున్నారు. ఫిషింగ్ సంగతి తీసుకుంటే, ఆర్థిక సంస్థలు లేదా అడ్వైజర్ల నుంచి వచ్చినట్లుగా కనిపించేలా ఈమెయిల్స్, మెసేజీల్లాంటివి పంపిస్తారు. మిమ్మల్ని మాయ చేసి పాస్‌వర్డ్‌ల్లాంటి వ్యక్తిగత వివరాలు సేకరిస్తారు. ఆ తర్వాత మీ ప్రమేయం లేకుండానే మీ ఖాతాల్లోనుంచి విత్‌డ్రా చేసుకోవడం, ట్రేడింగ్ చేయడంలాంటివి చేసి ఖాతాలను కొల్లగొడతారు. ఇక ఐడెంటిటీ థెఫ్ట్ కేసుల్లో మీ వ్యక్తిగత సమాచారాన్ని దొంగిలించి, మీ పేరు మీద రుణాలు తీసుకోవడం, మీ ఖాతాలను ఖాళీ చేయడంలాంటివి జరుగుతుంటాయి. ర్యాన్సమ్‌వేర్ దాడులు మరింత అధునాతనంగా ఉంటాయి. సైబర్ నేరగాళ్లు మీ ఖాతాలను స్తంభింపచేసి, తిరిగి మీ చేతికివ్వాలంటే డబ్బు కట్టాలంటూ బెదిరింపులకు దిగుతారు. మిమ్మల్ని నేరుగా టార్గెట్ చేయకపోయినా మీరు ఆధారపడే ఆర్థిక సేవలను లక్ష్యంగా చేసుకుని మీ లావాదేవీలకు అంతరాయం కలిగించవచ్చు. కొన్నిసార్లు క్రిమినల్స్ నేరుగా పెట్టుబడి ప్లాట్‌ఫాంలలోకి చొరబడి నిధులను దొంగిలించవచ్చు. తప్పుడు ట్రేడింగ్ చేసి నష్టపర్చవచ్చు. అలాగని ఇలాంటి పరిణామాల వల్ల డిజిటల్ సాధనాల మీద నమ్మకాన్ని కోల్పోనక్కర్లేదు. కొన్ని జాగ్రత్తలు తీసుకుంటే చాలు ఇలాంటి సవాళ్లను అధిగమించవచ్చు.



- మీ అకౌంట్లకు పటిష్టమైన పాస్‌వర్డ్‌లను వాడండి. తరచూ వాటిని అప్‌డేట్ చేస్తూ ఉండండి. పాస్‌వర్డ్‌లను భద్రపర్చుకునేందుకు ఒక పాస్‌వర్డ్ మేనేజర్ వెబ్‌సైట్‌ను ఉపయోగించవచ్చు.
- మల్టీ-ఫ్యాక్టర్ అథెంటికేషన్‌ను(ఖుంఅ) ఉపయోగించండి. వీలైన సందర్భాల్లో మీ ఫోన్‌కు వెరిఫికేషన్ కోడ్‌లు వచ్చేలా జాగ్రత్తలు తీసుకోండి. పర్సనల్ డివైజ్‌లను అన్‌లాక్ చేసేందుకు బయోమెట్రిక్స్‌ను ఎనేబుల్ చేయండి.
- ఫిషింగ్, సోషల్ ఇంజినీరింగ్ దాడుల విషయంలో జాగ్రత్తగా ఉండండి. బ్యాంకులు, మ్యుచువల్ ఫండ్‌లు లేదా ఫైనాన్షియల్ అడ్వైజర్ల నుంచి వచ్చినట్లుగా అనిపించేలా మోసగాళ్లు ఈమెయిల్స్ లేదా మెసేజీలు పంపిస్తుంటారు. వ్యక్తిగత సమాచారాన్ని ఇచ్చేలా మిమ్మల్ని మభ్యపెట్టొచ్చు. అప్రమత్తత వహించండి. అనుమానం వస్తే వెంటనే ఆ సంస్థను అధికారిక మాధ్యమాల ద్వారా సంప్రదించండి.
- డివైజ్‌లను భద్రంగా ఉంచుకోండి. విశ్వసనీయ ప్లాట్‌ఫాంలు, యాప్‌ల ద్వారానే ఆర్థిక లావాదేవీలు నిర్వహించండి. సాఫ్ట్‌వేర్, ఓఎస్‌లు, యాంటీవైరస్ ప్రోగ్రాంలను అప్‌డేటెడ్‌గా ఉంచండి. కీలకమైన డేటా చోరీ కాకుండా డివైజ్ ఎన్‌క్రిప్షన్‌ను ఎనేబుల్ చేయండి. డివైజ్‌ల స్క్రీన్‌ను లాక్ చేసి ఉంచండి. ఆటోలాక్‌ను ఎనేబుల్ చేయండి. సెషన్ హైజాక్ కాకుండా, ట్రాకింగ్‌ను, ఆటో-లాగిన్ రిస్కులను నియంత్రించేందుకు బ్రౌజర్ నుంచి కుకీలను, హిస్టరీని తొలగించండి.
- ఆర్థిక లావాదేవీల కోసం పబ్లిక్ వై-ఫైను వాడొద్దు. ప్రయాణాల్లో కీలకమైన అకౌంట్లు, ఆర్థిక సేవల ప్లాట్‌ఫాంలలోకి లాగిన్ అయ్యేందుకు సురక్షితమైన వీపీఎన్‌ను ఉపయోగించండి.
- వ్యక్తిగత సమాచారాన్ని ఆన్‌లైన్‌లో షేర్ చేసుకోవడం తగ్గించుకోండి. మీ పుట్టిన రోజు లేదా ఆర్థిక వివరాలను సోషల్ మీడియాలో షేర్ చేసుకోకండి. సైబర్ నేరగాళ్ల బారిన పడే రిస్కులు ఉన్నాయి.
- బ్యాంకు ఖాతా స్టేట్‌మెంట్లు, లావాదేవీలను తరచూ పరిశీలించండి. అనధికారిక లావాదేవీలేవైనా కనిపిస్తే సత్వరం గుర్తించొచ్చు.
- కీలకమైన డాక్యుమెంట్ల వంటి వాటిని సురక్షితమైన, ఆఫ్‌లైన్ లొకేషన్లలో బ్యాకప్ తీసుకోండి. రాన్సమ్‌వేర్ రిస్కులను తగ్గించుకోవచ్చు.
- సైబర్ నేరగాళ్లు ఎప్పటికప్పుడు కొత్త పద్ధతుల్లో మోసాలు చేస్తున్నారు. ఇలాంటి వాటి గురించి ఆర్థిక సంస్థలు తరచుగా అప్‌డేట్లు, టిప్‌లు ఇస్తున్నాయి. వాటిని ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ, అప్‌డేట్‌గా ఉండాలి.

వాహన విక్రయాలు బాగున్నాయ్

- పెరిగిన మారుతీ, ఎంఅండ్‌ఎం టయోటా అమ్మకాలు
- తగ్గిన టాటా మోటార్స్, టయోటా విక్రయాలు



న్యూఢిల్లీ: మారుతీ సుజుకీ కొత్త ఏడాది జనవరిలో మొత్తం 2,12,251 వాహనాలు విక్రయించింది. గడిచిన ఏడాది ఇదే జనవరి అమ్మకాలు 1,99,364 యూనిట్లతో పోలిస్తే ఇవి 6% అధికం. ఇందులో దేశీయ ప్రయాణికుల వాహన అమ్మకాలు క్రితం ఏడాదితో పోలిస్తే 1,73,599 యూనిట్ల నుంచి 1,66,802 యూనిట్లకు చేరాయి. విదేశాలకు ఎగుమతులు 23,921 యూనిట్లకు 27,100 యూనిట్లకు ఎగిశాయి. హ్యుందాయ్ మోటార్ ఇండియా వాహన విక్రయాలు 3% తగ్గి 57,115 వాహనాలకు చేరాయి. ఇందులో దేశీయంగా 54,003 వాహన అమ్మకాలు జరగ్గా.., విదేశాలకు ఎగుమతులు 11,600 యూనిట్లుగా ఉన్నాయి. కాగా 2024 జనవరిలో 67,615 యూనిట్ల విక్రయాలు అమ్ముడయ్యాయి. టాటా మోటార్స్ అమ్మకాలు 86,125 యూనిట్ల నుంచి 80,304 యూనిట్లకు పరిమితమయ్యాయి. టయోటా కిర్లోస్కర్ మోటార్ అమ్మకాలు 24,609 నుంచి 19% పెరిగి 29,371కు చేరాయి. మహీంద్రాఅండ్‌మహీంద్రా విక్రయాలు 16% పెరిగి 85,432 యూనిట్లకు చేరాయి.

జనవరిలో జీఎస్‌టీ వసూళ్ల జోరు

1.96 లక్షల కోట్లు • 12 శాతం అధికం



న్యూఢిల్లీ: జనవరి నెలలో జీఎస్‌టీ వసూళ్లు మెరుగ్గా నమోదయ్యాయి. క్రితం ఏడాది ఇదే నెలలోని గణాంకాలతో పోల్చి చూసినప్పుడు 12.3% అధికంగా రూ.1.96 లక్షల కోట్లు వసూలైనట్టు ప్రభుత్వం ప్రకటించింది. ఇందులో దేశీ వస్తు, సేవల ద్వారా 10.4% అధికంగా రూ.1.47 లక్షల కోట్లు వసూలైంది. దిగుమతి చేసుకున్న వస్తువులపై జీఎస్‌టీ ఆదాయం 19.8% అధికంగా రూ.48,382 కోట్లు సమకూరింది. మొత్తం జీఎస్‌టీ ఆదాయం జనవరి నెలకు రూ.1,95,506 కోట్లుగా ఉన్నట్టు ప్రభుత్వ ప్రకటన తెలిపింది. అదే నెలలో రూ.23,853 కోట్లు రిఫండ్‌లు జారీ చేసినట్టు, ఇది క్రితం ఏడాది ఇదే నెలలో పోల్చి చూసినప్పుడు 24% పెరిగినట్టు పేర్కొంది. రిఫండ్‌లను సర్దుబాటు చేసిన తర్వాత నికర ఆదాయం 1.72 లక్షల కోట్లు అని, ఇది 10.9% వృద్ధికి సమానమని వెల్లడించింది. జీఎస్‌టీ వసూళ్లు స్థిరంగా పెరుగుతుండడం ఆర్థిక వృద్ధి పుంజుకోవడానికి, వ్యాపార సంస్థల నిబంధనల అమలుకు నిదర్శనమని కేపీఎంజీ పరోక్ష పన్నుల హెడ్ అభిషేక్ జైన్ వ్యాఖ్యానించారు. రిఫండ్‌ల తర్వాత కూడా నికర వసూళ్లు అధికంగా ఉండడం ప్రశంసనీయమన్నారు.

సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు..



కె.సీహెచ్. ఎ.వి.ఎస్.ఎన్ మూర్తి
కె.వి.ఎన్ లావణ్య
ట్యాక్సేషన్ నిపుణులు

ఒక్క మాటలో చెప్పాలంటే సీతమ్మ కరుణించిందనే చెప్పాలి. సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు చిగురించిందనే అనాలి. త్వరలో కొత్త చట్టం తెస్తున్నట్లు చెప్పారు. అందులో ఏం ఉంటుందనే ఆతృత, ఉత్కంఠకు తెరదించుతూ, మధ్యతరగతి వర్గాలపై వరాల జల్లు కురిపించారు. ఆదాయ పన్నుకి సంబంధించి ముఖ్యమైన మార్పులు కొన్ని చేశారు. అవేమిటంటే..

ప్రస్తుతం రూ. 10 లక్షలు దాటితే 30 శాతం పన్ను ఉంటోంది. రూ. 10 లక్షలు దాటిన వారికి ఎంత ఉన్నా 30 శాతంగా ఉంది. ఈ పరిమితిని పెంచాలని డిమాండ్ వస్తోంది. తాజా మార్పుల వల్ల రూ. 24 లక్షల వరకు 30 శాతం చొప్పున పడదు. ఇది చాలా పెద్ద ఉపశమనం.

- బేసిక్ లిమిట్‌ని రూ. 4,00,000కు పెంచారు. ఇది చిన్న ఉపశమనంలాగా కనిపించినా. శ్లాబులు మార్చారు
- కొత్త శ్లాబులు, పన్ను రేట్లు ఇలా ఉంటాయి.

(రూ.)	రేటు (శాతాల్లో)
0-4 లక్షలు	5
8-12 లక్షలు	10
12-16 లక్షలు	15
16-20 లక్షలు	20
20-24లక్షలు	25
ఆ పైన	30

- ఈ మార్పుల వల్ల రూ. 12,00,000 ఆదాయం ఉన్నవారికి పన్నుభారం ఉండదు. రూ. 7 లక్షల నుంచి రూ. 12 లక్షలకు పెంచారు. చాలా సాహసోపేతమైన, గొప్ప నిర్ణయం.
- వేతనజీవులకు ఈ లిమిట్‌ను రూ. 12.75 లక్షలు చేశారు. వీరికి స్టాండర్డ్ డిడక్షన్ రూపంలో రూ. 75 వేలు మినహాయింపు లభిస్తుంది.
- ఇంత భారీ మినహాయింపు గతంలో ఎప్పుడూ, ఎవ్వరూ ఇవ్వలేదనే చెప్పాలి. సాహసం చేశారు. కొన్ని లక్షల మందికి పన్నుండదు.
- ఇంతకు తగ్గట్లుగా టీడీఎస్ విషయంలో చాలా మంచి మార్పులు తెచ్చారు. హేతుబద్ధత పేరున న్యాయం చేకూర్చారు.
- సీనియర్ సిటిజన్లకు వడ్డీ ఆదాయం మీద టీడీఎస్ వర్తింపును రూ. 1,00,000కు పెంచారు. చివరగా పన్నుభారం విషయంలో మార్పులు ఉండకపోయినా ఇది ముఖ్య ఉపశమనం.
- ఇంటికి అద్దె చెల్లించే విషయంలో సంవత్సరానికి రూ. 2,40,000 దాటితే టీడీఎస్ ఉంది. ఇక నుంచి టీడీఎస్ రూ. 6,00,000 దాటితేనే వర్తిస్తుంది. ఈ రోజుల్లో నగరంలో నెలకు అద్దె రూ. 20,000కు తక్కువ ఉండటం లేదు. ఓనర్లు మాకు బ్లాక్‌లో ఇవ్వండి అని పేచీ.. టీడీఎస్ వద్దని విజ్ఞప్తి చేస్తున్నారు. ఇకపై ఆ భయాల్లేవు. ఈ లిమిట్‌ని భారీగా పెంచినట్లు చెప్పవచ్చు. ఈ ఉపశమనంతో పాటు బ్లాక్ వ్యవహారాల జోలికి వెళ్లకుండా రాచమార్గంలో వెళ్లే అవకాశం కల్పించారు.
- మనలో చాలా మంది విదేశాల్లో కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయం/సర్దుబాటు/బదిలీలు చేస్తుంటాం. ప్రస్తుతం ఏటా రూ. 7,00,000 దాటితే టీడీఎస్ కంపల్సరీ. ఆ లిమిట్‌ని ఇప్పుడు రూ. 10,00,000కు పెంచారు. అంతే కాకుండా విద్య నిమిత్తం ఎంతైనా పంపవచ్చు. టీడీఎస్ లేకుండా. అయితే, ''సోర్స్' మాత్రం రుణం రూపంలో ఉండాలి.
- ప్రస్తుతం ఒక ఇంటి మీద యాన్యువల్ వేల్యూ నిల్‌గా భావించవచ్చు. ఇక నుంచి ఈ జాబితాలో మరొక ఇల్లును జోడించారు. ఏతావతా రెండిళ్ల మీద మినహాయింపు పొందవచ్చు. రూల్సు మేరకు ఈ రెండూ లభ్యమవుతాయి.

ఆర్థిక మంత్రి సీతారామన్‌గారు మినహాయింపులు పెంచకపోయినా, 80సీ మొదలైన సెక్షన్లలో మినహాయింపులు ముట్టుకోకపోయినా, వాటికి రెట్టింపు/మూడింతలు ఉపశమనం ఇచ్చారు. వినియోగం వైపు మధ్యతరగతి వాళ్లు మొగ్గు చూపేలా మార్గనిర్దేశం చేశారు.

వచ్చే వారం మరిన్ని తెలుసుకుందాం.

పన్నుకు సంబంధించిన సందేహాలు ఏవైనా ఉంటే పాఠకులు business@sakshi.comకు ఈ-మెయిల్ పంపించగలరు.

రిస్క్-రాబడుల మధ్య సమతుల్యం

పెట్టుబడులపై లాభాలు ఒక్కటే చూడడం సరికాదు. సంబంధిత పెట్టుబడుల్లో ఉండే అస్థిరతలు, ఆ రిస్క్‌ను తట్టుకుని కొనసాగగలిగే సామర్థ్యం ఎంతో ముఖ్యం. ఈక్విటీ పెట్టుబడులు దీర్ఘకాలంలోనే నిలకడైన సగటు రాబడిని ఇవ్వగలవు. ఇతర సాధనాలతో పోల్చితే అధిక రాబడిని ఇస్తాయని చారిత్రక డేటా స్పష్టం చేస్తోంది. ఈక్విటీల్లో లార్జ్‌క్యాప్ విభాగంలో కాస్త అస్థిరతలు తక్కువ. రాబడులు మోస్తరుగా ఉంటాయి. మిడ్‌క్యాప్‌లో కొంచెం అస్థిరతలు ఎక్కువ. రాబడులు కూడా ఎక్కువే. 10 ఏళ్లకు పైబడి లక్ష్యాల కోసం లార్జ్ అండ్ మిడ్‌క్యాప్ ఫండ్స్‌ను ఇన్వెస్టర్లు పరిగణనలోకి తీసుకోవచ్చు. ఈ విభాగంలో మోతీలాల్ ఓస్వాల్ లార్జ్ అండ్ మిడ్‌క్యాప్ ఫండ్ మెరుగైన పనితీరు చూపిస్తోంది.

మోతీలాల్ ఓస్వాల్ లార్జ్ అండ్ మిడ్‌క్యాప్ ఫండ్



రాబడులు

ఈ పథకం గడిచిన ఆరు నెలల్లో మూడు శాతం నష్టాలు ఇచ్చింది. ఇటీవలి కాలంలో ఈక్విటీ మార్కెట్లు గరిష్ట స్థాయిల నుంచి 10 శాతానికి పైగా దిద్దుబాటుకు గురికావడం తెలిసిందే. దీని ఫలితమే ఆరు నెలల్లో నష్టాలు. కానీ, ఏడాది కాలంలో పెట్టుబడులపై రాబడి 21.46 శాతంగా ఉంది. మూడేళ్లలో 20.52 శాతం, ఏడేళ్లలో 21.46 శాతం చొప్పున వార్షిక రాబడుల చరిత్ర ఈ పథకానికి ఉంది. బీఎస్ లార్జ్ మిడ్ క్యాప్ టీఆర్ఐ, లార్జ్ అండ్ మిడ్‌క్యాప్ ఫండ్స్ విభాగం సగటు రాబడుల కంటే ఈ పథకమే మెరుగైన పనితీరు చూపించింది. ఏడాది కాలంలో 12 శాతం, మూడేళ్లలో 5 శాతం, ఐదేళ్లలో 3 శాతం వరకు అధిక రాబడులను ఇన్వెస్టర్లకు తెచ్చి పెట్టింది.



రిస్క్ కొలమానం

మ్యూచువల్ ఫండ్ పథకంలో ఉండే రిస్క్‌ను సైతం ఇన్వెస్టర్లు అర్థం చేసుకోవాలి. ఇందుకు షార్పే రేషియో కొలమానాన్ని పరిశీలించాలి. రిస్క్‌తో సర్దుబాటు చేసిన రాబడి ఎంత మెరుగ్గా ఉందో ఇది తెలియజేస్తుంది. పెట్టుబడులపై రిస్క్ తీసుకుని, ఇన్వెస్టర్లకు ఏ మేరకు రాబడిని ఇచ్చిందో తెలియజేస్తుంది. గత ఏడాది కాలంలో ఈ ఫండ్ షార్పే రేషియో 3.08గా ఉంది. మూడేళ్లలో 1.46, ఐదేళ్లలో 1.14గా ఉంది. ఒకటికి పైన ఉంటే మెరుగ్గా పనిచేసిందని అర్థం.

పెట్టుబడుల విధానం/పోర్ట్‌ఫోలియో

మార్కెట్ పతనాల్లో నష్టాలను పరిమితం చేయడం, మార్కెట్ ర్యాలీల్లో మెరుగైన రాబడులను ఇచ్చే విధంగా ఈ పథకం పనితీరు ఉంటుంది. మధ్య కాలం నుంచి దీర్ఘకాలంలో పెట్టుబడుల వృద్ధి లక్ష్యంగా ఈ పథకం పనిచేస్తుంది. మెరుగైన యాజమాన్యం, పటిష్టమైన బ్యాలన్స్ షీట్లు ఉన్న కంపెనీలకు ప్రాధాన్యం ఇస్తుంది. ఈ పథకం నిర్వహణలో డిసెంబర్ చివరికి రూ.9,001 కోట్ల పెట్టుబడులు ఉన్నాయి. ఇందులో 98.82 శాతం మేర ఈక్విటీల్లో ఇన్వెస్ట్ చేయగా, నగదు, నగదు సమానాలకు 1.18 శాతాన్ని కేటాయించింది. ఈక్విటీ మొత్తం పెట్టుబడుల్లో 58 శాతం లార్జ్ క్యాప్ స్టాక్స్‌కు కేటాయించింది. మిడ్‌క్యాప్ కంపెనీల్లో 37.28 శాతం ఇన్వెస్ట్ చేసింది. అదే సమయంలో స్మాల్‌క్యాప్ కంపెనీల్లోనూ 4.53 శాతం పెట్టుబడులు కలిగి ఉంది. ముఖ్యంగా టెక్నాలజీ రంగ కంపెనీలకు ఎక్కువ ప్రాధాన్యం ఇస్తూ 23 శాతం పెట్టుబడులను ఈ రంగాలకు చెందిన కంపెనీల్లోనే ఇన్వెస్ట్ చేసింది. కన్జ్యూమర్ డిస్క్రీషినరీ కంపెనీలకు 22.24 శాతం, ఇండస్ట్రియల్స్ కంపెనీలకు 18.25 శాతం, బ్యాంకింగ్ అండ్ ఫైనాన్షియల్ రంగ కంపెనీలకు 11.79 శాతం చొప్పున కేటాయింపులు చేసింది.

టాప్ ఈక్విటీ హోల్డింగ్స్

కంపెనీ	పెట్టుబడులు శాతం
జొమాటో	6.91
ట్రెంట్	6.63
కల్యాణ్ జ్యుయలర్స్	4.88
భారతీ ఎయిర్‌టెల్	4.48
కోఫోర్జ్	3.77
సంవర్ధన మదర్సన్	3.46
మ్యాన్‌కైండ్ ఫార్మా	3.22
ప్రీమియర్ ఎనర్జీస్	3.18
ప్రెస్టీజ్ ఎస్టేట్స్	3.16
అంబర్ ఎంటర్‌ప్రైజెస్	3.06

భవిష్యత్ బాగుంది!

అండర్-19 టి20 ప్రపంచకప్‌లో మెరిసిన భారత అమ్మాయిలు

- 'ప్లేయర్ ఆఫ్ ద టోర్నమెంట్'గా గొంగడి త్రిష
- అత్యధిక వికెట్లు తీసిన వైష్ణవి శర్మ
- ఇదే నిలకడ కొనసాగిస్తే సీనియర్ జట్టులోకి ఖాయం

ఐసీసీ మహిళల అండర్-19 ప్రపంచకప్ ఆసాంతం రాణించిన భారత జట్టు... డిఫెండింగ్ చాంపియన్ హోదాకు న్యాయం చేస్తూ సంపూర్ణ ఆధిపత్యంతో వరుసగా రెండోసారి జగజ్జేతగా ఆవిర్భవించింది. ప్రత్యర్థికి పైచేయి సాధించే అవకాశం కాదు కదా... కనీసం కోలుకునే చాన్స్ కూడా ఇవ్వకుండా చెలరేగిపోయింది. వరల్డ్‌కప్ మొత్తం పరాజయం అన్నదే ఎరగకుండా ముందుకు సాగిన యువ భారత్... ఎదురైన ప్రత్యర్థినల్లా చిత్తుచేస్తూ చాంపియన్‌గా నిలిచింది. ఫైనల్‌కు ముందు ఆడిన ఆరు మ్యాచ్‌ల్లో నాలుగింట ఛేజింగ్ చేసిన టీమిండియా... అన్నీ మ్యాచ్‌ల్లోనూ రెండు వికెట్లు కూడా కోల్పోకుండానే లక్ష్యాన్ని అధిగమించింది. తొలుత బ్యాటింగ్ చేసే చాన్స్ వస్తే దంచి కొట్టడం... బౌలింగ్ చేయాల్సి వస్తే ప్రత్యర్థిని కట్టిపడేయడం టోర్నీ మొత్తం ఇదే ప్రణాళిక అవలంబించి విజయవంతమైంది. బ్యాటింగ్‌లో తెలుగమ్మాయి గొంగడి త్రిష ఆకాశమే హద్దుగా చెలరేగితే... తమిళనాడు అమ్మాయి కమలిని ఆమెకు చక్కటి సహకారం అందించింది. బౌలింగ్‌లో స్పిన్ త్రయం వైష్ణవి శర్మ, ఆయుషి శుక్లా, పారుణిక సిసోడియా యువ భారత విజయాల్లో కీలక పాత్ర పోషించింది. మెగా టోర్నీలో మన యంగ్ 'స్టార్ల' ప్రదర్శనలను ఓసారి పరిశీలిస్తే... –సాక్షి క్రీడావిభాగం



త్రిష

కమలిని కమాల్



టోర్నీలో ఓపెనర్‌గా బరిలోకి దిగిన తమిళనాడుకు చెందిన కమలిని 7 మ్యాచ్‌లాడి 143 పరుగులు చేసింది. అత్యధిక పరుగులు చేసిన జాబితాలో మూడో స్థానం దక్కించుకున్న కమిలిని 35.75 సగటుతో పరుగులు రాబట్టింది. అందులో 2 అర్ధశతకాలు ఉన్నాయి. లీగ్ దశలో పెద్దగా ఆకట్టుకోలేకపోయిన కమలిని 'సూపర్ సిక్స్'లో స్కాట్లాండ్‌తో పోరులో 51 పరుగులు చేసి భారత విజయంలో కీలకపాత్ర పోషించింది. ఇక ఇంగ్లండ్‌తో సెమీఫైనల్లో దంచికొట్టిన కమలిని 56 పరుగులు చేసి అజేయంగా జట్టును ఫైనల్‌కు చేర్చింది. ఈ టోర్నీలో త్రిష విజృంభించడంతో ఆమె మెరుపుల ముందు కమలిని ప్రదర్శన మరుగున పడినా... జట్టుకు అవసరమైన ప్రతి సందర్భంలో ఈ తమిళనాడు వికెట్ కీపర్ రాణించింది. అండర్-19 ఆసియా కప్‌లోనూ ఆకట్టుకున్న కమలినిని మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) ఫ్రాంచైజీ ముంబై ఇండియన్స్ రూ. 1 కోటీ 60 లక్షలకు కొనుగోలు చేసుకుంది. ఇంట్లో సోదరులను చూసి క్రికెట్ ఆడటం నేర్చుకున్న కమలిని కొంత కాలం తర్వాత ఆటనే కెరీర్‌గా ఎంచుకోవాలని భావించి తీవ్ర సాధన చేసింది. వచ్చిన ప్రతి అవకాశాన్ని అందిపుచ్చుకొని నిలకడగా రాణిస్తూ తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంది. ఇక జాతీయ జట్టులో చోటు దక్కించుకోవడమే తదుపరి లక్ష్యంగా కమలిని ముందుకు సాగుతోంది.

'సూపర్' సనిక



దక్షిణాఫ్రికాతో తుదిపోరులో ఫోర్ కొట్టి భారత జట్టును విజయతీరాలకు చేర్చిన సనిక చాల్కె కూడా... ఈ టోర్నీలో తనదైన ముద్ర వేసింది. వెస్టిండీస్‌తో జరిగిన టోర్నీ ఆరంభ పోరులో రైజింగ్ స్టార్ త్రిష త్వరగా అవుటైన సమయంలో అజేయంగా జట్టును గెలిపించిన ముంబైకి చెందిన సనిక... ఆ తర్వాత అవకాశం వచ్చిన ప్రతిసారి మెరుగైన ప్రదర్శనతో ఆకట్టుకుంది. దక్షిణాఫ్రికాతో తుది పోరులోనూ ఓపెనర్ కమలిని తక్కువ స్కోరుకే వెనుదిరిగినా... త్రిషతో కలిసి చక్కటి భాగస్వామ్యం నమోదు చేసింది. వరల్డ్‌కప్‌లో వైస్‌కెప్టెన్‌గానూ వ్యవహరించిన సనిక... మున్ముందు కూడా ఇదే జోరు కొనసాగించాలనుకుంటున్నట్లు వెల్లడించింది.

వైష్ణవి స్పిన్ మాయ

మధ్యప్రదేశ్ గ్వాలియర్‌కు చెందిన వైష్ణవి శర్మ... తన లెఫ్టార్మ్ స్పిన్ మాయాజాలంతో భారత అండర్-19 జట్టు వరుసగా రెండోసారి ప్రపంచకప్ గెలవడంలో కీలక పాత్ర పోషించింది. టోర్నీ ఆసాంతం రాణించిన వైష్ణవి 17 వికెట్లతో ఈ జాబితాలో అగ్రస్థానంలో నిలిచింది. ఐసీసీ అండర్-19 వరల్డ్‌కప్ ఒక ఎడిషన్‌లో అత్యధిక వికెట్లు తీసిన బౌలర్‌గా వైష్ణవి రికార్డుల్లోకెక్కింది. మలేసియాలోపై హ్యాట్రిక్ సహా కేవలం 5 పరుగులే ఇచ్చి 5 వికెట్లు పడగొట్టిన వైష్ణవి... మరో మూడు మ్యాచ్‌ల్లో మూడేసి వికెట్లు పడగొట్టింది. బంగ్లాదేశ్‌పై 15 పరుగులిచ్చి 3 వికెట్లు తీసిన వైష్ణవి, స్కాట్లాండ్‌పై 5 పరుగులే ఇచ్చి 3 వికెట్లు ఖాతాలో వేసుకుంది. 'సూపర్ సిక్స్' దశలో స్కాట్లాండ్‌పై 23 పరుగులిచ్చి 3 వికెట్లు తీసిన ఈ మధ్యప్రదేశ్ స్పిన్నర్... ఇంగ్లండ్‌తో సెమీఫైనల్లో 23 పరుగులిచ్చి 2 వికెట్లు ఖాతాలో వేసుకుంది. దాదాపు ఆడిన ప్రతి మ్యాచ్‌లోనూ స్పిన్‌తో తనదైన ముద్రవేసిన వైష్ణవి శ్రీలంకపై మ్యాచ్‌లో 3 పరుగులిచ్చి ఒక వికెట్ పడగొట్టింది.

పారుణిక ప్రతాపం

భారత అండర్-19 జట్టు వరుసగా రెండోసారి ప్రపంచకప్ గెలవడంలో స్పిన్నర్లు కీలకపాత్ర పోషించగా... అందులో పారుణిక కూడా ఉంది. వైష్ణవి, ఆయుశికి తోడు తన లెఫ్టార్మ్ స్పిన్‌తో ఢిల్లీకి చెందిన పారుణిక సిసోడియా ప్రత్యర్థిని వణికించింది. 6 మ్యాచ్‌లాడిన పారుణిక 5.80 సగటుతో 10 వికెట్లు పడగొట్టింది. ఇంగ్లండ్‌తో సెమీఫైనల్లో 21 పరుగులిచ్చి 3 వికెట్లు పడగొట్టిన పారుణిక... ఫైనల్లో ప్రత్యర్థిని తన స్పిన్‌తో ఉక్కిరిబిక్కిరి చేసింది. 4 ఓవర్లలో కేవలం 6 పరుగులే ఇచ్చి 2 వికెట్లు తీసి... దక్షిణాఫ్రికా జట్టు భారీ స్కోరు వేయకుండా అడ్డుకట్ట వేసింది.

ఆయుశి అదరహో

ఒకవైపు తన స్పిన్‌తో వైష్ణవి ప్రత్యర్థులను బెంబేలెత్తిస్తుంటే... ఆమెకు ఆయుశీ శుక్లా తోడవడం అగ్నికి ఆజ్యం పోసినట్లయింది. గింగిరాలు తిరిగే బంతులతో బ్యాటర్లను తికమిక పెట్టిన ఆయుశి వరల్డ్‌కప్‌లో 7 మ్యాచ్‌లాడి 5.71 సగటుతో 14 వికెట్లు తీసి అత్యధిక వికెట్లు తీసిన బౌలర్ల జాబితాలో రెండో స్థానంలో నిలిచింది. స్కాట్లాండ్‌తో పోరులో 8 పరుగులే ఇచ్చి 4 వికెట్లు తీసిన ఆయుశి భారత విజయాల్లో కీలక పాత్ర పోషించింది. వైష్ణవి బౌలింగ్‌లోనైనా ప్రత్యర్థులు అడపాదడపా భారీ షాట్లు ఆడగలిగారు కానీ... ఆయుశి మాత్రం బ్యాటర్లను స్వేచ్ఛగా ఆడనివ్వకుండా కట్టిపడేసింది. వైవిధ్యమైన బంతులతో ఫలితం సాధించింది. వెస్టిండీస్‌పై 2 వికెట్లు, మలేసియాపై 3 వికెట్లు, శ్రీలంకపై ఒక వికెట్, ఇంగ్లండ్‌పై 2 వికెట్లు తీసి సత్తా చాటింది.


పారుణిక, వైష్ణవి, ఆయుశి

షబ్నమ్ సత్తా...



భారత మహిళల జట్టు వరుసగా రెండోసారి అండర్-19 ప్రపంచకప్ గెలవడంలో... మరో తెలుగమ్మాయి పాత్ర కూడా ఉంది. విశాఖపట్నం జిల్లాకు చెందిన 17 ఏళ్ల షబ్నమ్ షకీల్ తన మీడియం పేస్ బౌలింగ్‌తో ఆకట్టుకుంది. గత ప్రపంచకప్‌లోనూ బరిలోకి దిగిన ఈ తెలుగమ్మాయి. ఈసారి ఏడు మ్యాచ్‌లు ఆడి 4 వికెట్లు పడగొట్టింది. స్పిన్నర్లు ప్రధాన పాత్ర పోషించిన ఈ టోర్నీలో పేసర్‌గా తన బాధ్యతలు నిర్వర్తించింది. మెరుగైన ఎకానమీ నమోదు చేయడంతో పాటు... ప్రత్యర్థిపై ఒత్తిడి పెంచి సహచర బౌలర్లకు వికెట్లు దక్కడంలో కీలక పాత్ర పోషించింది. మరోవైపు కేరళకు చెందిన జోషిత 6 మ్యాచ్‌లాడి 6 వికెట్లు పడగొట్టింది.


ఓటమితో హైదరాబాద్ ముగింపు

- ఈ సీజన్‌లో నాలుగో స్థానంతో సరి
- ఆఖరి మ్యాచ్‌లో విదర్భ చేతిలో 58 పరుగుల తేడాతో పరాజయం

నాగ్‌పూర్: భారత జట్టు పేస్ బౌలర్ మొహమ్మద్ సిరాజ్ బరిలోకి దిగినా... హైదరాబాద్ జట్టుకు నిరాశ తప్పలేదు. రంజీ ట్రోఫీ 2024–2025 దేశవాళీ క్రికెట్ టోర్నమెంట్‌ను హైదరాబాద్ జట్టు పరాజయంతో ముగించింది. మాజీ చాంపియన్ విదర్భ జట్టుతో ఆదివారం ముగిసిన గ్రూప్ 'బి' ఆఖరి లీగ్ మ్యాచ్‌లో చామా మిలింద్ నాయకత్వంలోని హైదరాబాద్ జట్టు 58 పరుగుల తేడాతో ఓడిపోయింది. విదర్భ నిర్దేశించిన 220 పరుగుల లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో... ఓవర్‌నైట్ స్కోరు 23/1తో రెండో ఇన్నింగ్స్‌ను కొనసాగించిన హైదరాబాద్ జట్టు 38.5 ఓవర్లలో 161 పరుగులకు ఆలౌటై పరాజయాన్ని చవిచూసింది. రాహుల్ రాదేశ్ (77 బంతుల్లో 48; 4 ఫోర్లు, 1 సిక్స్) టాప్ స్కోరర్‌గా నిలువగా... చివర్లో మిలింద్ (32 బంతుల్లో 20; 2 ఫోర్లు, 1 సిక్స్), సిరాజ్ (14 బంతుల్లో 26; 3 ఫోర్లు, 2 సిక్స్‌లు) కాసేపు అలరించారు. ఎడంచేతి వాటం స్పిన్నర్ హర్ష్ దూబే 57 పరుగులిచ్చి 6 వికెట్లు పడగొట్టి విదర్భ జట్టు విజయంలో ముఖ్యపాత్ర పోషించాడు. బ్యాటర్లు క్రీజులో నిలబడితే ఛేదించే లక్ష్యమైనా... చివరిరోజు హైదరాబాద్ బ్యాటర్లు తడబడి మూల్యం చెల్లించుకున్నారు. ఓవరాల్‌గా గ్రూప్ 'బి'లో హైదరాబాద్ జట్టు 16 పాయింట్లతో నాలుగో స్థానంలో నిలిచింది. ఎనిమిది జట్లున్న ఈ గ్రూప్‌లో హైదరాబాద్ 2 మ్యాచ్‌ల్లో గెలిచి, 2 మ్యాచ్‌లను 'డ్రా' చేసుకొని, 3 మ్యాచ్‌ల్లో ఓడిపోయింది. గ్రూప్ 'బి'లో తొలి రెండు స్థానాల్లో నిలిచిన విదర్భ, గుజరాత్ జట్లు నాకౌట్ దశకు అర్హత సాధించాయి.

స్కోరు వివరాలు

విదర్భ తొలి ఇన్నింగ్స్: 190; హైదరాబాద్ తొలి ఇన్నింగ్స్: 326; విదర్భ రెండో ఇన్నింగ్స్: 355; హైదరాబాద్ రెండో ఇన్నింగ్స్: తన్మయ్ అగర్వాల్ (సి అండ్ బి) యశ్ ఠాకూర్ 6; అభిరత్ రెడ్డి (సి) దానిశ్ (బి) హర్ష్ దూబే 21; తనయ్ త్యాగరాజన్ (ఎల్బీడబ్ల్యూ) (బి) ఆదిత్య థాకరే 18; రాహుల్ రాదేశ్ (సి) అథర్వ తైడే (బి) పార్థ్ రేఖడే 48; హిమతేజ (సి) అథర్వ తైడే (బి) హర్ష్ దూబే 0; వరుణ్ గౌడ్ (సి) యశ్ రాథోడ్ (బి) హర్ష్ దూబే 5; రాహుల్ బుద్ధి (సి) అక్షయ్ వాడ్కర్ (బి) పార్థ్ రేఖడే 9; చామా మిలింద్ (సి) దానిశ్ (బి) హర్ష్ దూబే 20; రక్షణ్ రెడ్డి (బి) హర్ష్ దూబే 0; సిరాజ్ (సి) అథర్వ తైడే (బి) హర్ష్ దూబే 26; అనికేత్ రెడ్డి (నాటౌట్) 5; ఎక్స్‌ట్రాలు 3; **మొత్తం (38.5 ఓవర్లలో ఆలౌట్) 161. వికెట్ల పతనం:** 1–11, 2–36, 3–61, 4–67, 5–94, 6–107, 7–116, 8–123, 9–140, 10–161. **బౌలింగ్:** యశ్ ఠాకూర్ 5–1–26–1, ఆదిత్య థాకరే 7–0–27–1, హర్ష్ దూబే 11.5–1–57–6, అక్షయ్ వఖారే 7–3–16–0, పార్థ్ రేఖడే 8–0–33–2.



మిలింద్, సిరాజ్

వికెట్ కోల్పోకుండానే 376 కొట్టేశారు

- ఒడిశాతో రంజీ ట్రోఫీ మ్యాచ్‌లో సర్వీసెస్ జట్టు సంచలన విజయం
- శుభం రోహిల్లా అజేయ డబుల్ సెంచరీ
- సూరజ్ వశిష్ట్ అజేయ సెంచరీ



కటక్: భారత్‌లోని పిచ్‌లపై నాలుగో రోజు ఆటలో 200 పరుగుల లక్ష్యమైనా కొండంతలా అనిపిస్తుంది. ఆచితూచి ఆడితేనే దానిని ఛేదించే అవకాశం ఉంటుంది. అలాంటిది ఏకంగా 376 పరుగుల లక్ష్యం ముందుంటే... ఏ జట్టయినా విజయంపై ఆశలు వదులుకోవాల్సిందే. అయితే ఒడిశాతో జరిగిన రంజీ ట్రోఫీ దేశవాళీ క్రికెట్ టోర్నీ మ్యాచ్ సందర్భంగా సర్వీసెస్ జట్టు బ్యాటర్లు మాత్రం అలా అనుకోలేదు. ప్రయత్నిస్తే పోయేదేమీ లేదు కదా అనే ఉద్దేశంతో బరిలోకి దిగారు. ప్రత్యర్థి బౌలర్లపై ఎదురుదాడికి దిగారు. దాంతో చూస్తుండగానే స్కోరు బోర్డుపై 100, 200, 300 పరుగులు నమోదయ్యాయి. చివరకు 376 పరుగుల లక్ష్యం కూడా కరిగిపోయింది. వెరసి సర్వీసెస్ జట్టు రంజీ ట్రోఫీ చరిత్రలోనే చిరస్మరణీయ విజయం అందుకుంది. గత ఏడాది అగర్తాలలో త్రిపుర జట్టుపై రైల్వేస్ జట్టు 378 పరుగుల లక్ష్యాన్ని అధిగమించగా... రెండో స్థానంలో సర్వీసెస్ కూడా చేరింది. 376 పరుగుల లక్ష్యంతో ఓవర్‌నైట్ స్కోరు 46/0తో రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన సర్వీసెస్ జట్టు 85.4 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా లక్ష్యాన్ని అధిగమించింది. సర్వీసెస్ ఓపెనర్లలో శుభం రోహిల్లా (270 బంతుల్లో 209 నాటౌట్; 30 ఫోర్లు) డబుల్ సెంచరీ చేయగా... సూరజ్ వశిష్ట్ (246 బంతుల్లో 154 నాటౌట్; 15 ఫోర్లు, 1 సిక్స్) సెంచరీ సాధించాడు. ఈ మ్యాచ్‌లో గెలిచినప్పటికీ సర్వీసెస్ జట్టు నాకౌట్ దశకు చేరలేకపోయింది. ఆదివారంతో రంజీ ట్రోఫీలో లీగ్ దశ మ్యాచ్‌లు ముగిశాయి. ఈనెల 8 నుంచి 12వ తేదీ వరకు జరిగే క్వార్టర్ ఫైనల్స్‌లో గుజరాత్‌తో సౌరాష్ట్ర; ముంబైతో హరియాణా; విదర్భతో తమిళనాడు; జమ్మూ కశ్మీర్‌తో కేరళ తలపడతాయి.

భారత్ 4 టోగో 0


వరల్డ్‌గ్రూప్–1లోనే ఉండనున్న టీమిండియా



న్యూఢిల్లీ: డేవిస్‌కప్ టీమ్ టెన్నిస్ టోర్నీలో భారత జట్టు వరల్డ్ గ్రూప్–1లోనే కొనసాగనుంది. టోగో జట్టుతో జరిగిన ప్లే ఆఫ్ మ్యాచ్‌లో భారత్ 4–0తో విజయం సాధించింది. తొలి రోజు శనివారం జరిగిన రెండు సింగిల్స్‌లో భారత ఆటగాళ్లు శశికుమార్ ముకుంద్, రామ్‌కుమార్ రామనాథన్ గెలుపొందగా... రెండో రోజు ఆదివారం జరిగిన డబుల్స్ మ్యాచ్‌లో బొల్లిపల్లి రిత్విక్ చౌదరీ–శ్రీరామ్ బాలాజీ జంట 6–2, 6–1తో ఎంలాపా అకోమోలో–ఇసాక్ పాడియో (టోగో) ద్వయంపై నెగ్గింది. దాంతో భారత్ 3–0తో విజయాన్ని ఖరారు చేసుకుంది. ఫలితం తేలిపోయినా ప్రాక్టీస్ కోసం భారత జట్టు నాలుగో మ్యాచ్‌ను ఆడేందుకు సిద్ధమైంది. నాలుగో మ్యాచ్‌లో కరణ్ సింగ్ 6–2, 6–3తో పాడియోను ఓడించాడు. నామమాత్రమైన ఐదో మ్యాచ్‌ను ఆడకూడదని రెండు జట్లు నిర్ణయం తీసుకున్నాయి. డబుల్స్ మ్యాచ్ ద్వారా హైదరాబాద్ ప్లేయర్ రిత్విక్ చౌదరీ డేవిస్‌కప్‌లో అరంగేట్రం చేశాడు.

ఇంతకన్నా మెరుగైన టి20 సెంచరీ చూడలేదు

అభిషేక్ మెరుపులపై హెడ్ కోచ్ గంభీర్ వ్యాఖ్య



ముంబై: భారత యువ ఓపెనర్ అభిషేక్ శర్మపై హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ ప్రశంసలు కురిపించాడు. ఇంగ్లండ్‌తో చివరి టి20లో భారీ సెంచరీతో చెలరేగిన అభిషేక్ ఆటతీరు అమోఘమని గంభీర్ పేర్కొన్నాడు. దీనికన్నా మెరుగైన టి20 సెంచరీ తానెప్పుడూ చూడలేదని గంభీర్ అన్నాడు. 'అభిషేక్ నిర్భయంగా, నిర్దాక్షిణ్యంగా ప్రత్యర్థిపై విరుచుకుపడ్డాడు. కొత్త తరం ఆటగాళ్లు భయం లేకుండా దూకుడుగా ఆడుతున్నారు. అలాంటి వాళ్లకు అండగా నిలుస్తాం. ఇంగ్లండ్ బౌలర్లు 140–150 కిలోమీటర్ల వేగంతో బంతులు విసురుతుంటే అభిషేక్ అలవోకగా సిక్స్‌లు బాదాడు. దీనికన్న గొప్ప టి20 శతకాన్ని చూడలేదు. ఫలితాలు అనుకూలంగా వస్తే అంత సవ్యంగా సాగుతుంది. పరాజయాలు ఎదురైనప్పుడే జట్టుపై విమర్శలు వస్తాయి. అలాంటి కష్ట కాలాన్ని కూడా ధైర్యంగా ఎదుర్కొంటాం. ఈ జట్టు చాలా కాలంగా కలిసి ఆడుతోంది. వారి మధ్య మంచి అనుబంధం ఉంది. 140 కోట్ల మంది ప్రజలకు ప్రాతినిధ్యం వహించడం అంటే ఎలా ఉంటుందో మా ఆటగాళ్లకు తెలుసు. వన్డేల్లోనూ ఇదే దూకుడు కొనసాగిస్తూ అభిమానులను అలరిస్తాం' అని గంభీర్ అన్నాడు.

శ్రీహరి ఖాతాలో ఐదో స్వర్ణం

డెహ్రాడూన్: జాతీయ క్రీడల్లో కర్ణాటక స్విమ్మర్ శ్రీహరి నటరాజన్ పసిడి పతకాల వేట కొనసాగుతోంది. ఆదివారం జరిగిన పోటీల్లో ఒలింపియన్ శ్రీహరి 100 మీటర్ల బ్యాక్‌స్ట్రోక్‌లో 56.26 సెకన్లలో గమ్యానికి చేరి విజేతగా నిలిచాడు. ఈ క్రీడల్లో శ్రీహరికిది ఐదో స్వర్ణ పతకం కావడం విశేషం. కర్ణాటకకే చెందిన 15 ఏళ్ల స్విమ్మర్ ధినిధి దెసింగూ కూడా ఐదు బంగారు పతకాలు సాధించింది. ఆదివారం పోటీలు ముగిశాక సర్వీసెస్ పతకాల పట్టికలో అగ్రస్థానంలో కొనసాగుతోంది. సర్వీసెస్ 17 స్వర్ణాలు, 9 రజతాలు, 7 కాంస్యాలతో కలిపి మొత్తం 33 పతకాలు సాధించింది.



సాక్షి ప్లస్
సోమవారం । 3-2-2025



ముంబైలో సునాక్ సందడి

టెన్నిస్‌బాల్ క్రికెట్ ఆడిన బ్రిటన్ మాజీ ప్రధాని

ముంబై: బ్రిటన్ మాజీ ప్రధాని రిషి సునాక్ ఆదివారం ముంబైలో పర్యటించారు. మహానగరంలోని ప్రఖ్యాత పార్సీ జింఖానా మైదానంలో క్రికెట్ ఆడి సందడి చేశారు. టెన్నిస్ బాల్ క్రికెట్ ఆడకుండా తన ముంబై ట్రిప్ ఏదీ ముగియదంటూ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. తాను క్రికెట్ ఆడుతున్న ఫొటోను సైతం షేర్ చేశారు. జింఖానా వార్షికోత్సవ వేడుకల్లో పాల్గొన్న ఆయన సంస్థ చారిత్రక ప్రాముఖ్యతను ప్రశంసించారు. 1885లో సర్ జంషెడ్జీ జెజీబాయ్ అధ్యక్షుడిగా, జంషెడ్‌జీ టాటా చైర్మన్‌గా స్థాపించిన పార్సీ జింఖానా మైదానం ముంబై క్రికెట్‌కు మూలస్తంభం. మెరైన్‌డ్రైవ్ వెంబడి ఉన్న ఈ క్లబ్ తరతరాలుగా ఎందరో క్రికెటర్లను తయారు చేస్తూ వస్తోంది. క్రీడాభిమానులకు గౌరవప్రదమైన ప్రాంతంగా మారింది. ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకుడు, తన మామ నారాయణమూర్తితో కలిసి సునాక్ శనివారం జైపూర్ లిటరేచర్ ఫెస్టివల్‌లో పాల్గొన్నారు. సంబంధిత వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. వేదికపైకి స్వాగతం పలికిన యాంకర్‌కు సునాక్ నమస్కరించడం అందులో కనిపించింది.

ఢిల్లీ ప్రచారానికి... నేటితో తెర

కీలక నేతలంతా హస్తినలోనే
- ప్రచారంలో పలు రాష్ట్రాల సీఎంలు
- 5న పోలింగ్, 8న ఫలితాలు

సాక్షి, న్యూఢిల్లీ: దేశ రాజధానిలో అసెంబ్లీ ఎన్నికల ప్రచారం చివరి దశకు చేరింది. సోమవారం సాయంత్రంతో ప్రచార గడువు ముగియనుంది. దాంతో ప్రధాన పార్టీలు బీజేపీ, కాంగ్రెస్, ఆప్ ప్రచారాన్ని హోరెత్తిస్తున్నాయి. ప్రధాని మోదీ, కేంద్ర మంత్రి అమిత్ షా, ప్రధాన ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, పలు రాష్ట్రాల ముఖ్యమంత్రులు, కేంద్ర మంత్రులు, ఎంపీలు ఢిల్లీ ఎన్నికల ప్రచారంలో జోరుగా పాల్గొంటున్నారు.

అగ్రనేతలంతా ఢిల్లీ ప్రచారంలోనే

ఈసారి ఢిల్లీ పీఠం నీదా నాదా అన్నట్లు బీజేపీ, ఆప్ మధ్య హోరాహోరీ సాగుతోంది. ప్రధాని మోదీ బహిరంగ సభల ద్వారా ప్రచారం నిర్వహిస్తున్నారు. ఆప్‌పై తనదైన శైలిలో విరుచుకుపడుతున్నారు. ఢిల్లీ అభివృద్ధికి ఆప్ అడ్డుపడుతోందంటూ దుయ్యబడుతున్నారు. కేంద్ర హోంమంత్రి అమిత్‌షా మొదలు బీజేపీ రాష్ట్రాల సీఎంలు కూడా ప్రచారం నిర్వహిస్తున్నారు. ఉత్తరప్రదేశ్ సీఎం యోగి ఆదిత్యనాథ్, ఉత్తరాఖండ్ సీఎం పుష్కర్‌సింగ్ ధామీ, హరియాణా సీఎం నయాబ్‌సింగ్ సైనీలు భారీ బహిరంగ సభలతోపాటు, మూడేసి నియోజకవర్గాల్లో ర్యాలీలు నిర్వహించారు. బీజేపీ అధికారంలోకి వస్తేనే ఢిల్లీ అభివృద్ధి చెందుతుందంటూ ప్రచార సభల్లో వ్యాఖ్యలు చేస్తున్నారు. పేదల ప్రభుత్వంగా పేరొందిన ఆప్ మరోసారి ఢిల్లీ పీఠం మాదేనంటూ ధీమా వ్యక్తం చేస్తోంది. ఎవరెన్ని హామీలు ఇచ్చినా, గెలిచేది మాత్రం తామేనంటూ ఆప్ చీఫ్ అరవింద్ కేజ్రీవాల్, సీఎం అతిషి, ఇతర మంత్రులు, ఎమ్మెల్యేలు చెబుతున్నారు. ఆప్‌కు మద్దతుగా పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్‌మాన్ ప్రచారం నిర్వహించారు. ఓటర్లతో మమేకం అవుతూ.. పదేళ్లలో ఆప్ ఇచ్చిన ప్రతి వాగ్దానాన్ని అమలు చేసిందని గుర్తు చేస్తూ, మరోసారి ఆప్‌కు అవకాశం ఇవ్వాలని భగవంత్‌మాన్ అభ్యర్థిస్తున్నారు. కాంగ్రెస్‌ను అధికారంలోకి తెచ్చేందుకు ప్రధాన ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ నడుంబిగించారు. పదేళ్లలో ఢిల్లీ అభివృద్ధి చెందలేదని, బీజేపీ వచ్చినా అభివృద్ధి సూన్యమేనంటూ ప్రచార సభల్లో వ్యాఖ్యానిస్తున్నారు. కాంగ్రెస్ హయాంలోనే మాత్రమే ఢిల్లీ అభివృద్ధిలో పరుగులు తీసిందని గుర్తు చేస్తూ ఓటర్లను ఆకర్షిస్తున్నారు.

సోషల్ మీడియాలో హోరాహోరీ

బీజేపీ, ఆప్, కాంగ్రెస్ మధ్య మాటల యుద్ధాలు సోషల్ మీడియాలో జోరుగా సాగుతున్నాయి. ఢిల్లీ అభివృద్ధిని ఆప్ అడ్డుకుంటుందని ప్రధాని మోదీ చేసిన కామెంట్లకు ఆప్ నేతలు దీటైన సమాధానాలు ఇస్తున్నారు. తాము అధికారంలోకి వచ్చే వరకూ బలహీన వర్గాల వారిని పట్టించుకున్న వారు లేరని, ఢిల్లీ లాంటి మహానగరంలో పాఠశాలల రూపురేఖలు మార్చి ప్రైవేటుగా దీటుగా విద్యను అందిస్తున్నామంటూ ఆప్ బదులిస్తుంది. మెట్రో, తదితర అభివృద్ధి కార్యక్రమాలన్నీ తమ కాంగ్రెస్ హయాంలోనే ఢిల్లీలో జరిగిందని కాంగ్రెస్ చెప్పుకుంటుడగా.. బీజేపీ, ఆప్‌లు మూకుమ్మడిగా దాడి చేస్తున్నాయి. దేశాన్ని కాంగ్రెస్ దోచుకున్నది చాలంటూ బీజేపీ ఆరోపిస్తుండగా.. అంతుపట్టని అవినీతి, ఈవీఎంల ట్యాంపరింగ్, మతకల్లోహాలకు బీజేపీ కేరాఫ్ అంటూ ఆప్, కాంగ్రెస్‌లు సోషల్ మీడియా ద్వారా ప్రతిఘటిస్తున్నాయి.

తెలుగు నేతలు

5వ తేదీన ఢిల్లీ పోలింగ్ జరగనున్న నేపథ్యంలో సామవారంతో ప్రచారం పర్వం ముగియనుంది. దీంతో దేశంలోని జాతీయ కీలకనేతలంతా ఢిల్లీలోనే మకాం వేశారు. ఇక తెలుగు రాష్ట్రాల నుంచి ఏపీ సీఎం చంద్రబాబు, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్, ఏపీ బీజేపీ అధ్యక్షురాలు పురంధేశ్వరి, ఎంపీలు ఈటల రాజేందర్, రఘునందన్‌రావు, ధర్మపురి అరవింద్, డీకే అరుణ, బీజేపీ శాసనసభ పక్షనేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి తదితరులు ప్రచారంలో పాల్గొన్నారు. బీజేపీని అధికారంలోకి తెచ్చేందుకు ప్రచారంలో దూసుకుపోతున్నారు. సోమవారం సాయంత్రంతో ప్రచారం ముగియడంతో.. బీజేపీ, కాంగ్రెస్, ఆప్‌లకు చెందిన పార్టీల నేతలంతా వారి వారి బాధ్యతలలో నిమగ్నమైయ్యారు. సుమారు 50కి పైగా జాతీయ నేతలు ఢిల్లీలో మకాం వేసి మరీ ఎన్నికల హీట్‌ను పెంచుతున్నారు. ఎన్నికల ఫలితాలు 8న వెల్లడవుతాయి.

కాంగ్రెస్ ఆఖరి పోరాటం..!

సాక్షి, న్యూఢిల్లీ: ప్రస్తుత ఢిల్లీ ఎన్నికల్లో ఒంటరిగా తలపడుతున్న కాంగ్రెస్..తన అస్తిత్వాన్ని నిలుపుకునేందుకు ఆఖరి పోరాటం చేస్తోంది. పూర్వ వైభవాన్ని చాటుకునే పరిస్థితులు లేకున్నా, కనీస 10 స్థానాలనైనా గెలుచుకునేలా చివరి దశ ప్రచారాన్ని ముమ్మరం చేసింది. పార్టీ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంకా గాంధీ, మల్లికార్జున ఖర్గేలు ఆదివారం విస్తృత ప్రచారం నిర్వహించారు. సోమవారం సైతం వీరు తమ ప్రచారాన్ని హోరెత్తించనున్నారు. నిజానికి 1998 నుంచి 2013 వరకు వరుసగా 15 ఏళ్లపాటు ఢిల్లీని పాలించిన కాంగ్రెస్, ప్రస్తుత ఎన్నికల్లో కనీస ఖాతా తెరవాలని గట్టి పట్టుదలతో ఉంది. 2008లో 48శాతం ఓట్లతో 43 సీట్లు సాధించుకున్న కాంగ్రెస్ పార్టీ 2013లో 24.70 శాతం సీట్లతో 7 సీట్లకు పరిమితమయింది. తర్వాత 2015 ఎన్నికల్లో కాంగ్రెస్‌కు 9.7 శాతం, 2020లో 4.3 శాతం ఓట్లు రాగా ఒక్క సీటును గెలువలేదు. మొన్నటి పార్లమెంట్ ఎన్నికల్లో మాత్రం 18శాతం ఓట్ల మేర సాధించింది. ఈసారి దాన్ని కాస్త పెంచుకున్నా 5 నుంచి 10 స్థానాలు గెలువచ్చనే అంచనాల్లో ఉంది. అయితే ఆప్‌తో పొత్తు లేకపోవడం, ప్రధాన పోటీ మొత్తంగా బీజేపీ, ఆప్‌ల మధ్యే కొనసాగుతుండటంతో కాంగ్రెస్‌ను పట్టించుకునే వారే కరువయ్యారు. ఢిల్లీని పట్టి పీడిస్తున్న యమునా నది కాలుష్య అంశాన్ని రాజకీయ అస్త్రంగా మాలుచుకునేందుకు రాహుల్‌గాంధీ స్వయంగా కాలుష్య నురగలు కక్కుతున్న యమునాలో బోటులో పర్యటించగా, అది ఏమేరకు ప్రభావితం చేస్తుందన్నది ప్రశ్నగానే ఉంది. ఇక ఢిల్లీని ప్రధాని మోదీ, ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్ మొత్తంగా నాశనం చేశారని, లిక్కర్ మాఫియాలో ప్రభుత్వ పెద్దలంతా కూరుకుపోయిరని, శీష్ మహల్‌లో విలాసవంతమైన జీవితాన్ని కేజ్రీవాల్ గడిపారంటూ ఎక్కుపెట్టిన అస్త్రాలు ఎంతవరకు ఓటర్లను తాకాయన్నది తేలాలి. మేనిఫెస్టో హామీలనే ప్రధానాస్త్రాలుగా ప్రజల్లోకి తీసుకెళుతూ ఓట్లు రాబట్టుకునే ప్రయత్నం చేస్తోంది. ముఖ్యంగా పింఛను రూ.2,500 నుంచి రూ.5,000లకు పెంపు, సోమవారం ప్రచారానికి చివరి రోజు కావడంతో తెలంగాణ, పంజాబ్, హరియాణా నేతలనూ ప్రచారంలోకి దించింది.

జన్యులోపాల వల్లే కాఫీ చేదు



కాఫీ చుక్క గొంతులోకి దిగనిదే రోజు గడవని వారెందరో! కొందరేమో కాఫీ అంటేనే ముఖం చిట్లిస్తారు. అలాంటి వారికి కాఫీ నచ్చకపోవడానికి ప్రత్యేక కారణమే ఉందంటున్నారు శాస్త్రవేత్తలు. కాల్చిన అరబికా కాఫీ చేదును నిర్ణయించడంలో ఆయా వ్యక్తుల జన్యువులు కీలక పాత్ర పోషిస్తున్నట్టు కనుగొన్నారు. కాఫీ గింజలను కాల్చడం వల్ల రుచి ప్రభావితం అవుతుందా, లేదా అన్న అంశంపై జర్మనీలోని మ్యూనిచ్ టెక్నికల్ వర్సిటీ పరిశోధకులు అధ్యయనం చేశారు. 'కోఫియా అరబికా' మొక్కకు చెందిన గింజలను కాల్చి పొడి చేస్తారు. కెఫీన్ సాధారణంగానే చేదుగా ఉన్నప్పటికీ కెఫీన్ తీసేసిన కాఫీ కూడా చేదుగానే ఉంటుంది. అరబికా బీన్స్‌లో ఉండే 'మొజాంబియోసైడ్' అనే పదార్థమే దీనికి కారణం. ఇది కెఫీన్ కంటే ఏకంగా 10 రెట్లు ఎక్కువ చేదుంటుంది! కాఫీ తాగినప్పుడు మనుషుల్లో ఉన్న 25 చేదు రుచి గ్రాహకాల్లో రెండింటిని అది యాక్టివేట్ చేస్తుంది. గింజలను కాల్చిన ఉష్ణోగ్రత, సమయాన్ని బట్టి అవి ఏడు రకాలుగా మారతాయి. ఒక్కో దశలో ఒక్కో రుచి కలిగి ఉంటాయి. ఈ ఏడు దశల్లోని కాఫీ కూడా రుచి గ్రాహకాలపై ప్రభావం చూపుతుంది. ఇలా కాల్చిన కాఫీ పొడి పదకొండు మందిలో ఎనిమిది మందికి చేదుగా అనిపించింది. వారిలో ఒక గ్రాహక జన్యువు లోపభూయిష్టంగా ఉండటమే అందుకు ప్రధాన కారణం. రెండు జన్యువులు చెక్కు చెదరకుండా ఉన్న ఇద్దరికి మాత్రం కాఫీ చేదుగా అనిపించలేదు. దీనిపై మరింత అధ్యయనం చేయాల్సి ఉందని శాస్త్రవేత్త లాంగ్ చెప్పారు.

- సాక్షి, నేషనల్ డెస్క్

ఇండియా-ఇండోనేసియాది తరాల బంధం: మోదీ



న్యూఢిల్లీ: భారత్, ఇండోనేసియాల మధ్యనున్నది కేవలం భౌగోళికరాజకీయం సంబంధం కాదని ప్రధాని మోదీ చెప్పారు. రెండు దేశాలది వేల ఏళ్లుగా పెనవేసుకుపోయిన బంధమని చెప్పారు. రెండు దేశాల భిన్నత్వంలో ఏకత్వమనే సంప్రదాయం కొనసాగుతోందని తెలిపారు. ఇండోనేసియా రాజధాని జకార్తాలో సనాతన ధర్మ ఆలయంలో ఆదివారం జరిగిన మహా కుంభాభిషేకం సందర్భంగా వర్చువల్‌గా ప్రధాని మోదీ ప్రసంగించారు. జకార్తాలోని మురుగన్ ఆలయంలో అభిషేక ఉత్సవాల్లో పాలుపంచుకోవడం తనకు చాలా ఆనందంగా ఉందని చెప్పారు. ఈ సందర్భంగా ఇండోనేసియా ప్రజలు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. స్కంధ షష్ఠి కవచం ప్రజలను అన్ని వేళలా కాపాడాలని ఆకాంక్షించారు. మురుగన్ ఆలయంలో తిరుప్పుగల్ శ్లోకాలతో పూజలు కొనసాగాలన్నారు. 'మనమంతా మురుగన్, శ్రీరాముడు, బుద్ధుని సంబంధీకులమని చెప్పారు.

కేజ్రీ యమునా జలం తాగాలి: రాహుల్



న్యూఢిల్లీ: ఢిల్లీ ప్రజలకు సరఫరా చేసే దుర్గంధపూరిత నీరు తాగాలని ఆప్ చీఫ్ కేజ్రీవాల్‌కు కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ సవాల్ విసిరారు. ప్రధాని మోదీ మాదిరిగానే కేజ్రీవాల్ కూడా తప్పుడు హామీలతో ప్రజలను మోసగిస్తున్నారని విమర్శించారు. హౌజ్ కాజీ చౌక్‌లో ఆదివారం జరిగిన బహిరంగ సభలో రాహుల్ మాట్లాడారు. 2020 అల్లర్ల బాధితులను తరఫున తనతోపాటు తన పార్టీ మాత్రమే మద్దతుగా నిలిచిందని, అణచివేతకు గురయ్యే వారికి ఇకపైనా దన్నుగా నిలుస్తామని ఆయన భరోసా ఇచ్చారు. ప్రేమ, సోదరభావాన్ని పంచే కాంగ్రెస్ కావాలో విద్వేషాన్ని, హింసను ప్రేరేపించే బీజేపీ కావాలో తేల్చుకోవాలని ప్రజలను ఆయన కోరారు.

అయోధ్యలో దళిత యువతి హత్య... కన్నీటి పర్యంతమైన ఎస్పీ ఎంపీ

ఫక్తు డ్రామాగా అభివర్ణించిన సీఎం యోగి



అయోధ్య: అయోధ్యలో 22 ఏళ్ల దళిత యువతి హత్య ఘటనపై సమాజ్‌వాదీ పార్టీ ఎంపీ అవదేశ్ ప్రసాద్ మీడియా ముందు కన్నీటి పర్యంతమయ్యారు. ప్రసాద్ ప్రెస్‌మీట్‌పై స్పందించిన సీఎం యోగి.. ఈ అంశంపై ఫైజాబాద్ ఎంపీ డ్రామా చేస్తున్నారని ఆరోపించారు. అయోధ్య ఘటనలో సమాజ్‌వాదీ పార్టీకి చెందిన కొందరు క్రిమినల్స్ ప్రమేయముందని కచ్చితంగా తేలుతుందన్నారు. అయోధ్యకు చెందిన యువతి గురువారం రాత్రి నుంచి కనిపించకుండాపోయింది. ఆమె కుటుంబ సభ్యులు అంతటా వెతికారు. శనివారం ఉదయం గ్రామానికి కేవలం 500 మీటర్ల దూరంలోని చిన్న కాలువలో ఆమె మృతదేహం పడి ఉండగా గుర్తించారు. యువతిపై అత్యాచారం చేసి హత్య చేశారని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. యువతి కళ్లు పీకేశారని, ఎముకలు విరిగిపోయాయని, శరీరంపై లోతైన గాయాలు, పగుళ్లు ఉన్నాయని చెప్పారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించేందుకు ఫైజాబాద్ ఎంపీ ప్రసాద్ బాధితురాలి ఇంటికి వెళ్లారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఎస్పీ నేత కన్నీటి పర్యంతమయ్యారు. యువతిని కాపాడటంలో తాను విఫలమయ్యానని, విషయాన్ని ప్రధాని మోదీ దృష్టికి తీసుకెళ్తానని, కుటుంబానికి న్యాయం జరగకపోతే రాజీనామా చేస్తానని ప్రకటించారు. శ్రీరాముడి జన్మస్థలమైన అయోధ్యలో ఇంత దారుణమైన నేరం ఎలా జరుగుతుందని అవదేశ్ ప్రశ్నించారు. కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేశారు. మృతుడి గ్రామానికి చెందిన ఇద్దరిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నామని పోలీసులు తెలిపారు. పోస్టుమార్టం రిపోర్టు ఇంకా రాలేదని, అది అందాక తదుపరి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఈ ఘటనపై బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ) అధినేత్రి మాయావతి స్పందిస్తూ.. ''ఇది చాలా విచారకరమైన, తీవ్రమైన విషయం. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలి''అని ఎక్స్‌లో పేర్కొన్నారు. ఈ ఘటనకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ నేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ డిమాండ్ చేశారు. కుటుంబ సభ్యుల గోడును పోలీసులు పట్టించుకుని ఉంటే.. ఆమె ప్రాణాలతో బయటపడేదన్నారు. ఉత్తరప్రదేశ్‌లో బహుజన వ్యతిరేక బీజేపీ పాలన సాగుతోందని, దళితులపై దౌర్జన్యాలు, అన్యాయాలు, హత్యలు పెరుగుతున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు.

మద్యం మత్తులో 80 అడుగుల టవర్ ఎక్కి..

'అసలే కోతి.. ఆపై కల్లు తాగింది' అని ఓ సామెత. మధ్యప్రదేశ్‌లోని భోపాల్‌కు చెందిన ఓ వ్యక్తి తీరు అచ్చం అలాగే ఉంది. జిల్లాలో ఉన్న బెరాసియా తహసీల్‌లో బర్‌ఖేడీ గ్రామానికి చెందిన 33 ఏళ్ల వివేక్ అనే వ్యక్తి పీకల దాకా తాగాడు. ఇంకేముంది వెయ్యేనుగుల బలం వచ్చింది. ఆ మత్తులో 80 అడుగుల మొబైల్ టవర్ ఎక్కాలనుకున్నాడు. స్థానికులు అడ్డుకుంటున్నా సరే.. పక్కకు నెట్టిమరీ సునాయాసంగా ఎక్కాడు. టవర్ మీదకు ఎక్కనయితే ఎక్కాడు కానీ.. ఎట్లా దిగాలో అర్థం కాలేదు. ఏం చేస్తున్నాడో కూడా అర్థం కాలేదు. దీంతో స్థానికులు జహంగీరాబాద్ **పోలీసులకు,** మున్సిపల్ అధికారులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న అధికారులు అతడిని 20 నిమిషాలపాటు మాటల్లో పెట్టి.. అగ్నిమాపక క్రేన్ సహాయంతో కిందకు దించారు. కథ సుఖాంతం కావడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. కిందకు దిగిన వివేక్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటనంతా స్థానికులు తమ సెల్‌ఫోనులో బంధించిన స్థానికులు సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేయగా.. వీడియో వైరల్ అవుతోంది.

సవతి కూతురిని చంపి..

మృతదేహాన్ని కాల్చి, గోనె సంచిలో దాచిన బిహార్ మహిళ

బక్సర్ (బిహార్): ఎనిమిదేళ్ల సవతి కూతురిని అత్యంత కిరాతకంగా హత్య చేసింది బిహార్‌కు చెందిన ఓ మహిళ. శనివారం రాత్రి మృతురాలి అవశేషాలను గుర్తించిన పోలీసులు మహిళను అరెస్టు చేశారు. వివరాల్లోకి వెళ్తే.. బక్సర్ జిల్లాలోని డుమ్రాన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని నయా భోజ్‌పూర్‌ప్రాంతంలో ఓ మహిళకు సవతి కూతురు ఎనిమిదేళ్ల ఆంచల్ కుమారి ఉంది. ఆమె తండ్రి ఢిల్లీలో ఉంటున్నారు. మహిల సవతి కూతురుతోపాటు భోజ్‌పూర్‌లో ఉంటోంది. కూతురిని గొంతు నులిమి చంపింది. ఆ తరువాత మృతదేహానికి నిప్పంటించింది. కాలిపోయిన మృతదేహాన్ని గోనె సంచిలో నింపి చెక్కపెట్టెలో దాచి పెట్టింది. ఆంచల్ కనిపించకపోవడంతో ఇతర కుటుంబ సభ్యులు శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు బాలిక ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేపట్టారు. చివరకు ఇంటిని తనిఖీ చేయగా.. గోనె సంచిలో పెట్టిన చెక్కపెట్టెలో దాచిన మృతదేహం బయటపడింది. నేరం చేసినట్లు సవతి తల్లి అంగీకరించింది. సంఘటనా స్థలం నుంచి సేకరించిన సాక్ష్యాల ఆధారంగా పోలీసులు ఆమెను అరెస్టు చేశారు. ఈ దారుణానికి ఒడిగట్టడానికి గల కారణాలు మాత్రం ఆమె పోలీసులకు వెల్లడించలేదు.

లోన్ తీసుకుని మరీ మరదలు హత్యకు సుపారీ

ముజఫర్‌నగర్: లోన్ తీసుకుని మరీ.. మరదలిపై సామూహిక అత్యాచారం, హత్య చేయించాడో ప్రబుద్ధుడు. ఈ దారుణ ఘటన యూపీలోని మీరట్‌లో జరిగింది. ముజఫర్‌నగర్‌కు చెందిన ఆశిష్ అనే వ్యక్తి.. తన భార్య చెల్లెలితో వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నాడు. ఏం జరిగిందో తెలియదు.. ఆమెను వదిలించుకోవాలనుకున్నాడు. చంపేంత ధైర్యం ఒక్కడికే లేదు. అందుకోసం ఇద్దరు మనుషులను మాట్లాడుకున్నాడు. వారికి చెల్లించడానికి డబ్బులు లేకపోవడంతో రూ.40 వేలు అప్పుగా తీసుకుని మరీ శుభమ్, అతని స్నేహితుడు దీపక్‌కు చెల్లించాడు. జనవరి 21న బాధితురాలికి కాల్ చేసి రప్పించారు. స్కూటర్‌పై మీరట్‌లోని నాను కాలువ సమీపంలోకి తీసుకెళ్లి సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. ఆ తరువాత కండువాతో గొంతు నులిమి చంపేశారు. మృతదేహాన్ని పెట్రోల్ పోసి తగులబెట్టి.. ఎక్కడి వాళ్లక్కడ వెళ్లిపోయారు. 21న ఇంటి నుంచి వెళ్లిపోయిన అమ్మాయి ఎంతకీ రాకపోవడం, ఫోన్ పనిచేయకపోవడంతో జనవరి 23న కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆమె చివరిసారి ఆశిష్, శుభం, దీపక్‌లతో కనిపించినట్లు తేలింది. ఆశిశ్‌ను విచారించడంతో నేరాన్ని అంగీకరించాడు. మరదలు బ్లాక్‌మెయిల్ చేయడంవల్లే చంపాల్సి వచ్చిందని చెప్పాడు. ఘటనా స్థలం నుంచి బాధితురాలి అవశేషాలు, కాలిపోయిన దుస్తులు, ఉంగరం, ఇతర వస్తువులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

సోనియాగాంధీపై బిహార్‌లో కేసు

రాష్ట్రపతిని అవమానించారంటూ ఫిర్యాదు చేసిన న్యాయవాది

ముజఫర్‌పూర్(బిహార్): రాష్ట్రపతి ద్రౌపది ముర్ముపై అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ కాంగ్రెస్ అధినేత్రి సోనియాగాంధీపై బిహార్‌లోని ముజఫర్‌పూర్ జిల్లా కోర్టులో కేసు నమోదైంది. దేశంలోని అత్యున్నత రాజ్యాంగ పదవిలో ఉన్న వారిని అవమానించారంటూ సోనియాగాంధీపై ముజఫర్‌పూర్‌కు చెందిన సుధీర్ ఓఝా అనే న్యాయవాది శనివారం ఫిర్యాదు చేశారు. లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, కాంగ్రెస్ ఎంపీ ప్రియాంకాగాంధీ వాద్రాలను సహ నిందితులుగా పేర్కొన్నారు. వారిపైనా చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఓఝా కోరారు. ఇది దేశంలోని అత్యున్నత రాజ్యాంగ సంస్థను అవమానించడమేనని ఓఝా అన్నారు. దీనిపై ఫిబ్రవరి 10న కోర్టు విచారణ జరపనుంది. కాగా, బడ్జెట్ సమావేశాలకు ముందు పార్లమెంటులో రాష్ట్రపతి ముర్ము గంటపాటు ప్రసంగించారు. అనంతరం బయటకు వచ్చిన సోనియా గాంధీని రాష్ట్రపతి ప్రసంగం గురించి మీడియా ప్రశ్నించగా.. 'రాష్ట్రపతి బాగా అలసిపోయారు. పాపం ఆమె ఇక మాట్లాడలేరు' అని అన్నారు. ప్రసంగం బోరింగ్‌గా ఉందని రాహుల్ గాంధీ అభివర్ణించారు. అప్పుడు ప్రియాంక గాంధీ వాద్రా పక్కనే ఉన్నారు. ఈ వ్యాఖ్యలను ఖండిస్తూ రాష్ట్రపతి భవన్ ఒక ప్రకటన విడుదల చేసింది. సోనియాగాంధీ పేరు ప్రస్తావించకుండానే వ్యాఖ్యలు ఆమోదయోగ్యం కాదని, ముర్ము అలసిపోలేదని పేర్కొంది.

నావిక్-02 కక్ష్య పెంపులో అవాంతరాలు

సూళ్లూరుపేట: ఇస్రో జనవరి 31న జీఎస్ఎల్వీ ఎఫ్15 ద్వారా ప్రయోగించిన నావిక్-02 ఉపగ్రహం కక్ష్య దూరం పెంపు ప్రక్రియ సాంకేతిక కారణాలతో నిలిచిపోయింది. మూడు రోజులుగా ప్రయత్నిస్తున్నా థ్రస్టర్లను మండించేందుకు ఆక్సిడైజర్‌ను అందించే వాల్వ్‌లు తెరుచుకోక పోవడంతో కక్ష్య రైజింగ్ ఆగిపోయింది. ఉపగ్రహం కక్ష్య పెంపులో ఇబ్బందులు తలెత్తడం ఇదే మొదటిసారి. 2,250 కిలోల నావిక్-02 ఉపగ్రహాన్ని జియో ట్రాన్స్‌ఫర్ ఆర్బిట్‌లోకి విజయవంతంగా ప్రవేశపెట్టిన విషయం తెలిసిందే. మూడు నాలుగు విడతల్లో ఉపగ్రహం కక్ష్య దూరాన్ని భూమికి 36 వేల కిలోమీటర్ల ఎత్తులోని భూస్థిర కక్ష్యలోకి చేర్చాల్సి ఉంది. లేకుంటే ఉపగ్రహం ప్రయోగం వృథా అయ్యే ప్రమాదముందంటున్నారు.

గ్యాంగ్‌స్టర్ జోగీందర్‌ను అప్పగించిన ఫిలిప్పీన్స్

న్యూఢిల్లీ: పోలీసులకు వాంటెడ్‌గా, ఇంటర్ పోల్ రెడ్ నోటీసు జారీ చేసిన గ్యాంగ్‌స్టర్ జోగిందర్ గియోంగ్‌ను ఫిలిప్పీన్స్ ఢిల్లీ పోలీసులకు అప్పగించింది. హత్య, నేర పూరిత కుట్ర కేసులను ఎదుర్కొంటున్న జోగీందర్ ఆదివారం ఫిలిప్పీన్స్ నుంచి ఇందిరా గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకోగానే ఢిల్లీ పోలీసులు అదుపులోకి తీసుకుని హరియాణా పోలీసులకు అప్పగించారు. రెడ్ నోటీసు ఫలితంగా జోగిందర్‌ను ఫిలిప్పీన్స్ నుంచి బ్యాంకాక్ మీదుగా న్యూఢిల్లీకి చేరుకున్నాడని పోలీసు ఉన్నతాధికారులు తెలిపారు. ఇతడి సోదరుడు, గ్యాంగ్‌స్టర్ సురేందర్ పోలీసులతో జరిగిన ఎదురుకాల్పుల్లో చనిపోయాడన్నారు. సోదరుడి హత్యకు ప్రతీకారంగానే జోగిందర్ హత్యకు కుట్ర పన్నాడని వివరించారు. ఇతడికి ఢిల్లీ, పంజాబ్‌లలో జరిగిన దోపిడీ, హత్య, హత్యాయత్నాలతో ప్రమేయం ఉందని వివరించారు. అక్రమ ఆయుధాల రవాణా కేసులో జీవిత ఖైదు పడిన ఇతడు 2017లో పెరోల్‌పై బయటకు వచ్చి విదేశాలకు పరారయ్యాడని చెప్పారు.

సౌదీలో అల్-షరా తొలి విదేశీ పర్యటన

దుబాయ్: సిరియా తాత్కాలిక అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన అహ్మద్ అల్-షరా మొట్టమొదటి విదేశీ పర్యటనలో భాగంగా ఆదివారం సౌదీ అరేబియా రాజధాని రియాద్ చేరుకున్నారు. తన విదేశాంగ మంత్రి అస్సాద్ అల్-షయిబానీతో కలిసి సౌదీ పంపిన జెట్ విమానంలో వెళ్లారు. దీంతో, బషర్ అల్ అసద్ హయాంలో ఇరాన్‌తో ఉన్న మైత్రికి సిరియా ముగింపు పలికినట్లయిందని పరిశీలకులు అంటున్నారు. గతంలో షరాకు అల్ ఖైదాతో సన్నిహిత సంబంధాలున్నాయి. సౌదీ యువరాజు సల్మాన్‌తో అల్- షరా భేటీ అవుతారని భావిస్తున్నారు. ఇప్పటికే సౌదీ ఆర్థిక మంత్రి ఫైసల్ బిన్ ఫర్హాన్ సిరియాలో పర్యటించారు. సిరియాపై విధించిన ఆంక్షలను ఎత్తివేసేందుకు చర్చలు జరుపుతున్నట్లు ప్రకటించారు. అల్-షరాకు సన్నిహిత తుర్కియే, ఖతార్‌లు ఇప్పటి వరకు సిరియాపై ఆంక్షలను తొలగించనప్పటికీ సౌదీ 2023లోనే ఇతర అరబ్ దేశాలతోపాటే ఆంక్షలను ఎత్తివేస్తున్నట్లు ప్రకటించింది. అసద్ ప్రభుత్వాన్ని పడగొట్టేందుకు సౌదీ సహా అనేక దేశాలు సిరియాలోని ఉగ్రమూకలకు దన్నుగా నిలిచాయి. అయితే, ఇరాన్, రష్యాల సాయంతో అసద్ మొన్నటి వరకు తట్టుకుని నిలబడ్డారు. డిసెంబర్‌లో తిరుగుబాటుదార్లు అనూహ్యంగా పుంజుకుని మెరుపు దాడులు చేస్తూ రాజధాని డెమాస్కస్‌కు చేరుకోవడం అసద్ పలాయనం కావడం తెలిసిందే. తిరుగుబాటు గ్రూపుల్లో ప్రధానమైన హయత్ తహ్రీర్ అల్-షామ్(హెచ్‌టీఎస్) నేత అహ్మద్ అల్-షరా ఆపద్ధర్మ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టారు. ఇతర తిరుగుబాటు గ్రూపులతో కుదిరిన అంగీకారం మేరకు ఆయన ఇటీవల తాత్కాలిక అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టారు.

భారత్‌లో ప్రిన్స్ ఎడ్వర్డ్ పర్యటన

లండన్: బ్రిటన్ యువరాజు, డ్యూక్ ఆఫ్ ఎడిన్‌బరో ప్రిన్స్ ఎడ్వర్డ్ భారత్‌లో మూడు రోజుల పర్యటనకు గాను ఆదివారం ఢిల్లీకి చేరుకున్నారు. కింగ్ చార్లెస్-3 తమ్ముడైన ఎడ్వర్డ్ ఢిల్లీ, ముంబైల్లో జరిగే డ్యూక్ ఆఫ్ ఎడిన్‌బరో ఇంటర్నేషనల్ అవార్డ్ కార్యక్రమాల్లో పాలుపంచుకుంటారని బకింగ్‌హామ్ ప్యాలెస్ ఒక ప్రకటనలో తెలిపింది. ఈ అవార్డును భారత్ ఇంటర్నేషనల్ అవార్డ్ ఫర్ యంగ్ పీపుల్(ఐఏవైపీ)గా పరిగణిస్తుంటారు. 1962లో నెలకొల్పిన ఈ అవార్డుతో ఇప్పటి వరకు 325 పాఠశాలలు, విద్యా సంస్థలకు చెందిన 1.50 లక్షల మంది విద్యార్థులకు అవసరమైన సాయం అందింది.

డెమోక్రాట్ల నేతగా కెన్ మార్టిన్ ఎన్నిక

వాషింగ్టన్: మిన్నెసొటాకు చెందిన నేత కెన్ మార్టిన్(51) డెమోక్రాట్ పార్టీ నేషనల్ చైర్‌కు ఎంపికయ్యారు. అంతగా పరిచయం లేదని కెన్ ఇప్పుడు డొనాల్డ్ ట్రంప్ పాలనపై పోరుకు మిగతా డెమోక్రాట్లను కలుపుకుని పోవాల్సి ఉంటుంది. ఆదివారం జరిగిన డెమోక్రాట్ నేషనల్ కమిటీ సమావేశంలో జెయిమ్ హారిసన్ నుంచి బాధ్యతలు చేపట్టారు. హారిసన్ మరోసారి బాధ్యతల్లో కొనసాగేందుకు అంగీకరించకపోవడంతో ఈ ఎన్నిక అనివార్యమైంది. అన్ని రాష్ట్రాలు, యూఎస్ టెర్రిటరీల నుంచి హాజరైన సుమారు 400 మంది ప్రతినిధులు ఓటింగ్‌లో పాల్గొన్నారు. పోటీలో కెన్ మార్టిన్‌కు 243, మరో నేత విల్కర్‌కు 134, ఓ మల్లేకు 44 ఓట్లు పడ్డాయి. ఎన్నిక అనంతరం కెన్ మాట్లాడుతూ..ఇది కొత్త డెమోక్రాట్ పార్టీ. ట్రంప్‌తో మేమిప్పుడు పోరాటానికి సిద్ధమయ్యాం. నవంబర్‌లో జరిగిన ఎన్నికల్లో మా ఓటమికి కారణాలపై చర్చ జరిగాక అతిత్వరలోనే కార్యాచరణను ప్రకటిస్తాం'అని ప్రకటించారు. పార్టీ మిన్నెసొటా చైర్‌కు 2011 నుంచి కెవిన్ సారథ్యం వహిస్తున్నారు.

ఉక్రెయిన్ లేకుండానే చర్చలు ప్రమాదకరం

అమెరికా-రష్యాల సంభాషణలపై జెలెన్‌స్కీ

కీవ్: ఉక్రెయిన్‌లో జరుగుతున్న యుద్ధంపై రష్యా, అమెరికాలు చర్చలు జరపడంపై ఆ దేశాధ్యక్షుడు జెలెన్‌స్కీ స్పందించారు. కాల్పుల విరమణ గురించి ఉక్రెయిన్, అమెరికాలు ఒక విధానానికి రూపకల్పన చేయకుండానే జరిగే ఈ చర్చలు చాలా ప్రమాదకరమంటూ ఆయన వ్యాఖ్యానించారు. జెలెన్‌స్కీ ఆదివారం అసోసియేటెడ్ ప్రెస్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు విషయాలను వివరించారు. యుద్ధ క్షేత్రంలో రష్యా బలగాలు పైచేయిగా ఉన్న సమయంలో చర్చలకు సమయం వృథా ఎందుకని అంటున్న రష్యా కాల్పుల విరమణకు, ఇతరత్రా వెసులుబాట్లపై చర్చలకుగానీ అంగీకరించదని ఆయన చెప్పారు. ఉక్రెయిన్‌కు మిలటరీ సాయం కొనసాగిస్తూ రష్యా ఇంధనం, బ్యాంకింగ్ వ్యవస్థలపై ఆంక్షలు విధిస్తామని బెదిరించడం ద్వారా పుతిన్‌ను చర్చలకు దిగివచ్చేలా చేయాలని ట్రంప్‌ను జెలెన్‌స్కీ కోరారు. కాల్పుల విరమణపై అమెరికా, రష్యా అధికారులు సీరియస్‌గానే చర్చలు ప్రారంభించినట్లు శుక్రవారం ట్రంప్ చేసిన వ్యాఖ్యలపై జెలెన్‌స్కీ ఈ మేరకు స్పందించారు. 'అమెరికా, రష్యాల మధ్య సొంత సంబంధాలు ఉండొచ్చు కానీ, మా దేశం గురించిన చర్చల్లో మా ప్రాతినిథ్యం లేకుండా చేయడం ప్రతి ఒక్కరికీ ప్రమాదమే'అని ఆయన అన్నారు.

బిట్‌శాట్‌తో బీటెక్, బీఫార్మసీకి మార్గం

దేశంలో ఇంజనీరింగ్, సైన్స్ ఎడ్యుకేషన్‌లో పేరు గడించిన.. బిర్లా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ (బిట్స్) నిర్వహించే ఎంట్రన్స్ టెస్ట్.. బిట్‌శాట్! ఇందులో ర్యాంకు ఆధారంగా.. బిట్స్ క్యాంపస్‌లలో.. బీటెక్, బీఫార్మసీ కోర్సుల్లో ప్రవేశం పొందొచ్చు!! జేఈఈ మెయిన్, అడ్వాన్స్‌డ్‌కు హాజరయ్యే విద్యార్థులు అదే ప్రిపరేషన్‌తో.. బిట్‌శాట్‌లోనూ సత్ఫలితాలు సొంతం చేసుకునే అవకాశం ఉంది! తాజాగా.. 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి బిట్‌శాట్-2025కు దరఖాస్తు ప్రక్రియ ప్రారంభమైంది. ఈ నేపథ్యంలో.. బిట్స్ ప్రత్యేకత, బిట్‌శాట్ పరీక్ష విధానం, ప్రిపరేషన్ తదితర వివరాలు..

» బిట్‌శాట్-2025 ప్రక్రియ ప్రారంభం
» ఈ పరీక్ష స్కోర్ ఆధారంగా సీట్ల కేటాయింపు
» నాలుగు బిట్స్ క్యాంపస్‌లలో ప్రవేశాలు


బిట్‌శాట్ 2025

బిర్లా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ (బిట్స్)కు ప్రస్తుతం అయిదు క్యాంపస్‌లు ఉన్నాయి. అవి.. పిలానీ, గోవా, హైదరాబాద్, ముంబై, దుబాయ్. వీటిలో పిలానీ, గోవా, హైదరాబాద్ క్యాంపస్‌లలో ఇంటిగ్రేటెడ్ ఫస్ట్ డిగ్రీ కోర్సులుగా పేర్కొనే బ్యాచిలర్ ఆఫ్ ఇంజనీరింగ్ కోర్సుల్లోకి ప్రవేశానికి బిట్‌శాట్‌ను నిర్వహిస్తారు.

క్యాంపస్‌లు.. బ్రాంచ్‌లు

- బిట్స్ పిలానీ క్యాంపస్‌లో.. కెమికల్, సివిల్, కంప్యూటర్ సైన్స్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్, మెకానికల్, మాన్యుఫ్యాక్చరింగ్, మ్యాథమెటిక్స్ అండ్ కంప్యూటింగ్ బ్రాంచ్‌లు ఉన్నాయి. వీటితోపాటు బీఫార్మసీ, ఎమ్మెస్సీ(బయలాజికల్ సైన్సెస్, కెమిస్ట్రీ, ఎకనామిక్స్, మ్యాథమెటిక్స్, ఫిజిక్స్), ఎమ్మెస్సీ జనరల్ స్టడీస్ కోర్సుల్లోనూ ప్రవేశం పొందొచ్చు.
- గోవా క్యాంపస్‌లో.. కెమికల్, ఈసీఈ, ఈఈఈ, ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రు మెంటేషన్, మెకానికల్, మ్యాథమెటిక్స్ అండ్ కంప్యూటింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ కంప్యూటింగ్ బ్రాంచ్‌లు ఉన్నాయి.
- హైదరాబాద్ క్యాంపస్‌లో.. కెమికల్, సివిల్, కంప్యూటర్ సైన్స్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్, మెకానికల్, మ్యాథమెటిక్స్ అండ్ కంప్యూటింగ్ బ్రాంచ్‌లు ఉన్నాయి. వీటితోపాటు బీ-ఫార్మసీ, ఇంటిగ్రేటెడ్ ఎంఎస్సీ కోర్సుల్లో కూడా చేరొచ్చు.
- ఇంటిగ్రేటెడ్ ఎమ్మెస్సీ కోర్సుల్లో చేరిన వారు మొదటి సంవత్సరం పూర్తయ్యాక.. తాము ఏ విభాగంలో ఇంటిగ్రేటెడ్ కోర్సులో చేయాలనుకుంటున్నారో తెలియజేయాల్సి ఉంటుంది. ఈ కోర్సు వ్యవధి అయిదున్నరేళ్లు.

అర్హతలు

- 10+2/ఇంటర్మీడియెట్ ఎంపీసీ/బైపీసీలో 75 శాతం ఉత్తీర్ణత ఉండాలి. దీంతోపాటు మొత్తం గ్రూప్ సబ్జెక్ట్‌లలో(ఫిజిక్స్, కెమిస్ట్రీ, మ్యాథమెటిక్స్/బయాలజీ)లలో ఒక్కో సబ్జెక్ట్‌లో తప్పనిసరిగా 60 శాతం మార్కులు సాధించాలి.
- 10+2/ఇంటర్మీడియెట్ 2024లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు, 2025లో ద్వితీయ సంవత్సరం పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు బిట్‌శాట్‌కు దరఖాస్తు చేసుకోవచ్చు.

మొత్తం 130 ప్రశ్నలు

- బిట్‌శాట్ పరీక్ష పూర్తిగా ఆన్‌లైన్ విధానంలో జరుగుతోంది. పార్ట్ 1లో ఫిజిక్స్‌పై 30 ప్రశ్నలు, పార్ట్-2లో కెమిస్ట్రీపై 30 ప్రశ్నలు, పార్ట్-3లో ఎ) ఇంగ్లిష్ ప్రొఫిషియన్సీపై 10 ప్రశ్నలు, బి) లాజికల్ రీజనింగ్‌పై 20; అదేవిధంగా పార్ట్ 4లో మ్యాథమెటిక్స్/బయాలజీ నుంచి 40 ప్రశ్నలు అడుగుతారు. పార్ట్-4కు సంబంధించి బీఫార్మసీలో చేరాలనుకునే విద్యార్థులు బయాలజీ సబ్జెక్టును ఎంచుకోవాలి. బీఈ కోర్సుల అభ్యర్థులు మాత్రం తప్పనిసరిగా మ్యాథమెటిక్స్ సబ్జెక్టుతోనే పరీక్ష రాయాల్సి ఉంటుంది. ఒక్కో ప్రశ్నకు మూడు మార్కులు చొప్పున మొత్తం 130 ప్రశ్నలతో 390 మార్కులకు పరీక్ష జరుగుతుంది. నెగెటివ్ మార్కింగ్ నిబంధన ఉంది. ప్రతి తప్పు సమాధానానికి ఒక మార్కును తగ్గిస్తారు. పరీక్ష వ్యవధి మూడు గంటలు.
- పరీక్షకు కేటాయించిన మూడు గంటల వ్యవధిలో అన్ని ప్రశ్నలను పూర్తిచేసిన అభ్యర్థులకు.. అదనంగా మరో 12 ప్రశ్నలకు సమాధానం ఇచ్చే అవకాశం కల్పిస్తారు. ఫిజిక్స్, కెమిస్ట్రీ, మ్యాథమెటిక్స్ లేదా బయాలజీ, లాజికల్ రీజనింగ్ నుంచి మూడు ప్రశ్నలు చొప్పున ఇస్తారు.

రెండు సెషన్లు

బిట్‌శాట్‌ను రెండు సెషన్లలో నిర్వహిస్తారు. అభ్యర్థులు రెండు సెషన్లకు లేదా ఏదో ఒక సెషన్‌కు దరఖాస్తు చేసుకోవచ్చు. రెండు సెషన్లకు హాజరైతే.. బెస్ట్ స్కోర్ సాధించిన సెషన్‌నే మెరిట్ జాబితా రూపకల్పనలో పరిగణనలోకి తీసుకుంటారు.సీట్ల కేటాయింపులో అభ్యర్థులు దరఖాస్తు సమయంలో పేర్కొన్న క్యాంపస్ ప్రాథమ్యాలను, ఇంజనీరింగ్ బ్రాంచ్ ప్రాథమ్యాల ఆధారంగా సీట్ల కేటాయింపు చేస్తారు.

బోర్డ్ టాపర్స్‌కు నేరుగా ప్రవేశం

రాష్ట్రాల స్థాయిలోని ఇంటర్మీడియెట్, తత్సమాన బోర్డ్ పరీక్షల్లో ఫస్ట్ ర్యాంకు పొందిన వారికి వారు మెచ్చిన బ్రాంచ్‌లో నేరుగా ప్రవేశం కల్పిస్తారు. అంటే.. బోర్డ్ స్థాయిలో ఇంటర్‌లో టాపర్‌గా నిలిచిన వారికి బిట్‌శాట్ నుంచి మినహాయింపు లభిస్తుంది. ఈ బోర్డ్ టాపర్స్ నేరుగా ఇంటిగ్రేటెడ్ ఫస్ట్ డిగ్రీ కోర్సుల్లో ప్రవేశం పొందే వీలుంది.

బోధనలో ప్రత్యేకత

బిట్స్ క్యాంపస్‌లలో ఆయా కోర్సులకు సంబంధించి ప్రత్యేక కరిక్యులంను రూపొందించారు. విద్యార్థుల్లో ప్రాక్టికల్ అప్రోచ్ పెరిగే విధంగా బోధన కొనసాగిస్తారు. బీఈ కోర్సుల్లో చేరిన విద్యార్థులు కోర్సు వ్యవధిలో రెండుసార్లు ప్రాక్టీస్ స్కూల్-1, ప్రాక్టీస్ స్కూల్-2 పేరుతో.. పరిశ్రమల్లో రీసెర్చ్ కార్యకలాపాల్లో పాల్గొనాల్సి ఉంటుంది. అదే విధంగా కోర్ సబ్జెక్ట్‌లతోపాటు..ఇతర అంశాల్లోనూ అవగాహన కల్పించే విధంగా మైనర్ ప్రోగ్రామ్స్ విధానాన్ని బిట్స్ అమలు చేస్తోంది. ఫైనాన్స్, అకౌంటింగ్, లిటరేచర్, హ్యూమానిటీస్ వంటి పలు సబ్జెక్ట్‌లు అందుబాటులో ఉన్నాయి. వీటిని పూర్తిచేసిన అభ్యర్థులకు సర్టిఫికెట్ సైతం అందిస్తారు.

మరెన్నో ఇన్‌స్టిట్యూట్స్‌కు

బిట్‌శాట్ స్కోర్ ద్వారా మరెన్నో ఇన్‌స్టిట్యూట్‌లలో బీటెక్ ప్రోగ్రామ్‌లలో ప్రవేశం పొందే వీలుంది. పలు ప్రైవేటు యూనివర్సిటీలు, ఇన్‌స్టిట్యూట్‌లు కూడా బీటెక్‌లో ప్రవేశం కల్పిస్తున్నాయి. దాదాపు వంద వరకు ప్రైవేటు ఇన్‌స్టిట్యూట్‌లు తమ ప్రవేశ ప్రక్రియకు బిట్‌శాట్ స్కోర్‌ను పరిగణనలోకి తీసుకుంటున్నాయి.

బిట్‌శాట్-2025 ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ:** 2025, ఏప్రిల్ 18
- **దరఖాస్తు సవరణకు అవకాశం:** ఏప్రిల్ 29 నుంచి మే 1 వరకు
- **సెషన్-1 హాల్‌టికెట్ డౌన్‌లోడ్:** మే 23 నుంచి
- **సెషన్-1 ఆన్‌లైన్ టెస్ట్ తేదీలు:** మే 26 నుంచి మే 30 వరకు
- **బిట్‌శాట్ సెషన్-2 దరఖాస్తు తేదీలు:** మే 26 నుంచి జూన్ 10 వరకు
- **సెషన్-2 దరఖాస్తు సవరణ అవకాశం:** జూన్ 13, 14 తేదీల్లో
- **సెషన్-2 హాల్‌టికెట్ డౌన్‌లోడ్:** జూన్ 20 నుంచి
- **సెషన్-2 ఆన్‌లైన్ టెస్ట్ తేదీలు:** జూన్ 22 నుంచి జూన్ 26 వరకు
- **అడ్మిషన్ జాబితా ప్రకటన:** జూలై 9, 2025
- **తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు:** బిట్స్ పిలానీ-హైదరాబాద్ క్యాంపస్, హైదరాబాద్, రాజమండ్రి, తిరుపతి, విజయవాడ, విశాఖపట్నం.
- **వివరాలకు వెబ్‌సైట్:** https://www.bitsadmission.com

బెస్ట్ స్కోర్‌కు మార్గాలు

కాన్సెప్ట్‌లే కీలకం

- బిట్‌శాట్‌లో మంచి స్కోర్ కోసం ఆయా కాన్సెప్ట్‌లపై పూర్తి అవగాహన పెంచుకోవాలి.జేఈఈ తరహాలోనే బిట్‌శాట్ క్లిష్టత స్థాయి ఉంటోంది. ప్రశ్నలన్నీ దాదాపుగా అప్లికేషన్ ఓరియెంటేషన్‌తో సమాధానం ఇవ్వాల్సిన విధంగా ఉంటున్నాయి. దీంతో అభ్యర్థులు ఫిజిక్స్, కెమిస్ట్రీ, మ్యాథమెటిక్స్ సబ్జెక్ట్‌లలో బేసిక్స్‌పై పట్టుపెంచుకోవాలి. జేఈఈ ప్రిపరేషన్‌తో అనుసంధానం చేసుకుంటూ చదవడం వల్ల ఒకే సమయంలో రెండు పరీక్షలకు ప్రిపరేషన్ సాగించొచ్చు.

సొంత నోట్స్

- ప్రతి సబ్జెక్ట్‌లోనూ ముఖ్యమైన ఫార్ములాలు, కాన్సెప్ట్‌లకు షార్ట్‌కట్ మెథడ్స్‌తో సొంత నోట్స్ రూపొందించుకోవాలి. ఇది రివిజన్ సమయంలో ఉపయుక్తంగా ఉంటుంది.
- మ్యాథమెటిక్స్‌లో.. హైపర్‌బోలా, పారాబోలా, రెక్టాంగులర్ పారాబోలా, ట్రిగ్నోమెట్రీ, వెక్టార్స్, 3-డి, ఇంటిగ్రల్ కాలిక్యులస్ అంశాలకు ప్రాధాన్యం ఇవ్వాలి.
- ఫిజిక్స్‌లో.. వర్క్ అండ్ ఎనర్జీ, న్యూటన్స్ లా, కరెంట్ ఎలక్ట్రిసిటీ, హీట్ అండ్ థర్మోడైనమిక్స్, మ్యాగ్నటిజం అండ్ మ్యాగ్నటిక్ ఎఫెక్ట్ ఆఫ్ కరెంట్, ఎలక్ట్రిక్ కరెంట్ యూనిట్లలో ముఖ్య అంశాలతో నోట్స్ రూపొందించుకోవాలి. కెమిస్ట్రీలో ముఖ్యంగా ఆర్గానిక్ కెమిస్ట్రీలో కెమికల్ రియాక్షన్స్‌ను ఒక జాబితాగా రూపొందించుకోవాలి.

పార్ట్-3కి ప్రత్యేకంగా

బిట్‌శాట్‌లో మరో ప్రత్యేకం పార్ట్-3 అని చెప్పొచ్చు. ఈ విభాగంలో ఇంగ్లిష్ ప్రొఫిషియన్సీ, లాజికల్ రీజనింగ్ అంశాల నుంచి కూడా ప్రశ్నలు ఉంటాయి. కేవలం అభ్యర్థుల్లోని సబ్జెక్ట్ నైపుణ్యాలను పరీక్షించడమే కాకుండా.. లాంగ్వేజ్, తులనాత్మక పరిశీలన సామర్థ్యాన్ని పరీక్షించే విధంగా ఈ విభాగాన్ని పొందుపర్చారు. పదో తరగతి స్థాయిలో ఇంగ్లిష్ గ్రామర్, వొకాబ్యులరీపై పట్టుంటే 25 ప్రశ్నలకు సులువుగా సమాధానం ఇచ్చే సామర్థ్యం లభిస్తుంది.

సబాయి, సలాయి గడ్డి పెరిగే ప్రాంతం?

వర్షపాతం, ఉష్ణోగ్రత, నేల స్వభావాన్ని బట్టి అడవులు పెరుగుతాయి. విశాల భారతదేశం వివిధ శీతోష్ణస్థితులకు నిలయం. వర్షపాతం అన్ని ప్రాంతాల్లో ఒకేలా లేదు. అందుకే భారత దేశంలో దట్టమైన అరణ్యాలు మొదలుకొని చిట్టడవులు, పొదలు, తుప్పలు కూడా విస్తారంగా కనిపిస్తాయి.


టెట్/డీఎస్సీ- ప్రత్యేకం
భూగోళశాస్త్రం

భారతదేశ అటవీ సంపద

భారతదేశ సహజ ఉద్భిజ్జ సంపద ఎంతో వైవిధ్యభరితంగా ఉంటుంది. వివిధ శీతోష్ణస్థితులు, నైసర్గిక స్వరూపం దీనికి కారణం. దట్టమైన అరణ్యాలు మొదలుకొని చిట్టడవులు, పొదలు, తుప్పలు కూడా భారతదేశంలో కనిపిస్తాయి. ఉష్ణమండల అరణ్యాలే కాకుండా సమశీతోష్ణ, ఆల్పైన్ అరణ్యాలు కూడా భారతదేశంలో పెరుగుతున్నాయి. హిమాలయ ప్రాంతం మినహాయిస్తే భారతదేశంలోని వివిధ ప్రాంతాల్లో పెరిగే అరణ్య జాతులు ఆయా ప్రాంతాలు పొందే వర్షపాతంపై ఆధారపడి ఉంటాయి. అత్యధిక వర్షపాతం పొందే ప్రాంతాల్లో సతతహరిత అరణ్యాలు పెరుగుతాయి. అత్యల్ప వర్షపాత ప్రాంతాల్లో పొదలు, తుప్పలు మాత్రమే ఉంటాయి.హిమాలయాల్లో ఎత్తును బట్టి అరణ్యాల జాతులు మారతాయి. ఎక్కువ ఎత్తులో కోనిఫెరస్ అరణ్యాలు, ఆల్పైన్ వృక్షజాతులు దర్శనమిస్తాయి.

సతత హరిత అరణ్యాలు

అత్యధిక వర్షపాతాన్ని పొందే మలబార్ తీరం, కేరళ, కర్ణాటకలోని పశ్చిమ కనుమల్లోని పశ్చిమ వాలులు, అండమాన్-నికోబార్, మేఘాలయ, నాగాలాండ్ రాష్ట్రాల్లోని ఆయనరేఖా ప్రాంతాల్లో సతత హరితారణ్యాలు విస్తరించి ఉన్నాయి. ఈ అరణ్యాల్లో మహాగని, ఎబోని, రోజ్‌వుడ్ ముఖ్య వృక్షజాతులు. ప్రవేశసౌలభ్యత లేకపోవటంతో ఈ అరణ్యాల్లో వాణిజ్య కలపను ఉత్పత్తి చేయటం కష్టం. ఈ అరణ్యాలు విస్తారమైన జీవవైవిధ్యాన్ని కలిగి ఉన్నాయి. ఈ కోవకు చెందిన కేరళలోని సైలెంట్‌వ్యాలీ ప్రాంతంలో సింహపుతోక లాంటి అందమైన కోతుల జాతి నివసిస్తోంది. పశ్చిమ కనుమల్లోని ఈ అరణ్య ప్రాంతాన్ని ప్రపంచంలోని 14 జీవ వైవిధ్య మండలాల్లో ఒకటిగా గుర్తించారు. అధిక వర్షపాతాన్ని పొందే తెరాయి ప్రాంతం, పశ్చిమ బెంగాల్, జార్ఖండ్, ఒడిశా,ఛత్తీస్‌గఢ్, తూర్పు మధ్యప్రదేశ్, ఈశాన్య భారతంలోని కొండ ప్రాంతాల్లో ఆర్ద్ర ఆకురాల్చే అడవులు విస్తరించి ఉన్నాయి. వీటిని 'రుతుపవన అరణ్యాలు'గా పిలుస్తారు. టేకు, సాల్, గుర్జన్, మహుబా ముఖ్యమైన వృక్షజాతులు. వెదురు, సబాయి, సలాయి గడ్డిజాతులు కూడా ఈ అరణ్యాల్లో పెరుగుతాయి. దేశంలో వాణిజ్య కలపను ఉత్పత్తి చేసే ముఖ్యమైన అరణ్యాలు ఇవి.

60-100 సెం.మీ. మధ్యస్థ వర్షపాతాన్ని పొందే ప్రాంతాల్లో అనార్ద్ర ఆకురాల్చే అరణ్యాలు పెరుగుతున్నాయి. ఈ అరణ్యాల్లో టేకు, మద్ది, అడవిచింత, అడవి వేప ముఖ్య వృక్షజాతులు ఇక్కడ పెరుగుతాయి. వెదురు కూడా విస్తారంగా లభిస్తుంది. ఇవి పశ్చిమ మధ్యప్రదేశ్, గుజరాత్, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోని నల్లమలై, ఎర్రమలై కొండ ప్రాంతాల్లో విస్తరించాయి. వ్యవసాయం విస్తరించడంతో ఈ అరణ్యాలు ఎక్కువగా కుచించుకపోతున్నాయి. ఈ అరణ్యాల్లో వాణిజ్య కలప ఉత్పాదకత తక్కువ.

చిట్టడవులు

చిట్టడవులు 40-60 సెం.మీ. అల్ప వర్షపాతాన్ని పొందే సహ్యాద్రి కొండల వర్షచ్ఛాయా ప్రాంతం, వాయవ్య భారతదేశంలో పెరుగుతాయి. పశ్చిమ తెలంగాణ, రాయలసీమ, ఉత్తర కర్ణాటక, మరఠ్వాడా, పంజాబ్, హర్యానా, ఉత్తర రాజస్థాన్ ప్రాంతాల్లో ఈ అరణ్యాలు విస్తరించి ఉన్నాయి. ముళ్లతో కూడిన తుమ్మ లాంటి అకేషియా జాతికి చెందిన తక్కువ ఎత్తు వృక్షజాతులు మాత్రమే ఇక్కడ ఉంటాయి. ఈ అరణ్యాల్లో వంటచెరకు మాత్రమే ఉత్పత్తి అవుతుంది. వాణిజ్య కలప లభించదు.

అత్యల్ప వర్షపాతాన్ని పొందే ఉత్తర గుజరాత్ (కచ్), పశ్చిమ రాజస్థాన్(థార్ ఎడారి) ప్రాంతాల్లో వృక్షాలు పెరగటానికి కావలసిన తేమ లభించదు. శుష్క, అధిక ఉష్ణోగ్రతలను తట్టుకోగలిగే మోగాధర్మ్, జెరోఫైట్ తరానికి చెందిన కాక్టస్‌లాంటి పొదలు, తుప్పలు మాత్రమే పెరుగుతాయి. ద్వీపకల్ప భారతదేశంలోని పర్వత శిఖర భాగాల్లో ఉప ఆయనరేఖ అనార్ద్ర సతతహరిత అరణ్యాలు పెరుగుతాయి. మధ్యప్రదేశ్‌లోని మహదేవ కొండలు, అమర్‌కాంత్ ప్రాంతం, కేరళలోని పళని కొండలు, తమిళనాడులోని నీలగిరి, అన్నామలై కొండలు, కర్ణాటకలోని కూర్గ్ ప్రాంతాల్లోని అరణ్యాలు ఈ కోవకు చెందుతాయి. దక్షిణ భారతదేశంలో వీటిని 'షోలా' అరణ్యాలు అని పిలుస్తారు. ఇందులో యూకలిప్టస్, ఓక్, చెస్ట్‌నట్, మాపుల్ ముఖ్య వృక్షజాతులు.

ఎత్తును బట్టి వృక్ష జాతులు

హిమాలయ పర్వతాల్లో 2000 మీ. ఎత్తులో సమశీతోష్ణ మండల జాతులైన ఓక్, చెస్ట్‌నట్, వాల్‌నట్, మాపుల్, బీచ్ లాంటి వృక్షాలు ఉంటాయి. సుమారు 3000-3500 మీటర్ల ఎత్తులో కోనిఫెరస్ జాతికి చెందిన పైన్, ఫర్, స్ప్రూస్, సెడార్‌లాంటి వృక్షాలతో కూడిన టైగా అరణ్యాలు పెరుగుతాయి. 4500 మీటర్ల ఎత్తులో విల్లో జాతి వృక్షాలు, రోడోడెండ్రాన్ జాతికి చెందిన పుష్పజాతులు, పచ్చిక బయళ్లు విస్తారంగా పెరుగుతాయి. ఈ ప్రాంతం సహజసిద్ధ ఉద్యానవనంగా కనిపిస్తుంది.

మడ అడవులు

తీర ప్రాంతాల్లోని నదీ ముఖద్వారాలు, డెల్టాలు, ఉప్పునీటి కయ్యల వద్ద ప్రత్యేక రకమైన అరణ్యాలు పెరుగుతాయి. వీటిని 'మడ అడవులు' లేదా 'మాన్‌గ్రూవ్ అరణ్యాలు'గా పిలుస్తారు. లవణీయతను తట్టుకొని నీటిలో తేలియాడే వృక్షజాతులు ఇక్కడ పెరుగుతాయి. సుందరి, రైజోఫెరా, సూల్బాకేస్ మొదలైనవి ముఖ్య వృక్షజాతులు. ఈ మడ అడవులు సముద్ర ఉప్పునీరు తీరమైదానాల్లోని వ్యవసాయ భూముల్లోకి ప్రవేశించకుండా నిరోధిస్తాయి. ఎత్తయిన వేలా తరంగాలు, సునామీ తరంగాలు, చక్రవాతాలు తీరాన్ని దాటేటప్పుడు తీర ప్రాంతాల్లో ఎక్కువ నష్టం జరగకుండా ఈ అరణ్యాలు అడ్డుకుంటాయి. ఇవి జీవ వైవిధ్యానికి కూడా ప్రసిద్ధి. ఇటీవలి కాలంలో పర్యాటక కేంద్రాలు (రిసార్టులు, హోటల్స్) ఏర్పరచటానికి, వ్యవసాయాన్ని విస్తరించటానికి మడ అడవులను విచక్షణారహితంగా నరికివేస్తున్నారు. అందువల్ల భారత ప్రభుత్వం కొన్ని ముఖ్యమైన మాన్‌గ్రూ ప్రాంతాలను రక్షిత మండలాలుగా ప్రకటించింది. అందులో ముఖ్యమైనవి సుందరవనాలు (పశ్చిమ బెంగాల్), భిత్తర్ కనికా (ఒడిశా), కొరింగ(ఆంధ్రప్రదేశ్), పిచ్చవరం, పాయింట్ కాలిమోర్(తమిళనాడు), వెంబనాడు(కేరళ), కొందాపూర్ (కర్ణాటక), అచ్రా (మహారాష్ట్ర). భారతదేశంలో సగటున 23 శాతం భౌగోళిక ప్రాంతంలో మాత్రమే అరణ్యాలు విస్తరించి ఉన్నాయి.

ఇందులో 16 శాతం మాత్రమే దట్టమైన అరణ్యాల కోవకు చెందుతాయి. భౌగోళిక ప్రాంతంలో కనీసం 33 శాతం అరణ్యాలు ఉండాలని జాతీయ అటవీ విధానం నిర్దేశిస్తోంది. కొండలు ఎత్తయిన పీఠభూముల్లో కనీసం 60 శాతం, మైదాన ప్రాంతాల్లో కనీసం 20 శాతం అరణ్యాలు ఉండాలని కూడా జాతీయ అటవీ విధానం సూచిస్తోంది. కేవలం ఈశాన్య భారతదేశం, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, ఒడిశా, జార్ఖండ్, అండమాన్-నికోబార్ అరణ్య ప్రాంతాలు మాత్రమే జాతీయ అటవీ విధాన లక్ష్యాలకు అనుగుణంగా ఉన్నాయి. ముఖ్యంగా ఉత్తరభారత మైదాన ప్రాంతాల్లో అరణ్యాల శాతం 10 కంటే తక్కువగా ఉంది.

పర్యావరణాన్ని పరిరక్షించటానికి భారత ప్రభుత్వం కొన్ని అరణ్య ప్రాంతాలను జాతీయ ఉద్యానవనాలు, అభయారణ్యాలు, జీవావరణ మండలాలుగా ప్రకటించింది. దండేలి, భద్ర (కర్ణాటక) పెంచ్(మహారాష్ట్ర) బోరి, సాత్పుర (మధ్యప్రదేశ్), పాకీబామేరా (అరుణాచల్ ప్రదేశ్) అరణ్య ప్రాంతాలను 'పులుల అభయారణ్యాలు'గా భారత ప్రభుత్వం ప్రకటించింది. దీంతో 1973లో ప్రారంభించిన ప్రాజెక్టు టైగర్ పథకం కింద స్థాపించిన పులుల అభయారణ్యాల సంఖ్య 29కి చేరింది. 'మ్యాన్ అండ్ బయోస్పియర్' పథకం కింద ఇప్పటి వరకు 14 రక్షిత జీవావరణ మండలాలను ఏర్పరిచారు. అవి..

రక్షిత జీవావరణ మండలం	రాష్ట్రం (ఉనికి)
1. అచనాకర్-అమర్‌కాంతక్	మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్
2. అగస్త్యమలై	కేరళ
3. దేహంగ్-దిబాంగ్	అరుణాచల్ ప్రదేశ్
4. దిబ్రూ-సాయికోవా	అసోం
5. గ్రేట్ నికోబార్	అండమాన్-నికోబార్
6. మన్నార్ సింధు శాఖ	తమిళనాడు
7. కాంచనజంగ	సిక్కిం
8. మానస్	అసోం
9. నందాదేవి	ఉత్తరాంచల్
10. నీలగిరి	కేరళ, తమిళనాడు, కర్ణాటక
11. నాక్రిక్	మేఘాలయ
12. పచ్‌మాడి	మధ్యప్రదేశ్
13. సిమ్లిపాల్	ఒడిశా
14. సుందరవనాలు	పశ్చిమ బెంగాల్

అరణ్య సంపద.. జీవవైవిధ్యత, పర్యావరణానికి సంబంధించిన అంశం కావటంతో ప్రతి పోటీ పరీక్షలో ఈ అంశానికి సంబంధించి ప్రశ్నలు తప్పనిసరిగా ఉంటాయి. ప్రశ్నలు సాధారణంగా కింది ఉప అంశాల నుంచి ఇచ్చే అవకాశం ఉంది.

- అరణ్యాల రకాలు – విస్తరణ
- అరణ్యాలు – ప్రధాన వృక్ష జాతులు
- జాతీయ ఉద్యానవనాలు, వన్య, మృగ సంరక్షణా కేంద్రాలు – ఉనికి, సంరక్షణ పొందుతున్న జంతుజాలం.
- జీవావరణ మండలాలు – ఉనికి
- పరిరక్షణ చట్టాలు – ఇతర చర్యలు

సాధారణంగా విద్యార్థులు భారతదేశంలో అరణ్యాలు అంశాల్లో అత్యధిక, అత్యల్ప శాతం అడవులు విస్తరించిన రాష్ట్రాలను, దేశంలో సగటు అరణ్య శాతాన్ని గుర్తుంచుకోవటంలో తమ ప్రిపరేషన్ ముగిసిందని భావిస్తుంటారు. కానీ విద్యార్థులను వడపోతకు అవసరమైన ఎగ్జామినర్స్ అనేక ఇతర కొత్త ఉప అంశాల మీద కొత్త తరహా ప్రశ్నలు రూపొందిస్తున్నారు. ఒక్కోసారి రాష్ట్రాలవారీగా అరణ్యశాతం విస్తరణ అంశంలోనే భిన్నంగా ప్రశ్నలు వచ్చే అవకాశం ఉంది.

ఉదాహరణకు:

1. ఈశాన్య భారతదేశంలో అత్యధిక శాతం అరణ్య ప్రాంతం ఉన్న రాష్ట్రం ఏది?
   1) మేఘాలయ 2) మిజోరాం
   3) నాగాలాండ్ 4) మణిపూర్
2. ఈశాన్య భారతదేశంలో అత్యల్ప శాతం అరణ్య ప్రాంతం ఉన్న రాష్ట్రం ఏది?
   1) అసోం 2) త్రిపుర
   3) సిక్కిం 4) అరుణాచల్ ప్రదేశ్
3. దక్షిణ భారతదేశంలో అత్యధిక శాతం అరణ్య ప్రాంతం ఉన్న రాష్ట్రం ఏది?
   1) తమిళనాడు 2) కర్ణాటక
   3) కేరళ 4) ఆంధ్రప్రదేశ్
4. దక్షిణ భారతదేశంలో అత్యల్ప శాతం అరణ్య ప్రాంతం ఉన్న రాష్ట్రం ఏది?
   1) తమిళనాడు 2) కర్నాటక
   3) కేరళ 4) ఆంధ్రప్రదేశ్
5. భారతదేశంలో అరణ్య ప్రాంతం శూన్యంగా ఉన్న కేంద్రపాలిత ప్రాంతాలు?
   ఎ) లక్షదీవులు బి) డామన్-డయ్యు
   సి) పాండిచ్చేరి డి) ఛండీగఢ్
   1) ఎ, బి 2) బి, సి
   3) ఎ, డి 4) ఎ, సి

సమాధానాలు

1) 2; 2) 1; 3) 3; 4) 1; 5) 4.

రాష్ట్రాలవారీగా అరణ్య ప్రాంతాల వివరాలను పరిశీలించేటప్పుడు కేవలం అత్యధిక,అత్యల్ప శాతం అరణ్య ప్రాంతం ఉన్న రాష్ట్రాల వివరాలే కాకుండా, పైన సూచించినట్లు వివిధ కోణాల్లో చదవాలి.

నమూనా ప్రశ్నలు

1. భారతదేశంలో సుమారుగా ఎంత శాతం అరణ్య ప్రాంతాన్ని 'రిజర్వ్ ప్రాంతం'గా గుర్తించారు?
   1) 30 2) 40 3) 50 4) 60
2. భారతదేశంలో అరణ్య ప్రాంతం ప్రధానంగా కింది నైసర్గిక విభాగంలో కేంద్రీకృతమై ఉంది?
   1) హిమాలయాలు
   2) ద్వీపకల్ప కొండలు – పీఠభూములు
   3) పశ్చిమ కనుమలు – పశ్చిమ తీర మైదానాలు
   4) తూర్పు కనుమలు – తూర్పు తీర మైదానాలు
3. శృంగాకార అరణ్యాలు మొత్తం భారతదేశ అరణ్య ప్రాంతంలో ఎంత శాతం వాటాను కలిసి ఉన్నాయి?
   1) 6 2) 15 3) 25 4) 35
4. శృంగాకార అరణ్యాలు భారతదేశంలో ఏ ప్రాంతంలో కేంద్రీకృతమై ఉన్నాయి?
   1) సహ్యాద్రి కొండలు
   2) జార్ఖండ్ 3) ఈశాన్య భారతదేశం
   4) హిమాలయ పర్వతాలు
5. సబాయి, సలాయి గడ్డి ఏ ప్రాంత అరణ్యాల్లో పెరుగుతున్నది?
   1) ఛోటా నాగపూర్
   2) పూర్వాంచల్ కొండలు
   3) తెరాయి ప్రాంతం
   4) మల్వా పీఠభూమి

సమాధానాలు

1) 3; 2) 2 ; 3) 1; 4) 4; 5) 3.

విద్య, ఉద్యోగ సమాచారం

బెల్, పుణెలో 22 డిప్యూటీ ఇంజనీర్ పోస్టులు

పుణెలోని భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్(బీఈఎల్).. ఫిక్స్‌డ్ టర్మ్ ప్రాతిపదికన డిప్యూటీ ఇంజనీర్(ఈ-2) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 22.
» **విభాగాలు:** ఎలక్ట్రానిక్స్, మెకానికల్, సివిల్, ఎలక్ట్రికల్.
» **అర్హత:** గుర్తింపు పొందిన యూనివర్శిటీ నుంచి బీఈ/బీటెక్/ఏఎంఐఈ/జీఐఈటీఈ ఉత్తీర్ణులవ్వాలి. జనరల్/ఓబీసీ/ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులు ఫస్ట్ క్లాస్‌లో ఉత్తీర్ణులవ్వాలి. ఎస్సీ, ఎస్టీ, పీడబ్ల్యూబీడీ అభ్యర్థులు పాసయ్యుండాలి.
» **గరిష్ఠ వయో పరిమితి:** 28 ఏళ్లు ఉండాలి. ఓబీసీ అభ్యర్థులకు మూడేళ్లు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఐదేళ్లు వయో సడలింపు ఉండాలి.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష, ఇంటర్వ్యూ ద్వారా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 24.02.2025.
» **పనిచేయాల్సిన ప్రదేశం:** పుణె/నాగ్‌పూర్.
» **వెబ్‌సైట్:** https://bel-india.in

కొచ్చిన్ షిప్‌యార్డ్ లిమిటెడ్‌లో 11 పోస్టులు

కొచ్చి(కేరళ)లోని కొచ్చిన్ షిప్‌యార్డ్ లిమిటెడ్.. ఫిక్స్‌డ్ టర్మ్ ఒప్పంద ప్రాతిపదికన వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 11.
» **పోస్టుల వివరాలు:** సెరాంగ్-09, ఇంజన్ డ్రైవర్-01, లస్కర్(ఫ్లోటింగ్ క్రాఫ్ట్)-01.
» **అర్హత:** ఏడో తరగతి ఉత్తీర్ణులవ్వాలి. సంబంధిత పోస్టుకు సంబంధించి సర్టిఫికేట్ కలిగి ఉండాలి.
» **వేతనం:** నెలకు సెరాంగ్, ఇంజన్ డ్రైవర్ పోస్టుకు మొదటి ఏడాది రూ.23,300, రెండో ఏడాది రూ.24,000, మూడో ఏడాది రూ.24,800, లస్కర్ పోస్టులకు మొదటి ఏడాది రూ.22,100, రెండో ఏడాది రూ.22,800, మూడో ఏడాది రూ.23.400.
» **వయసు:** 13.02.2025 నాటికి 30 ఏళ్లు మించకూడదు. ఎస్సీ అభ్యర్థులకు ఐదేళ్లు, ఓబీసీ అభ్యర్థులకు మూడేళ్లు సడలింపు ఉంటుంది.
» **ఎంపిక విధానం:** ప్రాక్టికల్ టెస్ట్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 13.02.2025.
» **వెబ్‌సైట్:** http://https//cochinshipyard.in

సౌత్ ఈస్టర్న్ కోల్‌ఫీల్డ్స్ లిమిటెడ్‌లో 100 అప్రెంటిస్‌లు

బిలాస్‌పూర్(ఛత్తీస్‌గఢ్)లోని సౌత్ ఈస్టర్న్ కోల్‌ఫీల్డ్స్ లిమిటెడ్(ఎస్ఈసీఎల్) ఫ్రెషర్(ఆప్షనల్ ట్రేడ్).. అప్రెంటిస్ ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం ఖాళీల సంఖ్య:** 100.
» **ట్రేడు:** ఆఫీస్ ఆపరేషన్స్ ఎగ్జిక్యూటివ్.
» **అర్హత:** పదో తరగతి ఉత్తీర్ణులవ్వాలి. రెండేళ్ల సంబంధిత పని అనుభవం ఉండాలి.
» **ఎంపిక విధానం:** విద్యార్హతల్లో సాధించిన మార్కులు, ఉత్తీర్ణతా సంవత్సరం, రూల్ ఆఫ్ రిజర్వేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 10.02.2025.
» **వెబ్‌సైట్:** www.secl-cil.in

సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ముంబైలో 1000 క్రెడిట్ ఆఫీసర్ పోస్టులు

ముంబైలోని సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(సీబీఐ) రెగ్యులర్ ప్రాతిపదికన జూనియర్ మేనేజ్‌మెంట్ గ్రేడ్/స్కేల్-1(జేఎంజీఎస్) క్రెడిట్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 1000.
» **అర్హత:** గుర్తింపు పొందిన యూనివర్శిటీ/ఇన్‌స్టిట్యూట్ నుంచి 60 శాతం మార్కులతో ఏదైనా విభాగంలో డిగ్రీ ఉత్తీర్ణులవ్వాలి (ఎస్సీ/ఎస్టీ/ఓబీసీ/పీడబ్ల్యూబీడీ 55 శాతం) ఉండాలి.
» **వయసు:** 20 నుంచి 30 ఏళ్ల మధ్య ఉండాలి (ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఐదేళ్లు, ఓబీసీ అభ్యర్థులకు మూడేళ్లు, పీడబ్ల్యూబీడీ అభ్యర్థులకు 10 ఏళ్ల సడలింపు ఉంటుంది).
» **పే స్కేల్:** నెలకు రూ.48,480 నుంచి రూ.85,920 ఉంటుంది.
» **ఎంపిక విధానం:** ఆన్‌లైన్ టెస్ట్, పర్సనల్ ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **పరీక్ష విధానం:** మొత్తం 120 మార్కులకు 120 ప్రశ్నలు ఉంటాయి. ఇంగ్లిష్ లాంగ్వేజ్ (30 ప్రశ్నలు-30 మార్కులు), క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్(30 ప్రశ్నలు-30 మార్కులు), రీజనింగ్ ఎబిలిటీ(30 ప్రశ్నలు-30 మార్కులు), జనరల్ అవేర్‌నెస్(రిలేటెడ్ టు బ్యాంకింగ్ ఇండస్ట్రీ)(30 ప్రశ్నలు-30 మార్కులు) సబ్జెక్టుల నుంచి ప్రశ్నలు ఉంటాయి. ఇంగ్లిష్ లాంగ్వేజ్ ఎస్సై పరీక్ష (రెండు ప్రశ్నలు-30 మార్కులు) ఉంటుంది. పరీక్ష ఇంగ్లిష్ హిందీ భాషల్లో ఉంటుంది.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌కు చివరితేది:**20.02.2025
» **వెబ్‌సైట్:** www.centralbankofindia.co.in

బహుళ అంశాల్లో వృద్ధి సాధనే లక్ష్యం..

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

ఇండియన్ ఎకానమీ

సుస్థిర, విధాన నిర్ణయాల ఫలితంగా సాధించే ఆర్థికాభివృద్ధి ఒక ప్రత్యేక ప్రదేశంలోని ప్రజల జీవన ప్రమాణాలను మెరుగు పరుస్తుంది. దీంతో పాటు ఆరోగ్యవంతమైన ఆర్థిక వాతావరణాన్ని కల్పిస్తుంది. ఆర్థికాభివృద్ధిని ఆర్థిక వ్యవస్థలో పరిమాణాత్మక, గుణాత్మక మార్పుగా పేర్కొనవచ్చు. మానవ మూలధనం, మౌలిక సౌకర్యాలు, ప్రాంతీయ పోటీతత్వం, భద్రత, అక్షరాస్యత, ఆరోగ్య ప్రమాణాలు లాంటి బహుళ అంశాల్లో అభివృద్ధి సాధించడం ఆర్థికాభివృద్ధి ప్రక్రియలో భాగంగా ఉంటుంది.

ఆర్థికాభివృద్ధి

ఆర్థికాభివృద్ధి, ఆర్థికవృద్ధి మధ్య స్పష్టమైన వ్యత్యాసాలున్నాయి. ఆర్థిక, సాంఘిక శ్రేయస్సులో భాగంగా ఆర్థికాభివృద్ధి మొదటి దశలో ప్రభుత్వ జోక్యం అవసరమవుతుంది. ఆర్థిక వృద్ధి ప్రక్రియ అనేది మార్కెట్ ఉత్పాదకత, స్థూల దేశీయోత్పత్తి పెరుగుదలకు సంబంధించింది. ప్రముఖ ఆర్థిక శాస్త్రవేత్త అమర్త్యసేన్ ఆర్థికాభివృద్ధి ప్రక్రియలో ఆర్థికవృద్ధిని ఒక అంశంగా పేర్కొన్నారు.

ఆర్థికాభివృద్ధి విధానాలు

1. ధరల స్థిరత్వం, అధిక ఉద్యోగిత, సుస్థిర వృద్ధి సాధన మొదలైనవి ప్రభుత్వ ఆర్థిక లక్ష్యాల్లో భాగంగా ఉంటాయి. వీటి సాధనలో ద్రవ్య విధానం, కోశ విధానం, విత్త సంస్థల నియంత్రణ, వాణిజ్యం, పన్నుల విధానం ప్రధాన పాత్ర పోషిస్తాయి.
2. అవస్థాపనా సౌకర్యాలైన హైవేస్, పార్కులు, గృహ వసతి, విద్య తదితర సదుపాయాల కల్పనతో పాటు నేరాలను నిర్మూలించడానికి అవసరమైన కార్యక్రమాలు చేపట్టడం కూడా ఆర్థికాభివృద్ధి విధానాల్లో భాగం.
3. ఉపాధి కల్పన, శ్రామిక శక్తి అభివృద్ధి, చిన్న వ్యాపారాల అభివృద్ధి, వ్యాపార విస్తరణ, సాంకేతిక పరిజ్ఞానం బదిలీ చేసుకోవడం, రియల్ ఎస్టేట్ అభివృద్ధి కోసం అవలంబించే విధానాలు ఆర్థికాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తాయి.

అంతర్జాతీయ వాణిజ్యం, వినిమయ రేటు అనేవి ఆర్థికాభివృద్ధిలో ప్రధానమైన అంశాలు. కరెన్సీ విలువలు తరచుగా ఒడుదొడుకులకు గురవడం వల్ల ప్రపంచవ్యాప్తంగా వివిధ దేశాలు వాణిజ్య మిగులు లేదా లోటును ఎదుర్కొంటున్నాయి. ఈ స్థితి ఆర్థికాభివృద్ధిపై ప్రభావం చూపుతోంది. ఆర్థిక కోణంలో చూసినప్పుడు ప్రపంచవ్యాప్తంగా నిర్దిష్ట ప్రదేశానికి ప్రాధాన్యం ఉంది. ఒక దేశం లేదా అందులోని ప్రత్యేక ప్రదేశం కాంపిటీటివ్ అడ్వాంటేజ్‌కు ఒక ముఖ్య సాధనంగా నిలిచిన పరిస్థితులు ఉండటమే దీనికి కారణం. మూడో ప్రపంచ దేశాలు ఆర్థికాభివృద్ధి ప్రక్రియ వేగవంతంపై దృష్టి సారించాయి. ఒక దేశ స్థూల జాతీయోత్పత్తి అధిక రేటులో పెరిగినప్పటికీ అంటే అధిక ఆర్థికవృద్ధి సాధించినప్పటికీ దాని ఫలితాలు దేశంలో తక్కువ మందికి మాత్రమే అందవచ్చు. ఫలితంగా మిగిలిన ప్రజలు పేదరికంలో ఉంటారు. స్థూల జాతీయోత్పత్తి పెరుగుదల వల్ల ప్రాంతీయ సమతౌల్య అభివృద్ధి సాధ్యం కాకపోవచ్చు. కొన్ని దేశాల్లో గ్రామీణ - పట్టణ ప్రాంతాలు, వివిధ సామాజిక వర్గాల మధ్య అసమానతలు పెరగవచ్చు. దీంతో ప్రజల ఆదాయంలో వ్యత్యాసాలు అధికమవుతాయి. ఈ కారణంగా అన్ని వర్గాల శ్రేయస్సు మెరుగుపడదు. ఈ విధమైన స్థితిని ఆర్థికాభివృద్ధిగా పరిగణించలేం. ఆదాయ అసమానతల నిర్మూలన; పేదరికం, నిరుద్యోగం తగ్గింపు; విద్య, ఆరోగ్య ప్రమాణాల మెరుగుదల; అవస్థాపనా సౌకర్యాల అభివృద్ధితో పాటు అధిక పారిశ్రామికీకరణ లాంటి అంశాలను ఆర్థికాభివృద్ధిలో భాగంగా పరిగణనలోకి తీసుకుంటారు. ఆర్థిక వృద్ధి జాతీయోత్పత్తిలో పరిమాణాత్మక మార్పును మాత్రమే తెలుపుతుంది. ఆర్థిక వ్యవస్థలో జాతీయాదాయ పెరుగుదలతో పాటు సంస్థా పూర్వక, సాంకేతిక మార్పులతో కూడిన గుణాత్మక మార్పును ఆర్థికాభివృద్ధి వెల్లడిస్తుంది. నిర్దిష్ట ప్రాంతం లేదా ఒక దేశంలో సాపేక్ష ఆర్థిక పురోగతిని పరిశీలించడానికి ఆర్థికవేత్తలు అనేక స్థూల ఆర్థిక, సాంఘిక, సాంస్కృతిక సూచీలను ఉపయోగించారు. అవి:

1. తలసరి స్థూల దేశీయోత్పత్తి
2. ఆదాయ పంపిణీ
3. అక్షరాస్యత, విద్య
4. ఆరోగ్య సంరక్షణ అందుబాటు
5. సామాజిక భద్రత, పింఛన్లు
6. ఆధునిక రవాణా వ్యవస్థ

గ్రాస్ నేషనల్ హ్యాపీనెస్ ఇండెక్స్ (జీఎన్‌హెచ్‌ఐ)

ఒక దేశ ప్రగతిని కొలవడానికి స్థూల దేశీయోత్పత్తికి ప్రత్యామ్నాయంగా 'గ్రాస్ నేషనల్ హ్యాపీనెస్ ఇండెక్స్'ను తీసుకోవచ్చు. దేశ పురోగతిని అంచనా వేయడంలో జీడీపీ లాంటి ఒకే కొలమానంపై ఆధారపడటానికి బదులుగా జీఎన్‌హెచ్‌ఐని పరిగణనలోకి తీసుకోవడం కొంతవరకు ప్రయోజనకరంగా ఉంటుంది. ఇందులో ప్రజల ఆధ్యాత్మిక, భౌతిక, సాంఘిక, పర్యావరణ అంశాలతో పాటు ఆరోగ్యం తదితరాలు ఇమిడి ఉంటాయి. జీఎన్‌హెచ్‌ఐ కొలమానంలో పర్యావరణం ఒక ముఖ్య కారకంగా ఉంటుంది. 'గ్రాస్ నేషనల్ హ్యాపీనెస్ ఇండెక్స్' అనేది ఆర్థిక వ్యవస్థలోని ఆర్థిక ఉత్పత్తి విలువను మాత్రమే కాకుండా నికర పర్యావరణ ప్రభావం; పౌరుల ఆధ్యాత్మిక, సాంస్కృతిక ప్రగతి; ప్రజల మానసిక, భౌతిక ఆరోగ్యం; కార్పొరేట్ల బలం; రాజకీయ వ్యవస్థ మొదలైనవాటి గురించి వెల్లడిస్తుంది. గ్రాస్ నేషనల్ హ్యాపీనెస్ ఇండెక్స్ ఆధారంగా సుస్థిర అభివృద్ధిలో భాగంగా ప్రగతికి సంబంధించిన అన్ని అంశాలపై దృష్టి కేంద్రీకరిస్తూ ఆర్థికేతర అంశమైన శ్రేయస్సుకు కూడా సమాన ప్రాధాన్యం ఇవ్వాలని 'సెంటర్ ఫర్ భూటాన్ స్టడీస్' అభిప్రాయపడింది.

1. సుస్థిర అభివృద్ధిని ప్రోత్సహించడం
2. సాంస్కృతిక విలువలను కాపాడుకోవడం ద్వారా ఆర్థికాభివృద్ధిని ప్రోత్సహించడం
3. సహజ పర్యావరణాన్ని పరిరక్షించడం
4. సుపరిపాలన స్థాపన

జీఎన్‌హెచ్‌ఐలో ఉండే ముఖ్యమైన అంశాలు (Domains):

1. ఆరోగ్యం
2. పర్యావరణ వైవిధ్యం, సామర్థ్యం
3. మానసిక శ్రేయస్సు



4. సామాజిక ప్రగతి
5. జీవన ప్రమాణాలు
6. కాలం వినియోగం
7. సాంస్కృతిక వైవిధ్యం, సామర్థ్యం
8. సుపరిపాలన 9. విద్య

1972లో జిగ్మే సింఘీ వాంగ్‌చుక్ జీఎన్‌హెచ్ సూచీని ప్రతిపాదించారు. భూటాన్ ప్రగతికి ప్రామాణికంగా స్థూల దేశీయోత్పత్తికి బదులు గ్రాస్ నేషనల్ హ్యాపీనెస్ కొలమానాన్ని ఉపయోగించడం ప్రయోజనకరమని ఆయన సూచించారు. 33 సూచీలను 9 డొమైన్ల కింద విభజించి ఈ సూచీని రూపొందించారు. ఈ ఇండెక్స్‌ను రూపొందించడంలో ఆల్కైరా-ఫోస్టర్ పద్ధతిని వినియోగించారు. అన్ని డొమైన్లకు ఒకేవిధమైన వెయిటేజీ ఇచ్చారు. ప్రతి డొమైన్‌లోనూ లక్షిత సూచీలకు అధిక వెయిటేజీ, సెల్ఫ్ రిపోర్టెడ్ సూచీలకు తక్కువ వెయిటేజీ ఇచ్చారు. జీఎన్‌హెచ్‌ఐ ప్రధానంగా నాలుగు అంశాలపై ఆధారపడి ఉంటుంది. అవి:

'సెంటర్ ఫర్ భూటాన్ స్టడీస్' సర్వేకు అవసరమైన ప్రశ్నావళిని మెరుగుపరుచుకొని గ్రాస్ నేషనల్ హ్యాపీనెస్ సర్వేను మొదటిసారిగా 2007 డిసెంబర్‌లో నిర్వహించింది. సర్వే బడ్జెట్‌లో వ్యయ పరిమితి దృష్ట్యా 12 జిల్లాల్లో మాత్రమే ఈ సర్వే నిర్వహించారు. ఇందులో శాంపుల్ పరిమాణాన్ని 950కి పరిమితం చేశారు. రెండో సర్వే ఏప్రిల్ 2010లో ప్రారంభమై డిసెంబర్ 2010లో ముగిసింది. అన్ని ప్రాంతాల్లో సర్వే నిర్వహించడం ద్వారా ఇందులో 7142 శాంపుల్స్ తీసుకున్నారు.

మాదిరి ప్రశ్నలు

వృద్ధి - వ్యూహాలు

1. కొనుగోలు శక్తి సమానత సిద్ధాంతాన్ని ప్రతిపాదించినవారెవరు?
   ఎ) షుంపీటర్ బి) గుస్తావ్‌కాసల్
   సి) మిస్సెస్ జోన్‌రాబిన్‌సన్
   డి) మిర్డాల్
2. గ్రామీణ ప్రాంతాల్లో నిరుద్యోగిత, అల్ప ఉద్యోగిత పక్కపక్కనే ఉంటాయని ఎన్నో ప్రణాళిక డాక్యుమెంట్‌లో పేర్కొన్నారు?
   ఎ) 3 బి) 5 సి) 8 డి) 10
3. మార్క్సియన్ నిరుద్యోగిత (బహిరంగ నిరుద్యోగిత) అనే పదాన్ని ఉపయోగించినవారెవరు?
   ఎ) లూయిస్ బి) అమర్త్యసేన్
   సి) మాల్థస్ డి) మిస్సెస్ జోన్ రాబిన్‌సన్
4. వృద్ధి – సంక్షేమం మధ్య ఉన్న సంబంధం విషయంలో కింది ఏ అంశాన్ని పరిమితిగా పేర్కొనలేం?
   ఎ) అధిక ధరలు
   బి) జనాభా పెరుగుదల
   సి) అధిక శ్రామిక పనిగంటలు
   డి) తక్కువ అనుత్పాదక వ్యయం
5. శ్రామిక దోపిడీ లేదా మిగులు విలువ రేటును ఏవిధంగా కనుగొనవచ్చు?
   ఎ) మిగులు విలువ వేతనాలు (చర మూలధనం)
   బి) మిగులు విలువ యంత్రాలపై వ్యయం (స్థిర మూలధనం)
   సి) అవకాశ వ్యయం ద్రవ్య వ్యయం
   డి) ఏదీకాదు
6. మార్క్స్ ఆర్థికాభివృద్ధి సిద్ధాంతాన్ని ఏ విధంగా చర్చించవచ్చు?
   ఎ) మిగులు విలువ సిద్ధాంతం
   బి) మూలధన కల్పన
   సి) మూలధన సంక్షోభం
   డి) పైవన్నీ
7. రోస్టోవ్ అభిప్రాయంలో జాతీయాదాయంలో నికర పెట్టుబడి 10 శాతానికి మించి ఉండే దశ దేన్ని సూచిస్తుంది?
   ఎ) సాంప్రదాయ సమాజం
   బి) పరిపక్వ దశకు గమనం
   సి) ప్లవన దశ
   డి) సామూహిక వినియోగం
8. భూమిపై పుట్టే ప్రతి బిడ్డ నరకానికి దారి తీస్తాడు అని ఎవరు పేర్కొన్నారు?
   ఎ) రోస్టోవ్ బి) మిర్డాల్
   సి) మాల్థస్ డి) ఎవరూ కాదు
9. 'నేషనల్ కౌన్సిల్ ఆఫ్ అప్లయిడ్ ఎకనమిక్ రీసెర్చ్' ఆర్థికాభివృద్ధి సూచీ నిర్మాణంలో కింద పేర్కొన్న ఏ సూచీని పరిగణనలోకి తీసుకోలేదు?
   ఎ) విద్యాస్థాయి
   బి) సాంకేతిక విజ్ఞానం
   సి) ఆరోగ్య వృద్ధి
   డి) తలసరి స్థూల జాతీయోత్పత్తి
10. గినీ గుణకం విలువ 'ఒకటి' కావడం దేన్ని సూచిస్తుంది?
    ఎ) సంపూర్ణ అసమానత్వం
    బి) సంపూర్ణ సమానత్వం
    సి) సంపద సమానత్వం
    డి) తక్కువ నిరుద్యోగం
11. స్థూల దేశీయ పొదుపులో అధిక వాటాను కలిగిన రంగం ఏది?
    ఎ) ప్రభుత్వ రంగం
    బి) కార్పొరేట్ రంగం
    సి) గృహ రంగం డి) విదేశీ వాణిజ్యం
12. హారడ్-డోమార్ ఆర్థికాభివృద్ధి నమూనాలో మూలధన కల్పన కింది ఏ దశను కలిగి ఉంటుంది?
    ఎ) నిజ పొదుపు స్థాయిలో పెరుగుదల
    బి) పరపతి సంస్థల ద్వారా పొదుపు సమీకరించడం
    సి) పొదుపు మొత్తాన్ని పెట్టుబడిగా మార్చడం
    డి) పైవన్నీ
13. ప్రచ్ఛన్న నిరుద్యోగితపై అంచనాలను రూపొందించినవారు?
    ఎ) శకుంతల మెహ్రా
    బి) అమర్త్యసేన్
    సి) మార్షల్ డి) జె.బి. సే
14. మార్కెట్ వ్యవస్థ ద్వారా అభివృద్ధి చెందిన దేశాలేవి?
    ఎ) మొదటి ప్రపంచ దేశాలు
    బి) రెండో ప్రపంచ దేశాలు
    సి) మూడో ప్రపంచ దేశాలు
    డి) నాలుగో ప్రపంచ దేశాలు
15. 'గ్రామీణ ప్రాంతాల్లోని ప్రచ్ఛన్న నిరుద్యోగులను ఇతర రంగాలకు తరలిస్తే జాతీయాదాయం పెరుగుతుంది' అని పేర్కొన్నది?
    ఎ) మాల్థస్ బి) రాగ్నార్ నర్క్స్
    సి) జె.బి. సే డి) ఆడమ్ స్మిత్
16. వ్యవస్థాపకుల కొరత వల్ల కూడా పెట్టుబడి స్థాయి తక్కువగా ఉంటుందని పేర్కొన్నవారెవరు?
    ఎ) షుంపీటర్ బి) రాగ్నార్ నర్క్స్
    సి) లెబన్ స్టీన్ డి) డోమార్
17. పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థలో పెట్టుబడిదారీ వర్గం, కార్మిక వర్గం అనే రెండు వర్గాలుంటాయని పేర్కొన్నవారెవరు?
    ఎ) లూయిస్ బి) నెల్సన్
    సి) కార్ల్ మార్క్స్ డి) హారడ్

సమాధానాలు

1) బి; 2) ఎ; 3) డి; 4) డి; 5) ఎ; 6) డి; 7) బి; 8) సి; 9) బి; 10) ఎ; 11) సి; 12) డి; 13) ఎ; 14) ఎ; 15) బి; 16) ఎ; 17) సి.

HTML documents are saved in..

BANK EXAMS

COMPUTERS AWARENESS



1. The primary job of an operating system is to manage:
   a) Commands b) Users
   c) Programmes d) Resources
   e) Process
2. Short cut key for Page Break in Ms Word?
   a) Ctrl + Enter b) Ctrl + B
   c) Alt + Enter d) Alt + B
   e) None of these
3. What is Cache RAM?
   a) Extra memory used for overflow from your Hard Disk
   b) A place to store secret information like passwords
   c) It's the same as your Hard Disk Drive
   d) Fast memory used for data that is accessed often
   e) None of these
4. Fire wire is same as:
   a) IEEE 1394 b) 56K Modem
   c) Roadrunner d) DVD
   e) All of the above
5. What are the limitations of the local user account?
   a) Their passwords cannot be synchronized
   b) They cannot be used to access resources across domains
   c) They do not support the interactive logon process
   d) All of the above
   e) None of these
6. Which of the following are objects in an access data base?
   a) Table, Form
   b) Queries, Reports
   c) Macros, Modules
   d) All the above
   e) None of these
7. Changing an existing document is called ______ the document
   a) creating b) deleting
   c) editing d) adjusting
   e) None of these
8. In HTML document the tags:
   a) Should be written in upper case
   b) Should be written in lower case
   c) Should be written in proper case
   d) Can be written in both upper case or lower case
   e) None of the above
9. The database language that allows you to access or maintain data in a database:
   a) DCL b) DML c) DDL
   d) DKL e) None of these
10. Which option enables automatic updates in destination documents?
    a) Embedding b) Objects
    c) Links d) Relationships
    e) None of these
11. Which type of template provides a design concept, fonts & colour scheme for presentation?
    a) Format b) Design
    c) Content d) Normal
    e) None of these
12. The two basic types of record access methods are _____ and ______.
    a) sequential, random
    b) direct, immediate
    c) sequential, indexed
    d) on-line, real-time
    e) None of these
13. In Ms Word by default setting of Line spacing is?
    a) 1 b) 1.15 c) 1.5
    d) 2 e) 2.5
14. What technology of memory is Cache RAM usually?
    a) DRAM b) SRAM
    c) Flash d) EEROM
    e) ESRAM
15. Fire wire is usually used for:
    a) Connecting to the internet
    b) Downloading Digital Camera pictures
    c) Connecting to the printer
    d) Interfacing to a Digital Camcorder
    e) All of the above
16. What is the most common type of digital line used in most networks today?
    a) 56 kbps b) T1 c) T3
    d) E1 e) Asynchronous modems
17. The particular field of a record that uniquely identifies each record is called the
    a) Key field b) Primary field
    c) Master field d) Order field
    e) None of these
18. Why has RAM been named like this?
    a) Because it is read and write memory
    b) Because it is volatile memory
    c) Because any of the locations in chip can directly be selected for storing and retrieving data and instructions
    d) Because it is non-volatile memory
    e) None of these
19. What is a search engine?
    a) A program that searches engines
    b) A website that searches anything
    c) A hardware component
    d) A machinery engine that search data
    e) None of these
20. The basic elements of a form or a report are called:
    a) Controls b) Objects
    c) Windows d) Properties
    e) Icons
21. In Word, the mailing list is known as the _________.
    a) data sheet b) source
    c) data source d) sheet
    e) work sheet
22. Gutter margin is _____ in Ms Word.
    a) Bottom Margin
    b) Top Margin c) Left Margin
    d) Binding Margin
    e) Right Margin
23. In Ms Word we can create same letter or mail etc., to many people with different address. This option is called?
    a) Format painter b) Macro
    c) Mail merge d) All of these
    e) None of these
24. BIOS is stored in ______
    a) DRAM b) SDRAM
    c) Flash d) Hard Disk
    e) None of these
25. What is USB?
    a) A new Hard Disk standard
    b) A new CD-ROM specification
    c) A high-speed serial connection
    d) A high-speed video connection
    e) None of these
26. Which of the following is used for dial-up data communications protocols?
    a) FTP b) TCP c) SLIP
    d) PPP e) ATM
27. The _______ is a device that connects inputs to outputs.
    a) Cross point b) Cross bar
    c) Modem d) RAM
    e) None of these
28. What does v link attribute mean?
    a) visited link b) virtual link
    c) very good link
    d) active link e) None of these
29. Which of the following data type allows alphanumeric characters and special symbols?
    a) Text b) Memo
    c) Auto number
    d) All of the above e) None
30. Which of the following is word processing software?
    a) Word Perfect b) Easy Word
    c) MS Word
    d) All of the above e) None
31. Which is the shortcut key to jump to the first slide of the presentation?
    a) Home b) Alt + Home
    c) Ctrl + Home d) Shift + Home
    e) None of these
32. To increase font size from the Keyboard we use:
    a) Alt + C b) Ctrl +Shift+ <
    c) Ctrl+Shift+ > d) Ctrl+Pageup
    e) None of these
33. What is the use of Track changes in Ms Word?
    a) We can accept or Reject Changes doing by others
    b) We can protect our file by password
    c) We can protect our content from the formatting
    d) All of the above e) None
34. Where does the PC store the programs when the power is off?
    a) DRAM b) Cache
    c) Hard Disk Drive
    d) Monitor e) None of these
35. What does DDR stand for?
    a) DRAM Double Rate
    b) Data DRAM Rate
    c) Double Data Rate
    d) Double DRAM Rate
    e) None of these
36. Translating the data format is the responsibility of which layer of the OSI model?
    a) Application b) Physical
    c) Data Link
    d) Communication
    e) Presentation
37. In _____ each packet of a message follows the same path from sender to receiver.
    a) Circuit switching
    b) Message switching
    c) The virtual approach to packet switching
    d) The datagram approach to packet switching
    e) None of these
38. Data that is copied from an application is stored in the ___
    a) Driver b) Terminal
    c) Prompt d) Clipboard
    e) None of these
39. HTML documents are saved in
    a) Special binary format
    b) Machine language codes
    c) ASCII text
    d) All of the above
    e) None
40. The command centre of access file that appears when you create or open the MS Access database file.
    a) Database Window
    b) Query Window
    c) Design View Window
    d) Switchboard e) None

KEY

1) d; 2) a; 3) d; 4) a; 5) d; 6) c; 7) d; 8) d; 9) c; 10) c; 11) b; 12) a; 13) b; 14) b; 15) d; 16) b; 17) a; 18) c; 19) b; 20) a; 21) c; 22) d; 23) c; 24) b; 25) c; 26) d; 27) c; 28) a; 29) a; 30) d; 31) c; 32) c; 33) d; 34) c; 35) c; 36) e; 37) c; 38) d; 39) c; 40) a.